

ఈనాడు



విజయవాడ 13-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 93
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ప్రతి పేదవాడికీ సొంతిల్లు

2029 నాటికి సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం ■ రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు 3 లక్షల ఇళ్ల అప్పగింత

- ఉగాది నాటికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు
- కుటుంబమంతా కలిసి ఉండేలా రెండిళ్లు కలిపి కట్టుకునే వెసులుబాటు: సీఎం చంద్రబాబు


దేవగుడిపల్లిలో లబ్ధిదారు హేమలత దంపతులతో కలిసి గృహప్రవేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు- కడప, న్యూస్‌టుడే- చిన్నమండెం: 'ఇల్లు అంటే నాలుగు గోడలు కాదు. భవిష్యత్తుకు భద్రత. పేదలకు దేశంలో తొలిసారిగా పక్కా ఇళ్లు నిర్మించిన వ్యక్తి ఎన్టీఆర్. కూడు, గూడు, గుడ్డ నినాదంతో పుట్టిన పార్టీ తెదేపా. ఇవాళ రాష్ట్రంలో 3 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తున్నాం. మళ్లీ ఉగాది నాటికి 5.9 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయిస్తాం. ప్రతి పేదవాడికీ 2029 నాటికి సొంతిల్లు ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో పేదల ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో సీఎం పాల్గొని, లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగించారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో చేపట్టిన గృహప్రవేశాల్లో వర్చువల్‌గా ఇక్కడి నుంచి పాల్గొన్నారు. దేవగుడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు.

స్థలం చూపి ఇసుక దోచిన వైకాపా

'2014-19 మధ్య 8 లక్షల ఇళ్లు పూర్తి చేశాం. అందుకు రూ.16 వేల కోట్లు ఖర్చుచేశాం. గత ప్రభుత్వం 4.73 లక్షల ఇళ్లు రద్దుచేసింది. 2.73 లక్షల మంది ఇళ్లు కట్టుకుంటే రూ.900 కోట్ల బిల్లులివ్వకుండా ఎగ్గొట్టింది. గృహనిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేసింది. ఉచితంగా ఇళ్లు కట్టించి, ఇస్తామని మాట (మిగతా 3లో)

విశాఖలో మరో డేటా సెంటర్
రూ.15 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ 12లో
మంత్రి లోకేశ్ సమక్షంలో దిల్లీలో ఒప్పందం


దిల్లీ పేలుడులో గాయపడ్డ ఓ వ్యక్తిని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం
బాధితులను పరామర్శించిన అనంతరం 'ఎక్స్'లో మోదీ పోస్టు 10లో

కిరాతక ఉగ్ర దాడే
దోషులకు శిక్ష తప్పదు
ఎర్రకోట పేలుడుపై కేంద్ర క్యాబినెట్ స్పష్టీకరణ
మృతులకు నివాళి 10లో

అసలు గురి ఎర్రకోట!

దానిచుట్టూ జనవరిలో పదేపదే రెక్కీ

రిపబ్లిక్ డే వేడుకల్లో 26/11 తరహా విధ్వంసానికి కుట్ర

విస్తృత బందోబస్తుతో అప్పుడు విఫలమైన ప్రయత్నం

ఈ డిసెంబరు 6న పేలుళ్లకు ఉమర్ నబీ పన్నాగం

దిల్లీ పేలుడు దర్యాప్తులో పురోగతి ● మరో కారు కోసం అన్వేషణ

దిల్లీ: చరిత్రాత్మక ఎర్రకోట వద్ద ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రోజు పెను విధ్వంసానికి పాల్పడాలని డాక్టర్ ముజమ్మిల్ గనయీ పదేపదే ప్రయత్నం చేశాడా? అప్పటికే అక్కడ గట్టి బందోబస్తు ఉండటంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయా?.. దీంతో వచ్చే నెల 6న భారీ ఉగ్రదాడులకు పాల్పడాలని పన్నాగం పన్నారా? దర్యాప్తు సంస్థలకు దొరికిన పక్కా ఆధారాలు అవుననే సమాధానమిస్తున్నాయి! హరియాణాలోని ఫరీదాబాద్‌లో భారీగా పేలుడు పదార్థాలు లభ్యమయ్యాక డాక్టర్ షహీన్ సయీద్, డాక్టర్ గనయీలను పోలీసులు అరెస్టుచేసిన విషయం తెలిసిందే. అదేరోజు ఎర్రకోట సమీపంలో కారు పేలుడు జరగడంతో ఈ రెండింటిపై జరుపుతున్న విచారణలో నిర్ఘాంతపరిచే అంశాలు వెలుగు చూస్తున్నాయి. కొందరు అనుమానితుల్ని జమ్మూకశ్మీర్ పోలీసులు విచారించగా తాము తొలుత ఈ ఏడాది రిపబ్లిక్ డే నాడు ఎర్రకోట లక్ష్యంగా (మిగతా 3లో)



పాలు సేకరించాల్సిన పనే లేదు
రూ.250 కోట్ల టర్నోవర్ ఎందుకు..
రూ.150 కోట్లు చాలు
నెయ్యి టెండరు నిబంధనల మార్పిడి
నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నిర్వాకం 2లో

నేను చేసింది తప్పయితే... ఆమోదించిన వారిదీ తప్పేగా



- నెయ్యి టెండరు నిబంధనల మార్పుపై.. అప్పటి ఛైర్మన్, ఈవో కూడా సంతకాలు చేశారు
- సిట్ విచారణలో తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి
- రెండోరోజు ఏడున్నర గంటలపాటు సాగిన విచారణ

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో తితిదే మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డిని రెండోరోజు బుధవారమూ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ప్రశ్నించింది. ఉదయం 8.55 గంటలకు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయానికి చేరుకున్న ధర్మారెడ్డి మధ్యాహ్న భోజనానికీ బయటకు రాలేదు. హోటల్ నుంచి ఆహారం తెప్పించుకున్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విచారణ సాగింది. దాదాపు ఏడున్నర గంటల పాటు ధర్మారెడ్డిని అధికారులు విచారించారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని... రావాలని చెప్పారు. (మిగతా 3లో)

తప్పు చేశాను మన్నించండి

ఏబీ వెంకటేశ్వరరావు, జాస్తి కృష్ణకిశోర్‌లకు ప్రవీణ్ ప్రకాశ్ బహిరంగ క్షమాపణ

ఇన్‌స్టా రీల్ విడుదల చేసిన మాజీ ఐఏఎస్ అధికారి


ప్రవీణ్ ప్రకాశ్

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వం కక్ష సాధింపుతో తీవ్ర ఇబ్బందులకు గురైన విశ్రాంత ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఏబీ వెంకటేశ్వరరావు, జాస్తి కృష్ణకిశోర్‌లకు.. మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ బహిరంగ క్షమాపణ చెప్పారు. తాను వ్యవహరించిన విధానం వల్ల వారు అంతులేని మానసిక వేదనకు గురయ్యారని, వారికి, వారి కుటుంబసభ్యులకు వ్యక్తిగతంగా, సామాజికంగా తీవ్ర నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. "వారిద్దరినీ ఇప్పటికే


ఏబీ వెంకటేశ్వరరావు


జాస్తి కృష్ణకిశోర్

ఫోన్‌లో క్షమాపణ కోరాను. కానీ అది సరిపోదు. వారికి బహిరంగ క్షమాపణ చెప్పడం ద్వారా నా అంతరాత్మను శుద్ధి చేసుకుంటున్నాను. దీనిలో నా స్వార్థం కూడా ఉంది" అని తెలిపారు. ఈ మేరకు ఆయన 'నేను చేసిన తప్పేమిటంటే' అంటూ ఒక ఇన్‌స్టా రీల్‌ని విడుదల చేశారు.

ఒక్కసారిగా విలన్ అయిపోయాను

"ఒక అధికారిగా నాకు ఆంధ్రప్రదేశ్‌తో 30 ఏళ్ల అనుభవం ఉంది. 2000 నుంచి 2004 వరకు గుంటూరు, (మిగతా 12లో)



పాలు సేకరించాల్సిన పనే లేదు

- వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధమే లేదు
- డెయిరీ మూడేళ్లు కార్యకలాపాలు చేయక్కర్లేదు.. ఏడాది చాలు
- రూ.250 కోట్ల టర్నోవర్ ఎందుకు.. రూ.150 కోట్లు చాలు
- ఎక్కువ మందికి అవకాశం ముసుగులో నెయ్యి టెండరు నిబంధనల మార్పిడి
- నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నిర్వాకం
- చేష్టలుడిగి చూసిన అధికారులు

ఈనాడు, అమరావతి: చిన్న సంస్థైనా సరే.. విక్రయదారు నాణ్యమైన సరకులు సరఫరా చేసేలా నిబంధనలను మరింత కఠినతరం చేస్తుందే తప్ప నాణ్యత విషయంలో రాజీపడేలా వాటిని సడలించదు. అలాంటిది ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుమలలో లడ్డూ సహా వివిధ రకాల ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలిచేటప్పుడు నాణ్యత కోణంలో ఇంకెన్ని జాగ్రత్తలు తీసుకోవాలి? కానీ వైకాపా హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాబాయ్, అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని పాలకమండలి మాత్రం ఇవేవీ పట్టించుకున్నట్లు లేదు. తమ సొంత ఎజెండా కోసం నెయ్యి సరఫరా టెండర్ల నిబంధనలను అడ్డగోలుగా, ఇష్టానుసారంగా మార్చేసింది. ఓ కమిటీని నియమించుకుని తమకు కావాల్సినట్లుగా సిఫార్సులు చేయించుకుని వాటికి ఆమోదం తెలిపేసింది. వైవీ సుబ్బారెడ్డి నిర్వాకంతో అసలు పాలు, వెన్న సేకరణే చేయని, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేని సంస్థలకు నెయ్యి టెండర్లలో పాల్గొనే అవకాశం కలిగింది. దీంతో మారిన నిబంధనలను అడ్డం పెట్టుకుని కల్తీ నెయ్యి సరఫరా సంస్థలు ఇష్టానుసారంగా చెలరేగిపోయాయి.

నిబంధనలు మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది?

తితిదేకు నెయ్యి సరఫరాకు కఠిన అర్హతలు, నిబంధనలు మొదటి నుంచీ ఉన్నాయి. ఎప్పుడూ కల్తీ నెయ్యి సరఫరా జరిగిన ఉదంతమే లేదు. అయితే వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నెయ్యి సరఫరా టెండర్లలో ఎక్కువ మంది పాల్గొనేలా నిబంధనలు సవరించాలని, రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలని 2019 డిసెంబరు 28న జరిగిన తితిదే బోర్డు సమావేశంలో తీర్మానించారు. టెండరు నిబంధనలను సవరించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. 2020 మే 23న సమావేశమైన ఈ కమిటీ అప్పటి వరకూ ఉన్న కీలక షరతుల్లో కొన్నింటిని తొలగిస్తూ, మరికొన్నింటిని మారుస్తూ సిఫార్సులు చేసింది. అప్పటి వరకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగుతున్న నిబంధనలు మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎవరి స్వార్థం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు? నాటి ప్రభుత్వం పాలక వర్గం నిర్ణయాన్ని ఎందుకు ఆపలేదు అనేవి ఇప్పుడు సమాధానం వెతకాల్సిన ప్రశ్నలు.

పాలు సేకరించి ఉండాలనే నిబంధనే ఎత్తేశారు

- తితిదే నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనే సంస్థలకు (జాతీయ డెయిరీలు) మూడేళ్లుగా డెయిరీ నిర్వహిస్తున్న అనుభవం ఉండాలనే నిబంధనను మార్చేసి ఏడాదిగా డెయిరీ నిర్వహిస్తుంటే చాలని సరిపెట్టేశారు.
- డెయిరీ గతేడాదిలో రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలని, దీనికి ఆధారంగా ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐకి సమర్పించిన రిటర్న్‌లు జత చేయాలనే నిబంధనను గల్లంతు చేసేశారు. ఆయా సంస్థలు మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 8 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలనే నిబంధనను ఎత్తేశారు. పాలు సేకరించకుండా, వెన్న తయారు చేయకుండా నెయ్యి ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందనే ఇంగితమైనా వారికి లేకుండా పోయింది.
- సంస్థల వార్షిక టర్నోవర్ 3 ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదన్నా రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధన తీసేసి, రూ.150 కోట్ల టర్నోవర్ ఉంటే చాలని మార్చేశారు. ఆయా సంస్థలు మూడేళ్ల పాటు రోజుకు 12 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలనే నిబంధనను తొలగించి ఏడాదిపాటు రోజుకు 8 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం ఉంటే చాలని సరిపెట్టేశారు.
- ఇలా నిబంధనలన్నీ సడలించటంతోనే భోలేబాబా, వైష్ణవి డెయిరీ వంటి సంస్థలు రంగప్రవేశం చేయటానికి అవకాశం కలిగింది. అసలు పాలతో కాకుండా పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్, తయారు చేసిన నెయ్యే కాని నెయ్యిని సరఫరా చేశాయి.

అంతకు ముందున్న నిబంధన	మార్చేసిన నిబంధన
అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి ట్యాంకర్ల ద్వారా సరఫరాకు (జాతీయ డెయిరీలకు)	
1. డెయిరీ కనీసం గత మూడేళ్లుగా ఆపరేషన్‌లో ఉండాలి	డెయిరీ కనీసం గతేడాది ఆపరేషన్‌లో ఉంటే చాలు
2. గతేడాదిలో రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలి. ఆ ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిటర్న్‌లు జత చేయాలి	ఇవేవీ అక్కర్లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
3. మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 8 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఇవేవీ అవసరం లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
4. మూడేళ్లపాటు రోజుకు 12 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఏడాదిపాటు రోజుకు 8 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం ఉంటే చాలు
5. వార్షిక టర్నోవర్ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదైనా రూ.250 కోట్లు ఉండాలి	వార్షిక టర్నోవర్ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదైనా రూ.150 కోట్లు చాలు.
అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి ట్యాంకర్ల ద్వారా సరఫరాకు (ఏపీ డెయిరీలకు)	
1. డెయిరీ కనీసం గత మూడేళ్లుగా ఆపరేషన్‌లో ఉండాలి	డెయిరీ కనీసం గతేడాది ఆపరేషన్‌లో ఉంటే చాలు
2. గతేడాదిలో రోజుకు కనీసం 2 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలి. ఆ ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిటర్న్‌లు జత చేయాలి	ఇవేవీ అవసరం లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
3. మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 3 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఇవేవీ అవసరం లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
4. మూడేళ్లపాటు రోజుకు 6 టన్నులు వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఏడాదిపాటు రోజుకు 3 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం ఉంటే చాలు
5. వార్షిక టర్నోవర్ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదైనా రూ.100 కోట్లు ఉండాలి	వార్షిక టర్నోవర్ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదైనా రూ.50 కోట్లు చాలు
అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి టిన్నుల ద్వారా సరఫరాకు	
1. డెయిరీ కనీసం గత మూడేళ్లుగా ఆపరేషన్‌లో ఉండాలి	డెయిరీ కనీసం గతేడాది ఆపరేషన్‌లో ఉంటే చాలు
2. గతేడాదిలో రోజుకు కనీసం 2 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలి. ఆ ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిటర్న్‌లు జత చేయాలి	ఇవేవీ అక్కర్లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
3. మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 2 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఇవేవీ అవసరం లేదంటూ ఈ నిబంధన తొలగించేశారు
4. మూడేళ్లపాటు రోజుకు 4 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలి	ఏడాదిపాటు రోజుకు 2 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం ఉంటే చాలు

సైకిల్ తొక్కిన హోం మంత్రి అనిత



పాయకరావుపేట, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ విశాఖ రేంజ్ పోలీసులు చేపట్టిన 'అభయం సైకిల్ యాత్ర'లో హోం మంత్రి వంగలపూడి అనిత సైకిల్ తొక్కి స్ఫూర్తి నింపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి బుధవారం ఈ ర్యాలీకి ఆమె శ్రీకారం చుట్టారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాలతో కలిసి పాయకరావుపేటలోని పాత పంచాయతీ కార్యాలయం నుంచి జాతీయరహదారి వై.కూడలి మీదుగా శ్రీప్రకాష్ విద్యానికేతన్ వరకు సుమారు మూడు కిలోమీటర్లు సైకిల్ తొక్కారు. ప్రజలు, విద్యార్థులు స్వాగతం పలికారు.

పెరుగుతున్న చలి తీవ్రత

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. మంగళవారం రాత్రి అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగి పుట్టులో 14.4, డుంబ్రిగుడలో 14.7, పెదబయలులో 15.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. బంగాళాఖాతంలో 17న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వివిధ మోడళ్లు సూచిస్తున్నాయి. దీని ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండబోదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

'సివిల్స్-2025' మెయిన్స్ ఫలితాల విడుదల

ఈనాడు, హైదరాబాద్: సివిల్స్-2025 మెయిన్స్ పరీక్షల ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. అందులో 2,736 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది వరకు ఉండొచ్చని అంచనా. గతేడాది వరకు ముఖాముఖికి ఎంపికైన అభ్యర్థుల రోల్ నంబరు మాత్రమే యూపీఎస్సీ విడుదల చేసేది. ఈసారి అభ్యర్థుల పేర్లు ఇవ్వడం గమనార్హం. 979 ఖాళీలను భర్తీ చేయనున్నారు. డిసెంబరు నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని భావిస్తున్నారు. 'మొత్తం మార్కుల్లో ముఖాముఖి మార్కుల శాతం 13.50 శాతమే. స్వల్ప తేడాతో అనేక మంది ఎంపికవుతుంటారు' అని సివిల్స్ శిక్షణ నిపుణుడు గోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు.

నౌకా నిర్మాణం, ఎలక్ట్రానిక్స్ రంగంపై భారత్ ఫోర్జ్ ఆసక్తి

- చంద్రబాబుతో భేటీ అయిన ఆ సంస్థ వైస్ ఛైర్మన్ అమిత్ కల్యాణి
- భాగస్వామ్య సదస్సుకు సర్వం సిద్ధంచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 14న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభంకానున్న సదస్సు



అమిత్ కల్యాణిని సత్కరించి అరకు కాఫీ గిఫ్ట్‌ప్యాక్‌ను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు-విశాఖపట్నం, అమరావతి: రాష్ట్రంలో నౌకా నిర్మాణం, ఎలక్ట్రానిక్స్ రంగంలో అడ్వాన్స్‌డ్ ఉత్పత్తుల తయారీలో పెట్టుబడులు పెట్టేందుకు భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ అమిత్ కల్యాణి ఆసక్తి వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఆయన విశాఖలోని నోవోటెల్ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తమ సంస్థ తరఫున పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. పర్యాటక రంగంలో గండికోట వద్ద రివర్ క్రూజ్ ప్రాజెక్టును చేపట్టేందుకు సైతం ఆసక్తి వ్యక్తం చేశారు. తిరుపతి సమీపంలో అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ సెన్సర్ల ఉత్పత్తిని చేపట్టాలని భావిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను సీఎం చంద్రబాబు ఫోర్జ్ వైస్ ఛైర్మన్‌కు వివరించారు. అనంతరం అమిత్ కల్యాణిని శాలువాతో సత్కరించి అరకు కాఫీ గిఫ్ట్‌ప్యాక్‌ను సీఎం అందజేశారు. భారత్ ఫోర్జ్ చేపట్టే ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. పెట్టుబడుల సదస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఆ తర్వాత జరిగిన తొలి భేటీ ఇదే.

15 వరకు విశాఖలోనే సీఎం..: ఈ నెల 15వ తేదీ వరకు అంటే నాలుగు రోజులపాటు చంద్రబాబు విశాఖలోనే ఉంటారు. గురువారం వివిధ సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతారు. పలు రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను వారికి వివరిస్తారు. సదస్సును విజయవంతంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. 14వ తేదీన సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి సీఎం ప్రారంభిస్తారు. ఏపీ పెవిలియన్ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి పాల్గొంటారు. వివిధ కంపెనీలు, ప్రభుత్వ ప్రతినిధులు, ఆహ్వానితుల గౌరవార్థం శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి ప్రత్యేక విందు ఇస్తారు.

సీజీఎఫ్ నిధులతో చిన్న ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: సర్వ శ్రేయో నిధి (సీజీఎఫ్)ని చిన్న, మధ్యస్థాయి ఆలయాల అభివృద్ధికి వినియోగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం సచివాలయంలో సీజీఎఫ్, ధూప దీప నైవేద్య పథకం (డీడీఎన్ఎస్)పై ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని నిధులు కేటాయించాలన్నారు.

ఆర్టీజీఎస్ డేటా లేక్ ప్రాజెక్టు రూపకల్పన బాధ్యత టీసీఎస్‌కు

ఈనాడు, అమరావతి: రియల్ టైం గవర్నెన్స్‌కు సంబంధించిన డేటా లేక్ ప్రాజెక్టు రూపకల్పన, అభివృద్ధి, అమలు, కార్యకలాపాలు, నిర్వహణకు టీసీఎస్‌ను సిస్టమ్ ఇంటిగ్రేటర్‌గా నియమించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టెండర్లలో టీసీఎస్ మాత్రమే బిడ్ దాఖలు చేయడంతో ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అడవి మధ్యలోని భూమి పెద్దిరెడ్డికి వారసత్వంగా ఎలా వచ్చింది?

- అక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు
- అటవీశాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: అడవి మధ్యలో ఉన్న భూమి అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి వారసత్వంగా ఎలా వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. భూమి ఎప్పుడు చేతులు మారిందో తెలుసుకోవాలని, దీనిలో ఎవరి పాత్ర ఎంతనే దానిపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 104 ఎకరాల అటవీ భూములపై పవన్‌కల్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఒక్కో రికార్డులో ఒక్కోలా వివరాలు

'మంగళంపేటలో సర్వే నంబర్లు 295, 296లో అసలు భూమి విస్తీర్ణం ఎంత, అది కాలానుగుణంగా ఎలా పెరిగిందనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లు సబ్ డివిజన్ చేసి అటవీ భూములను ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా ఎలా జరిగిందనే అంశంపై దృష్టి పెట్టాలి.

- 'రక్షిత అటవీ భూముల్లో ఆస్తులు కబ్జా చేసి ఎస్టేట్‌లు నిర్మించిన వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకెళ్లాలి. భూములు ఆక్రమించిన వారి వివరాలు అటవీశాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలి. వారిపై కేసులు ఏ స్థితిలో ఉన్నాయనే వివరాలు ప్రజలకు తెలియాలి.'
- 'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో అటవీ భూములపై అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. భూ రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 40.80 ఎకరాలు వారి ఆధీనంలో ఉంటే.. వెబ్‌ల్యాండ్‌లోకి వచ్చే సరికి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది పరిశీలించాలి.'
- మంగళంపేట అటవీ భూముల ఆక్రమణపై విజిలెన్స్ నివేదిక ఎంతో కీలకం. పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన భూముల పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకోవాలి' అని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

గ్రహం అనుగ్రహం

13-11-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
నవమి: తె. 3-31 తదుపరి దశమి
మఖ: రా. 12-22 తదుపరి పుబ్బ
వర్జ్యం: మ. 12-20 నుంచి 1-56 వరకు
అమృత ఘడియలు: రా. 9-58 నుంచి 11-34 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-51 నుంచి 10-36 వరకు తిరిగి మ. 2-21 నుంచి 3-06 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.07; సూర్యాస్తమయం: సా.5.21

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	19.0	31.0
విజయనగరం	20.0	30.0
కర్నూలు	20.3	33.5
అనంతపురం	20.5	32.1
కడప	22.0	34.0
విజయవాడ	22.4	30.9
విశాఖపట్నం	23.0	30.4
తిరుపతి	23.1	31.2
గుంటూరు	24.0	32.0
రాజమహేంద్రవరం	24.0	36.0
ఒంగోలు	24.4	31.8
నెల్లూరు	25.1	32.4
నరసాపురం	25.2	32.7
తాడేపల్లిగూడెం	29.0	32.0

సిట్ ఎదుట హాజరైన ప్రకాశ్‌రాజ్



ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌లపై దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు బుధవారం సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌ను గంటపాటు విచారించారు. యాప్‌ల ప్రచారానికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. తెలంగాణలో బెట్టింగ్‌యాప్‌ల నిర్వాకాలపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటలకు లక్డీకపూల్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చిన ప్రకాశ్‌రాజ్‌ను అధికారులు దాదాపు గంటసేపు విచారించారు. బెట్టింగ్‌యాప్‌ల ప్రచారానికి కుదుర్చుకున్న ఒప్పందం, పారితోషికం, ఎప్పటినుంచి ఎప్పటి వరకు ప్రచారం చేశారన్న వివరాలు ఆరా తీశారు. అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపించారు.

బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి: ప్రకాశ్‌రాజ్

యువత బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని ప్రకాశ్‌రాజ్ పిలుపునిచ్చారు. సిట్ విచారణ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'నేను 2016లో ఒక యాప్‌కు ప్రచారం చేశా. అప్పుడది గేమింగ్ యాప్ అనుకున్నా. అది బెట్టింగ్ యాప్ అని తెలిశాక ప్రచారం ఆపేశా. బెట్టింగ్ యాప్‌ల వల్ల చాలా మంది యువత ప్రాణాలు కోల్పోయారు. అందుకు సారీ. ఎవరూ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దు' అని ఆయన సూచించారు.

చెవిరెడ్డి పిటిషన్ డిస్మిస్

ఈనాడు, అమరావతి: వెన్నునొప్పి చికిత్స కోసం ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో చేరేందుకు అనుమతించాలన్న వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో ఏసీబీ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నానని.. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో చికిత్స చేయించుకునేందుకు అనుమతి చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

- లఖ్‌నవూ, హైదరాబాద్ వెళ్లేందుకు 3 రోజులు అనుమతి ఇవ్వాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ జరగనుంది.

సీఎం మాట ఇచ్చిన 24 గంటల్లోనే జీవో: మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఇమామ్, మౌజమ్‌లకు గౌరవవేతనాలు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన 24 గంటల్లోనే సంబంధిత జీవోను ప్రభుత్వం విడుదల చేసిందని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. గౌరవ వేతనాల చెల్లింపునకు రూ.90 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులివ్వడం హర్షణీయమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనారిటీలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. జీవో విడుదల పట్ల సీఎం చంద్రబాబుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి పేదవాడికీ సొంతిల్లు

(మొదటి పేజీ తరువాయి)

నిలుపుకోలేదు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదు. సెంటు, సెంటున్నర స్థలాలిచ్చి పేదల పేరుతో ఇసుకను వైకాపా నేతలు దోచుకున్నారు' అని విమర్శించారు. 'ఇళ్ల నిర్మాణానికి పట్టణాల్లో రూ.1.50 లక్షలు, పల్లెల్లో రూ.1.80 లక్షలు కేంద్రం ఇస్తోంది. రాష్ట్ర వాటాగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నాం. ఇకపై మైనారిటీలకూ రూ.50 వేలు ఇస్తాం. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తాం. కుటుంబ పెద్దలు, పిల్లలు కలిసి ఉండేలా రెండిళ్లు కలిపి నిర్మించుకునేలా వెసులుబాటు కల్పిస్తాం. ఇళ్లపై సౌరఫలకాలు పెట్టుకునేలా ప్రోత్సహిస్తాం' అని సీఎం హామీ ఇచ్చారు. రాయలసీమలో 90 శాతం రాయితీ కింద బిందు సేద్యం పరికరాలు ఇచ్చామన్నారు.



గృహ నిర్మాణ మంజూరుపత్రాలు, తాళాలతో మహిళలు

వైకాపా ప్రభుత్వం పులివెందులకూ నీళ్లివ్వలేదు

'రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులొస్తాయి. ఇక్కడ చదువుకున్న పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు వస్తాయి. వర్క్ ఫ్రం హోమ్ కింద ఇక్కడి నుంచే పని చేసుకోవచ్చు. ఎక్కడి వాళ్లకు అక్కడే ఉద్యోగాలు కల్పిస్తాం. శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా. చెరువులన్నీ నింపి భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం. నదుల అనుసంధానం నా జీవితాశయం. తద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు అందుతాయి. తాగునీటి పథకాలను కూడా వైకాపా నాశనం చేసింది. చివరకు పులివెందులకు కూడా నీళ్లివ్వలేదు. త్వరలో ఆ నియోజకవర్గానికి నీరిచ్చే పథకాన్ని ప్రారంభిస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు.





హేమలత కుటుంబసభ్యులకు వస్త్రాలు బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు ★ షేక్ ముంతాజ్ బేగం గృహప్రవేశంలో వారి కుటుంబసభ్యులతో కలిసి నమాజ్ చేస్తున్న చంద్రబాబు

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం

'ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభిస్తాం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం. దేశంలో ఎక్కడాలేని విధంగా మన డ్వాక్రా సంఘాలు ప్రగతి సాధిస్తున్నాయి. వీరు ఏం చేయాలనుకున్నా శిక్షణ ఇప్పిస్తాం' అని తెలిపారు. అనంతరం దేవగుడిపల్లిలో లబ్ధిదారు హేమలత కుటుంబంతో కలిసి గృహప్రవేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. హేమలత, ఆమె భర్త ఈశ్వర్‌కు నూతన వస్త్రాలు బహూకరించారు. షేక్ ముంతాజ్ బేగం నివాసానికి చేరుకుని గృహప్రవేశం అనంతరం నమాజ్‌లో పాల్గొని నూతన వస్త్రాలు అందించారు. అప్పులపాలై జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన ముంతాజ్ భర్త మహమ్మద్ షరీఫ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడారు. స్వస్థలానికి వచ్చేస్తానంటే ఎలక్ట్రిక్ ఆటో కొనిస్తామని మాటిచ్చారు. కార్యక్రమాల్లో మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల వరకు వేచి చూడను!



ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సరిగ్గా పని చేయకపోతే మార్పు తప్పదు

ఇకపై శాశ్వతంగా గెలిచేలా ప్రణాళిక • మైనారిటీల మద్దతు పెరుగుతోంది

• తెదేపా కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

ఈనాడు, కడప: 'ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సక్రమంగా పనిచేయకపోతే వచ్చే ఎన్నికల వరకు వేచిచూడం. ఈలోపే వారికి ప్రత్యామ్నాయం చూసుకుంటాం. వేచి చూసే పక్షంలో జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఇప్పుడు తప్పులు చేస్తాం. ఎన్నికల ముందు చూసుకుందామంటే ఎవరూ క్షమించరు. పార్టీని శాశ్వతంగా అధికారంలో ఉంచాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించాం. అందులో భాగంగా నెలవారీగా నియోజకవర్గాలపై అభిప్రాయసేకరణ చేపట్టి హెచ్చరికలు చేస్తాం. మార్పురాని పక్షంలో ప్రత్యామ్నాయం వెతుకుతాం' అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ తెదేపా సమావేశాన్ని చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామం వద్ద బుధవారం నిర్వహించారు. చంద్రబాబు ఏమన్నారంటే..

అందరి పనితీరుపై అభిప్రాయ సేకరణ

పార్టీ, ప్రభుత్వంపై తరచూ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నాం. మైనారిటీల మద్దతు పెరుగుతూ వస్తోంది. ప్రత్యేకించి మహిళల ఆదరణ ఎక్కువగా ఉంది. రాయలసీమలో అభివృద్ధిని ఆకాంక్షించే విధంగా ఓటర్లలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 స్థానాల్లో 12 గెలిచాం. కొన్ని తప్పుల కారణంగా మిగిలినవి పోగొట్టుకున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పనితీరు మరింతగా మెరుగుపర్చుకోవాలంటూ వివిధ ర్యాంకులను చదివి వినిపించారు. తన పనితీరుపైనా ప్రజాభిప్రాయాన్ని తెప్పించుకుంటున్నానని చంద్రబాబు వివరించారు. పదవులు పొందిన పలువురు నేతలు సమావేశానికి హాజరుకాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పలువురి పేర్లు ప్రస్తావించి వచ్చారా లేదా అంటూ ఆరాతీశారు. డిసెంబరు 1 నుంచి పార్టీ కార్యక్రమాలు ముమ్మరమవుతాయని.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, జోనల్ ఇన్‌ఛార్జులు మరింత కీలకంగా వ్యవహరించాలని అధినేత సూచించారు.

కార్యకర్తల త్యాగాలు మరువం

గుజరాత్‌లో 25 ఏళ్లపాటు ఒకే పార్టీ అధికారంలో ఉండటంతో అభివృద్ధి శరవేగంగా సాగింది. రాష్ట్రంలోనూ ఇలాగే అవసరం. పార్టీ ఇకపై ఓడిపోవడమంటూ జరగదు. మన విజయానికి ఎన్నో వ్యూహాలున్నాయి. కార్యకర్తలు సంతృప్తికరంగా ఉండటానికి అన్ని రకాల చర్యలు చేపట్టాం. జెండా మోసినవారి త్యాగాలు గుర్తున్నాయి. ఎవరినీ విస్మరించడం లేదు. వారి అభిప్రాయానికే విలువిచ్చి పదవులిచ్చాం. చాలాచోట్ల పార్టీ శ్రేణులు తిరస్కరించడంతో పలువురిని పదవుల నుంచి పక్కన పెట్టాం. కార్యకర్తలు, నేతల కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందిస్తున్నాం.

నేను చేసింది తప్పయితే... ఆమోదించిన వారిదీ తప్పేగా

(మొదటి పేజీ తరువాయి)

ధర్మారెడ్డి సాయంత్రం 6.02 గంటలకు కారు ఎక్కి కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.

అదనపు ఈవోగా కొనుగోళ్ల కమిటీలో కీలకంగా వ్యవహరించిన మీరు టెండరు నిబంధనల్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందని రెండోరోజు విచారణలో భాగంగా ధర్మారెడ్డిని మరోసారి సిట్ అధికారులు ప్రశ్నించారు. 'అందులోని సభ్యుల అంగీకారంతోనే ఇది జరిగింది. అనంతరం ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఆమోదించారు. ఒకవేళ నేను చేసింది తప్పయితే వారూ తప్పు చేసినట్టేగా' అని ధర్మారెడ్డి అన్నట్లు సమాచారం. ఇందులో మీకు ముడుపులు ముట్టాయా? అని అధికారులు ప్రశ్నించగా... లేదంటూ అడ్డంగా తలూపినట్లు... ఈ మొత్తం వ్యవహారంలో తన పాత్ర నామమాత్రమేనని చెప్పినట్లు తెలిసింది. అంత తక్కువ ధరకు నాణ్యమైన నెయ్యి రాదన్న విషయం అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డితోపాటు మీకు తెలియదా? తెలిసీ ఎందుకు నిర్ణయం తీసుకున్నారని అధికారులు ప్రశ్నించారు. దీనికి సమాధానంగా... నిబంధనల మేరకు ఎల్1గా వచ్చిన వారికి టెండర్లు అప్పగించినట్లు ధర్మారెడ్డి చెప్పారు. గతేడాది జనవరిలో నిర్వహించిన అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి తిరుమల నుంచి లక్ష లడ్డూలు పంపారని.. వాటికి మాత్రం ప్రత్యేకంగా నాణ్యమైన నెయ్యిని ఎందుకు కొనుగోలు చేశారు? ఇది మీ సొంత నిర్ణయమా? లేక అప్పటి తితిదే ఛైర్మన్, ఇతర వ్యక్తులు ఎవరైనా ఆదేశించారా? అని ఆరా తీయగా ఆ వ్యవహారం గురించి తనకు సమాచారం లేదని, అయోధ్యకు లడ్డూలు పంపించడం వరకు మాత్రమే గుర్తుందని చెప్పినట్లు తెలిసింది.

అవన్నీ అధికారులు చూసుకున్నారు: 'ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా ఓరోగానిక్ డెయిరీకి భగవాన్పూర్‌లో ఉన్న డెయిరీ విస్తీర్ణం సిట్ కార్యాలయంలో సగమైనా లేదు. కనీసం వే బ్రిడ్జి కూడా లేదు. అలాంటి సంస్థకు నెయ్యిని ట్యాంకర్లు, టిన్నుల్లో సరఫరా చేసే కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? దాదాపు మూడేళ్లు అక్కడి నుంచి నెయ్యి వచ్చింది. ఆ ప్లాంటును తనిఖీ బృందం చూసిన విషయం వాస్తవమేనా? వారు మీకు అక్కడి పరిస్థితిని నివేదించారా? లేదంటే ఆ సంస్థ ప్రతినిధులు ఇంకెక్కడి డెయిరీనైనా చూపి టెండర్ దక్కించుకున్నారా?' అని అడగ్గా అవన్నీ అధికారులు చూసుకున్నారని ధర్మారెడ్డి బదులిచ్చారు.



విచారణ అనంతరం కారులో వెళ్తున్న ధర్మారెడ్డి

పోటు కార్మికుల ఫిర్యాదును ఎందుకు పట్టించుకోలేదు?

'లడ్డూ నాణ్యతపై అప్పట్లోనే భక్తులు అసంతృప్తి వ్యక్తంచేశారు. సరఫరా అవుతోన్న నెయ్యి నాణ్యంగా లేదని పోటు కార్మికులూ పలుమార్లు మీకు ఫిర్యాదు చేశారు కదా? అయినా నాణ్యత లేని నెయ్యి సరఫరా కొనసాగింది. ఐదేళ్లపాటు ఇలానే జరిగినా దీనిపై ఎందుకు దృష్టి సారించలేదు?' అని ధర్మారెడ్డిని సిట్ అధికారులు అడిగారు. పోటు కార్మికులు కొన్నిసార్లు విన్నవించిన విషయం వాస్తవమేనని.. హైకమాండ్ (ఉన్నతస్థాయి) ఒత్తిళ్ల కారణంగా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేకపోయానని ఆయన చెప్పినట్లు తెలిసింది.

చిన్న అప్పన్న కమీషన్ విషయం తెలుసా?

కల్తీ నెయ్యి వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి ఏమైనా ఒత్తిడి చేశారా? అని అడగ్గా ధర్మారెడ్డి ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదని సమాచారం. వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను దిల్లీలోని ఏపీ భవన్‌లో ఓఎస్డీగా నియమించినప్పుడు అతనికి తిరుమలలో ఏం పని? ఎప్పుడైనా అతను మిమ్మల్ని సంప్రదించారా? భోలేబాబా డెయిరీ ప్రతినిధి పీపీ శ్రీనివాస్‌ను చిన్న అప్పన్న కిలోకు రూ.25 చొప్పున కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయమైనా తెలుసా? అని అడగ్గా లేదని ధర్మారెడ్డి సమాధానమిచ్చారు. 'కమీషన్ ఇవ్వనందునే చిన్న అప్పన్న.. భోలేబాబా డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యి నాణ్యతపై వైవీ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేయడంతోపాటు ఇతరులతోనూ చేయించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా భోలేబాబా డెయిరీలో తనిఖీలు చేయించారని విచారణలో బహిర్గతమైంది. దీని గురించి సంబంధిత అధికారులు మీకు చెప్పారా?' అని సిట్ అని అడగ్గా గుర్తులేదని ధర్మారెడ్డి బదులిచ్చారు.

సంతకాలు చేసినప్పుడు బాధ్యత ఉంటుంది కదా?: తితిదే ధర్మకర్తల మండలి, అధికారులు, కొనుగోళ్ల కమిటీ ఇచ్చిన సిఫారసులను మీరు గుడ్డిగా ఆమోదించాల్సిన అవసరం లేదు కదా? వాటిపై సంతకాలు చేసినప్పుడు మీకు బాధ్యత ఉంటుంది కదా? భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని వాటిపై చర్చించే అధికారం మీకు ఉంది కదా? అని సిట్ అధికారులు గుర్తుచేశారు. ఇందులో మిగతా వారి పాత్ర ఎంత ఉందో తనదీ అంతేనని ధర్మారెడ్డి తెలిపారు.

పొమిల్ జైన్, విపిన్ జైన్‌లనూ..: భోలేబాబా డెయిరీ, శ్రీవైష్ణవి డెయిరీల్లో డైరెక్టర్లుగా ఉన్న పొమిల్ జైన్, విపిన్ జైన్‌లనూ రెండోరోజు ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నించింది. కల్తీ నెయ్యి బాగోతం బయటపడిన వెంటనే భగవాన్‌పూర్‌లోని డెయిరీని ఎందుకు మూసేశారని అడిగారు. కొద్ది రోజులకే శ్రీవైష్ణవి డెయిరీలో డైరెక్టర్లుగా రాజీనామా చేసి డ్రైవర్లైన సురేంద్ర సింగ్, సౌరభ్ కశ్యప్‌లను ఎందుకు నియమించారన్నారు. వరుసగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో కొంతకాలం డెయిరీని మూసేశామని వారు జవాబిచ్చారు. మధ్యాహ్నం 1.35 గంటలకు భోజన విరామం తీసుకున్నారు. తర్వాత పొమిల్ జైన్, విపిన్ జైన్‌లతో కలిపి ధర్మారెడ్డిని విచారించారని తెలిసింది. కొనుగోళ్ల కమిటీ సభ్యులతో మీరు ఎప్పుడైనా మాట్లాడారా? ధర్మారెడ్డి మీకు సహకరించారా? డబ్బులు ఏమైనా డిమాండ్ చేశారా? అని అడగ్గా వారు బదులివ్వలేదు. వారితో తాను ఎప్పుడూ మాట్లాడలేదని ధర్మారెడ్డి పేర్కొన్నారు.



భోజనం విరామ సమయంలో బయటకు వస్తున్న విపిన్ జైన్, పొమిల్ జైన్

ప్రభుత్వం మారాక టెండరు విధి విధానాల్లో మార్పు సహజం: రాత్రికి కారులో ఇంటికి వెళ్తూ ధర్మారెడ్డి.. 'ఈటీవీ' ప్రతినిధితో మాట్లాడారు. 'సిట్ విచారణలో భాగంగా... గతంలో తితిదేలో పనిచేసిన అధికారులను పిలిచారు. ఆ క్రమంలోనే నన్నూ రమ్మన్నారు. వారు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పా. విచారణకు సహకరించా. ప్రభుత్వం మారాక టెండరు విధివిధానాల్లో మార్పులు జరగడం సహజం. ఇప్పుడూ మార్చారు. నెయ్యి కొనుగోలులో అవినీతి చేయాల్సిన అవసరం లేదు. భోలేబాబా డెయిరీ ఎల్-1గా రావడంతో నెయ్యి సరఫరా కాంట్రాక్టును అప్పగించాం. అప్రూవర్‌గా మారినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవం. భక్తుల మనోభావాలు దెబ్బతీయవద్దు' అని ఆయన చెప్పారు.

ఉమర్ నబీ ఉగ్రావేశం!

దాడుల గురించి అతడు తరచూ అతిగా మాట్లాడేవాడు

ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి పేలుడు పదార్థాల సేకరణ

విచారణలో షాహీన్ వెల్లడించినట్లు సమాచారం

ఇంటర్నెట్ డెస్క్, ఫరీదాబాద్, లఖ్‌నవూ, దిల్లీ, శ్రీనగర్: దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్ర దాడులు చేయడం గురించి ఎర్రకోటవద్ద కారు బాంబు పేలుడుకు పాల్పడ్డాడని అనుమానిస్తున్న వైద్యుడు ఉమర్ నబీ. ప్రతిసారీ ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను అతడు సేకరిస్తున్నట్లు సమాచారం. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు బయటపడింది. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహీన్‌ను విచారించినప్పుడు ఈ వివరాలు వెల్లడైనట్లు సమాచారం. ఫరీదాబాద్ మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో డాక్టర్ షాహీన్‌ను అరెస్టు చేసిన అధికారులు.. తదుపరి విచారణ కోసం ఆమెను శ్రీనగర్ తీసుకెళ్లారు. విచారణ సమయంలో ఆమె నుంచి అధికారులు కీలక విషయాలు రాబట్టారు.



ఉమర్ నబీ

ఫరీదాబాద్ మాడ్యూల్‌లో తన సోదరుడు పర్వేజ్ సయీద్ భాగమని ఆమె పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో జమ్మూ కశ్మీర్ పోలీసులు మంగళవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడివద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని అధికారులు వెల్లడించారు. అరెస్టు అవుతాననే అనుమానంతో వాటిని అతడు దాచి ఉంచొచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో గురుగ్రామ్‌కు చెందిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాదారుడిని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. జమాత్ ఉల్ మొమినాత్‌కు జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తోంది. ఈ విభాగంలో షాహీన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి, నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలు చూస్తున్నట్లు సమాచారం.

నమ్మలేకపోతున్నాం
- షాహీన్ సోదరుడు

ఉగ్రవాదులతో తన సోదరికి సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని షాహీన్ సోదరుడు మహమ్మద్ షోయబ్ పేర్కొన్నారు. అసలు ఆమె పెళ్లిళ్లలో తప్ప ఎప్పుడూ బుర్ఖా ధరించలేదని షాహీన్ మాజీ భర్త డాక్టర్ జాఫర్ హయత్ వెల్లడించారు.

'పోలీసులు, ఉగ్రవాద వ్యతిరేక భద్రతా దళం సిబ్బంది మా ఇంటికి వచ్చారు. సోదాలు చేశారు. వివరాలను అడిగారు. సాధారణ ప్రశ్నలు అడిగారు. నన్నుగానీ, నా తండ్రినిగానీ ఇబ్బంది పెట్టలేదు. గత నాలుగేళ్లుగా షాహీన్ మాతో టచ్‌లో లేదు. అప్పుడప్పుడూ షాహీన్ పిల్లలతో మా తల్లిదండ్రులు మాట్లాడేవారు. లఖ్‌నవూలోని ఐఐఎం రోడ్డులో ఉన్న షాహీన్ ఇంటికి మేం ఎప్పుడూ వెళ్లలేదు. ఆ రోడ్డులో ఆమెకు ఇల్లుందని తెలుసు. కానీ అది ఎక్కడ ఉందో తెలియదు. మెడిసిన్ చదివేటప్పుడూ ఆమె ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినట్లు అనిపించలేదు. ఇప్పటికీ ఉగ్ర లింకులను నమ్మలేకపోతున్నాం' అని షోయబ్ వివరించారు.

■ 'ఆమె ఉగ్రవాదులతో కలిసి పని చేస్తుందని విని షాకయ్యా. ఒక నెల కిందటే షాహీన్‌తో మాట్లాడా. ప్రయాగ్‌రాజ్‌లో ఆమె మెడిసిన్ పూర్తి చేసింది' అని ఆమె తండ్రి తెలిపారు.

■ 'మంగళవారం సాయంత్రమే షాహీన్ అరెస్టయిన విషయం తెలిసింది. మేం 2003 నవంబరులో పెళ్లి చేసుకున్నాం. విడివిడిగా మెడిసిన్ చదువుకున్నాం. మాకు ఇద్దరు పిల్లలున్నారు. 2012లో మేం విడాకులు తీసుకున్నాం. అయితే మేమెప్పుడూ గొడవపడలేదు. విడాకులైనప్పటి నుంచి నేను ఆమెతో మాట్లాడలేదు. ఆమెను ఎప్పుడూ నేను బుర్ఖాలో చూడలేదు' అని కాన్పూర్‌లో ఉంటున్న ఆప్తమాలజిస్టు అయిన హయత్ తెలిపారు. ఆస్ట్రేలియాగానీ, ఐరోపాలోగానీ స్థిరపడాలని అప్పట్లో అనేదని వెల్లడించారు. ఆమె భారత్‌లోనే ఉన్నట్లు ఇటీవలే తెలిసిందని వివరించారు.

మరో ఇద్దరితో కలిసి..

అల్-ఫలా విశ్వవిద్యాలయంతో సంబంధాలున్న షాహీన్‌కు ముజమ్మిల్ గనయీతోపాటు మరో వైద్యుడితో సంబంధాలున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ముగ్గురు జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్‌తో కలిసి పని చేస్తున్నట్లు తేలింది. ఈ మాడ్యూల్.. కశ్మీర్, ఉత్తర్ ప్రదేశ్, హరియాణాల్లో విస్తరించినట్లు అనుమానిస్తున్నారు.

అసలు గురి ఎర్రకోట!

(మొదటి పేజీ తరువాయి)

దాడికి ప్రణాళిక వేశామని వెల్లడించారు. పరిసర ప్రాంతాల్లో జనవరి మొదటివారంలో పలుమార్లు రెక్కీ కూడా నిర్వహించామని తెలిపారు. తాను, అల్-ఫలా విశ్వవిద్యాలయం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఉమర్ నబీ (ఉమర్ మహ్మద్) (28) కలిసి రెక్కీ చేశామని కేసు నిందితుడు డాక్టర్ ముజమ్మిల్ గనీ పోలీసులకు ధ్రువీకరించాడు. ఈ రిపబ్లిక్ డే నాడు కుదరనందున, వచ్చే జనవరి 26న దాడి చేయాలని నిర్ణయించామన్నాడు. మొబైల్ టవర్ల డేటాను, సీసీటీవీ దృశ్యాలను పోలీసులు సేకరించినప్పుడూ ఈ మేరకు రుజువులు దొరికాయి. ఈ ఏడాది దీపావళి నాడు దిల్లీలోని రద్దీ ప్రాంతాల్లో పేలుళ్లు జరిపేందుకు కూడా ఉగ్రవాదులు కుట్ర పన్నారని అధికార వర్గాలు తెలిపాయి.

అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లు లభ్యం

ఎర్రకోట వద్ద పేలుళ్లకు ఉద్దేశించిన రెండో పదార్థం అమ్మోనియం నైట్రేట్ కంటే శక్తిమంతమైనదని, అందులో ఏమేం వాడారనేది లోతైన ఫోరెన్సిక్ పరీక్ష తర్వాత ధ్రువీకరణ అవుతుందని విచారణాధికారి ఒకరు తెలిపారు. పేలని కొన్ని తూటాలను, సుమారు 40 ఇతర ఆనవాళ్లను ఫోరెన్సిక్ బృందాలు సేకరించాయి. వాటి విశ్లేషణలో అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లు లభించాయని, అదనంగా మరొక అత్యంత శక్తిమంతమైన పేలుడు పదార్థం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. కారులో పేలుడుకు వాడిన పదార్థాల తీరుతెన్నులపై లోతైన విచారణ జరుగుతోంది. దీనికోసం ఫోరెన్సిక్ ల్యాబ్ రోజంతా పని చేస్తోంది. జమ్మూకశ్మీర్ పోలీసులు బుధవారం హరియాణాలోని మెవాత్‌లో మౌల్వీ ఇష్తియాక్ అనే మతబోధకుడిని నిర్బంధంలో తీసుకున్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా విశ్వవిద్యాలయ సముదాయంలో అతడు నివాసం ఉన్న అద్దె ఇంటి నుంచే 2,500 కిలోల పేలుడు పదార్థాలు దొరికాయి. ఉగ్రవాదులు 26/11 ముంబయి దాడుల తరహాలో దేశ రాజధానిలో వరుస పేలుళ్లకు పథక రచన చేసినట్లు తేలింది. ఎర్రకోటతో పాటు ఇండియాగేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం వంటి ప్రముఖ కట్టడాలు వారి లక్ష్యంగా ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.



ఇంటర్నెట్‌లో చూసి బాంబు తయారీ

ఇంటర్నెట్‌లో ఉన్న సమాచారం శోధించి, వాహనంలో అమర్చే ఐఈడీ బాంబును ఉమర్ నబీ తయారు చేస్తూ ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఆ క్రమంలోనే అది పేలిందని చెబుతున్నారు. తాను మూడు నెలలపాటు అందుబాటులో ఉండనని అక్టోబరు 26న కశ్మీర్‌కు వెళ్లినప్పుడు బంధుమిత్రులకు చెప్పినట్లు తెలిసింది. కారులో బాంబును అమర్చి కొన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలనేదే ఆ మాటల ఉద్దేశంగా భావిస్తున్నారు. శ్రీనగర్‌లో పోస్టర్లు వెలిసిన అంశంలో పోలీసుల ముమ్మర దర్యాప్తుతో ఆ పన్నాగం బెడిసికొట్టింది.

జైషే మహమ్మద్‌తో సంబంధాలు

ఎర్రకోట పేలుడు కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ దాడి వెనుక జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది. దిల్లీతోపాటు దేశవ్యాప్తంగా విధ్వంసకర దాడులకు ఈ ముఠా సిద్ధమవుతోందని అధికార వర్గాలు తెలిపాయి. శక్తివంతమైన సుమారు 200 ఐఈడీలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నట్లు తేలింది. వీటిని ఉపయోగించి దిల్లీలోని ముఖ్య ప్రాంతాలతోపాటు రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్ వద్ద భారీ పేలుళ్లకు పన్నాగం పన్నారు.

విదేశీ మూలాలపై ఆరా

దిల్లీ పేలుడు కేసును విచారణకు స్వీకరించిన ఎన్ఐఏ 10 మంది అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. నిందితుల ఆర్థిక లావాదేవీలు, విదేశీ నిధుల మూలాలు, వారిని వెనకనుంచి నడిపిస్తున్న ప్రధాన కుట్రదారుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిఘా మండలి (ఐబీ) చీఫ్, ఎన్ఐఏ డీజీ భేటీ అయ్యారు. పేలుడు ఎలా సంభవించిందో కచ్చితంగా తెలిపే దృశ్యాలూ సీసీటీవీల్లో రికార్డయ్యాయి. ట్రాఫిక్‌లో ఒక్కసారిగా మండే అగ్నిగోళం ఏర్పడినట్లు ఇవి చెబుతున్నాయి.

బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజు పేలుళ్లకు పన్నాగం

పేలుడు పదార్థాలున్న కారుతో ఎర్రకోట సమీపానికి వచ్చిన డాక్టర్ ఉమర్ నబీ డిసెంబరు 6న బాబ్రీ మసీదు కూల్చివేత రోజు శక్తిమంతమైన పేలుళ్లకు కుట్ర పన్నినట్లు అధికారులు తెలిపారు. జైషే మహమ్మద్ ఉగ్రవాదులతో సంబంధం ఉన్న ఎనిమిదిమందిని విచారించిన మీదట ఇది బయటపడింది. ముజమ్మిల్ గనయీ అరెస్టుతో ఆ ప్రయత్నానికి గండిపడింది. విద్యాపరంగా మంచి రికార్డులున్న ఉమర్ కొన్ని టెలిగ్రాం గ్రూపుల్లో చేరి, 2021లో గనయీతో కలిసి తుర్కియేకి వెళ్లాక జీవితం తీవ్రవాదం వైపు మళ్లిందని గుర్తించారు. అక్కడే జైషే నేతల్ని వారు కలిసినట్లు భావిస్తున్నారు. అప్పటి నుంచి అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, గంధకం వంటి పేలుడు పదార్థాల సమీకరణను ప్రారంభించి అల్‌ఫలా వర్సిటీ సమీపంలోనే నిల్వచేస్తూ వచ్చినట్లు గుర్తించారు. డిసెంబరు 6న చేయబోయే పేలుళ్ల గురించి సన్నిహితులకు చెప్పి, పేలుడు పదార్థాలను తన కారులో ఉంచడం ప్రారంభించాడని బయటపడింది. వీరున్న ఒక టెలిగ్రాం గ్రూపును పాక్‌లోని ఉగ్రవాది నడిపేవాడని తేలింది.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

నిర్మలా సీతారామన్‌కు మంత్రి నారాయణ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: అమృత్ పథకం, 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఆర్థికశాఖ మంత్రిని దిల్లీలో బుధవారం కలిసిన ఆయన.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రావలసిన నిధులు, కేటాయింపులు, విడుదలపై చర్చించారు. విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, సంచాలకులు సంపత్‌కుమార్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ ప్రభాకర్ పాల్గొన్నారు.

అమరావతిలో రూ.44,600 కోట్ల పెట్టుబడులు

• సీఐఐ భాగస్వామ్య సదస్సులో 41 ఒప్పందాలు

• హాజరుకానున్న మలేసియా, సింగపూర్, జర్మనీ, యూఏఈ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా రాజధాని అమరావతికి భారీగా పెట్టుబడులు రానున్నాయి. ఇప్పటికే రూ.51 వేల కోట్ల విలువైన పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ టెండర్లు పిలిచాయి. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నాయి. ఇవికాక సీఐఐ సదస్సు ద్వారా మరో రూ.44,600 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ మేరకు 41 అవగాహన ఒప్పందాలు కుదరనున్నాయి. పర్యాటకం, ఆరోగ్యం, మీడియా సిటీ, క్రీడలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నాలెడ్జ్ సిటీ సహా పలు ప్రధానరంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నారు. మలేసియా, సింగపూర్, జర్మనీ, యూఏఈ సహా దేశవిదేశాలకు చెందిన సుమారు 84 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. 13న సీఎం చంద్రబాబు సమక్షంలో 8, ఈ నెల 14న పురపాలకశాఖ మంత్రి నారాయణ సమక్షంలో 33 ఒప్పందాలు కుదరనున్నాయి.

ఈనాడు

వైకాపాసురుల మహాపచారాలు

'కొండవంటి దేవుడు నే గొలిచే దేవుడు' అంటూ అమేయ భక్తిప్రపత్తులతో తిరుమల వేంకటనాథుడికి చేతులు జోడించాడు అన్నమయ్య. 'కన్నులెదుటిదే ఘనవైకుంఠము' అని ఆయన ప్రణమిల్లిన తిరుమల- కోట్లాది మందికి పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం. 'యీతడే మా దేవుడు... శ్రీపతియైన దేవుడు శ్రీవేంకటాద్రి దేవుడు' అనుకుంటూ పిల్లాపాపలతో కొండకు వచ్చి మొక్కులు తీర్చుకునే అశేష భక్తజనవాహినికి శ్రీవారి లడ్డూ అంటే- సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరుడే ఆశీర్వదించి అనుగ్రహించిన దివ్య ప్రసాదం! కాసులకక్కుర్తితో దాన్ని అపవిత్రం చేసిన వైకాపాసురుల మహాపాతకాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. వేంకటేశుడి భక్తకోటి హృదయాలను అవి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. జగన్‌మోహన్ రెడ్డి జమానాలో ఒక్క చుక్క పాలను సేకరించకుండానే ఏవేవో రసాయనాలు కలిపి కల్తీనెయ్యి తయారుచేసి తిరుమలకు పంపిన భోలేబాబా డెయిరీ బాగోతం 'సిట్' దర్యాప్తులో బయటపడింది. దాని గురించి నాటి తితిదే ఈవో ధర్మారెడ్డిని ప్రశ్నిస్తే- హైకమాండ్ ఒత్తిడితోనే ఆ కల్తీనెయ్యి సరఫరాకు తాను అడ్డుచెప్పలేదని బదులిచ్చినట్లు భోగట్టా! ఏడుకొండలవాడి సేవకుడినని మరచిపోయి అధికార బాధ్యతల్లో ఉన్నన్నాళ్లూ వైకాపాధినేత సేవలోనే తరించిపోయిన భ్రష్టచరిత్ర ఆ మాజీ ఉన్నతాధికారి సొంతం. అవినీతి ఆరోపణలూ అడ్డగోలు వ్యవహారాలతో 'అధర్మారెడ్డి'గా పరువుమాసిన ఆయన 'హైకమాండ్' అని చెబుతున్న ఆ పెద్దమనుషులు ఎవరన్నది బహిరంగ రహస్యమే!

బొంకరా బొంకరా పోలిగా అంటే, టంగుటూరి మిరియాలు తాటికాయలంత! అన్నాడట వెనకటికొకడు. అచ్చం అలాగే పచ్చి అబద్ధాలాడటంలో జగన్ నోటికి హద్దూపద్దూ ఉండదు. అలాంటాయన మొన్నామధ్య సత్యహరిశ్చంద్రుడి వేషంకట్టుకుని 'తిరుపతి లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడారని చెప్పడం అబద్ధం కాదా? అది ధర్మమేనా? న్యాయమేనా?' అని కడవలకొద్దీ మొసలికన్నీరు కార్చేశారు. జగన్ ఏలుబడిలోనే తితిదేకు భోలేబాబా డెయిరీ నిర్వాహకులు 68.17 లక్షల కిలోల కల్తీనేతిని సరఫరాచేసి, రూ.251 కోట్లకు పైగా జేబులో వేసుకున్నారని ఎవరో కాదు- సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందమే నిగ్గుదేల్చింది. అప్పట్లో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా ఉన్న జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డికి ఈ అక్రమాల గుట్టు అంతా తెలుసునన్న సంగతి కూడా బయటకొచ్చింది. కమీషన్లకు లొట్టలేస్తూ వేంకటేశ్వరుడి సన్నిధిలో కల్తీనెయ్యితో మహాపరాధానికి ఒడిగట్టి, భక్తుల ఆరోగ్యంతో ఆటలాడుకున్న వారెవరూ క్షమార్హులు కారు!

తిరుమలను తన స్వార్థం కోసం వాడుకోవడం జగన్‌కు కొత్తేమీ కాదు. 2019కి ముందు పింక్ డైమండ్ అంటూ, వకుళమాత పోటులో తవ్వకాలు చేశారంటూ నోటికొచ్చిన అసత్యాలెన్నో వల్లెవేశారు. అలా బూటకపు ప్రచారంతో పదవిలోకి వచ్చాక అయినవారికి తిరుమలలో సర్వాధికారాలు కట్టబెట్టారు. ఆ మహిమాన్విత క్షేత్రాన్ని అడ్డుపెట్టుకుని తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకునే కుతంత్రాలకు పాల్పడ్డారు. ధర్మారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి లాంటి వివాదాస్పదులకు, మరికొందరు నేరచరితులకు తిరుమలను పునరావాస కేంద్రంగా మార్చి భక్తుల మనోభావాలపై గొడ్డలివేటు వేశారు. తితిదే బడ్జెట్ నుంచి సివిల్ పనులకు ఇష్టారాజ్యంగా నిధులు కేటాయించి వాటిని దారిమళ్లించే భ్రష్టాచారాలకూ జగన్ భృత్యులు తెగబడినట్లుగా కథనాలెన్నో వెలువడ్డాయి. దేవదేవుడి సొమ్మును దిగమింగిన ప్రబుద్ధులందరికీ తగిన దండనలు పడేలా చూడటం, వాళ్లు కాజేసిన సొత్తును అణాపైసలతో సహా కక్కించడం కూటమి సర్కారు కర్తవ్యం!




కృత్రిమ, తాత్కాలిక ఆనందాల వెంట పరుగులు తీయడం కన్నా ఒక గొప్ప విజయం కోసం అంకిత భావంతో కృషిచేయడం మిన్న. అలా లభించే ఆనందం శాశ్వతమైంది, సార్థకమైంది.

– మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

సచ్చిదానంద స్వరూపం

సచ్చిదానందమనేది భారతీయ తత్వశాస్త్రంలో పరమ సత్యాన్ని లేదా పరమాత్మ స్వభావాన్ని వివరించడానికి ఉపయోగిస్తారు. ఈ పదం సత్యం, జ్ఞానం, ఆనందం అనే మూడు విషయాలను సూచిస్తుంది. ఇది కేవలం నిర్వచనం కాదు, మన అంతరంగంలో, సకల విశ్వంలో వెలిగే దివ్యజ్యోతి.

సత్‌కి సరళమైన అర్థం ఉనికి. అయితే, వేదాంత దృక్కోణంలో దీనికి లోతైన అర్థం ఉంది. సాధారణంగా ఏ జీవి అయినా పుట్టి, పెరిగి, అంతరించిపోతుంది. ఇదంతా 'అసత్' అంటే తాత్కాలిక ఉనికి. కానీ, సత్ అనేది కాలం, ప్రదేశం, మార్పులకు అతీతమైన శాశ్వత అస్తిత్వం. దీన్ని మార్చడానికి, నాశనం చేయడానికి, సృష్టించడానికి వీల్లేదు. అది నిశ్చలం, స్వయంప్రకాశం. సకల సృష్టికీ, చరాచర జగత్తుకు మూలం ఈ సత్ శక్తియే. ప్రతిదీ ఈ నిత్యమైన ఉనికి నుంచే ఉద్భవిస్తుంది, అందులోనే లీనమవుతుంది. 'సత్'కి సత్యం అనే మరొక అర్థమూ ఉంది. మిగతా ప్రపంచమంతా మిథ్య అని, బ్రహ్మం మాత్రమే సత్యమని చెప్పేది ఈ 'సత్' లక్షణమే. అది పర్వతంలా స్థిరంగా, మహాసముద్రంలా అగాధంగా, సూర్యుడిలా నిత్యంగా ఉండే మూలశక్తి. అన్నింటికీ ఆధారభూతమైనది.



అంతర్యామి

సచ్చిదానందంలో రెండోభాగం 'చిత్'. దీనికి జ్ఞానం, చైతన్యం అని అర్థం. ఇది పుస్తకాలూ ఇంద్రియాల ద్వారా పొందే ఎరుక కాదు; సర్వవ్యాప్తమైన, ఆత్మరూపమైన చైతన్యం. సృష్టిలోని ప్రతి అణువులో, ప్రతి ప్రదేశంలో నిండి ఉంటుంది. ప్రతి జీవిలో ఆత్మరూపంలో ప్రకాశించేది ఈ చిత్ శక్తే. సూర్యుడికి వెలుగునివ్వడానికి వేరే దీపం అవసరం లేనట్లే, 'చిత్' ఎవరి సహాయం లేకుండా ప్రకాశిస్తుంది. మనసు, బుద్ధి, ఇంద్రియాలు పనిచేయడానికి వెనకనున్న ఇంధనం ఇదే. అద్దం స్వయంగా వస్తువులను సృష్టించకపోయినా, అన్ని వస్తువులనూ తనలో ప్రతిబింబిస్తుంది. అదేవిధంగా, బ్రహ్మం తన చైతన్యంతో ఈ సృష్టి అంతటినీ గమనిస్తుంది, ప్రతిబింబిస్తుంది, కానీ దేనికీ అంటకుండా ఉంటుంది.

మూడోది ఆనందం. ఇది క్షణికమైన సంతోషాలకు, ఇంద్రియ సుఖాలకు అతీతమైంది. మనం అనుభవించే ప్రతి సుఖం కూడా ఆనందం తాలూకు ప్రతిబింబమే. ఈ సుఖాలన్నిటికీ మూలం ఆనంద స్వరూపమైన బ్రహ్మమే. 'ఆనందం' దేనిపైనా ఆధారపడదు. పరమాత్మ నిజమైన స్వభావం నిరంతర ఆనందం. అది సముద్రంలా ఉంటుంది. సంద్రంలో ఎన్ని అలలు, కల్లోలాలు వచ్చినా, లోపలి భాగం ఎల్లప్పుడూ ప్రశాంతంగా, అచంచలంగా ఉంటుంది. అదేవిధంగా, జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, పరమాత్మతో అనుసంధానం అయినప్పుడు లభించే ఆనందం ఎప్పటికీ చెక్కుచెదరదు.

సచ్చిదానందం అనేది కేవలం బ్రహ్మానికి సంబంధించిన లక్షణాల వివరణకే కాదు; విశ్వానికి, మానవ జీవితానికి సంబంధించిన లోతైన తాత్విక సత్యం. ఈ నిత్యమైన, చైతన్యవంతమైన, ఆనంద స్వరూపాన్ని తెలుసుకోవడమే మానవ జీవిత అంతిమ లక్ష్యం.

– డాక్టర్ చిట్యాల రవీందర్

మమ్దానీ చేసి చూపించగలరా?

అమెరికాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ, వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మీ, సిన్సినాటి మేయర్‌గా అఫ్తాబ్ పురేవాల్ ఎన్నికయ్యారు. భారత సంతతికి చెందిన వీరిలో మమ్దానీ విజయం అందరినీ ఆకర్షించింది. నగర జీవన వ్యయం ప్రజలకు అందుబాటులో లేదనీ, తాను మేయర్‌నైతే ఈ సమస్యను ప్రజాస్వామ్య, సామ్యవాద విధానాలతో పరిష్కరిస్తాననీ ఆయన హామీ ఇచ్చారు. దీనికితోడు వ్యక్తిగత ఆకర్షణ, అనర్గళ వాగ్ధాటి, పదునైన ప్రచార వ్యూహాలతో 50 ఏళ్ల ఓటింగ్ రికార్డులను బద్దలు కొట్టి మరీ 34 ఏళ్ల ఈ యువనేత గెలిచారు. కానీ, తన వాగ్దానాలను నిలబెట్టుకోవడం మమ్దానీకి అంత సులభమేమీ కాదు.

న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ప్రత్యర్థులను మట్టికరిపించిన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ- ఇప్పుడు వార్తల్లో వ్యక్తి అయ్యారు. కానీ, ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన తీవ్ర విమర్శలెన్నింటినో ఎదుర్కొన్నారు. తోటి పోటీదారులు కోమో, ఆడమ్స్, స్లివాలతో పాటు సెనెటర్ క్రూజ్, రిపబ్లికన్ పార్టీ ప్రముఖులు, రైట్ వింగ్ టీవీ వ్యాఖ్యాతలు... సైద్ధాంతికంగానే కాకుండా, మతద్వేషంతో, జాతి వివక్షతో అత్యంత పరుషమైన భాషలో మమ్దానీపై విమర్శల దాడికి దిగారు. ప్రజాస్వామ్య సామ్యవాది(డెమొక్రటిక్ సోషలిస్ట్)గా ప్రకటించుకున్న ఆయనను 'కమ్యూనిస్టుగా, కమ్యూనిస్ట్ జిహాదీగా, ప్రపంచ తీవ్రవాదానికి ట్రోజన్ హార్స్'గా ప్రత్యర్థులు అభివర్ణించారు. అధ్యక్షుడు ట్రంప్ సైతం మమ్దానీని 'వందశాతం కమ్యూనిస్ట్ పిచ్చోడు' అన్నారు. మమ్దానీ మతవిశ్వాసాన్ని ఎత్తిచూపుతూ- 'ఇంతిఫాదా, ఉగ్రవాద సానుభూతిపరుడు, హమాస్ ఉగ్రవాది, పూర్తిస్థాయి జిహాదీ, ఒసామా-బిన్ మమ్దానీ' వంటి తీవ్ర అభ్యంతరకర పదజాలాన్ని వాడి 9/11 దాడులతో ఆయనకు ముడిపెట్టే ప్రయత్నం చేశారు. అమెరికా పౌరుడైన మమ్దానీ రూపాన్నీ, వలస నేపథ్యాన్నీ ప్రత్యర్థులు వేలెత్తి చూపుతూ కించపరిచారు. మమ్దానీని దేశ బహిష్కరణ చేయాలనీ, ఆయన ఉగాండాకు తిరిగి వెళ్లిపోవాలనీ, ఇది 'న్యూయార్క్-స్థాన్' కాదంటూ జాతి విద్వేషాన్ని వెళ్లగక్కారు.



ఆ మాటకు అర్థమేంటి?

ప్రత్యర్థుల విమర్శలను మమ్దానీ చిరునవ్వుతోనే ఎదుర్కొన్నారు. వాటిని పెద్దగా పట్టించుకోకుండా ప్రచారంపైనే దృష్టి సారించారు. న్యూయార్క్‌లో జనజీవితాలను మెరుగుపరిచేందుకు తానేం చేస్తానన్నది చెప్పుకొచ్చారు. ఫాక్స్ టీవీ ఇంటర్వ్యూలోనూ ట్రంప్‌ను ఉద్దేశించి క్లిష్టమైన ప్రశ్నలన్నింటికీ సూటిగా సమాధానాలిచ్చారు. ఆరు నెలల క్రితం మమ్దానీ ఎవరో న్యూయార్క్‌లో పెద్దగా ఎవరికీ తెలియదు. అలాంటిది, దాదాపు 85లక్షల మంది నివసిస్తున్న ప్రపంచస్థాయి నగరానికి మేయర్‌గా ఎన్నిక కావడం కొందరికి ఉత్తేజం కలిగిస్తే- ఆయన విశ్వాసాలూ సిద్ధాంతాలూ మరికొందరిలో ఆందోళన రేకెత్తించాయి.


మమ్దానీ ఎన్నికల ప్రచారంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును యుద్ధ నేరస్థుడిగా పేర్కొన్నారు. తాను మేయర్‌నయ్యి, నెతన్యాహు ఒకవేళ న్యూయార్క్ వస్తే మాత్రం ఆయనను అరెస్టు చేయిస్తానని వ్యాఖ్యానించారు. దీనిపై బాగా చర్చ జరిగింది. మమ్దానీ తన ప్రచారంలో 'గ్లోబలైజ్ ఇంతిఫాదా' అనడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ముఖ్యంగా ఇజ్రాయెల్ అనుకూలురు, సంప్రదాయవాద ప్రత్యర్థులు ఈ మాట ఉగ్రవాదాన్ని కీర్తిస్తోందనీ, మమ్దానీ రాజకీయ తీవ్రవాదానికి నిదర్శనమనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్త హింసాత్మక ఘర్షణకు పిలుపివ్వడం ద్వారా యూదు వ్యతిరేకతను ఆయన ప్రేరేపిస్తున్నారంటూ విమర్శించారు. అయితే, దీనికి మమ్దానీ- అరబిక్‌లో 'వదిలించుకోవడం, తిరుగుబాటు' అనే అర్థంలోనే ఇంతిఫాదా అనే మాటను అన్నానంటూ చెప్పుకొచ్చారు. అయినాసరే, తీవ్రస్థాయిలో ముసురుతున్న విమర్శలను తగ్గించుకోవడానికి ఆయన కాస్త దిగివచ్చి, భవిష్యత్తులో ఈ మాటను ఉపయోగించకుండా ప్రయత్నిస్తానన్నారు. అదే సమయంలో పాలస్తీనా అనుకూల వైఖరికి మాత్రం మమ్దానీ కట్టుబడ్డారు.

నిధులు ఎలా తెస్తారు?

మమ్దానీ ప్రతిపాదించిన యూనివర్సల్ చైల్డ్‌కేర్‌కు సుమారు ఆరు బిలియన్ డాలర్లు, ఉచిత బస్ సేవకు 800 మిలియన్ డాలర్లు, సిటీ ఆధ్వర్యంలోని కిరాణా దుకాణాలకు 60 మిలియన్ డాలర్లు అవసరం. ఇన్ని నిధులను ఎలా సమకూరుస్తారన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అందుకాయన సమాధానమిస్తూ- కార్పొరేట్ ఆదాయపు పన్నును 11.5శాతానికి పెంచుతామన్నారు. ఒక మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపాదించేవారి వ్యక్తిగత ఆదాయపు పన్నుపై రెండు శాతం సర్‌ఛార్జ్ విధిస్తామన్నారు. కానీ, ఇలా పన్నులు పెంచే విషయంలో నగర పాలక సంస్థకు ఉండే అధికారం చాలా పరిమితం. ఇదే చేయాలంటే మమ్దానీకి రాష్ట్ర శాసనసభ, గవర్నర్ నుంచి అనుమతి తప్పనిసరి. అర్జెంటినా అధ్యక్షుడు హావియర్ మిలె తనను తాను లిబర్టేరియన్‌గా ప్రకటించుకున్నారు. కానీ, తన విధానాలను బలవంతంగా అమలుచేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఆయన విధానాలు వినాశకర ఫలితాలిచ్చాయి. దాంతో ఆయన అమెరికా నుంచి 40 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీ కోసం అభ్యర్థించారు. అధ్యక్షుడిగా తానుకున్నది అమలు చేయడానికి మిలెకి విస్తృతమైన అధికారాలున్నాయి. కానీ, మేయర్‌గా తన విధానాలకు నిధులు సమకూర్చుకునే అవకాశాలు మమ్దానీకి చాలా తక్కువ.

ట్రంప్ ప్రతీకారం ప్రదర్శిస్తారా?

మమ్దానీ తన విజయ ప్రసంగంలో 'డొనాల్డ్ ట్రంప్! సౌండ్ పెంచుకుని వినండి' అంటూ పలుసార్లు అధ్యక్షుణ్ని ఉద్దేశించి నేరుగా మాట్లాడారు. ప్రత్యర్థులపై పగ, ప్రతీకారం తీర్చుకోవడాన్నే తన పాలనా విధానంగా మార్చుకున్న ట్రంప్- మమ్దానీపై ఆగ్రహంతో తన స్వస్థలమైన న్యూయార్క్‌కు కచ్చితంగా నిధులు నిలిపేస్తారని అంతా భావిస్తున్నారు. కాబట్టి, మమ్దానీ తన వాగ్దానాల్లో చాలావాటిని నెరవేర్చడం అసంభవమని పలువురు భావిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యమేమిటంటే- మమ్దానీకి ఓటేసిన వారిలోనూ 60శాతం మందికిపైగా ఇదే అభిప్రాయాన్ని ఓ సర్వేలో చెప్పారు! ఏదిఏమైనా మమ్దానీ అమెరికా రాజకీయాల్లో రాణించడం, ముఖ్యంగా ఇక్కడి దక్షిణాసియా సంతతివారికి ఒక చారిత్రక ఘట్టం. ఆయన విజయం డెమొక్రటిక్ పార్టీకి ఒక సరికొత్త మైలురాయి. మమ్దానీ రాజకీయ ఎదుగుదల వలసదారులతో నిండిన న్యూయార్క్ నగర ప్రత్యేక పరిస్థితులకు మాత్రమే పరిమితం కావచ్చు. కానీ, అమెరికన్లలో రాజకీయ అభిప్రాయాల వృద్ధికీ, వ్యక్తీకరణకూ న్యూయార్క్ మేయర్ ఎన్నికలు అద్దం పట్టాయనే చెప్పాలి.



ప్రొఫెసర్ వి.మోహన మురళీధర్

జార్జ్ మేసన్ యూనివర్సిటీ, వర్జీనియా, అమెరికా



ఫల్టన్... మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మహర్ ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతం. అక్కడ బేబీతాయి కాంబ్లే కుటుంబానికి పండ్లు, సరకులు అమ్మే దుకాణం ఉంది. ఆమె పొద్దున్నే వంట ముగించుకుని దుకాణానికి రాగానే భర్త సరకులు తేవడానికి వెళ్లేవాడు.

ఫల్టన్ కథానాయిక

పదమూడేళ్లకే పెళ్లవడంతో బేబీ కాంబ్లే చదువు నాలుగో తరగతితో ఆగిపోయింది. దుకాణంలో కూర్చుని, పొట్లాలు కట్టడానికి తెచ్చిన పాత పేపర్లన్నిటినీ ఆమె ఒక్క అక్షరం వదలకుండా చదివేది. క్రమంగా లైబ్రరీలో పుస్తకాలు తెచ్చుకుని చదవడమూ అలవాటైంది. అయితే తాను చదివిన పుస్తకాల్లో ఎక్కడా తనలాంటి వారి కథలు లేకపోవడం ఆమెను ఆలోచింపజేసింది. తనకు తెలిసిన ఆ కథల్ని రాద్దామనుకుంది. ముఖ్యంగా మహర్ స్త్రీల కష్టాలు, అణచివేతల గురించి ఎక్కువగా ఆలోచించేది. అంబేద్కర్ ఉపన్యాసాలు విన్న ఆమె మహిళా మండలిలో చేరింది. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంది. బేబీతాయి కృషి ఫలితంగానే ప్రభుత్వం అక్కడో ఆశ్రమపాఠశాలను ప్రారంభించింది. తన జీవితం నేపథ్యంగా నాటి సమాజంలోని కుల, లింగ వివక్షలు, దోపిడీ, పితృస్వామ్య ధోరణులు తదితరాలన్నిటి గురించి రాయడం మొదలెట్టింది బేబీ కాంబ్లే. కుటుంబ సభ్యులు ఒప్పుకోరనే భయంతో రాసినవాటిని అటక మీద దాచేసేది.

అలా రెండు దశాబ్దాలు గడిచిపోయాయి. మాక్సీన్ బెర్న్‌స్టైన్ అనే అమెరికన్ స్త్రీవాద రచయిత్రి పరిశోధన నిమిత్తం ఫల్టన్ వచ్చి రెండేళ్లు అక్కడే ఉన్నారు. అప్పుడు బేబీ కాంబ్లే నోట్సు ఆమె దృష్టిలో పడింది. తానే సిఫార్సు చేసి అది 'స్త్రీ' పత్రికలో సీరియల్‌గా వచ్చేలా చేశారు. దానికి మంచి ఆదరణ లభించడంతో ఓ ప్రచురణ సంస్థ ముందుకొచ్చి 'జీనా అమూచ'(మా బతుకు) పేరుతో మరాఠీలో ప్రచురించింది. అలా బేబీ కాంబ్లే రచన మరాఠీలో తొలి దళిత మహిళ ఆత్మకథగా వెలుగు చూసింది. ఆ పుస్తకాన్ని మాయా భట్ ఇంగ్లీషులోకి(ద ప్రిజన్స్ వియ్ బ్రోక్), బి.అనురాధ 'మా బతుకులు' పేరుతో తెలుగులోకి అనువదించారు. మహర్ పిల్లలు బడికి వెళ్తే టీచర్లు వాళ్ల ముఖాలు కూడా చూడటానికి ఇష్టపడేవారు కారట. మహిళల స్థితిగతులు మరింత దారుణంగా ఉండేవి. అంబేద్కర్ ప్రభావంతో చదువుకోవడం, వృత్తి ఉపాధుల్లోకి రావడం వంటి మార్పులు తమ వారిలో వచ్చాయని రచయిత్రి ఈ పుస్తకంలో చెబుతారు.

1929 నాటి సంగతి. ఏడాదిన్నర బిడ్డను ఒళ్లో పెట్టుకుని విచారంగా గుమ్మంలో కూర్చుని ఉంది తల్లి. కాస్త దూరంగా ఆ బిడ్డకోసం సమాధి తవ్వుతున్నారు. 'ఇప్పటి వరకూ నా బిడ్డలందరినీ కళ్లారా చూసుకోనివ్వకుండా రాత్రిపూట సమాధి చేశారు, ఈ పిల్ల ముఖమైనా కాస్త చూసుకోనివ్వమని పట్టుబట్టిందా తల్లి. అలా అమ్మ ఒడిలో రాత్రంతా ఉలుకూపలుకూ లేకుండా ఉన్న ఆ బిడ్డ తెల్లవారేసరికి కళ్లు తెరిచింది. తల్లి కోరిక వల్ల బతికి బట్టకట్టిన ఆ పాపే బేబీ కాంబ్లే. స్త్రీవాదిగా, దళిత ఉద్యమకారిణిగా, విద్యాప్రదాతగా మహారాష్ట్రలో ఎంతో ఖ్యాతిగాంచిన ఆమె 2012లో తుదిశ్వాస విడిచారు.

– డాక్టర్ బి.సత్యనారాయణ

ఆర్‌అండ్‌డీలో మనం వెనకే!

ఏ దేశమైనా ఆర్థికాభివృద్ధి సాధించాలంటే పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)పై తగినంత ఖర్చు చేయాలి. అది నూతన ఆవిష్కరణలకు ఊతమిస్తుంది. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడానికి తోడ్పడుతుంది. ఆర్‌అండ్‌డీపై తగినంతగా దృష్టి సారిస్తే నూతన వస్తువులు, సేవల సృష్టికి మార్గం సుగమమవుతుంది. ఉత్పాదకత ఇనుమడిస్తుంది. 2020లో ఇండియా తన జీడీపీలో 0.65శాతమే ఆర్‌అండ్‌డీకి వెచ్చించింది. చాలా దేశాలు అంతకు రెట్టింపు ఖర్చు చేస్తూ అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. 2022లో తమ జీడీపీలో ఎంత సొమ్మును ఆయా దేశాలు ఆర్‌అండ్‌డీ కోసం ఖర్చు చేశాయంటే (శాతాల్లో)...

ఇజ్రాయెల్	6.02
దక్షిణ కొరియా	5.21
అమెరికా	3.59
జపాన్	3.41
జర్మనీ	3.13
ఫిన్లాండ్	2.96
చైనా	2.56
నెదర్లాండ్స్	2.26
ఫ్రాన్స్	2.23
ఇటలీ	1.39

(ఆధారం: ప్రపంచబ్యాంక్ వెబ్‌సైట్)

వారసుల చేతికి వేగంగా డిపాజిట్లు!

ఎవరైనా ఖాతాదారుడు మరణించినప్పుడు చాలా బ్యాంకులు నామినేషన్ ఉన్నాసరే, రకరకాల పత్రాలు కావాలంటూ సంబంధిత వారసులను ఇబ్బంది పెడుతున్నాయి. నామినేషన్ లేకుండా ఖాతాదారుడు మరణిస్తే, కోర్టు ద్వారా పొందిన వారసత్వ హక్కుపత్రాలను తీసుకురమ్మంటున్నాయి. పూచీకత్తు కావాలనీ మెలిక పెడుతున్నాయి. దానివల్ల డబ్బులు వెంటనే చేతికందక బాధిత కుటుంబాలకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇలా కాకుండా, నామినీలకు వెంటనే డబ్బు అందించేందుకు ఆర్‌బీఐ తీసుకొచ్చిన తాజా మార్గదర్శకాలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులతో పాటు సహకార బ్యాంకులూ అనుసరించాల్సి ఉంటుంది.

కొత్త నిబంధనలు ఏం చెబుతున్నాయి?

ఆర్‌బీఐ నూతన నిబంధనల ప్రకారం- బ్యాంకు ఖాతాదారుడు మరణించి, నామినేషన్ ఉంటే... కోర్టుల నుంచి ఎలాంటి ఆదేశాలు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. ఆర్‌బీఐ మార్గదర్శకాలతో పాటు ఇచ్చిన అనెక్చర్-1 ఫారాన్ని నింపి... ఖాతాదారుడి మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు క్లెయిమ్ చేస్తున్నవారు తమ గుర్తింపు పత్రాన్ని బ్యాంకుకు సమర్పిస్తే సరిపోతుంది. ఒకవేళ నామినేషన్ లేకుండానే అకౌంట్ హోల్డర్ మరణిస్తే మాత్రం- ఖాతాదారుడి డెత్ సర్టిఫికెట్, తమ గుర్తింపు పత్రాలతో పాటు అనెక్చర్ 1-ఈలో పేర్కొన్న డిక్లరేషన్ ఫారంపై పరిచయస్తులతో సంతకం చేయించి బ్యాంకుకు సమర్పించాల్సి ఉంటుంది. ఇవి మినహా, ఇతరత్రా పూచీకత్తు కావాలని బ్యాంకులు అడగడానికి వీల్లేదు. ఈ పద్ధతిలో సంబంధిత వారసులు సహకార బ్యాంకుల నుంచి రూ.అయిదు లక్షల వరకు; ఇతర వాణిజ్య బ్యాంకులైతే రూ.15లక్షల వరకు డబ్బులు పొందవచ్చు. అంతకుమించి డిపాజిట్లు ఉంటే మాత్రం- పైన చెప్పిన పత్రాలతో పాటు అనెక్చర్-1లోని డిక్లరేషన్ ఫారాన్ని క్లెయిమ్ చేస్తున్నవారు తమకు తెలిసినవారితో నోటరీ చేయించాలి. లేదంటే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా న్యాయాధికారి సమక్షంలో వారితో సంతకం చేయించి బ్యాంకుకు ఇవ్వాలి.

నూతన మార్గదర్శకాల ప్రకారం- వీలునామా కేసులు, కోర్టు వివాదాల్లో ఉన్నవాటికి సంబంధించిన డిపాజిట్లను బ్యాంకులు పరిష్కరించకూడదు. ఈ విషయంలో కోర్టు ఆదేశాల ప్రకారమే బ్యాంకులు నడుచుకోవాలి. వీలునామా ద్వారా క్లెయిమ్ చేయదలిస్తే, కోర్టు ద్వారా ధ్రువీకరించిన వీలునామాను సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ వీలునామా లబ్ధిదారులతో పాటు మిగతా వారసులకూ సమ్మతమైతే... కోర్టు ద్వారా ధ్రువీకరించుకోవాల్సిన అవసరం లేకుండానే బ్యాంకులు క్లెయిమ్‌ను పరిష్కరించవచ్చని ఆర్‌బీఐ సూచించింది. ఈ విషయంలో వీలునామా, కోర్టు ఆదేశాలు తప్ప మరే ఇతర పత్రాలనూ గ్యారంటీగా సమర్పించాలని బ్యాంకులు అడగకూడదు. టర్మ్ డిపాజిట్ గడువు తీరకముందే డిపాజిట్‌దారుడు మరణిస్తే- ఎలాంటి పెనాల్టీ రుసుము లేకుండానే వారసులకు డిపాజిట్ సొమ్మును అందించాలి. ఈ విధంగా చెల్లింపులు జరిపే విషయాన్ని టర్మ్ డిపాజిట్ అప్లికేషన్ ఫారంలోనే బ్యాంకులు స్పష్టంగా ఖాతాదారులకు తెలియజెప్పాలి.

బ్యాంకు ఖాతాదారుడు ఎవరైనా మరణించినప్పుడు, అతని పేరిట ఉన్న డిపాజిట్లు వారసులకు బదిలీ కావడానికి ప్రస్తుత నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. ఈ విషయంలో ఒక్కో బ్యాంకు ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఈ దుస్థితిని తప్పించేందుకు రిజర్వు బ్యాంకు తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలయ్యే ఈ కొత్త నిబంధనల ప్రకారం- మరణించిన ఖాతాదారుల వారసులకు డిపాజిట్లను బదిలీచేసే విషయంలో అన్ని బ్యాంకులూ ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.




పక్షం రోజుల్లో పరిష్కారం...

ఖాతాదారులు ఎవరైనా ఏడేళ్లపాటు కనిపించకుండా పోతే, వారిని మరణించినట్లుగానే పరిగణిస్తారు. అలాంటి సందర్భంలో ఖాతాదారుల కుటుంబ సభ్యులు సొమ్ములను క్లెయిమ్ చేసుకోవడానికి ప్రస్తుతం ఏడేళ్లపాటు నిరీక్షించాల్సి వస్తోంది. అంతకాలం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండానే బ్యాంకులు ఎఫ్ఐఆర్ కాపీ, పోలీసు రిపోర్టు ఆధారంగా కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల వరకు చెల్లించవచ్చని ఆర్‌బీఐ నూతన మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. నామినేషన్ లేని సందర్భాల్లోనూ పైన చెప్పిన విధానాన్నే అనుసరించాలి. అనెక్చర్-1బి ఫార్మాట్ ద్వారా లాకర్లలో ఉన్న వస్తువులను ఖాతాదారుల కుటుంబ సభ్యులు క్లెయిమ్ చేసుకోవచ్చు. వారు అన్ని పత్రాలు సమర్పించిన 15 రోజుల్లో క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఆర్‌బీఐ పేర్కొంది. ఒకవేళ బ్యాంకుల వల్ల క్లెయిమ్‌ల పరిష్కారం ఆలస్యమైతే, ప్రస్తుత వడ్డీ రేటుకు మరో నాలుగు శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, లాకర్ క్లెయిముల పరిష్కారంలో 15 రోజులకు మించి జాప్యం చేస్తే- ఆపై ప్రతిరోజూ జాప్యానికి అయిదు వేల రూపాయల చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఖాతాలు తెరిచే సమయంలోనే నామినేషన్ ప్రక్రియను పూర్తిచేస్తే... క్లెయిముల పరిష్కారం వారసులతో పాటు బ్యాంకులకూ సులభమవుతుంది. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొందరు, అవగాహనా రాహిత్యంవల్ల మరికొందరు ఎలాంటి నామినేషన్ లేకుండానే బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించడానికి, నామినేషన్‌ను తప్పనిసరి చేస్తూ ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరముంది.

– హరీశ్ కొలిచాల

విశ్రాంత ఏజీఎం(లా), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్



తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ అవసరం

పాయకాపురం, న్యూస్‌టుడే : తాగునీటి పథకాల పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సరఫరాపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా పథకాల పనుల ప్రగతి, తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. క్లోరినేషన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్యారోగ్యం, భూగర్భ జల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 584 పనులు చేపట్టి, 262 పనులు పూర్తి చేశామని చెప్పారు. మిగతావి త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలసత్వం వహించే గుత్తేదారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఎం.ఎఫ్.విజయకుమారి, డీఈ వి.రవి కుమార్, ఏఈ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపులులు.. ఫలప్రదం

మల్లవల్లి సీపీసీకి ఎట్టకేలకు మోక్షం

విస్తీర్ణం: 7.48 ఎకరాలు
వ్యయం: రూ.86 కోట్లు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

రైతులు, ఫల ఆధారిత పరిశ్రమలు నిర్వహించే వారు పళ్లు, కాయలు తెస్తే.. రసం(జ్యూస్), పల్ప్(గుజ్జు) ప్యాక్‌చేసి ఇచ్చేలా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మల్లవల్లిలో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) రూపొందించారు. దీనికి 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం అంకురార్పణ చేస్తే, తర్వాత వచ్చిన వైకాపా సర్కారు మూలకు చేర్చింది. తాజాగా వినియోగంలోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, ప్రఖ్యాత 'లులు' గ్రూప్ అనుబంధ సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ★ పండ్లను మాగబెట్టడం, వాటి నుంచి గుజ్జు, రసం తీయడం, బియ్యం, జొన్నలు వంటి ఆహార ధాన్యాలు నిల్వ చేసుకునేందుకు, పండ్లు, కూరగాయల నిల్వకు వేర్వేరుగా గిడ్డంగులు, ప్యాకింగ్ యూనిట్లు, ఆహార ఉత్పత్తుల నాణ్యత పరిశీలించేందుకు ఎనలైటికల్ ల్యాబ్ వంటి వసతులతో అధునాతనంగా నిర్మించారు. ★ పంట నిల్వకు వీలుగా 4 వేల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు నిర్మించారు. ★ 3 వేల టన్నుల పంటలు నిల్వ చేసేలా కోల్డ్ స్టోరేజీని సిద్ధం చేశారు. ★ కాయలను మాగబెట్టేందుకు ఒక్కొక్కటి 200 టన్నుల సామర్థ్యం గల 8 రైపెనింగ్ ఛాంబర్లు ఉన్నాయి

అయిదు రోజుల్లో.. పూర్తి ఆటో విధానంలో పనిచేసే రైపెనింగ్ ఛాంబర్లలో అన్ని రకాల కాయలు పక్వానికి వస్తాయి

గంట వ్యవధిలోనే.. 10 టన్నులు పండ్ల రసాలు, వివిధ రకాల గుజ్జు ఉత్పత్తి చేసి, వాటిని స్టెరిలైజేషన్ ట్యాంకుల్లోకి పంపి 104 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడిచేస్తారు, తర్వాత రసాలు, గుజ్జుని సాధారణ ఉష్ణోగ్రతకు తీసుకొచ్చి బ్యారెల్‌లో నింపుతారు. పండ్ల రసాలను తాగేందుకు వీలుగా టెట్రా ప్యాక్‌లు తయారు చేసుకోవచ్చు. చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాల పొడులు ప్యాకెట్లను గంటలో 70 తయారు చేసుకోవచ్చు.

రూ.50లక్షలు చెల్లించేలా.. 'లులు' గ్రూప్‌కు చెందిన ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు ఏడాదికి రూ.50 లక్షలు చెల్లించే ప్రాతిపదికన లీజుకు కేటాయించారు. త్వరలో ఈ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తోంది.

మూడేళ్ల కిందటే.. మామిడి, అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లతో పాటు టమాటాలను గుజ్జు, రసం రూపంలో శుద్ధి చేసేందుకు అన్ని వసతులు, పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యంత్ర వ్యవస్థను సీపీసీలో అమర్చారు. నిర్మాణంతో పాటు నిర్వహణకు అనువుగా కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.



సీపీసీ భవన సముదాయం



కీలక యంత్ర వ్యవస్థ

అక్రమాల వెలుగు.. అతివకు దిగులు!

డీఆర్‌డీఏలో బుక్‌కీపర్ల దందా



ఈనాడు, అమరావతి

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వెలుగు సంఘాల్లో లెక్కలేనన్ని చీకటి దందాలు వెలుగు చూస్తున్నాయి.. కొందరు కింది స్థాయి అధికారులు, బుక్ కీపర్లు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను పావులుగా మార్చి వ్యవహారం చక్కబెడుతున్నారు. అక్రమ సంఘాలను సృష్టించడం, సభ్యులకు తెలియకుండా రుణాలు స్వాహా చేయడంతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

☛ గొల్లపూడిలో స్థానిక సీసీ, ఏపీఎం కలిసి నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో మహిళలను నాలుగైదు గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి 14 అనధికార గ్రూపులు సృష్టించారు. వారి వివరాలు ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) చేస్తే బండారం బయట పడుతుందని మాన్యువల్‌గా దరఖాస్తు చేసి బ్యాంకు అధికారులను ఒప్పించారు. ఏకంగా రూ.2.8 కోట్లు కొల్లగొట్టారు.

☛ రెడ్డిగూడెం మండలంలో ఓ బుక్‌కీపర్ స్త్రీనిధి రుణం ఇప్పిస్తున్నట్లు ప్రెసిడెంట్, సెక్రటరీలను బ్యాంకుకు తీసుకువెళ్లారు. ఖాళీ బ్యాంకు ఓచర్లపై సంతకాలు చేయించి రూ.లక్ష బదులు రూ.3 లక్షలు నమోదు చేశారు. అదనంగా నమోదైన రూ.2 లక్షలను.. మరో బుక్‌కీపర్ ఖాతాలో జమయ్యేలా బ్యాంకు అధికారులను ఒప్పించారు. రూ.2 లక్షలకు ఇద్దరు బుక్‌కీపర్లు వాటాలేసుకున్నారు. అలా అన్ని గ్రూపుల్లో కలిపి రూ.20 లక్షల మేర దారి మళ్లాయి.

వెలుగు మాటున చీకటి దందా...

★ రుణాలు వచ్చినప్పుడు గ్రూపునకు రూ.2 వేల వరకు కమీషన్లు తీసుకోవడం షరా మామూలైంది. ★ తాజాగా కొత్త రకం దందాలు తెరమీదకు వస్తున్నాయి. ★ సభ్యుల అవగాహన రాహిత్యాన్ని ఆసరాగా తీసుకుని బుక్ కీపర్లు దోచేస్తున్నారు. ★ ఒక సభ్యురాలు ఒకే గ్రూపులో ఉండాల్సి ఉంటే.. ఐదారు గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. వారికి వచ్చిన రుణాలను వాటాలు వేసుకుంటున్నారు. ★ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా.. తీర్మానాలు చేయకుండా భారీ మొత్తంలో దోచేస్తుండగా.. వీరికి అధికారులు, బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలు ఉంటున్నాయి. ★ ఫలితంగా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కేటాయిస్తున్న రూ.కోట్ల రుణాల లక్ష్యం నీరుగారుతోంది. ★ కొన్ని చోట్ల బుక్‌కీపర్ల దందా బయటకు వస్తున్నా వారినే కొనసాగించడంలో అధికారుల ఆంతర్యం అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలపై చర్యలు తీసుకుంటాం..

అక్రమాల నివారణకు మన డబ్బులు, మన లెక్కలు అనే యాప్ వచ్చింది. అందులో సభ్యుల గ్రూప్ లావాదేవీల వివరాలు చూడవచ్చు. ఇప్పటికే వెలుగులోకి వచ్చిన అక్రమాలపై చర్యలు తీసుకుంటాం. **- నాంచారరావు, డీఆర్‌డీఏ పీడీ**



కాలభైరవ రూపం.. కరుణామృత దీపం!

ప్రేమకు గుర్తుగా కొందరు విగ్రహాలు ఏర్పాటు చేయడం, సేవా కార్యక్రమాలు చేయడం చేస్తుంటారు. విజయవాడ భవానీపురానికి చెందిన మురాల వెంకటేశ్వర్లు మాత్రం వాటిపై ఉన్న ప్రేమతో సొంతంగా కాలభైరవుడి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అయిన ఆయన గత కొన్నేళ్లుగా శునకాలు పెంచుతున్నారు. వాటికోసం ప్రత్యేకంగా భవానీపురంలో ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులోనే కాలభైరవుడి ఆలయాన్ని మూడేళ్ల కిందట నిర్మించారు. ప్రతి రోజు ఆలయంలో దీపారాధన చేసి పూజలు చేస్తుంటారు. అనారోగ్యంతో బాధపడే వాటికి, దెబ్బలు తగిలిన వాటికి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో యాభై వరకు శునకాలు ఉన్నాయి. వాటికి నిత్యం ఆహారం పెడుతున్నారు. కాలభైరవుడి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచీ ప్రజలు వస్తున్నారు.



– భవానీపురం, న్యూస్‌టుడే

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానం సిబ్బంది బుధవారం లెక్కించారు. 49 హుండీల్లో కానుకలను లెక్కించగా రూ. 2,67,93,738 ఆదాయం వచ్చింది. కానుకలతోపాటు 215 గ్రాముల బంగారం, 3.320 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీ 403 యూఎస్ఏ డాలర్లు, 25 కెనడా డాలర్లు, 16 సింగపూర్ డాలర్లు, 14 కువైట్ దీనార్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.

ఎర్రుపాలెం-నంబూరు రైల్వే లైన్‌కు.. భూసేకరణ వేగవంతం

నందిగామ, కంచికచర్ల, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కలుపుతూ ఎర్రుపాలెం-నంబూరు మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా అవసరమైన భూముల సేకరణకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి 20ఏ నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం రైతుల పేర్లతో త్వరలో 20ఈ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ❖ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వద్ద నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీని ద్వారా రాజధానికి రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ❖ కంచికచర్ల మండలం పరిటాల వద్ద రైల్వేస్టేషన్ రానుంది. దీనికి నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లో 297 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ❖ రెండు మండలాల పరిధిలో 8 గ్రామాల్లో ఎక్కడెక్కడ భూములు అవసరమో గుర్తించారు. ఈ మేరకు ప్రాథమికంగా గతంలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఆయా గ్రామాల పరిధిలో రైల్వే లైన్ ఏర్పాటు వల్ల కలిగే సమస్యలను రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ❖ పొలాలకు వెళ్లే డొంక రోడ్ల మీదుగా వెళ్తుండడం వల్ల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని చెప్పారు. వీటన్నింటిని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పరిశీలిస్తున్నారు. ❖ త్వరలో జారీ చేయనున్న 20ఈ నోటిఫికేషన్ అనంతరం గ్రామాల్లో సభలు పెట్టి రైతుల అభిప్రాయాలను స్వీకరిస్తామని ఆర్డీవో తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పరిధిలోని గ్రామాలు.. కావాల్సిన భూమి (ఎకరాల్లో..)

కంచికచర్ల మండలం: గొట్టుముక్కల (50.490), పరిటాల(72.425)

వీరులపాడు మండలం: జుజ్జూరు (28.894), గూడెంమాధవవరం (7.712) చెన్నారావుపాలెం (26.459) పెద్దాపురం (50.922) అల్లూరు (43.152) నరసింహారావుపాలెం (17.445)

వరద గాయం.. గోడలు మాయం



వంతెన రక్షణ దిమ్మెలు విరిగిపోయి ప్రమాదకరంగా..

గత నెలలో తెలంగాణలో కురిసిన వర్షాల కారణంగా మునేరుకు భారీగా వరద రావడంతో ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం లింగాల వద్ద కాజ్‌వే పైనుంచి నీరు ఉద్ధృతంగా ప్రవహించింది. మక్కపేట నుంచి లింగాల వెళ్లే కాజ్‌వే రోడ్డు బాగానే ఉన్నా వంతెనకు సపోర్టుగా రాళ్లతో నిర్మించిన గోడలు ధ్వంసమైపోయాయి. విద్యుత్తు స్తంభాలు పడిపోయి, నీటి పైపులైన్లు విరిగి కొట్టుకుపోయాయి. చోదకులు వంతెన అంచుల్లోకి వెళితే పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం స్పందించి వంతెన రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

- ఈనాడు, అమరావతి



వంతెనకు రక్షణగా నిర్మించిన రాతి సపోర్టు గోడలు ధ్వంసమైన తీరిది..



కరెంటు స్తంభాలు విరిగిపోయి కొట్టుకొచ్చి..

అత్యంత పారదర్శకంగా రెవెన్యూ సేవలు

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టిందని, అత్యంత పారదర్శకంగా నిర్దేశిత గడువులోగా ప్రజల సమస్యలు పరిష్కరించాలని జేసీ ఎస్.ఇలక్కియా.. ఆర్డీవోలు, తహసీల్దార్‌లను ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకం, మ్యూటేషన్ సేవలు సక్రమంగా అందించాలని బుధవారం ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల పరిష్కార విధానాలు వివరించారు. ఆన్‌లైన్ సేవలపై దరఖాస్తుదారులకు అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం కనిపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. రెవెన్యూ సేవల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు 91549 70454 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని జేసీ సూచించారు.

ఇదిగో.. ఆనందాల హరివిల్లు

✦ కొత్తగా 2,449 గృహాల మంజూరు
✦ 11,008 అసంపూర్తి నిర్మాణాల పూర్తి

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఇళ్ల స్థలాలు ఇచ్చి పనులు గాలికొదిలేయడంతో నిరుపేద లబ్ధిదారుల సొంతింటి కల సాకారం కాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. ఆయా పనులను పట్టాలెక్కించి పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు.. పూర్తి చేసిన గృహాల ప్రవేశ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలో బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం గృహ ప్రవేశాలు చేయించారు. అంతేకాదు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ఉమ్మడి కృష్ణాలో కొత్తగా 2,449 గృహాలను మంజూరు చేశారు.

సందడే సందడి: వైకాపా పాలనలో ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన గృహ నిర్మాణాల్లో.. కృష్ణా జిల్లాలో 6,708, ఎన్టీఆర్ 4,300 కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో వత్సవాయి, మచిలీపట్నం మండలాల్లో అధికారికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టర్, హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాలో అర్బన్ ప్రాంతాల్లో మంజూరైన యూనిట్లు..

నియోజకవర్గం	ఇళ్లు
జగ్గయ్యపేట	347
నందిగామ	223
మైలవరం	314
తిరువూరు	138
విజయవాడ తూర్పు	70
విజయవాడ మధ్య	111
విజయవాడ పశ్చిమ	54
గుడివాడ	465
పెనమలూరు	481
మచిలీపట్నం	140
పెడన	106



వత్సవాయిలో నూతన గృహం ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య

రూ.70.8 కోట్ల లబ్ధి...

★ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లాకు 2,449 ఇళ్లు మంజూరు చేశారు. ★ ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలు మంజూరయ్యాయి. ★ ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష ఇస్తుంది. ★ అదనంగా ఉపాధి హామీ ద్వారా 90 పని రోజులకు రూ.27 వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు ఇస్తారు. ★ ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.89 లక్షలు చెల్లిస్తారు. ★ ఉమ్మడి జిల్లాకు రూ.70.8 కోట్ల లబ్ధి చేకూరనుంది. ★ మంజూరు పత్రం అందిన 45 రోజుల్లోగా ఇంటి పని మొదలు పెట్టాలి. లేకుంటే గృహ మంజూరు ఉత్తర్వు రద్దు చేస్తారు. ★ ఇల్లు కనీసం 420 చదరపు అడుగుల విస్తీర్ణంలో హాలు, పడక, వంట గదులు మరుగుదొడ్లతో కూడిన నిర్మాణం చేపట్టాలి.

మేధను మలిచి.. మేటిగ నిలిచి..!

ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేటివ్ కాంపిటీషన్

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, ఏఎన్‌యూ

హ్యాక్ చేయడానికి వీల్లేని డ్రోన్... రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి, అధికారులకు సమాచారమిచ్చే ఆవిష్కరణ... అసలు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమే లేకుండా ప్రత్యేక పెయింటింగ్‌తో కట్టడి చేసే ఆలోచన.. పిల్లల ఆరోగ్య పరిస్థితులు వారి కాళ్లకున్న బూట్ల ద్వారా తెలుసుకునేలా రూపొందించిన వ్యవస్థ.. . జనసమ్మర్ద ప్రదేశాల్లో ప్రతి ఒక్కరినీ, అక్కడి పరిస్థితిని పక్కాగా గుర్తించే నిఘా వ్యవస్థ... ఇలాంటి ఎన్నో వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికైంది. బుధవారం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆల్ ఇండియా ఐడియా అండ్ ఇన్నోవేషన్ కాంపిటీషన్ (ఐసీసీ)-2025ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 170 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు 85 వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైనవాటిని దిల్లీ ప్రదర్శనలో ఉంచుతామని వివరించారు.



ఆవిష్కరణలు పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

సమరసేనకు చేదోడు..

ప్రాజెక్టు: ఆప్టికల్ ఫైబర్ డ్రోన్ **తయారీదారులు:** విక్రాంత్‌చౌదరి, హార్దిక్ మిత్తల్, మయూర్ చౌదరి (బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు) **స్వస్థలం:** జైపూర్, రాజస్థాన్ **పరికరాలు:** 6 ఎల్‌డీసీ బ్రష్‌లెస్ మోటార్లు, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, పిక్సో ఫ్లైట్ కంట్రోల్, జీపీఎస్ కంపాస్ మాడ్యుల్. **ప్రత్యేకతలు:** ఇది ఆప్టికల్ ఫైబర్ డ్రోన్. హ్యాక్ చేయలేరు. 3 నుంచి 4 కిలోల పేలోడ్ పేలుడు పదార్థాలను తరలిస్తుంది. 2 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల రేడియస్‌లో పనిచేస్తుంది. సైన్యంలో కౌంటర్ ఎటాక్‌కు ఉపయోగపడుతుంది. వ్యయం రూ.70 వేలలోపే. ఇలాంటివి ప్రస్తుతం రష్యా మాత్రమే వినియోగిస్తోంది.

యువ



డ్రోన్ పనితీరు వివరిస్తున్న యువకులు

త్వరబడితేనే సుజలం!

✧ 99 పాఠశాలల్లో బిగించని తీరు ✧ మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

ఆర్వో ప్లాంట్ల మంజూరు: 671
ప్రస్తుతం పని చేస్తున్నవి: 316
మూలకు చేరినవి: 256
అసలు బిగించనివి: 99



☛ విజయవాడ ఆటోనగర్.. ఏపీఐఐసీ కాలనీలో రేగుల అనూరాధ ఉన్నత పాఠశాలకు గతేడాది వచ్చిన ఆర్వో ప్లాంట్‌కు విద్యుత్తు సరఫరా ఇవ్వక వృథాగా ఉంది. ఇక్కడ 200 మంది చదువుతున్నారు.



☛ మాచవరం టీఎంఆర్‌సీ ఉన్నత పాఠశాలలో 600 మంది చదువుతున్నారు. ఈ బడికి ఆర్వో ప్లాంట్ మంజూరైనా.. బడికెళ్లే దారి ఇరుకుగా ఉండడం, యంత్రం పెట్టే ఖాళీ లేక గుణదలలో దాసరి గిరిధర్ అవంతి ప్రాథమిక పాఠశాలలో ఉంచారు. రెండేళ్లుగా ఇదే తీరు.

ఈనాడు, అమరావతి
– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించేందుకు మంజూరు చేసిన ఆర్వో ప్లాంట్ల పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. గత ప్రభుత్వంలో కొన్ని పాఠశాలలకు కేటాయించిన ఈ శుద్ధజల కేంద్రాలు.. మూణ్నాళ్లకే మూలకు చేరాయి. కనీసం మరమ్మతులు కూడా చేయక అలాగే వదిలేశారు. మరికొన్నిచోట్ల శుద్ధజల యంత్రాలను పాఠశాలలకు పంపినా.. వాటిని బిగించడానికి నిధులు ఇవ్వలేదు. కొన్నిచోట్ల గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. వెరసి చాలా పాఠశాలల్లో వాటిని ఆరంభించకుండానే.. వృథాగా వదిలేశారు. వీటిలో కొన్ని ఆరంభించకుండానే.. పాడయ్యే పరిస్థితికి చేరాయి. ఈ యంత్రాల కోసం గత ప్రభుత్వం రూ.కోట్లు కరిగించినా ఏమాత్రం లాభంలేదు. ఇప్పటికీ చేతి బోర్లు, నగర, పురపాలికల, పంచాయతీ సరఫరా చేస్తున్న నీళ్లే తాగుతున్నారు.

యంత్రాలనూ బిగించని దారుణం.. కొన్ని ఆర్వో ప్లాంట్లను ఆరుబయటే అలా వదిలేశారు. ఎండకు ఎండి.. వానకు తడిసి వీటిలో చాలావరకూ పాడయ్యాయి. ఈ యంత్రాలకు చిన్న మరమ్మతులొస్తే.. అంతే వాటినలా వదిలేశారు. వాస్తవంగా వీటిని పెట్టిన గుత్తేదారు సంస్థ సిబ్బందే నిర్వహణ చూడాలి. కానీ.. వాళ్లకు బిల్లులు చెల్లించకపోవడంతో రావడం మానేశారు.

అన్నింటినీ వినియోగంలోకి తెస్తాం

– రజనీకుమారి, సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

ఆర్వో ప్లాంట్లలో పనిచేయనవి, బిగించకుండా వదిలేసిన వాటిని పరిశీలిస్తాం. అన్నీ వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులకు శుద్ధజలం అందిస్తాం.

14న మీ డబ్బు - మీ హక్కు శిబిరం

పాయకాపురం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది మీ డబ్బు - మీహక్కు నినాదంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మార్గదర్శకంలో కలెక్టరేట్‌లో ఈ నెల 14వ తేదీ శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును.. బ్యాంకులు తిరిగి అర్హులకు ఇచ్చేస్తాయని తెలిపారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా, నామినీ వివరాల్లో లోపాలు, వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లో డబ్బు లబ్ధిదారులకు చేరలేదని, అలాంటి వాటిని ఇవ్వడం జరుగుతుందని ఆమె వెల్లడించారు.

రైల్వేస్టేషన్‌లో భద్రత కరవు..!

జీఆర్పీలో భారీగా సిబ్బంది కొరత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

విజయవాడ రైల్వేస్టేషన్ దేశంలోని ప్రధాన 28 రైల్వే స్టేషన్లలో ఒకటి. ఇప్పటికే ఎలైట్ గ్రూప్‌లో కూడా చేరింది. నిత్యం లక్షల మంది రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్లో విధులు నిర్వర్తించే పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అమరావతి రాజధానికి దగ్గరగా ఉన్న నేపథ్యంలో వీఐపీల రాకపోకలు భారీగా పెరిగాయి. తాజా దేశంలో ఉగ్రవాదుల కదలికల నేపథ్యంలో సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుంది. విజయవాడ జంక్షన్ జీఆర్పీ స్టేషన్లో సిబ్బంది కేటాయింపు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితం అవుతుందని విమర్శలున్నాయి.

★ విజయవాడ రైల్వే స్టేషన్ ఆదాయం ఏటా రూ.500 కోట్లు దాటింది. నాన్ సబర్బన్ గ్రూపుల్లో ఎన్ఎస్‌జీ-1 కేటగిరీ హోదాను పొందిన రైల్వే స్టేషన్‌గా చరిత్ర సృష్టించింది. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందినా భద్రతలో మాత్రం నానాటికి దిగజారిపోతోంది.




వన్‌టౌన్ ప్రవేశం వద్ద మూలన బాంబ్ డిటెక్టర్ ఫ్రేమ్



దక్షిణ మార్గం వద్ద కనిపించని భద్రత...

★ కొన్ని నెలల కిందట రైల్వే లోకో పైలట్ హత్యోదంతంతో రైల్వే సిబ్బందిలో కూడా భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. 2024-25లో దాదాపు 17 మిలియన్ల మంది ప్రయాణికులు విజయవాడ నుంచి రాకపోకలు సాగించారు. సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణించారు. ★ తాజా ఘటనల నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ భద్రత కల్పించాలి. ★ రైల్వేస్టేషన్ లోని అన్ని ప్రవేశ మార్గాల్లో మెటల్ డిటెక్టర్లతో పాటు 24 గంటలు భద్రతా సిబ్బందిని నియమించాలి. ★ రైళ్ల నుంచి రవాణా అయ్యే వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ★ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా 100 మంది వరకు సిబ్బందిని భర్తీ చేయాలి. ★ అన్ని ప్లాట్ ఫారాల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలి.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎ.కె.బాషా, రామకృష్ణప్రసాద్ తదితరులు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా, జనరల్ సెక్రటరీ వై.శివసుబ్రహ్మణ్యం తదితరులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. రక్షణ చట్టం అమలు కోరుతూ డోన్ నుంచి న్యాయవాదులు కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది. వీరంతా బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిసి, న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని.. చట్టం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని, త్వరలో చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని బాషా తెలిపారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో బీబీఏ సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు. తొలుత ఢిల్లీ మారణహోమానికి నిరసనగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు.

నాగవంశ వన సమారాధనకు విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న రమణరావు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఈ నెల 16వ తేదీన నాగవంశ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కొత్తూరు తాడేపల్లిలోని తోటల్లో కార్తిక వన సమారాధన నిర్వహణ చేపట్టినట్లు రాష్ట్ర నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణరావు తెలిపారు. బుధవారం సూర్యారావుపేటలోని తెదేపా కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. నిర్వాహక కమిటీ సభ్యులకు తన సొంత నిధుల రూ.10 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా హైదరాబాద్ నుంచి నాగవంశ సోదరులు హాజరవుతారని తెలిపారు. ఇటీవల నియమితులైన నాగవంశ కార్పొరేషన్ లోని 14 మంది డైరెక్టర్లను సన్మానించనున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా.. సామాజిక ఐక్యత కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సామాజిక భవన నిర్మాణం, బీసీ రుణాలు, రాజధాని అమరావతిలో స్థలం కేటాయింపు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని ఆయన చెప్పారు.

కొండపల్లి కోట.. శతాబ్దాల చరిత్రకు నిదర్శనం



కోట ప్రాధాన్యాన్ని వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి, న్యూస్‌టుడే: శతాబ్దాల చరిత్రకు కొండపల్లి కోట నిలువెత్తు నిదర్శనమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది శిక్షణ ఐఏఎస్‌లతో కలిసి బుధవారం కొండపల్లి కోట ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా కోట ప్రాధాన్యతను వారికి తెలియజేశారు. ఫీల్డ్ స్టడీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌కు వచ్చిన శిక్షణార్థులకు కొండపల్లి కోట మంచి హిస్టరీ అంశంగా ఉంటుందన్నారు. 13వ శతాబ్దం మొదట్లో నిర్మాణం ప్రారంభించిన కోట దశాబ్దాల కాలం పట్టిందన్నారు. రెడ్డిరాజులతో ప్రారంభమైన కోట ప్రస్థానం కాకతీయులు, కళింగులు, మహమ్మదీయులు, బ్రిటీష్ పాలకుల వరకూ సాగిందని వివరించారు. అప్పటి పాలకుల ఇంజినీరింగ్ టెక్నాలజీ అద్భుతమని..కోట పిల్లర్లపైన ఇప్పటికీ చెరగని అలనాటి వైభవ ఆకృతులు దర్శనమిస్తున్నాయని వారికి వివరించారు. అనంతరం మ్యూజియంలోని విశేషాలు.. కోటకు ప్రధాన ద్వారం, పాలనా విభాగం, పర్యవేక్షణ తదితరాలకు సంబంధించిన అనేక అంశాలను వారికి క్షుణ్ణంగా వివరించారు. జిల్లాకు టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం కలిసొచ్చిన అంశాలు అయినందున పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. పర్యాటకంగా ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కోట పడమర భాగంలో ఛాయా చిత్రాలు దిగారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తరుణ్, తహసీల్దారు వెంకటేశ్వర్లు, కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే కూటమి లక్ష్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన చెవుటూరు గ్రామ శివారులో బుధవారం నిర్వహించిన పలు కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నిరంతర కృషితోనే రాష్ట్ర ఆర్థిక స్థితి గాడిన పడిందని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల మైలవరం నియోజకవర్గంలో తెదేపా పార్టీలో నూతనంగా నియమితులైన పలు కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జి.కొండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన వేములకొండ వెంకటేశ్వరరావు, లంకా నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత తెదేపా పార్టీ పతాకావిష్కరణ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సీనియర్ తెదేపా నాయకులు నూర్ భాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మైలవరం నియోజకవర్గ పరిశీలకులు ధారూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యుపిక్స్ కేసులో మహిళ అరెస్టు.. రిమాండు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యుపిక్స్ కుంభకోణం కేసులో డిపాజిట్ ద్వారా అధిక లాభం పొందిన ఓ మహిళను సత్యనారాయణపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నరసరావుపేట రాజుగారి కోటకు చెందిన కొత్తూరి నాగమల్లిక(47).. ఈ సంస్థలో 2023, సెప్టెంబరు 20వ తేదీన 18 బాండ్ల ద్వారా రూ.2.90 కోట్లు డిపాజిట్ చేశారు. దీనికిగాను సంస్థ నుంచి రూ. 6.38 కోట్లు తీసుకున్నారు. మొత్తం రూ.3.48 కోట్లు లాభంగా పొందారు. ఆమె కుమార్తెల పేరుతోనూ డిపాజిట్లు చేసి అధిక లాభాలు తీసుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురం కేంద్రంగా యుపిక్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. మోసపూరితమైన సంస్థ అని తెలిసి కూడా డిపాజిట్లు చేసి లబ్ధి పొందడం చట్టరీత్యా నేరమని విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

వృద్ధురాలి ప్రాణం తీసిన మైనర్లు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణమోహన్

విజయవాడ (పాయకాపురం), న్యూస్‌టుడే : ముగ్గురు మైనర్లు అతివేగంతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. ఓ వృద్ధురాలిని ప్రాణం తీసిన ఘటన విజయవాడ శివారునున్న పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్, సుందరయ్య నగర్ కట్ట ప్రాంతానికి బెజ్జం కుమారి(50) తన కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. భర్త పదేళ్ల క్రితమే మృతి చెందారు. పెళ్లి కాని కుమారుడితో ప్రకాష్‌నగర్ కూడలిలో క్రషీస్ పాయింట్ నిర్వహిస్తూ జీవిస్తున్నారు. బుధవారం సాయంత్రం దుకాణం నుంచి ఆమె ఇంటికి వెళుతున్నారు. ఆవారాగా తిరుగుతున్న 14ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురు, ఒక బాలిక కలిసి ద్విచక్రవాహనంపై అతి వేగంతో వెళ్తూ.. ప్రకాష్‌నగర్‌లో వృద్ధురాలు కుమారిని ఢీకొట్టారు. తలకు బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర రక్తస్రావమైంది. నున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వాహనం నడిపిన బాలుడిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు మైనర్లు నాలుగో తరగతి వరకు చదివి, తర్వాత మానేశారు. ఆవారా తిరుగుతుంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

'వినియోగదారులపై విద్యుత్తు భారం తగ్గించండి'



విద్యుత్తు బిల్లును పరిశీలిస్తున్న బాబూరావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విద్యుత్తు భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజలను దగా చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు విమర్శించారు. 2022-2024 సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్తుపై రూ.18,243 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. తాజాగా 4వ కంట్రోల్ పీరియడ్ పేరుతో మరో రూ.12,771 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారం మోపేందుకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. బుధవారం సీపీఎం నాయకులు గవర్నర్‌పేటలో పర్యటించారు. విద్యుత్తు వినియోగదారులతో మాట్లాడి, వారి బిల్లులు పరిశీలించారు. ఛార్జీల భారాన్ని ప్రజలకు వివరించారు. యూనిట్‌కు 13 పైసలు మాత్రమే తగ్గించడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన భారాలు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం రూ. 31,014 కోట్ల భారం మోపుతున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై వేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దోనేపూడి కాశీనాథ్, కె.దుర్గారావు, ఎం.సీతారాములు, వై.సుబ్బారావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గొల్లపూడిలోని కార్యాలయం వద్ద ల్యాబ్ ఉద్యోగుల నిరసన

గొల్లపూడి, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ల్యాబ్‌లలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.మూర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూర్తిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 112 నీటి నాణ్యత ప్రయోగశాలలు ఉన్నాయని, అందులో 526 మంది ల్యాబ్‌లలో పని చేస్తున్నారని వెల్లడించారు. ఉద్యోగులకు ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. గతంతో పోల్చుకుంటే అదనపు పని భారం పెరిగిందని.. జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఒకే వేతనం తీసుకుంటున్నామని, ప్రతి ఏడాది పని భారం పెరుగుతుంది తప్పితే జీతం పెరగడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో అదనపు ఖర్చు అవుతుందని, అవన్నీ వేతనంలో నుంచే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.ప్రసాదరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.అనిల్, ఉపాధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు: 9063144762

? వెల్వటూరు ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులను గుర్తించి నీటికి అవస్థలు పడుతున్నాం. - సురేష్ (గ్రామస్థుడు)

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. - మురళి, పంచాయతీ కార్యదర్శి

★ వెల్వటూరు గ్రామ శివారు మాలపల్లిలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 11వ తేదీన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు.

★ జూపూడి గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీటిలో నలకలు వస్తున్నాయని వాటర్ ట్యాంకును శుభ్రం చేయించాలని స్థానికులు తెలిపిన సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షికన ప్రచురించగా గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి స్పందించారు. సిబ్బందితో గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం (గ్రామీణం), జి.కొండూరు

★ పట్టణంలోని 9వ వార్డులోని డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారడంలేదని స్థానికుడు శ్రీకాంత్ చేసిన ఫిర్యాదుకు శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 14వ వార్డులోని కాలువల్లో మురుగు నిలిచిపోయి దోమల బెడద ఎక్కువైందని స్థానికులు చేస్తున్న ఫిర్యాదును పారిశుద్ధ్య అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మైలవరం, జి.కొండూరు, పెనుగొలను, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు నాగార్జున, విజయ కృష్ణ, టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు, పోటీలతో పాటు ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

స్వదేశీ వస్తువులు కొనండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ప్రజలంతా తమవంతు బాధ్యతగా స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ దేశ స్వయం సమృద్ధికి పాటు పడాలని భాజపా టీచర్స్ సెల్ సమన్వయకర్త కొల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర భాజపా ఆదేశాల మేరకు చెవుటూరులో ప్రవాస యోజన కార్యక్రమం స్థానిక నాయకులతో కలిసి ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ ప్రతిజ్ఞ చేసి, ఇంటింటికి తిరిగి స్వదేశీ స్టిక్కర్లను అంటించారు. భాజపా ప్రవాస యోజన మండల ఇన్‌ఛార్జులు మరసు కృష్ణ, ఆద్దేపల్లి అంజనేయులు, మండల భాజపా అధ్యక్షుడు చల్లా మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని నిర్మాణాలు కూల్చేస్తాం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నగర పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని పురపాలిక కమిషనర్ కె.మనోజ్ హెచ్చరించారు. పట్టణంలోని 9వ వార్డులో అనుమతి లేకుండా రెండో అంతస్తు నిర్మిస్తుండగా గుర్తించి పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం ఆ నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తిస్తే కూల్చివేస్తామన్నారు.

నెమలి కృష్ణుడి సన్నిధిలో ఎమ్మెల్యే

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయన్ను అధికారులు, అర్చకులు స్వాగతించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మద్దతు దక్కేనా.. మభ్యపెట్టేనా..?

కొనుగోలు చేయని మార్క్‌ఫెడ్.. మొక్కజొన్న రైతుల్లో నిరాశ



బాడవ వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలు

మైలవరం, న్యూస్‌టుడే: పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి రైతులకు తిప్పలు తప్పడంలేదు. వారికి బాసటగా నిలవాల్సిన మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖలు కొనుగోళ్లకు సకాలంలో స్పందించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులే దిక్కవుతున్నారు. మార్కెట్‌లో పోటీ లేకపోవడంతో, మద్దతు ధరలకు బదులు, వ్యాపారులు చెప్పిందే మద్దతుగా మారుతోంది. ఈ లోగా వాతావరణ పరిస్థితులు కలవరపెడుతుంటే, వచ్చినకాడికి అమ్ముకుంటున్నారు.

ఆశగా సాగు చేసి: మైలవరం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌గా సాగు చేసిన మొక్కజొన్న దిగుబడులు మొదలయ్యాయి. ఇతర పంటల దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో గడిచిన నాలుగైదేళ్లుగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. విత్తన కంపెనీలతో ఒప్పందాలతో రబీ సీజన్‌లో ప్రారంభిస్తుండగా, ఖరీఫ్‌లో సాధారణ విత్తనాలతోనే సాగు చేస్తున్నారు. రబీ కంటే ఖరీఫ్‌లో దిగుబడులు తక్కువగా వచ్చే అవకాశం ఉన్నా, ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని మొక్కజొన్నకే మొగ్గు చూపుతున్నారు. గడిచిన రెండు వారాలుగా దిగుబడులు ప్రారంభమవగా, విత్తనాలను ఎండబెట్టుకోవటానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..
- మద్దతు ధర: క్వింటా రూ. 2400లు
- దిగుబడి: ఎకరానికి 30 క్వింటాళ్లు
- లభిస్తున్నది: క్వింటా రూ.1900లు
- సాగు విస్తీర్ణం: 2 వేల ఎకరాలు
- రైతు కోల్పోతున్నది: ఎకరానికి రూ. 15 వేలు

వదలని తుపాను భయం: పంట కోతలు పూర్తి చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులకు వాతావరణంలో మార్పులు కలవరపెడుతున్నారు. ఆరుదల కోసం రోజుల తరబడి ఎండలో ఉంచుతుంటే, రెండ్రోజులుగా మబ్బు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పరదాలపై పరిచిన విత్తనాలను ఉదయం తెరవడం, మధ్యాహ్నానికి మూయడంతోనే సరిపోతోంది. యార్డులో ఆరబెడుతున్న రైతులు ప్రత్యేకంగా కాపలా ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ కొంటే ఇబ్బందులు తొలగుతాయని కోరుతున్నారు.

ఒడిదుడుకుల్లో బేరాలు: మొంథా తుపానుకు ముందు వచ్చిన పంటకు కనీస ధర లభించలేదు. తుపాను అనంతరం క్వింటా రూ.2 వేల వరకు ధర పలికింది. తిరిగి వారం రోజులుగా గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు రూ.1900లే ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. దిగుబడులు ప్రారంభమయ్యే నాటికే మార్క్‌ఫెడ్ రంగంలో ఉంటే, బయట మార్కెట్ సైతం ధర పెరుగుతుందని రైతులు భావిస్తున్నా ఆ శాఖ నుంచి కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా రాలేదు. దీంతో స్థానిక యార్డు నిండా, గ్రామాల్లో తారు రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కజొన్నలే కనిపిస్తున్నాయి.

మళ్లింపు రహదారికి మరమ్మతులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారికి మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో భారీ వరదలకు మళ్లింపు రోడ్డుకు గండ్లుపడి రాకపోకలు నిలిచాయి. దాదాపు మూడు నెలలకు ఇప్పుడు జేసీబీ ఏర్పాటు చేసి వాహనాలు రాకపోకలకు వీలుగా మరమ్మతులు చేపట్టారు. గురువారం నాటికి మళ్లింపు రోడ్డుపై పూర్తి స్థాయిలో రాకపోకలు సాగుతాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనులు పరిశీలించి మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం హైలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేస్తుందని, వెంటనే టెండర్లు కూడా పూర్తి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ వి.రాజకుమారి, తెదేపా నాయకుడు బి.నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రెండున్నర గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి హైస్కూలు ప్రాంతం, మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్, మహేంద్రనగర్, టిడ్కో కాలనీ, అంబేడ్కర్‌నగర్, వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉపకేంద్రానికి స్థల పరిశీలన

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణం చేయడం అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. గత కొంత కాలంగా స్థలాభావంతో నిర్మాణంలో జాప్యం ఏర్పడింది. రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొని చర్చించారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు ఎండీ ఇర్ఫాన్ పాషాకు ఉర్దూ అకాడమీ ప్రకటించిన జీవనసాఫల్య అవార్డును ఎండీ ఎస్‌ఎండీ ఫరూక్ అందజేశారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రితోపాటు పలువురు నాయకులు పాల్గొని ఇర్ఫాన్ పాషాకు అవార్డు జ్ఞాపికతో పాటు రూ.25వేల నగదును అందించి ఆయనను సత్కరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యం కల్లాల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఆర్డీవో మాధురి రైతులకు సూచించారు. బుధవారం పుట్రేలలో ఆరబోసిన ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి అన్నదాతలతో మాట్లాడారు. ధాన్యం బస్తాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రైవేటు వ్యాపారులు, దళారుల వలలో చిక్కి తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దన్నారు. అనంతరం స్థానిక రామన రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి తేమశాతం, ధాన్యం కాటా, కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. గన్నీ బ్యాగులను పారదర్శకంగా సరఫరా చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, మండల వ్యవసాయాధికారి టిప్పు సుల్తాన్, ఆర్ఐ సుజాత, వీడీఎస్ డి.టి శివనారాయణ పాల్గొన్నారు.

రైతుల కష్టాన్ని గుర్తించి పత్తి కొనాలి



బయ్యర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన అధికారులు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రైతులు కష్టాన్ని, పెట్టుబడిని గుర్తించి సీసీఐ అధికారులు పత్తి కొనుగోలులో నాణ్యతా ప్రమాణాల పేరుతో ఆంక్షలు విధించకుండా మద్దతు ధర చెల్లించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. గంపలగూడెం, ఎ.కొండూరు మార్కెట్ యార్డుల్లో బుధవారం భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. మద్దతు ధర ఆంక్షలు విధించవద్దని, ప్రతిరోజు దూది కొనాలని సీసీఐ అధికారులను కోరారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో సీసీఐ కేంద్రాలు తెరవలేదని, కిలో పత్తి కొనలేదన్నారు. రైతులు కూడా మద్దతు ధర పొందేందుకు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసి నాణ్యమైన దూదిని తీసుకురావాలన్నారు. ఏఎంసీ కార్యదర్శి బి.రాజబాబు మాట్లాడుతూ పత్తి విక్రయించే రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని తీసుకురావాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, తహసీల్దార్ వి.రాజకుమారి, సీసీఐ బయ్యర్ బాలనరసింహానాయక్, సర్పంచి కె.పుల్లమ్మ, ఏవో వి.హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

భగవంతుడిని భక్తితో పూజించండి





చాగంటి ప్రవచనం వింటున్న ప్రజలు

గంపలగూడెం, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: భగవంతుడు కాంతి స్వరూపుడని, అందుకే కార్తిక మాసంలో ప్రతి ఇంటా దీపాన్ని వెలిగించాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సూచించారు. వెలిగించిన దీపానికి పసుపు, కుంకుమ, పూలు, అక్షితలు వేసి శివకేశవులను ఆహ్వానిస్తూ పూజ చేయాలన్నారు. కార్తికమాసం సందర్భంగా తిరువూరు బాలికోన్నత పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు. దీపం వెలిగించడం అనేది యావత్ భారతదేశంలో ఉన్న సర్వమంగళకరమైన సంప్రదాయమన్నారు. ఇంట్లో దీపం వెలిగించి పూజ చేసేందుకు ఏ వస్తువు అందుబాటులో లేకపోతే సూర్యనారాయణ మూర్తి వెలుగును చూస్తూ చేసినా ఆ ఫలితం లభిస్తుందన్నారు. వెంకటేశ్వరస్వామి పాదాలపై తులసీదళం, శివలింగంపై మారేడుదళం వేస్తే భక్తులకు లభించే పుణ్యఫలాన్ని ఆయన వివరించారు. కార్తికమాసంలో కాశినాథ దీపం ... నుంచి తిరువూరు పట్టణం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం ఆలకించేందుకు విశేషంగా ప్రజలు తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

భారీగా తరలిన కార్యకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గ తెదేపా సంస్థాగత కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మైలవరం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి కమిటీల్లో నియమించిన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఉదయం చెవుటూరు వెళ్లారు. మైలవరం నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

వల్లభ్ భాయ్ పటేల్ మార్గం అనుసరణీయం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మైలవరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంతో, దేశ సమైక్యతలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చూపిన చొరవ, సంకల్పం ఆయనను సమైక్యతామూర్తిగా నిలబెట్టాయని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మిలియన్‌మార్చ్ నిర్వహించారు. పెద్ద ఎత్తున విద్యార్థులతో కళాశాల నుంచి కేవీఎల్ రావు విగ్రహం వరకు ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎల్బీఆర్ ట్రస్ట్ సభ్యుడు లకిరెడ్డి హనిమిరెడ్డి, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, మైభారత్ జిల్లా అధికారి ఎస్.రాము, మేనేజర్ సుబ్బారావు, ప్రిన్సిపల్ అప్పారావు, ఎన్ఎస్ఎస్ అధికారి శివహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అపరాధ రుసుం తొలగించుకోండి

కొండపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులంతా విద్యుత్తు వాడకానికి తగ్గట్టుగా లోడు డిపాజిట్లు చెల్లించి అపరాధ రుసుం నుంచి తప్పించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ హనుమయ్య సూచించారు. ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్ పరిధిలోని కొండపల్లి సెక్టార్‌లో విద్యుత్తు విజిలెన్స్ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కొండపల్లి సెక్టార్ పరిధిలో మొత్తం 42 బృందాలు తనిఖీలు నిర్వహించాయన్నారు. అత్యధిక మంది లోడుకు మించి విద్యుత్తు వాడకం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారందరికీ ప్రస్తుతం మంచి అవకాశం ఉందన్నారు. డిసెంబరు 31 వరకూ రాయితీతో కూడిన లోడును విద్యుత్తు శాఖ అందిస్తుందన్నారు. దానిని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పేరుతో సోలార్ పథకానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వసంత రావు, గురు కిషోర్, పి.నాగేశ్వరరావు, పవిత్రారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

'వైద్య కళాశాలలను ప్రభుత్వం నిర్వహించాల్సిందే'



మైలవరంలో ప్రదర్శనలో అవినాష్, రాజీవ్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రానికి మంజూరైన 17 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పార్టీ పిలుపు మేరకు బుధవారం జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఆధ్వర్యంలో మైలవరంలో కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఎల్‌హెచ్ కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుతో పేదలకు వైద్యవిద్య దూరమవుతుందన్నారు. అనంతరం ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యకర్తలు పోగై, రహదారిపై ద్విచక్ర వాహనాలతో ఉండడంతో, కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించగా ఎస్సై సుధాకర్ క్రమబద్ధీకరించారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో తిరువూరు అయ్యప్పస్వామి గుడి నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలో ప్రతిభ



మేఘనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలో మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి.మేఘన మొదటి స్థానం సాధించింది. విజయవాడ పటమట కేబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 నుంచి 11 వరకు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. వాటిల్లో అండర్-17 విభాగంలో సత్తాచాటిందన్నారు. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ రాక్ ఫెల్లర్, క్రీడా ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వహీదా బేగం, రషీద్‌లు విద్యార్థినిని అభినందించారు.

నేత్రాలు దానం

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లికి చెందిన గువ్వల మాధవరెడ్డి (78) మంగళవారం రాత్రి మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు జి.కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు అంగీకరించడంతో వైద్యులు చేరుకుని మాధవరెడ్డి కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.



మాధవరెడ్డి (పాత చిత్రం)

నేటి నుంచి స్వామిత్వ సర్వే గ్రామ సభలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం పరిధిలో 9(2) నోటీసులు జారీ చేసిన గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ గ్రామ సభలు ఈనెల 13 నుంచి 21వ తేదీల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో చిన్న రాట్నాలు ఓ ప్రకటనలో తెలిపారు. 13, 14 తేదీల్లో కొర్లమండ, తాతకుంట్లలో, 18 నుంచి 19 వరకు తెల్లదేవరపల్లి, కలగరలో, 20, 21 వరకు కొండపర్వలో సభలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతాయన్నారు.

పంటల సంరక్షణపై శ్రద్ధ అవసరం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: రాబోయే రబీ సీజన్‌లో పంటల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వ్యవసాయ అధికారిణి పి.పద్మ సూచించారు. మండల పరిధిలోని మునుకుళ్ల, అక్కపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించి రైతులకు తేమనిల్వ, తెగుళ్ల నియంత్రణ, ఎరువుల వినియోగం వంటి అంశాలపై సూచనలు చేశారు. పశు వైద్యులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షుడి ఎంపిక

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమందల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నావేటి జార్జ్‌వాషింగ్టన్ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా సహాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను నియమించినట్లు రాష్ట్ర నాయకులు బుధవారం ప్రకటించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కరోనా సమయంలో బాలికను వేధింపులకు గురి చేసిన నిందితుడికి మచిలీపట్నం పోక్సో కోర్టు సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు బుధవారం శిక్ష విధించినట్లు జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. జి.కొండూరుకు చెందిన శీలం మహేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ బాలిక స్నానం చేస్తుంటే చూశాడని ఫిర్యాదు చేయగా 2021లో అప్పటి ఎస్సై ఆర్.ధర్మరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎనిమిది మంది సాక్షులను విచారించిన పిమ్మట మహేష్‌ను నిందితుడిగా పరిగణించి ఒక సంవత్సరం జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుదామని తెదేపా సీనియర్ నాయకుడు వల్లభనేని గిరిబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన తెదేపా శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయల సుబ్బారావు, నాయకులు కోటిరెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు

జూదరుల అరెస్టు

ఎ.కొండూరు: మండలంలోని కోడూరు, అట్లప్రగడలో జూదమాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జి.మహాలక్ష్మణుడు బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.6వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రైతు భూమి తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కొప్పాల వీరయ్య (అర్జీదారు) భూమిని తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.కల్యాణిలతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఆర్ఐ జి.పుల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు కొప్పాల వీరయ్య గ్రామంలోని తన భూమి కొండపల్లి వీరయ్య కుంట అని తప్పుగా 22(ఎ) వచ్చిందని సరిచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు జాయింట్ తనిఖీ చేశారు.

అవీ ఇవీ

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల పట్టివేత

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని కనుమూరు గ్రామం నుంచి మునుకుళ్ల మీదుగా తెలంగాణకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు బుధవారం తనిఖీ చేయగా రెండు ట్రాక్టర్లు దొరికాయి. ట్రాక్టర్ల యజమానులను, డ్రైవర్లపై కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై సత్యనారాయణ చెప్పారు.

రక్షణ కల్పించాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం: చంద్రన్న, లోకేశ్‌బాబు నాకు రక్షణ కల్పించండి అంటూ ఇబ్రహీంపట్నానికి చెందిన పాలబోయిన సుగుణ వాపోయారు. ఇబ్రహీంపట్నం సహాయ మాతా పాఠశాల పరిసరాల్లో నివాసముంటున్న ఈమె సామాజిక మాధ్యమాల ద్వారా తన బాధను చెప్పారు. స్థానిక సహాయ మాతా పాఠశాల పరిసరాల్లో తనకు కలిగిన ఆస్తిని కొందరు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని.. అందులో భాగంగానే గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అందులో పడేసి తనను భయపెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పంట పొలంలో వీరయ్య అనే వ్యక్తి మందు చల్లడానికి వెళ్తే అక్కడ మృతదేహం ఉందంటూ కేసు నమోదు చేయించారని ఆమె వీడియోలో వాపోయారు. మృతదేహం దొరికిన పొలం తనదని రెవెన్యూ సిబ్బందికి తెలిసినా ఆక్రమణ చేద్దామని భావిస్తున్న వ్యక్తికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. తనను, బిడ్డలను బెదిరిస్తున్న వారికి స్థానికంగా కొందరు అండగా ఉన్నారని తెలియజేశారు. ఈ విషయం పోలీసులకు చెప్పానని, అయినా ఏ క్షణమైనా ఆ దుండగులు దాడి చేస్తారని, తనను రక్షించాలని వేడుకున్నారు.

జానకిరామయ్య సేవలు ఎనలేనివి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధిలో దివంగత జానకిరామయ్య కీలకంగా ఉన్నారని కేఎంయూ అధ్యక్షుడు సీహెచ్.ఆంజనేయులు అన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన జానకిరామయ్య సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేఎంయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్రం తొలగింపుపై ఆగ్రహం



గొల్లపూడి, న్యూస్‌టుడే: కొత్తూరుతాడేపల్లి గ్రామంలోని కాళీమాత ఆలయానికి సంబంధించిన సత్రంను ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం తొలగించారు. దీంతో ఆలయ నిర్వాహకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆలయానికి సంబంధించి సత్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు వచ్చి తొలగించడం తగదన్నారు. స్థానికంగా ఉన్న ఒక పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉందనే ఉద్దేశంతో ఇలా చేశారని ఆరోపించారు. ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను తొలగించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెదకొమిర ఆదర్శ పాఠశాల, గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేల ఆరోగ్యంపై గొల్లపూడి భూసార పరీక్ష కేంద్రం అధికారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలపై వివరించారు. పాఠశాలకు మినీ మట్టి పరీక్ష ప్రయోగశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులు రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరీక్ష చేసి సాగు భూముల్లో పోషకాలు, ఎరువుల సిఫార్సులు చేయాల్సి ఉందన్నారు. భూసార పరీక్షా కేంద్రం అధికారులు ఎం.సువర్ణకుమారి, ప్రియాంక, ఏవో హరీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తూ..

రూ.79 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపనలో శాసనసభ్యుడు కృష్ణప్రసాద్, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి శ్రీనివాస నగర్, వస్త్రలతకాలనీలో రహదారులు, కాలువల నిర్మాణానికి మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.79లక్షల 90 వేల వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, నాయకులు బొమ్మసాని సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, నారదా తదితరులు పాల్గొన్నారు.

చదువు

బీఈ రెగ్యులర్‌గా చేశాను. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో రెండేళ్ల ఆన్‌లైన్ ఎంఏ (ఎకనామిక్స్)లో చేరాను. ఈ కోర్సుతో పీహెచ్‌డీకీ, ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్(ఐఈఎస్) పరీక్షలకూ అవకాశం ఉంటుందా? – ఆకాంక్ష



ఐఈఎస్‌కు అవకాశం ఉందా?

■ ఇంజనీరింగ్ రెగ్యులర్ విధానంలో పూర్తిచేసి, రెండేళ్ల ఎంఏ (ఎకనామిక్స్) ప్రోగ్రాంను ఆన్ లైన్‌లో చదువుతున్నానని చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం.. ఆఫ్‌లైన్ డిగ్రీలు, ఆన్‌లైన్ డిగ్రీలు, ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలు, దూరవిద్య డిగ్రీలకు సమాన గుర్తింపు ఉంటుంది. యూజీసీ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన రెగ్యులేషన్స్ ప్రకారం.. ఒక అకడమిక్ ప్రోగ్రాం మధ్యలో, ఓపెన్ నుంచి రెగ్యులర్‌కు, రెగ్యులర్ నుంచి ఆన్‌లైన్‌కు కూడా అకడమిక్ క్రెడిట్లను బదిలీ చేసుకొని డిగ్రీ/పీజీ పూర్తి చేయొచ్చు. కానీ, జాగ్రత్తగా గమనించాల్సింది ఏంటంటే.. ప్రస్తుతం మీరు చదువుతున్న యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో అకడమిక్ ప్రోగ్రామ్స్ నిర్వహించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (యూజీసీ డెబ్) అనుమతి ఉందా, లేదా అనే విషయం నిర్ధారణ చేసుకోండి. ఒకవేళ, అనుమతి ఉంటే, అనుమతించిన ప్రోగ్రామ్స్ జాబితాలో ఎంఏ ఎకనమిక్స్ ఉందో, లేదో తెలుసుకోండి. ఏదైనా యూనివర్సిటీకి ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ మోడ్‌లో కోర్సులు నడపడానికి అనుమతి లేకపోతే ఆ యూనివర్సిటీ అందించే ఆన్‌లైన్ డిగ్రీలు చెల్లుబాటు కావు. ఏదైనా యూనివర్సిటీ ఆన్‌లైన్ విధానంలో అకడమిక్ ప్రోగ్రాంను అందించాలంటే, ఆ యూనివర్సిటీకి కనీసం 3.26 న్యాక్ గ్రేడ్ ఉండాలి. యూజీసీ డెబ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఆంధ్రా యూనివర్సిటీకి మీరు చేస్తున్న పీజీని నిర్వహించడానికి అన్ని అనుమతులు ఉన్న విషయాన్ని నిర్ధారించుకోండి. వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు, మీరు చేస్తున్న డిగ్రీకి యూజీసీ డెబ్ గుర్తింపు ఉంది. కాబట్టి, మీరు నిరభ్యంతరంగా ఇండియన్ ఎకనామిక్ సర్వీస్, పీహెచ్‌డీలకు సన్నద్ధం కావొచ్చు.

–ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

మెర్న్ స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), సీఐ/సీడీ, సీఎస్ఎస్ 3, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్ 5, జావాస్క్రిప్ట్, మెర్న్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్, వెబ్‌సాకెట్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/2Nm8G

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఆస్మియం ఎనర్జీ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/dct0N

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఆటంప్రిక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డేటా స్ట్రక్చర్స్, ఫాస్ట్ఏపీఐ, జనరేటివ్ ఏఐ టూల్స్, గిట్, గిట్‌హబ్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాంప్ట్.
స్టైపెండ్: రూ.12,000-15,000
☛ https://shorturl.at/wYvw6

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 5

సమగ్ర కథనాలు, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు, ఉద్యోగ నోటిఫికేషన్లు https://epaper.eenadu.net లో.



గీత దాటితే.. వేతలు తప్పవు

ఆకర్షణీయమైన జీతం, అంతర్జాతీయ అవకాశాలు, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ యువతరాన్ని కార్పొరేట్ ఉద్యోగాలవైపు ఆకర్షించే అంశాలు. అయితే అక్కడ ఎదురయ్యే కంటికి కనిపించని సవాళ్ల గురించి చాలామంది ఉద్యోగార్థులకు అవగాహన ఉండకపోవచ్చు. ఎందుకంటే.. వీటిని ఎవరూ చెప్పరు, ఎక్కడా లిఖిత పూర్వకంగా ఉండవు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించే యువతతో పాటూ, ఇటీవలే కొలువుల్లో చేరినవారూ ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, కెరియర్‌లో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు.

అంతర్గత సాంకేతిక సమాచారం, క్లయింట్స్ డేటా, వ్యూహాలు, ఆర్థిక విషయాలు బయట ప్రపంచానికి వెల్లడికావడాన్ని ఏ సంస్థలూ అంగీకరించవు.

సోషల్ మీడియా



స్వాతి ఒక ఐటీ సంస్థలో ప్రాజెక్ట్ ట్రెయినీగా చేరి, బృందంలో చురుకుగా, ప్రొడక్టివ్‌గా ఉంటూ టీమ్‌కు అప్పగించిన ప్రాజెక్టును పూర్తి చేసి, 'ఎంప్లాయీ ఆఫ్ ద మంత్'గా గుర్తింపు పొందింది. 'ప్రాజెక్టు పూర్తి చేయడంలో నేను ఎదుర్కొన్న సవాళ్లు - ఆనందమయ క్షణాలు' అంటూ ఒక వ్యాసం రాసి, ప్రాజెక్ట్‌లో ఎదురైన సాంకేతిక సమస్యలను తానెలా పరిష్కరించింది, బృంద సభ్యుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణలు, క్లయింట్ ఒత్తిడిని హ్యాండిల్ చేసిన విధానం, బ్లాగ్‌లో పోస్ట్ చేసింది. ఎంతో గోప్యంగా ఉంచాల్సిన అంతర్గత సమాచారం బయటపెట్టడంతో యాజమాన్యం స్వాతిని హెచ్చరించింది. ఆమెకు మరో ప్రాజెక్ట్‌లో అవకాశం రావడానికి చాలా సమయం పట్టింది. ఈ పరిణామంతో సంస్థకు చెందిన ఏ సమాచారమైనా అనుమతి లేకుండా బహిర్గతపరచడం ప్రమాదకరమన్న సత్యాన్ని స్వాతి గ్రహించింది.

◗ గోప్యతను ఒక పాలసీగానే కాకుండా, నమ్మకాన్ని నిలబెట్టే నైతిక బంధంగా భావించే వారిని ఉద్యోగులుగా కోరుకుంటాయి కార్పొరేట్ సంస్థలు.

సెల్ఫీల అత్యుత్సాహం



ఉద్యోగంలో చేరిన ఉత్సాహంలో, కార్పొరేట్ జీవన శైలిని, పని వాతావరణాన్ని మిత్రులకు తెలపడానికి.. పని ప్రదేశ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొంత మంది. ఈ చర్య వల్ల ఉద్యోగికి ఏ విధమైన నిర్దిష్ట ప్రయోజనం లేకపోయినప్పటికీ, వాటి ప్రభావం కెరియర్‌పై తీవ్రంగా ఉంటుంది.

ప్రియాంక ఒక 'బల్క్ డ్రగ్స్' కంపెనీ ఆర్అండ్‌డీలో ట్రెయినీగా చేరింది. క్లాస్‌మేట్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ.. తన ఛాంబర్ చూపించి, సెల్ఫీ తీసి వాట్సాప్‌లో పోస్టు చేసింది. ఆ ఫ్రెండ్ ఆ ఫొటోను మరో క్లాస్‌మేట్‌కు ఫార్వర్డ్ చేసింది. ఆ ఫొటో మేనేజ్‌మెంట్ వరకూ చేరింది. ప్రియాంక వెనుక ఉన్న వైట్ బోర్డులో కొన్ని ఫార్ములాలున్నాయి. అవి కేవలం అక్కడ ఆర్అండ్‌డీ విభాగంలో పనిచేసే వారికి ఉద్దేశించిన అత్యంత గోప్యమైన అంశాలు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మేనేజ్‌మెంట్ పనిలో నిర్లక్ష్యానికి ప్రియాంకకు నోటీస్ జారీచేసింది.

◗ మీ సోషల్ మీడియా ప్రజెన్స్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. సంస్థ గోప్యత బహిర్గతం కాకూడదు. ఒక అంశం సోషల్ మీడియాలో పోస్టు చేసే ముందు ఆలోచించి అడుగువేయాలి.

గోప్యత

సోషల్ మీడియా వాడకంలోని పరిధిని ఎవరూ తెలియజెప్పరు. ఈ పరిధి తెలుసుకోలేకపోవడం యువ ఉద్యోగుల కెరియర్‌పై తీవ్ర పరిణామాలు చూపడానికి దారితీయొచ్చు.

అభిషేక్, ఒక ఐటీ సంస్థలో డెవలపర్‌గా చేరాడు. తన నియామక పత్రంలో అంగీకరించిన నిబంధనలకు విరుద్ధంగా.. కొన్ని ప్రాజెక్ట్ వివరాలు వృత్తిలో సాధించిన విజయాలుగా 'లింక్డ్ ఇన్'లో పోస్టు చేశాడు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన సాంకేతిక సమాచారం గోప్యతతో కూడింది కావడంతో యాజమాన్యం అభిషేక్‌పై చర్య తీసుకుంది.

◗ ఉద్యోగులు అందుకునే నియామక పత్రాలు నిబంధనలతో కూడి ఉంటాయి. కొన్ని ముఖ్యమైన గోప్యతా సూచనలు చదివి, అర్థం చేసుకోకుండా, నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేసి కాలక్రమంలో మర్చిపోతుంటారు. కొన్ని సంస్థల్లో 'నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్' అంటే 'రహస్య ఒప్పందం'పై సంతకం తీసుకుంటుంటారు. ఇది ఉద్యోగి సంస్థలోని సున్నిత సమాచారాన్ని బయటకి వెల్లడించనని హామీ ఇచ్చే ఒక నిబంధన. ఇందులో పేర్కొన్న వాటిని ఉల్లంఘిస్తే సమస్యలు తప్పవు.

నైతిక బంధం

కార్పొరేట్ కెరియర్‌లో విజయవంతం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతోపాటు నైతికత, గోప్యత, వృత్తి ధర్మాలు కీలక పాత్ర పోషిస్తాయి.

రమేష్ ఒక తయారీరంగ సంస్థలో న్యూ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్‌లో ట్రెయినీగా చేరాడు. ఒక ప్రోగ్రాంలో స్నేహితుడు రాజేష్‌ని క్యాజువల్‌గా కలిశాడు. ఇద్దరూ ఒకే తరహా ప్రాజెక్ట్ చేస్తున్నామని తెలుసుకుని సంతోషించారు. అయితే, రాజేష్ తనకు ఎదురైన ప్రాజెక్టులో కొన్ని సందేహాలను అడిగాడు. ఇది చాలా సున్నితమైన అంశం అని, ఈ సమాచారం బయటపెట్టలేనని, సున్నితంగా రాజేష్ అభ్యర్థనను రమేష్ తిరస్కరించాడు.

కొన్నాళ్ల తర్వాత ఈ విషయం మేనేజ్‌మెంట్‌కు తెలిసింది. రమేష్‌కు వృత్తిపై ఉన్న నిబద్ధత, పాటించిన గోప్యతకు ఎంతో సంతోషించిన యాజమాన్యం అతడికి కీలకమైన శాఖ బాధ్యతలు అప్పజెప్పింది.

◗ సంస్థ గోప్యతను కాపాడితే నమ్మకం బలపడుతుంది. విశ్వాసం కెరియర్ ప్రగతికి సహకరిస్తుంది.



దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ప్రొబేషనరీ ఆఫీసర్లు..

ఈసీజీసీ లిమిటెడ్, ముంబయి... ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుంది.
◗ ప్రొబేషనరీ ఆఫీసర్: 30
విభాగాలు: జనరలిస్ట్ 28, స్పెషలిస్ట్ 02
అర్హత: జనరలిస్ట్ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ. స్పెషలిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ.
వయసు: 01.11.2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.88,635 - 1,69,025.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష (ఆబ్జెక్టివ్ టెస్ట్), ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్‌లతో. **దరఖాస్తు రుసుము:** ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.175. ఇతరులకు రూ.950. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.12.2025. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 11-01-2026.
వెబ్‌సైట్: https://www.ecgc.in/

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు..

బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్, అసోం.. ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 16 పోస్టులు
విభాగాల వారీ: ◗ ప్రొడక్షన్: 07 ◗ మెకానికల్: 04 ◗ ఇన్‌స్ట్రుమెంటేషన్: 02 ◗ సివిల్: 01 ◗ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్: 01 ◗ ఫైనాన్స్: 01
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, డిప్లొమా, సీఏ/సీఎంఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.12.2025.
వెబ్‌సైట్: https://bvfcl.com/

నిట్ వరంగల్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), వరంగల్.. వివిధ విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్: 02 ◗ అసోసియేట్ ప్రొఫెసర్: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: 08
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2: 27
అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.2000, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 12. **ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/

నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ కొనుగోలు

- అందులో కొంత వినియోగించి, మిగిలింది అమ్మేవాడు
- ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే దారి తప్పిన మ్యాడీ



నిందితుడు మధుసూదన్‌రెడ్డి

ఈనాడు – అమరావతి

బెంగళూరులో స్నేహితుల ద్వారా నైజీరియన్లతో పరిచయంతో మ్యాడీ పెడ్లర్‌గా మారాడు. నైజీరియన్లకు వాట్సాప్‌లో కాల్ చేసి డ్రగ్స్ అడిగేవాడు. వారు వాట్సాప్ లోనే యూపీఐ క్యూఆర్ కోడ్ పెడితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. వారు సరకును ఒక లొకేషన్‌లో పెట్టి.. దానిని ఫొటో తీసి పంపేవారు. మ్యాడీ అక్కడకు వెళ్లి తెచ్చుకునేవాడు. ఇలా కొనుగోలు చేసిన ఎండీఎంఏలో కొంత సొంతంగా వాడుకుని.. మిగిలింది లాభం చూసుకుని అమ్మడం ప్రారంభించాడు. అమ్మకాలలో భాగంగా కాలేజీలో సీనియర్ అయిన గురుప్రసాద్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

చెన్నైలో మత్తుకు బానిస...

చెన్నైలో ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదే మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ మత్తుకు బానిసగా మారాడు. చెడు సావాసాలతో దారితప్పాడు. సిగరెట్లు, మద్యం, గంజాయి అలవాటైంది. బీటెక్ రెండో ఏడాదిలో ఎండీఎంఏ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. దీంతో చదువుపై దృష్టి సారించలేక తరగతులు ఎగ్గొట్టి స్నేహితులతో తిరిగేవాడు. ఫలితంగా పరీక్షలు రాసేందుకు హాజరు సరిపోక ఇంజినీరింగ్ పూర్తి చేయలేని పరిస్థితి. 2022లో కాలేజీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లాడు. అక్కడ పలు ఉద్యోగాలు చేశాడు. ఎండీఎంఏ కేసులో బెంగళూరులో అరెస్టు అయిన నిందితుడు మ్యాడీని మాచవరం పోలీసులు నగరంలోని ఒకటో ఏసీఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈనెల 26 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ కారాగారానికి తరలించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కంబాలపల్లికి చెందిన మ్యాడీ తండ్రి 13 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తల్లి పొలం పనులకు వెళ్తుండేది.

డ్రగ్స్ బదులు ఉప్పుతో టోకరా...

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న సమయంలో డ్రగ్స్ కొనుగోలు చేయలేక.. ఎండీఎంఏ బదులు ఉప్పును సరఫరా చేసి పలువురికి టోకరా వేసేవాడు. ర్యాపిడో డ్రైవర్ అవతారమెత్తిన మ్యాడీ.. వాట్సాప్‌లో డ్రగ్స్ కోసం ఆర్డర్ ఇస్తే వారికి బెంగళూరులోని ఏదో ఒక ప్రదేశంలో పెట్టి.. దాని లొకేషన్‌ను అవతలి వారికి పంపేవాడు. విశాఖ నుంచి బెంగళూరు వెళ్లిన శ్రీవాత్సవ్, హవీలాను కూడా ఇలాగే మోసం చేశాడు. డబ్బులు తీసుకుని.. ఎండీఎంఏ బదులు ఓ పార్కులో ఉప్పును పెట్టాడు. ఇలా పలువురిని మోసం చేసేవాడని విచారణలో తేలింది.

డ్రగ్స్ కేసులో నిందితుడిగా వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి!

ఈనాడు - అమరావతి : విజయవాడలో నమోదైన డ్రగ్స్ కేసులో వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డిని పోలీసులు నిందితుడిగా చేర్చారు. బెంగళూరులో దొరికిన ఎండీఎంఏ సరఫరాదారుడు మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ.. తన నేరాంగీకార స్టేట్‌మెంట్‌లో విశాఖపట్నానికి చెందిన కొండారెడ్డితో లింకుల గురించి పోలీసులకు వివరించాడు. తన నుంచి ఎండీఎంఏను విశాఖకు తెప్పించుకునే వాడని చెప్పాడు. బెంగళూరు వెళ్లిన వారితో తెప్పించుకునే వాడని తేలింది. దీనిపై ఆధారాలు లభించడంతో పోలీసులు వైకాపా నేతను ఏ5గా చేర్చారు. ఇప్పటికే విశాఖలో డ్రగ్స్ కేసులో కొండారెడ్డి అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో విజయవాడలోని కోర్టులో పీటీ వారెంటు దాఖలు చేయనున్నారు. కోర్టు నుంచి అనుమతి లభించిన తర్వాత ఇక్కడి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. అనంతరం కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించనున్నారు.

వీడిన బాలికల అదృశ్యం కేసు మిస్టరీ

కాకినాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెడన, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా పెడన మదర్సా నుంచి ఈనెల 10న అదృశ్యమైన ముగ్గురు బాలికలను పోలీసులు కాకినాడలో గుర్తించారు. వారు సోమవారం అదృశ్యం కాగా. .సంస్థ నిర్వాహకులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా కాకినాడ సముద్ర తీరానికి సమీపంలోని ఒక హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి బాలికలను గుర్తించి బుధవారం ఉదయం పెడన పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికల అదృశ్యం వెనుక కాకినాడ, బంటుమిల్లికి చెందిన వింజరపు విజయ రత్నకుమార్(20), కుంభా సందీప్(19) ఉన్నట్లు పోలీసులు నిర్ధారించి ఇరువురిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ యువకులు కూడా ప్రస్తుతం పెడన పోలీసుల అదుపులో ఉన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రత్యేక అరలు.. వేర్వేరు లారీలు

- తనిఖీలకు దొరక్కుండా రెండేళ్లుగా గంజాయి రవాణా
- రూ.కోట్లలో సంపాదన.. తొలిసారిగా పట్టుబడ్డ అంతర్రాష్ట్ర స్మగ్లర్
- దాడులు చేసిన ఈగల్, డీఆర్ఐ.. 248 కిలోల గంజాయి స్వాధీనం, ఐదుగురి అరెస్టు



నిందితుడు రాహుల్ కుమార్



లారీలో ప్రత్యేక అర ఏర్పాటు



పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే– పెనమలూరు

పుష్ప సినిమాలోని స్మగ్లింగ్ సన్నివేశాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో గత రెండేళ్లుగా గంజాయిని రహస్యంగా రవాణా చేస్తున్నాడు.. ఎక్కడా తనిఖీలకు దొరక్కుండా లారీల్లో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి.. రెండు వాహనాలు, ఇద్దరు డ్రైవర్లను ఉపయోగిస్తూ ఒడిశా నుంచి ఉత్తరాదికి రవాణా చేస్తూ రూ.కోట్లు ఆర్జించాడు. చివరకు సమాచారం అందుకున్న ఏపీ ఈగల్, డీఆర్ఐ అధికారులు దాడులు చేసి పట్టుకోవడంతో గుట్టురట్టయ్యింది. డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు లారీలను స్వాధీనం చేసుకుని, ప్రధాన నిందితుడు రాహుల్‌కుమార్ సహా ఐదుగురిని అరెస్టు చేశారు. రెండేళ్ల నుంచి రవాణా చేస్తున్నా.. అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ రాహుల్ తొలిసారిగా దొరకడం గమనార్హం.

వ్యవసాయం వదిలి..

కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రాంతానికి చెందిన రాహుల్‌కుమార్ స్వగ్రామంలో వ్యవసాయం చేస్తుండేవాడు. అది గిట్టుబాటు కాక.. విజయవాడ శివారు యనమలకుదురు వచ్చి.. ఫ్లాట్ తీసుకుని నివాసం ఉంటున్నాడు. తక్కువగా సమయంలో రూ.కోట్లు సంపాదించాలన్న ఆశతో గంజాయి రవాణాను మార్గంగా ఎంచుకున్నాడు. దీనికిగాను విజయవాడ, విశాఖపట్నంకు చెందిన కొందరు డ్రైవర్లతో ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం ఐదు పెద్ద లారీలను కొనుగోలు చేశాడు. వీటిలో రెండింటిని విశాఖపట్నం నగరానికి చెందిన డ్రైవర్ ఆనంద్‌కుమార్ పేరున ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇందుకుగాను అతడికి రూ.10వేలు ముట్టజెప్పి ఒప్పించాడు. మరో మూడు వాహనాలను రాహుల్.. తన పేరునే యూపీలో రిజిస్ట్రేషన్ చేయించాడు.

తనిఖీలు తప్పించుకునేందుకే..

ఒడిశా నుంచి గంజాయి రవాణా చేయాలని నిర్ణయించుకుని.. ఆ రాష్ట్రంలోని భవానీపట్నంకు చెందిన దీపు అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి విజయవాడకు చేర్చి.. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వేర్వేరు వాహనాల్లో తరలించాలని ప్రణాళిక వేశాడు. దీని కోసం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో రూ.25వేల అద్దెకు గోదాము తీసుకున్నాడు. ఒడిశా నుంచి ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాలను మాత్రమే ఉపయోగించేవాడు. ఏపీ రిజిస్ట్రేషన్‌వి అయితే ఆంధ్ర సరిహద్దుల్లో తనిఖీలు ఉండవని ప్లాన్ వేశాడు. ఒక్కో డ్రైవర్‌కు ప్రతి ట్రిప్పునకు రూ.40 వేలు చెల్లించేవాడు. ప్రతి లారీకి అడుగు భాగాన ప్రత్యేక అర ఏర్పాటు చేయించాడు. ఇది డ్రైవర్ వెనుక నుంచి మాత్రమే తీసేందుకు వీలుగా మార్చాడు. ఒడిశాలో కొన్న గంజాయిని ఈ అరలోకి చేర్చి.. పైన కంకర చిప్స్ పోసి విజయవాడకు వచ్చేవి. తర్వాత ఏపీ రిజిస్ట్రేషన్ వాహనం నుంచి సరకును యూపీ రిజిస్ట్రేషన్ వాహనంలోకి మార్చేవాడు. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే వాటిని.. అక్కడ సరిగా తనిఖీలు చేయరని ఈ ఎత్తుగడ వేశాడు. వాహనాలతో పాటు డ్రైవర్లను కూడా మార్చేవాడు.

రెండేళ్లలో తొలిసారి దొరికి..

గత రెండేళ్లుగా రహస్యంగా గంజాయిని రవాణా చేస్తూ రాహుల్‌కుమార్ పెద్ద మొత్తంలో సంపాదించాడు. అటు స్వగ్రామం, ఇటు యనమలకుదురులో ఎవరికీ అనుమానం రాకుండా మేనేజ్ చేశాడు. ముందస్తు సమాచారం మేరకు ఈగల్, డీఆర్ఐ బృందాలు ఈ నెల 10న విజయవాడ శివారు కానూరులోని కొత్త ఆటోనగర్‌లోని నిందితుడి గోదాముపై దాడులు చేశాయి. ఈ సందర్భంగా 242 ప్యాకెట్లలోని 248.82 కిలోల గంజాయిని సీజ్‌చేశారు. వీటి రవాణాకు ఉపయోగిస్తున్న ఐదు లారీలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శాయన రాహుల్ కుమార్, హుస్సేన్ (గోదాము ఇన్‌ఛార్జి, విజయవాడ), సోహన్ లాల్ (డ్రైవర్, హరియాణా), ఆనంద్‌కుమార్ (డ్రైవర్, విశాఖపట్నం), అబ్దుల్ హసన్ (డ్రైవర్, విశాఖపట్నం)లను అరెస్టు చేశారు.


ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించండి



ఏడీఆర్ఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిల్ నాయకులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వే ట్రైన్ మేనేజర్ల(గార్డు)ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.మోహన్‌దాస్ డిమాండ్ చేశారు. ట్రైన్ మేనేజర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8వ వేతన సంఘాన్ని తక్షణమే అమలు చేయాలని, ట్రైన్ మేనేజర్లకు సముచిత వేతన స్థాయిలను నిర్ధారించాలని కోరారు. 2024వ సంవత్సరం జనవరి 1 నుంచి రన్నింగ్ అలవెన్సులను 25 శాతం పెంచాలని, ఆదాయపు పన్ను మినహాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరిలో రైల్వే బోర్డు జారీ చేసిన జేపీవోను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ, డీఎంఆర్‌కేఎస్, సీఐటీయూ తదితర కార్మిక సంఘ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

అందుబాటులోకి రూ.100 టికెట్



ట్రావెల్ 24 గంటలు అని ముద్రించిన టికెట్

విజయవాడ బస్‌స్టేషన్, భాస్కరపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బుధవారం నుంచి రూ.100 ట్రావెల్ యాస్‌యూలైక్ టికెట్‌తో నగర పరిధిలో 24 గంటలలోపు ఎన్ని సార్లు అయిన ప్రయాణించే అవకాశం కల్పించింది. టికెట్ తీసుకున్న సమయం నుంచి మరుసటి రోజు అదే సమయం వరకు టికెట్ చెల్లుబాటు అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కండక్టరు వద్ద టికెట్ తీసుకునే సమయంలో ప్రయాణికుల పేరు, చరవాణి నంబరు, వయసు నమోదు చేసుకుని టికెట్ అందిస్తారు. దీని ద్వారా ప్రయాణికులు నగర పరిధిలో నడిచే సిటీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులు వెళ్లే మార్గాల్లో సూరంపల్లి అడ్డరోడ్డు, కొండపల్లి, గన్నవరం, కంకిపాడు, మంగళగిరి, కొత్తూరు తాడేపల్లి వరకు బస్సులు రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణించవచ్చు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో బుధవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీ ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చింది.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ విభాగాల్లో డీజీగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. గత ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇంకా దర్యాప్తు సాగుతోందని.. ఈ దశలో బెయిల్ ఇస్తే నిందితుడు తన పలుకుబడి ఉపయోగించి సాక్షులను బెదిరించే ప్రమాదం ఉందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది వాదించారు. ఇంత వరకు ఏసీబీ ప్రాథమిక సాక్ష్యాలు కూడా సేకరించ లేకపోయిందనీ, నిందితుడు చాలా రోజుల నుంచి రిమాండ్‌లో ఉన్నారనీ, ఈ దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని సంజయ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.. వాదనలు ముగియడంతో తీర్పు నిమిత్తం ఈనెల 17కు న్యాయాధికారి వాయిదా వేశారు.

వంశీ బెయిల్ ఆంక్షల్లో సడలింపు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ బెయిల్ ఆంక్షల్లో ఎస్సీ, ఎస్టీ కోర్టు సడలించింది. ఈ మేరకు న్యాయాధికారి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతినెలా రెండో శనివారం పటమట స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో వంశీకి బెయిల్ మంజూరు చేసినప్పుడు. . ప్రతి నెలా రెండో, నాలుగో శనివారాలు స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఎస్సీ, ఎస్టీ కోర్టు షరతు విధించింది. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, ఆంక్షలు సడలించాలని వంశీ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను బుధవారం పీటీ వారెంట్‌పై సిట్ అధికారులు విజయవాడ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి కారాగారంలో ఉన్న మిథున్ దాస్, అంతదాస్, హాజి, రాజులను న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. వీరికి ఈనెల 25 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ★ ఈ కేసులో అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తలారి రంగయ్య (ఏ14) దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్.. 8వ ఏడీజే కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలు చేసేందుకు ఈనెల 17వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

రెండో బంతికే బౌండరీ!



ప్రపంచకప్ విజయం తర్వాత మన మహిళా క్రికెటర్ల జీవితాలు మారిపోయాయి. ప్రశంసలూ, నగదు బహుమతులూ, ఉద్యోగాలూ... ఎన్నో వరించాయి. రిచా ఘోష్‌ను బెంగాల్ ప్రభుత్వం డీఎస్పీగా నియమించడమే కాదు 'బంగ భూషణ్' బిరుదునీ ఇచ్చింది. ఆమె పేరుమీద సొంతూరు సిలిగుడిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామంటోంది. ఇక్కడి వరకూ రావడానికి రిచా పడ్డ కష్టాలెన్నో!

▲ ఓపెన్ నెట్ ప్రాక్టీసు...

నన్ను ధోనీ సర్‌తో పోలుస్తూ... హిట్టర్, ఫినిషర్ అంటున్నారు. ప్రతి బంతినీ బౌండరీ దాటించడం సులభం కాదు. ఇక్కడ ఆప్షన్లను పెంచుకునేందుకు ప్రయత్నిస్తా. దాంతో ఆఫ్ సైడ్, లెగ్ సైడ్ ఎటువైపైనా హిట్టింగ్ చేయగలుగుతా. ఆడిన మొదటి, లేదంటే రెండో బంతినే బౌండరీకి పంపాలనే విధానాన్ని చిన్నప్పట్నుంచీ అవలంబిస్తున్నా. ఓపెన్ నెట్ బ్యాటింగ్ ప్రాక్టీసు చేయడంవల్ల మైదానంలోనూ షాట్లు మెరుగ్గా కొట్టగలను.

▲ ఆ దూకుడు వెనక

చివరి ఓవర్లలో నిర్భయంగా ఆడి వేగవంతంగా పరుగులు రాబట్టాలి, ఇతర బ్యాటర్లపైన ఒత్తిడి తగ్గించాలి... అని నాకు స్పష్టత ఇచ్చారు కోచ్. ఇది నా సహజ స్వభావం కూడా. ప్రపంచకప్ కోసం కొద్ది నెలలుగా మరింత మెరుగులు దిద్దుకున్నా. ఆటతోపాటు మానసికంగానూ సిద్ధమయ్యా. దూకుడులోనూ నిదానం అలవాటు చేసుకుని నా పాత్రను విజయవంతంగా పోషించగలిగా.

▲ అప్పుడే వదిలేద్దామనుకున్నా...

నాన్న క్లబ్ క్రికెట్ ఆడారు. ఇప్పుడు అంపైర్‌గా స్థిరపడ్డారు. ఎనిమిదేళ్లప్పటి నుంచి 'ఝూలన్ దీ'తో పరిచయం. అప్పట్నుంచీ ఆమె నాకు మార్గనిర్దేశం చేస్తూ వచ్చారు. 'నీకు ప్రతిభ ఉంది. కష్టపడి పనిచేస్తే విజయం దక్కుతుంద'నేవారు. బెంగాల్‌కు ఆడుతున్నప్పుడు ఓసారి చేతివేలు విరిగింది. ఆటను వదిలేయాలనుకున్నా. కుటుంబం, స్నేహితులు ఆడమని ప్రోత్సహించారు. వాళ్ల నమ్మకం నాకెంతో బలాన్నిచ్చింది.

▲ ధోనీ ప్రేరణ...

ధోనీ సర్ ఆట నాకు ప్రేరణ. మ్యాచ్‌లను ఫినిష్ చేసే తీరు, స్టంప్స్ వెనక నిమ్మళంగా ఉంటూ గమనించడం... అన్నీ నాకు స్ఫూర్తి. వికెట్ కీపింగ్ కూడా ఆయనవల్లే అలవాటు చేసుకున్నా. ఆయనలా వీలున్నప్పుడల్లా సిక్స్ కొట్టాలనే చూస్తా.

▲ నేను మారిపోను...

ప్రపంచకప్ సాధించడం పెద్ద విజయం. కానీ దీంతో నా స్వభావం, వ్యక్తిత్వంలో మార్పు వస్తుందనుకోను. ప్రపంచకప్ విజేతగా ఒకరకమైన సంతృప్తి ఉంటుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇప్పటికే నా తదుపరి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. శిఖరానికి చేరుకున్నాక... అక్కడ కొనసాగాలంటే కష్టపడి పనిచేయాలి, క్రమశిక్షణతో, అంకితభావంతో ఉండాలి.

▲ కొత్తనీరు వస్తుంది...

మనదేశంలో మొదలైన డబ్ల్యూపీఎల్, ఈ ప్రపంచకప్ విజయం మహిళా క్రికెట్‌కు ఆదరణను మరింత పెంచుతుంది. ఇకనుంచి ఎక్కువ మంది అమ్మాయిలు క్రికెట్‌ను కెరియర్‌గా ఎంచుకుంటారు. ఇప్పటికే డబ్ల్యూపీఎల్‌తో ఎంతోమంది యువ క్రికెటర్లకు అవకాశం వస్తోంది.

▲ ఝూలూ, మిథాలీ కోసం...

టీమ్‌లో అడుగుపెట్టినప్పుడు ఝూలన్ దీ, మిథాలీ దీ మార్గనిర్దేశం చేశారు. వాళ్ల కోసం ప్రపంచ కప్ గెలవాలని టీమంతా అనుకునేవాళ్లం. వాళ్లున్నప్పుడు సాధ్యం కాలేదు. కానీ ఇప్పుడు సాధ్యమైంది.

▲ తెల్లవార్లూ సంబరాలే...

ఇది మన టోర్నమెంట్, మన ట్రోఫీ అన్న ఆలోచనలతోనే ముందుకు వెళ్లాం. కప్ గెలిచాక డాన్స్‌లు చేస్తూ, నవ్వుకుంటూ... తెల్లవారే వరకూ సంబరాల్లో మునిగిపోయాం. అండర్-19 ప్రపంచకప్, డబ్ల్యూపీఎల్, సీనియర్ ప్రపంచకప్... మూడూ గెల్చాను. ప్రతి టోర్నీ నాకు పాఠాలు నేర్పింది. అండర్-19 ప్రపంచకప్ గెలిచాక అందులోని గొప్పతనం తెలిసింది. దేశవాళీ, డబ్ల్యూపీఎల్, ఇండియా... ఏ జట్టుకు ఆడినా ఇదే భావన కావాలని కోరుకుంటా.

జట్టులో స్థానం... ఊహించలేదు!



జాతీయ జట్టులోకి అడుగుపెట్టి కొన్నినెలలే! కానీ వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. బౌలింగ్ సెన్సేషన్‌గా పేరు తెచ్చుకుంది... శ్రీచరణి. ఈ టోర్నీలో టాప్ 5 బౌలర్లలో ఒకరిగా నిలిచి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ తెలుగమ్మాయిని 'వసుంధర' పలకరించింది...

మాది కడప జిల్లాలోని వీరపునాయునిపల్లె మండలం ఎర్రమల్లపల్లె. పల్లె నుంచి వచ్చినా క్రికెట్ అంటే చాలా ఇష్టం పెంచుకున్నా. నిజానికి నేను తొలిరోజుల్లో అథ్లెట్‌ని. ఖోఖో, బ్యాడ్మింటన్ కూడా ఆడేదాన్ని. అప్పుడు పోలీసు అవ్వాలి లేదంటే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినా అవ్వాలి అనుకునేదాన్ని. కానీ క్రికెట్‌వైపు వచ్చాక అదే లోకమైంది. అబ్బాయిలతో కలిసి గల్లీ క్రికెట్ ఆడేదాన్ని. డీఏవీ మైదానంలో మామయ్య కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి సాధన చేసేదాన్ని. అయితే భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానని మాత్రం ఊహించలేదు. అవకాశం వచ్చాక మాత్రం నిరూపించుకోవాలని బలంగా అనుకున్నా.

అదే మలుపు

ఇంట్లో ఒప్పించి శిక్షణలో చేరిన ఏడాదిలోపే రాష్ట్రస్థాయి మ్యాచ్‌ల్లో ఆడా. ఎడమచేతి వాటం బౌలర్‌ని కావడం... పొదుపుగా పరుగులు ఇస్తానన్న పేరు తెచ్చుకోవడం కలిసొచ్చింది. అలా విమెన్స్ ఛాలెంజర్స్ ట్రోఫీకి అర్హత సాధించా. ప్రతి మ్యాచ్‌లోనూ సత్తా చాటా. అప్పుడు నా ఆటతీరును గుజరాత్, ముంబయి, ఆర్‌సీబీ, దిల్లీ డబ్ల్యూపీఎల్ జట్ల ప్రతినిధులు పరిశీలించారు. వాస్తవానికి ఆ విషయం నాకు తెలియదు. ముంబయి జట్టు సంప్రదించినప్పుడు అర్థమైంది. అయితే చివరికి వేలంలో రూ. 55 లక్షలకు దిల్లీ దక్కించుకుంది. అప్పట్నుంచే గుర్తింపు మొదలైంది. డబ్ల్యూపీఎల్ తరవాత దేహ్రాదూన్‌లో జూనియర్ ఇండియా జట్లతో ఆడాను. అక్కడా బౌలింగ్‌లో రాణించడంతో భారతజట్టులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీలంకతో వన్డేతో అరంగేట్రం చేశా. ఆపై ఇంగ్లాండ్‌తో వన్డేలతోపాటు టీ-20ల్లోనూ చోటు దక్కించుకున్నా. వాటిల్లో నా ప్రదర్శనని మెచ్చి, సెలక్టర్లు వరల్డ్‌కప్ జట్టులో చోటు కల్పించారు. ఇక్కడా అన్ని మ్యాచ్‌ల్లో చోటు దక్కడం, టీమ్‌తో కలిసి కప్పు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

భయపడ్డా కానీ...

జట్టుకు ఎంపికవ్వడం ఆనందమే కానీ... జట్టు సభ్యులు ఎలా ఉంటారోనని కాస్త భయపడ్డా. కానీ మైదానంలోనే సీరియస్‌గా ఉంటారు. డ్రెస్సింగ్ రూమ్‌లో అందరూ సరదాగా ఉంటారు. దీంతో కొన్నిరోజుల్లోనే భయం పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా, దీప్తి లాంటి సీనియర్లు ప్రోత్సహించిన తీరు మర్చిపోలేను. తెలుగు అమ్మాయినైనా ఆంధ్ర జట్టు తరఫున వివిధ రాష్ట్రాలతో పోటీ పడ్డా కదా! అలా ఆంగ్లం, హిందీపైనా పట్టు సాధించా. భాషపరంగా ఇబ్బంది లేకపోవడమూ నాకు కలిసొచ్చింది.

ప్రత్యర్థి ఎవరైనా...

మైదానంలోకి అడుగు పెట్టాక ఒత్తిడి మాట ఎరుగను. ప్రత్యర్థి బ్యాటర్ ఎవరన్నదీ పట్టించుకోను. ఆ సమయంలో నా దృష్టంతా అవతలివాళ్ల పరుగులు కట్టడి చేయడం మీదే ఉంటుంది. పరుగులు కట్టడి చేసినప్పుడే వాళ్లలో ఒత్తిడి పెరుగుతుంది, వికెట్లు కోల్పోతారు. వికెట్ల కోసమే ఆడను. లైన్ అండ్ లెంత్ మీద దృష్టిపెడతా. ఏళ్ల అనుభవం ఉన్నవాళ్లూ నా బౌలింగ్‌లో ఆచితూచి ఆడారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్‌ని సైతం కట్టడి చేయగలగడం గర్వంగా అనిపించింది. కప్పు అందుకున్నప్పుడు ఆనందంతో కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆట కాకుండా...

ఆటల్లో పడి చదువునేం పక్కన పడేయలేదు. డిగ్రీ చదువుతున్నా. కాకపోతే అందరిలా రోజూ కాలేజీకి వెళ్లడమే కష్టం. బెస్ట్ ఫ్రెండ్స్ మాత్రం నా పదోతరగతి స్నేహితులే. ఇప్పటికీ వాళ్లతో స్నేహం కొనసాగిస్తున్నా. ఏమాత్రం ఖాళీ దొరికినా కుటుంబంతో గడపడానికే ఇష్టపడతా. నాకు నాన్‌వెజ్ ఎక్కువ ఇష్టం. అమ్మ చేతి వంట అంటే మరీ మరీ ఇష్టం.

చిన్న సలహా

అమ్మాయిల క్రికెట్‌కీ ఇప్పుడు ఆదరణ పెరిగింది. తమపై తమకు నమ్మకం ఉన్న ఎవరైనా ఈ క్రీడలోకి రావొచ్చు. అయితే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ముఖ్యం. ఫిట్‌నెస్‌పైనా ఎక్కువ దృష్టిపెట్టాలి. అయితే ఇందుకు అమ్మానాన్నల ప్రోత్సాహమూ తప్పనిసరే. కొంచెం స్వేచ్ఛ, తల్లిదండ్రుల అండ దొరికితే ఎవరైనా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.

భవిష్యత్తులో...

జట్టులో చోటు దక్కించుకోవడం ప్రతి క్రికెటర్ లక్ష్యమే! ప్రపంచ కప్ గెలుచుకోవడం అంటే కల నెరవేరినట్లే. అలాగని ఆటని నిర్లక్ష్యం చేయను. ఆటపై మరింత దృష్టిసారిస్తా. ప్రస్తుతం త్వరలో రాయ్‌చూర్‌లో ఆడబోయే వన్డేకి సిద్ధమవుతున్నా.

– శ్రీనివాసులు బోగెం, కడప

? మా అమ్మాయికి 16ఏళ్లు. నెలసరి క్రమంగా రాకపోవడంతో డాక్టరు దగ్గరికి తీసుకెళ్లా. పీసీఓఎస్ ఉందని చెప్పారు. బరువు తగ్గితే ఇది అదుపులోకి వస్తుందన్నారు నిజమేనా? తను బరువు తగ్గాలంటే ఎలాంటి డైట్ పాటించాలి? **- అనురాధ,** హైదరాబాద్

బరువు తగ్గితే... పీసీఓఎస్ తగ్గుతుందా!

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) ఇది మన శరీరంలో హార్మోన్ల అసమతుల్యత వల్ల ఏర్పడుతుంది. అయితే కౌమారదశలో ఈ సమస్య వస్తే జీవనశైలిలో ముఖ్యంగా ఆహారంలో మార్పులు చేసుకోవడంతో దీన్ని తగ్గించుకోవచ్చు. మనం తీసుకునే ఆహారం ద్వారా మన శరీరంలో ఇన్సులిన్ స్థాయుల్ని నియంత్రణలో ఉంచడం వల్ల ఈ సమస్య అదుపులోకి వస్తుందని ఇప్పటికే చాలా అధ్యయనాల్లో తేలింది. ఇందుకు మీ అమ్మాయికి గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని మాత్రమే పెట్టాలి. హోల్‌గ్రెయిన్స్, బ్రౌన్ రైస్, మిల్లెట్స్, ఓట్స్, క్వినోవా వంటివాటిలో గ్లైసమిక్ తక్కువగా, పీచుపదార్థం ఎక్కువగా ఉండి బరువు తగ్గడంలో సాయపడతాయి. వీటితోపాటు లీన్ ప్రొటీన్... చికెన్, ఫిష్, గుడ్డును తీసుకోవాలి. అంతేకాదు, మొక్క ఆధారిత ఆహార పదార్థాలు, నట్స్, నూనెగింజలను తక్కువ మొత్తంలో చిరుతిండిగా తీసుకుంటే మంచిది. ప్రాసెస్ చేసిన, చక్కెర పదార్థాలకు దూరంగా ఉండాలి. అయితే ప్రస్తుతం మీరున్న బరువుకి రోజుకి ఎన్ని కెలోరీలు అవసరం అవుతాయో చూసుకుని ఈ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతోపాటు వ్యాయామాలు తప్పక చేయాలి. కార్డియాక్ ఎక్సర్‌సైజ్‌లు... ప్లాంక్, జంపింగ్ జాక్స్ చేస్తే ఫలితం ఉంటుంది. కేవలం బరువు తగ్గడంతో ఈ సమస్య తగ్గిపోదు. ఆరోగ్యకరమైన అలవాట్లపైనా మీరు దృష్టి సారించాలి.

కొనోలి... ఐర్లాండ్ అధ్యక్షురాలు!

ప్రపంచవ్యాప్తంగా మహిళా శక్తినీ నాయకత్వాన్నీ చాటుతూ... తాజాగా ఐర్లాండ్‌కి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు కేథరీన్ కొనోలి. మేరీ రాబిన్సన్, మేరీ మెక్ అలీస్‌ల తరవాత ఆ దేశానికి ఎంపికైన మూడో మహిళా ప్రెసిడెంట్ ఈమె!



'ఐరిష్ భాష పునరుద్ధరణ, వాతావరణ పరిరక్షణ, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండేలా చూడటం, వలస రాజ్యాల వారసత్వ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తా' నని ప్రమాణం చేశారు కేథరీన్ కొనోలి. గత బ్రిటిష్ పాలనకు నిలయంగా ఉన్న డబ్లిన్ కోటలో 68 ఏళ్ల ఈ మాజీ న్యాయవాది... ఐర్లాండ్ 10వ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

స్వతంత్ర వామపక్ష శాసన సభ్యులుగా పోటీచేసి మరీ అధ్యక్ష పదవికి ఎంపికవడం చెప్పుకోదగ్గ విశేషం. ప్రతిపక్ష వామపక్ష పార్టీలన్నింటినీ ఏకం చేసి, యువ ఓటర్లను ఉత్తేజపరిచి, అధికార పార్టీ అభ్యర్థి హీథర్ హంఫ్రీస్‌ను 64 శాతం ఓట్లతో ఓడించారు. ఇంతవరకూ ఏ ప్రెసిడెంట్‌కీ ఇంత మెజారిటీ రాలేదట. 'ఏకాభిప్రాయాన్ని వ్యతిరేకించడానికీ భయపడని అధ్యక్షులు ఐర్లాండ్‌కి అవసరమ'ంటూ ఈమె చేసిన ప్రచారం ఫలించిందనే చెప్పాలి.

నిజానికి ఐర్లాండ్‌లో అధ్యక్ష పదవి నామమాత్రమే. కానీ ఆ దేశ ఏడో అధ్యక్షురాలిగా, తొలి మహిళా ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మేరీ రాబిన్సన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. తరవాత ఆ పదవిలోకి వచ్చినవాళ్లూ ఆ పదవి పరిమితులను విస్తరింపజేసి జాతీయ, అంతర్జాతీయ సమస్యల్ని చర్చించి పరిష్కారం చూపేగలిగేలా చేశారు. ఆ పద్ధతినే కొనోలీ కూడా కొనసాగించాలని భావిస్తున్నారు. ఈ పదవిలో ఈమె ఏడేళ్లు ఉంటారు.

తొమ్మిదో సంతానం!

ఈమె తండ్రి ఓడలు, పడవల తయారీలో పనిచేసేవారు. తల్లి గృహిణి. వీళ్లకి ఏడుగురు అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు. తొమ్మిదో సంతానం కొనోలి. తొమ్మిదేళ్ల వయసులో తల్లి మరణించడంతో తండ్రి, అక్కల సంరక్షణలోనే పెరిగారు.

'ఆదర్శ విలువలున్న కుటుంబంలో పుట్టి పెరిగాను. మా నాన్న మమ్మల్ని ఎంతో కష్టపడి పెంచారు. అంత పెద్ద కుటుంబంలో పెరిగాను కాబట్టి అందరి అభిప్రాయాల్నీ గౌరవిస్తూ ముందుకెళ్లడం నాకు సహజంగానే వచ్చింది' అంటారీమె.

విద్యార్థి దశలోనే వృద్ధులకు చెందిన స్వచ్ఛంద సంస్థలతో పనిచేసిన కొనోలి... సైకాలజీలో మాస్టర్స్ చేశాక కొంతకాలం క్లినికల్ సైకాలజిస్ట్‌గానూ పనిచేశారు. న్యాయవిద్య మీద ఆసక్తితో అదీ పూర్తి చేసి న్యాయవాదిగానూ సేవలందించారు. మారథాన్ రన్నర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కూడా. మంచి వక్త. 2020లో ఐరిష్ పార్లమెంట్‌కు డెప్యూటీ స్పీకర్‌గానూ ఎన్నికయ్యారీమె. తాజాగా తనదైన ప్రచార వ్యూహాలతో సోషల్ మీడియా స్టార్‌గానూ మారిన ఈ కొత్త ప్రెసిడెంట్... ఐర్లాండ్ పాలన యంత్రాంగంలో ఎలాంటి మార్పు తీసుకురానున్నారో వేచి చూడాల్సిందే!

హిమాలయాల్లో సాహస యాత్ర!

తూర్పు హిమాలయాల్లోని అరుణాచల్ ప్రదేశ్, తవాంగ్ జిల్లా ఓ ప్రత్యేక సాహస యాత్రకు వేదిక కానుంది. భారత సైన్యం, సశస్త్ర సీమా బల్, ఇండియన్ మౌంటెనీరింగ్ ఫౌండేషన్‌కు చెందిన మహిళా సభ్యులతోపాటు స్థానిక మోన్పా వర్గానికి చెందిన మహిళలు దీన్లో భాగం కానున్నారు. ఎత్తైన మార్గంలో సాగే యాత్ర... ఈ మంగళవారం మొదలైంది. సరిహద్దులోని గ్రామీణుల్ని కలవడం, మహిళా సాధికారత సాధించడంతోపాటు సాహస క్రీడల్ని, పర్యావరణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో దీన్ని చేపడుతున్నారు. సముద్ర మట్టానికి 13వేల అడుగుల ఎత్తులో ప్రకృతి రమణీయ జెమితాంగ్ ప్రాంతంలో ఈ యాత్ర 96 గంటలపాటు సాగుతుంది.

బంగారం - వెండి



12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,28,090	1,15,450	1,62,839
విజయవాడ	1,23,345	1,15,050	1,58,900
ప్రొద్దుటూరు	1,24,100	1,14,170	1,60,000
రాజమహేంద్రవరం	1,25,510	1,15,050	1,73,000
విశాఖపట్నం	1,25,050	1,15,050	1,55,000
తమిళనాడు	-----	1,16,000	1,73,000

దారులు తెలియకపోవడం మన తప్పు కాదు..!

అసలు నీకు కుడిఎడమలకు తేడా తెలుసా? నువ్వు దారి చెబితే వెళ్లినట్లే! ఫోన్ నాకు ఇచ్చేయి!... ఫోనులో మ్యాప్ చూసి దారి చెబుతున్నప్పుడు ప్రతి అమ్మాయికీ ఎదురయ్యే అనుభవాలు ఇవి. మనసుని గాయపరుస్తాయి కూడా. ఏదేమైనా ఇలా మ్యాప్ చెప్పేటప్పుడు గందరగోళానికి గురవ్వడం అమ్మాయిల తప్పు కాదట. అమ్మాయిల ప్రపంచం చాలా చిన్నది. ఇల్లు, స్కూలు, కాలేజీ... ఇదే ప్రపంచంగా ఉంటాం. అందుకే ఈ మ్యాప్‌లూ, దారులూ అంత తొందరగా మనకు గుర్తుండవట. పైగా మన మెదడు చిహ్నాలని



ఎక్కువగా గుర్తుపెట్టుకుంటుందట. టీ కొట్టు తర్వాత వీధి, గుడి పక్కన ఇల్లు ఇలా చిహ్నాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామట. కారణం కనిపించేవే మన మెదడులో రిజిస్టర్ అవుతాయి. ప్రాక్టికాలిటీ మీద దృష్టి ఎక్కువ. అందుకే టెక్నికల్‌గా ఉండే వాటిపై అందరమ్మాయిలూ ధ్యాస పెట్టలేరట. అలానే, అనుకున్న సమయానికి గమ్యాన్ని చేరుతామా లేదా అనే కంగారు అమ్మాయిల్లో ఎక్కువగా ఉంటుందట. దీనికితోడు వాహనం నడుపుతున్న వాళ్లు అరుస్తూ ఉంటే... ఒత్తిడి ఎక్కువవుతుంది. మనం చెబుతోన్నది సరైనదా? కాదా? అనే గందరగోళంలో తప్పు చెబుతామట. అంతేకానీ ఇది మన బలహీనతా కాదు. అబ్బాయిల బలమూ కాదు. అన్నట్టు అమ్మాయిలు దారులు చెప్పడంలో, గుర్తించడంలో బలహీనంగా ఉంటారని ఏ అధ్యయనమూ చెప్పలేదు. ఇది మగవాళ్ల అపోహ మాత్రమే. కాస్త స్వేచ్ఛ ఇచ్చి... కంగారు పెట్టకుండా, అవమానించకుండా ఉంటే... మనమూ దారులు సరిగ్గా చెప్పగలం. కావాలంటే ఓసారి ప్రయత్నించి చూడమనండి.

విరబూసిన కాగితం పూలు!



















కొన్ని రకాల మొక్కలు నర్సరీల్లోనూ ఉద్యానవనాల్లోనూ విరబూస్తాయి. ఇంట్లో పెంచితే సరిగ్గా పూయవెందుకు అన్న సందేహం చాలామందికి వస్తుంటుంది. ముఖ్యంగా బోగన్‌విలియా వంటి మొక్కలు ఆకు కనిపించకుండా పూయడం చూస్తుంటాం. వాటినలా చూసి ఇంట్లోనూ పెంచితే బాగుణ్ను అనుకుంటాం. పైగా ఈమధ్య వీటిల్లో పొట్టి వెరైటీలు బోలెడు రంగుల్లోనూ దొరుకుతున్నాయి. దాంతో వీటిని కుండీల్లో పెంచుకోవాలని చాలామంది ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే...

- సారవంతమైన మట్టి, వెడల్పాటి కుండీ, నీళ్లు బయటికి పోయే మార్గం... వీటన్నింటితోపాటు ఏ మొక్కకైనా కావాల్సింది సూర్యకాంతి. బోగన్‌విలియా లేదా కాగితప్పూల మొక్కలకీ ఇది ఎంతో అవసరం. కనీసం ఆరు గంటలైనా ఉండాలి. కాబట్టి ఎండ బాగా వచ్చే చోటే కుండీ పెట్టాలి.
- ఈ రకం మొక్కల్ని పెంచేటప్పుడు సమపాళ్లలో మట్టి, ఇసుక కంపోస్ట్ వేయాలి. ముద్దలా ఉండే బంకమట్టి లాంటిది వేయకూడదు. ఇది నీటిని ఎక్కువగా నిల్వ చేసుకోవడంతో పువ్వులు తక్కువగానూ ఆకులు ఎక్కువగానూ వస్తాయి.
- మట్టి పైభాగం కొన్ని అంగుళాలు మాత్రమే తడిచేలా నీళ్లు పోయాలి. ఎక్కువగా పోసినా పువ్వులు సరిగ్గా రావు. వేసవిలో మరీ ఎండిపోకుండా కొంచెంకొంచెం తడిపినా చలికాలంలో మాత్రం వారం పదిరోజులకోసారి అంటే, మట్టి పూర్తిగా ఎండాక మాత్రమే పోయాలి. నాలుగు లేదా ఆరు వారాలకోసారి కొద్దిగా ఎరువు వేస్తూ ఎప్పటికప్పుడు కొమ్మల్ని కత్తిరించాలి. అప్పుడే పువ్వులు బాగా వస్తాయి. చూశారుగా మరి... గులాబీ, తెలుపు, నారింజ, పసుపు, ఎరుపు... ఇలా కాగితం పూల మొక్కల్లో రంగులకు కొదవే లేదు. రెండుమూడు రంగుల్లో విరిసేవీ ఉంటున్నాయి. కాబట్టి ఎంపిక మీదే మరి!

వాళ్ల ధైర్యం... మనమే!

తమ పిల్లలు ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ఎదగాలి అని కోరుకోని తల్లులు ఉండరు. కానీ వాళ్లు అలా పెరగాలంటే అది మన మీదే ఆధారపడి ఉంటుందని తెలుసా? మనతో వాళ్ల అనుబంధమే పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందంటున్నాయి అధ్యయనాలు కూడా!



అమ్మానాన్నలకు నేనంటే చాలా ప్రేమ! నాకేమైనా వాళ్ల తోడు ఎప్పుడూ ఉంటుంది. ఏదైనా వాళ్లతో పంచుకోగలనన్న భరోసా ఉన్న పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఉంటారట. ఎదుటివారిపై నమ్మకం ఉంటుంది. బంధాల పట్లా విలువతో ఉంటారు. ఏదైనా సాధించడానికి వెనకాడరు. అదే ఏదైనా సాధించినప్పుడు విపరీతమైన ప్రేమ... చిన్న తప్పుకే కోప్పడటం, చేయి చేసుకోవడం లాంటివి జరుగుతోంటే పిల్లల్లో ఆందోళన పెరుగుతుందట. పొరపాటు చేయడానికే జంకుతారు. దీంతో కొత్తవి ప్రయత్నించరు. ఇక ఏదైనా ఎలా సాధించగలుగుతారు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీబిజీగా గడిపేస్తున్న రోజులివి. బాధ, సంతోషం ఏది పంచుకోవడానికి వచ్చినా... 'ఇప్పుడు కాదు బిజీగా ఉన్నా' అని పంపేస్తున్నారా? ఇలాంటి పిల్లలు తామంటే అమ్మానాన్నలకి ఇష్టం లేదనుకుంటారు. నిర్లక్ష్యానికి గురవ్వడం కొనసాగి... కొంతకాలానికి ఎవరికీ చేరువ కారు. అందరికీ దూరంగా ఉండటం అలవాటు చేసుకుంటారు. ఇలాంటివాళ్లు దారి తప్పే అవకాశాలే ఎక్కువ. కాబట్టి, పిల్లలతో ఎలా గడుపుతున్నాం అన్నది గమనించుకోవాలి అంటున్నారు పరిశోధకులు. ఏం చేసినా ప్రేమనే కురిపించాలనేం లేదు. అవసరమైతే సరిచేయొచ్చు. కానీ ఏం చేసినా... మీ ప్రేమ, భరోసా, తోడు దొరుకుతాయన్న ధీమా కల్పించగలిగితే చాలు. ఆనందకర బాల్యం సొంతమైన వాళ్లు... పెద్దయ్యాక ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా సాగగలుగుతారు. అలాంటి బాల్యాన్నే ఇస్తున్నారా మరి?

ఉల్లి రైతుకు కన్నీరు

- కిలో ధర రూపాయికి పతనం
- మధ్యప్రదేశ్‌లో అన్నదాతల ఆవేదన



ఈటీవీ భారత్: ఉల్లి ధరలు రైతులను కన్నీరు పెట్టిస్తున్నాయి. ఇప్పటికే పాత ఉల్లి నిల్వలు ఉండగా.. ఇప్పుడు కొత్త పంట మార్కెట్‌లోకి రావడంతో ధరలు భారీగా పడిపోయి రైతన్నలు నష్టాన్ని చవిచూస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో కిలో ఉల్లి ధర రూ.2గా ఉండగా.. మందసౌర్‌లో రూ.1కి పడిపోయింది. కొత్త, పాత నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే మాల్వా సహా పలు ప్రాంతాల్లో ఉల్లిపాయల ధరలు పడిపోయినట్లు సమాచారం. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే ఉల్లి, వెల్లుల్లికి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటాల్ ఉల్లి ధర రూ.600 నడుస్తోంది. మొపత్‌లాల్ మాలి అనే రైతు మాట్లాడుతూ.. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2వేలు చెల్లించాను. వాటిని విక్రయించగా.. క్వింటాల్‌కు రూ.250 మాత్రమే వచ్చాయి. ఇది భారీ నష్టాన్ని కలిగించింది' అని తెలిపారు.

పెళ్లిలో వరుడిపై కత్తితో దాడి


నిందితులను వెంటాడిన డ్రోన్



ఇంటర్నెట్ డెస్క్: వివాహ వేదికపై వరుడిని కత్తితో పొడిచి పారిపోతున్న నిందితులను డ్రోన్ రెండు కిలోమీటర్ల మేర వెంబడించిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. ఈ దృశ్యాలు వైరల్‌గా మారాయి. అమరావతి - బద్నేరా రోడ్డులోని ఓ పెళ్లిమండపంలో సోమవారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు వరుడు సుజల్ రామ్ సముద్రపై కత్తితో పలుమార్లు దాడి చేశారు. దీంతో అక్కడ ఉన్నవారంతా భయభ్రాంతులకు గురయ్యారు. తేరుకొని నిందితులను పట్టుకునేలోపే బైకుపై వారు అక్కడి నుంచి పారిపోయారు. పెళ్లి చిత్రీకరణకు ఏర్పాటుచేసిన డ్రోన్‌ను ఆపరేటరు నిందితుల వైపు మళ్లించడంతో అది వారిని చాలాదూరం వెంబడించింది. ఈ కేసు ఛేదనలో డ్రోన్ దృశ్యాలు కీలకమైన సాక్ష్యాలుగా మారాయని పోలీసులు పేర్కొన్నారు. డీజే పాటలకు నృత్యం చేస్తున్న సమయంలో తలెత్తిన వివాదం కారణంగా ఈ దాడి జరిగినట్లు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన వరుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హైకోర్టుకా.. సెషన్స్ కోర్టుకా..!

- ముందస్తు బెయిల్ కోసం తొలుత ఎక్కడికి వెళ్లాలి?
- తేల్చేందుకు త్రిసభ్య ధర్మాసనం వేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 482 కింద ముందస్తు బెయిల్ కోసం కక్షిదారులు.. తొలుత ఏ కోర్టును ఆశ్రయించాలన్న విషయంలో త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం ప్రకటించింది. ఇటీవల ముందస్తు బెయిల్ కేసులను నేరుగా కేరళ హైకోర్టు స్వీకరించడంపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విస్మయం వ్యక్తంచేసింది. సెషన్స్ కోర్టుల్లోనైతే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, నేరుగా హైకోర్టు స్వీకరించడం వలన కొన్ని కీలక అంశాలు మరుగున పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలోనే ఈ అంశాన్ని ముగ్గురు సభ్యుల ధర్మాసనం నిర్ణయించాల్సి ఉందని పేర్కొంది.

కిరాతక ఉగ్రదాడే

- ఎర్రకోట సమీపంలో పేలుడుపై కేంద్ర క్యాబినెట్ స్పష్టీకరణ

దిల్లీ: దేశ రాజధానిలోని ఎర్రకోట సమీపంలో సోమవారం చోటుచేసుకున్న కారు బాంబు పేలుడు కిరాతక ఉగ్ర దాడేనని కేంద్ర క్యాబినెట్ స్పష్టం చేసింది. దీనిని మతిహీన హింసాత్మక చర్యగా పేర్కొంది. పిరికిపందల దాడిగా అభివర్ణించింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపింది. ఈ కేసును అత్యవసరమైనదిగా భావించి వృత్తి నిపుణతతో వేగంగా ఛేదించాలని.. దోషులను, వారి వెనుక ఉన్నవారిని సాధ్యమైనంత త్వరగా చట్టం ముందు నిలబెట్టాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. భూటాన్ నుంచి తిరిగి వచ్చిన ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం సాయంత్రం కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. బాంబు పేలుడులో మృతిచెందిన వారికి సంతాపసూచకంగా సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలన్న తమ విధానానికి కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా క్యాబినెట్ సమావేశం స్పష్టం చేసింది. ఉగ్ర దాడిని ఖండిస్తూ, ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. 'జాతి వ్యతిరేక శక్తులు దుర్మార్గంగా చేసిన కిరాతక ఉగ్ర దాడిని దేశం చవి చూసింది. ఈ ఘటనలో పలువురు మరణించారు. ఎంతో మంది గాయపడ్డారు. దీనిని క్యాబినెట్ ఖండిస్తోంది' అని ఆ తీర్మానంలో పేర్కొంది. ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు క్యాబినెట్ భేటీ వెల్లడించింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని క్యాబినెట్ భేటీ ఆకాంక్షించింది. దాడి జరిగిన వెంటనే స్పందించి సహాయక చర్యలు, వైద్యం అందించిన వారిని అభినందించింది. అధికారులు, భద్రతా సిబ్బంది, స్థానికులను ప్రశంసించింది. దేశ పౌరులందరూ ప్రశాంతంగా జీవించడానికి, వారి భద్రతకు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసింది. క్యాబినెట్ భేటీ వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.



హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా ఖండావలిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు ఇది. ఎర్రకోట సమీపంలో సోమవారం పేలిపోయిన కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ పేరిట ఇది రిజిస్టరై ఉంది

కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం

బాధితులను పరామర్శించిన అనంతరం 'ఎక్స్'లో మోదీ పోస్టు

దిల్లీ: ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనలో గాయపడిన వారిని ప్రధానమంత్రి మోదీ బుధవారం పరామర్శించారు. "ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రికి వెళ్లాను. గాయపడినవారిని పరామర్శించాను. వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఈ దాడి వెనుక ఉన్న కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం" అని 'ఎక్స్'లో ప్రధాని పోస్టు చేశారు. భూటాన్ పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న ఆయన నేరుగా ఆసుపత్రికి వెళ్లారు.

అమెరికాలో తగినంత మంది ప్రతిభావంతులు లేరు



స్వరం మార్చిన ట్రంప్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బీ వీసా సంస్కరణలపై స్వరం మార్చారు. దేశ శ్రామిక శక్తిలో కీలక స్థానాలను భర్తీ చేయడానికి ప్రత్యేక నిపుణులైన విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం అవసరమని అన్నారు. తమవద్ద అనుకున్న స్థాయిలో ప్రతిభావంతులు లేరని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "మన వద్ద చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారు" అని యాంకర్ తెలుపగా.."లేదు, లేదు. మన వద్ద ప్రతిభావంతులు లేరు. వీరంతా ఇంకా నేర్చుకోవాలి. నిరుద్యోగులందరినీ ఫ్యాక్టరీకి తీసుకువెళ్లి క్షిపణులను తయారు చేయమనలేం. పనులు అలా జరగవు" అని వ్యాఖ్యానించారు. సరైన శిక్షణ లేకుండా తయారీ, రక్షణ రంగాల్లోని ఉద్యోగాలకు అమెరికన్లను నియమించుకోలేమన్నారు. జార్జియాలోని దక్షిణ కొరియా ప్లాంట్ నుంచి పెద్ద మొత్తంలో విదేశీ కార్మికులను తొలగించడం వల్ల కొన్ని ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనట్లు ట్రంప్ ఉదహరించారు. అమెరికన్ కార్మికుల వేతనాలను పెంచడానికి తాను మద్దతిస్తున్నప్పటికీ.. దేశంలో సాంకేతిక రంగాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే విదేశీ ప్రతిభను ఉపయోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఓపీటీని రద్దు చేస్తారా??

అంతర్గత భద్రతా విభాగం కీలక ప్రతిపాదన

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి విదేశీ విద్యార్థుల రాకను కఠినతరం చేస్తున్నారు. సోషల్ వెట్టింగ్ అంటూ పలు విధానాలతో ఆ దేశ కలను గందరగోళంలో పడేస్తున్నారు. ఈ క్రమంలో అమెరికా అంతర్గత భద్రతా విభాగం సరికొత్త ప్రతిపాదన చేసింది. ఆ నిబంధన వల్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)పై పరిమితులు విధించడం, లేదా పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉంది. ఆ నిబంధన ఫెడరల్ రెగ్యులేటరీ అజెండాలో లిస్ట్ అయింది. 2025 చివర్లో లేదా 2026 ప్రారంభంలో దానిని అమలు చేయొచ్చని తెలుస్తోంది. ఓపీటీని భారత్ సహా ఇతర దేశాల విద్యార్థులు దుర్వినియోగం చేస్తున్నారని అమెరికాలోని పలు సంస్థలు అభ్యంతరం తెలపటంతో సమస్య మొదలైంది. ఒకవేళ ఓపీటీ రద్దు విధానం అమలైతే ఆ ప్రభావం విద్యార్థులపై తీవ్రంగా ఉంటుంది. మన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లే అవకాశం మరింత తగ్గిపోతుంది. విద్యార్థులతోపాటు అక్కడ యూనివర్సిటీలు నష్టపోయే ప్రమాదం ఉంది.

ఆఫీసు నుంచి రాగానే ఇలా చేయకండి



నాన్న ఆఫీసు నుంచి ఇంటికి రాగానే పిల్లలు ఆనందంతో ఎగిరి గంతేస్తారు. తండ్రితో కలసి ఆడుకోవాలని వారు రోజంతా ఎదురుచూస్తుంటారు. కానీ నాన్న వచ్చీరాగానే నీరసంగా సోఫాలో కూలబడి టీవీకి అతుక్కుపోతే చిన్నారుల ఉత్సాహం నీరుగారిపోతుంది. అలా కాకుండా పిల్లలతో కలసిపోయి హుషారుగా వారిని ఆడించండి. అవి మీ పిల్లలతో పాటు మీకూ మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

– ర్యాన్ స్టీఫెన్స్, లైఫ్ కోచ్

పీఎం, సీఎంలను తొలగించే బిల్లుపై జేపీసీ

- ఛైర్‌పర్సన్‌గా అపరాజితా సారంగి
- కమిటీలో 31 మంది సభ్యులు
- ఏపీ, తెలంగాణల నుంచి ముగ్గురు చొప్పున ఎంపీలకు చోటు

దిల్లీ: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టై వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి/ముఖ్యమంత్రి/ కేంద్ర-రాష్ట్ర మంత్రులనైనా తొలగించేందుకు వీలు కల్పిస్తూ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ (సవరణ) బిల్లును పరిశీలించేందుకు భాజపా ఎంపీ అపరాజితా సారంగి నేతృత్వంలో 31 మంది సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) ఏర్పాటైంది. ఇందులో భాజపా నుంచి 15 మంది, ఇతర ఎన్డీయే పార్టీల నుంచి 11 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని కీలక పార్టీలు ఈ జేపీసీని బహిష్కరించాలని నిర్ణయించడంతో విపక్ష పార్టీల సభ్యుల సంఖ్య 4కే పరిమితమైంది. ఎన్సీపీ-ఎస్పీ, అకాలీదళ్, ఏఐఎంఐఎం, వైకాపా మాత్రమే ఈ కమిటీలో చేరాయి. ఓ నామినేటెడ్ సభ్యుడిని కూడా ఎంపిక చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి డి.కె.అరుణ(భాజపా), కె.లక్ష్మణ్ (భాజపా), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), లావు కృష్ణదేవరాయలు(తెదేపా), వల్లభనేని బాలశౌరి(జనసేన), నిరంజన్‌రెడ్డి(వైకాపా)లకు చోటు లభించింది. ఈ జేపీసీ.. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ (సవరణ) బిల్లును కూడా పరిశీలించనుంది. భాజపా బి టీంగా వ్యవహరించే పార్టీలకే జేపీసీలో చోటు దక్కిందని కాంగ్రెస్ విమర్శించింది.



అపరాజితా సారంగి

లిబియా తీరంలో పడవ బోల్తా 42 మంది వలసదారుల గల్లంతు

కైరో: అక్రమ వలసదారులతో నిండిన ఓ పడవ బోల్తా పడి 42 మంది గల్లంతైన ఘటన లిబియా తీరానికి సమీపంలో జరిగిందని ఐక్యరాజ్యసమితి వలసల సంస్థ బుధవారం వెల్లడించింది. గల్లంతైన వారంతా మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి ఏడుగురు బతికి బయటపడ్డారు. సముద్రం మధ్యలో మరపడవ ఇంజన్ విఫలం కావడంతో ఈ ఘటన సంభవించిందని భావిస్తున్నారు. ప్రమాదంలో బతికి బయటపడినవారు ఆరు రోజుల వరకూ సముద్రంలోనే ప్రాణాలు అరచేత పట్టుకొని జీవించారు. చివరకు వారిని లిబియా అధికారులు రక్షించారు. గల్లంతైన వారిలో 29 మంది సూడాన్ దేశానికి చెందినవారు, ఎనిమిది మంది సోమాలీలు, ముగ్గురు కామెరూన్ జాతీయులు, ఇద్దరు నైజీరియన్లు ఉన్నారు.

అయోధ్యలో 24, 25 తేదీల్లో రాముడి దర్శనం నిలిపివేత

శిఖర ధ్వజారోహణలో పాల్గొననున్న ప్రధాని మోదీ, మోహన్ భాగవత్



ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరంలో ఈ నెల 24 సాయంత్రం నుంచి రెండు రోజులపాటు రామ్‌లల్లా దర్శనం ఉండదు. నవంబరు 26 ఉదయం 7.00 గంటలకు దర్శనం పునఃప్రారంభం అవుతుంది. 25న రామమందిర శిఖర ధ్వజారోహణ కార్యక్రమానికి ప్రధానమంత్రి మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తదితర ప్రముఖులు హాజరు కానున్నారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసే క్రమంలో భాగంగా రామయ్య దర్శనానికి విరామం ఇచ్చామని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. వివాహ పంచమి సందర్భంగా ఈ నెల 25న అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణం జరగనుంది. శ్రీరాముడు, సీతమ్మల దివ్య వివాహానికి గుర్తుగా ఈ వేడుకను నిర్వహిస్తారు.

ఇస్లామాబాద్ పేలుళ్ల వెనుక భారత్ పాత్ర లేదు

- అంతర్గత అధికార దాహమే వాటికి కారణం
- స్పష్టంచేసిన కేంద్ర ప్రభుత్వం



రణ్‌ధీర్ జయస్వాల్

ఇంటర్నెట్ డెస్క్: ఇస్లామాబాద్ పేలుళ్లపై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతిచెందగా, 36 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. అయితే తమ దేశంలో వరుస పేలుళ్ల వెనుక భారత్ పాత్ర ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆరోపించారు. ఆ వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. పాక్‌లో అంతర్గత అధికార దాహమే దానికి కారణమంటూ విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వ్యాఖ్యానించారు. పొరుగు దేశంలో చోటు చేసుకున్న ఉగ్రదాడి వెనుక భారత్ పాత్ర లేదని స్పష్టం చేశారు. అసలు ఇలాంటి వాటిని భారత్ ప్రోత్సహించదని పేర్కొన్నారు. "పాకిస్థాన్ నాయకత్వం చేస్తోన్న నిరాధార, అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ దేశంలో జరుగుతోన్న సైనిక ప్రేరేపిత రాజ్యాంగ విధ్వంసం, అధికార దోపిడీ నుంచి అక్కడి ప్రజల దృష్టిని మరల్చేందుకే భారత్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి తప్పుడు కథనాలను పాక్ కల్పిస్తుందని ఊహించదగినదే. అంతర్జాతీయంగా వాస్తవ పరిస్థితులు ఏంటో ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంది" అని రణ్‌ధీర్ వెల్లడించారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడిని ఖండించిన చైనా

ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడి ఘటనను చైనా తీవ్రంగా ఖండించింది. 'చైనా అన్ని రకాల ఉగ్రవాదాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఉగ్రవాదంపై పోరాటంలో, సామాజిక స్థిరత్వాన్ని కాపాడటంలో, ప్రజలను సురక్షితంగా ఉంచడంలో పాకిస్థాన్‌కు మద్దతిస్తూనే ఉంటుంది. మరణించిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం" అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు.

'జమాత్ ఏ ఇస్లామీ'పై ఉక్కుపాదం

500 ప్రాంతాల్లో పోలీసుల సోదాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవ్యవస్థపై భారీస్థాయిలో పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. నిషేధిత 'జమాత్ ఏ ఇస్లామీ' (జేఈఐ) సహా పలు ఉగ్రసంస్థలకు చెందిన 500 పరిసరాలపై బుధవారం భారీస్థాయిలో సోదాలు చేపట్టారు. వివిధ రంగాల్లో తమ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు జేఈఐ అనుబంధ విభాగాలు ప్రయత్నిస్తున్నాయంటూ అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కుల్గాం, పుల్వామా, శోపియాన్, బారాముల్లా సహా 10 జిల్లాల్లోని జేఈఐ ఉగ్రముఠా సభ్యులు, వారి సహచరుల నివాసాలు, పరిసరాల్లో సోదాలు చేసినట్లు వెల్లడించారు.

బిహార్ ఎన్నికల్లో భాజపా, ఈసీ కుమ్మక్కు

రాహుల్‌గాంధీ ఆరోపణ

దిల్లీ: బిహార్ ఎన్నికల్లో భాజపా, ఈసీ కుమ్మక్కై 'ఓటు చౌర్యానికి' దిగి ప్రజాస్వామ్య హననానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బుధవారం ఆరోపించారు. ఒకే వ్యక్తి హరియాణా, దిల్లీ, బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసిన ఘటన వెలుగులోకి వచ్చిందని తన సోషల్ మీడియా పోస్టులో రాహుల్ తెలిపారు. లక్షల మంది భాజపా కార్యకర్తలు భిన్న రాష్ట్రాల్లో బహిరంగంగా తిరుగుతూ ఓట్లు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ చౌర్యాన్ని కప్పిపుచ్చేందుకు సాక్ష్యాధారాలన్నిటినీ చెరిపేస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు.

రీపోలింగ్ లేని ఎన్నిక: బిహార్‌లో రెండో దశ ఎన్నికలు జరిగిన 122 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కదానిలోనూ రీపోలింగ్‌కు సిఫార్సు చేయలేదని ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఇటీవలి కాలంలో రీపోలింగ్‌కు ఆదేశించని ఎన్నిక ఇదేనని కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. మొదటి దశ ఎన్నికల్లోనూ ఒక్క నియోజకవర్గంలోనూ రీపోలింగ్‌కు ఆదేశించలేదని ఈసీ తెలిపింది.

పెరూ రోడ్డు ప్రమాదంలో 37 మంది మృతి

లిమా(పెరూ): ఎదురుగా వస్తున్న వాహనంతో ఢీకొన్న ప్రయాణికుల బస్సు పక్కనే ఉన్న లోయలో పడిపోయి 37 మంది మరణించిన ఘటన బుధవారం దక్షిణ పెరూలో జరిగింది. ఈ ప్రమాదంలో 13 మంది గాయాలపాలయ్యారు. కొండ ప్రాంతంలో బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో ట్రక్కుతో ఢీకొని పక్కనే ఉన్న లోయలోకి జారిపోయిందని స్థానిక అధికారి ఒకరు వెల్లడించారు. ఈ బస్సు దక్షిణ పెరూలోని చలా ప్రాంతం నుంచి బయలుదేరిందని ఆయన తెలిపారు.

కెనడాలో జీ 7 విదేశీ వ్యవహారాల మంత్రుల భేటీ



అనితా ఆనంద్‌తో భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్

నయాగరా: పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గ్రూప్ ఆఫ్ 7 (జీ 7) దేశాల విదేశాంగ మంత్రులు కెనడాలో మంగళ, బుధవారాల్లో సమావేశమయ్యారు. అమెరికా సుంకాల పెంపు, గాజా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమాప్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలపై వారు చర్చలు జరిపారు. ట్రంప్ సుంకాల వల్ల వ్యాపారపరంగా ఎదురవుతున్న ఒత్తిళ్లపై కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రూబియోతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ విదేశాంగ మంత్రులతో కూడా చర్చించారు. అనితా ఆనంద్ భారత్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, మెక్సికో, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్ దేశాల విదేశాంగ మంత్రులను కూడా ఆహ్వానించారు. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు ప్రాధాన్యమిస్తున్నామని అనిత తెలిపారు. రష్యా దాడుల వల్ల ఉక్రెయిన్‌లో దెబ్బతిన్న విద్యుత్, నీటి సరఫరా పునరుద్ధరణ, శీతాకాలంలో వెచ్చదనం ఏర్పాట్ల కోసం 1.3 కోట్ల పౌండ్లను అందిస్తానని బ్రిటన్ ప్రకటించింది. కెనడా కూడా ఇలాంటి సహాయమే ప్రకటించింది. జీ 7లో జపాన్ తప్ప మిగిలిన దేశాలన్నీ నాటో సభ్య దేశాలే. అవి తమ వార్షిక జీడీపీలో 5 శాతాన్ని రక్షణకు వెచ్చించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. కెనడా, ఇటలీ తప్ప మిగిలిన దేశాలు ఆ మొత్తం కేటాయించేందుకు సిద్ధమన్నాయి. 2035 నాటికి తాము అంత కేటాయించగలుగుతామని కెనడా పేర్కొంటోంది.

బోట్స్‌వానా నుంచి భారత్‌కు 8 చీతాలు

- ప్రకటించిన ఆ దేశ అధ్యక్షుడు గిడియోన్
- రాష్ట్రపతి ముర్ము పర్యటనలో పలు ఒప్పందాలు



బోట్స్‌వానా అధ్యక్షుడు డ్యూమా గిడియోన్ బోకోతో ద్రౌపదీ ముర్ము

గబొరోనే: దక్షిణాఫ్రికా దేశం బోట్స్‌వానాతో భారత్ పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆరోగ్యరంగం, ఫార్మా రంగాలకు సంబంధించి పలు అవగాహన ఒప్పందాల(ఎంఓయూలు)పై సంతకాలు చేసింది. ప్రస్తుతం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మూడు రోజుల బోట్స్‌వానా పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆ దేశ అధ్యక్షుడు డ్యూమా గిడియోన్ బోకోతో ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారత్‌కు మరో 8 చీతాలను అప్పగించనున్నట్లు గిడియోన్ అధికారికంగా ప్రకటించారు. 2026తో బోట్స్‌వానా, భారత్‌ల మధ్య దౌత్య సంబంధాలు 60వ ఏటా అడుగుపెట్టనున్నాయి. ఈ నేపథ్యంలో తన పర్యటన ఓ మైలురాయిగా నిలిచిపోతుందని ముర్ము పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి బోట్స్‌వానాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

సీజేఐపై బూటు విసిరిన ఘటన.. నివారణోపాయం సూచించమన్న సుప్రీం

దిల్లీ: కోర్టు ఆవరణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై బూటు విసిరిన ఉదంతంలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని సుప్రీంకోర్టు బుధవారం అటార్నీ జనరల్‌ను, అత్యున్నత న్యాయస్థాన బార్ అసోసియేషన్‌ను కోరింది. ఇలాంటి ఘటనలు తిరిగి జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టవచ్చో సూచిస్తే కోర్టు వాటిని పరిశీలిస్తుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడానికి ప్రయత్నించిన రాకేశ్ కిశోర్ అనే న్యాయవాదిపై క్రిమినల్ కోర్టు ధిక్కార చర్యలు తీసుకోడానికి ఇటీవల కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే.

తదుపరి విచారణ డిసెంబరు 4న

దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసరడంపై దిల్లీ హైకోర్టు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. ఈ ఘటన న్యాయవాదులనే కాక ప్రతి ఒక్కరి భావనల్ని దెబ్బతీసిందని దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం పేర్కొంది. ఈ అంశంపై తదుపరి విచారణను డిసెంబరు 4వ తేదీకి వాయిదా వేసింది.

ఏం చేస్తున్నారో చెప్పండి: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధాని ప్రాంతం-దిల్లీలో వాయు నాణ్యత క్షీణతపై బుధవారం సుప్రీం కోర్టు స్పందించింది. ఈ పరిస్థితికి కారణమవుతున్న పంట వ్యర్థాల దహనం ఘటనల నివారణకు తీసుకున్న చర్యలను వివరించాలని పంజాబ్, హరియాణా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఈ అంశంపై ఈ నెల 17న విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం సమ్మతి తెలిపింది. అంతకు ముందు ఈ అంశంపై బుధవారమే విచారణ నిర్వహించాలని భావించింది.

ప్రత్యేక ఛాతీ క్లినిక్‌లు ఏర్పాటు చేయండి: కేంద్రం

నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ కింద ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో ప్రత్యేక ఛాతీ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వాయు కాలుష్యం అధికంగా ఉన్న నెలల్లో శ్వాసకోశ, హృద్రోగ ముప్పును ఎదుర్కొనే రోగులకు ఈ క్లినిక్‌లలో వైద్యం అందించాలని పేర్కొంది.

భాగస్వామ్య ప్రజాస్వామ్యం ఉంటేనే బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా: హసీనా



కోల్‌కతా, ఢాకా: బంగ్లాదేశ్‌లో భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించినప్పుడే.. తాను అక్కడ తిరిగి అడుగు పెడతానని భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా షరతు పెట్టారు. అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేత సహా స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగి వెళ్తానని స్పష్టంచేశారు. ఓ న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం బంగ్లాలో ఉన్న యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తోంది. భారత్‌తో సంబంధాలను ప్రమాదంలో పడేస్తోంది. మా హయాంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించాం. యూనస్ తన మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారు" అని పేర్కొన్నారు.

భారత డిప్యూటీ హై కమిషనర్‌కు నిరసన

షేక్ హసీనా భారత్‌లోని పలు మీడియా సంస్థలతో మాట్లాడటాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆక్షేపించింది. పరారీలో ఉన్న మాజీ ప్రధానికి మీడియా సమావేశంలో పాల్గొనేందుకు అవకాశం ఎలా ఇస్తారంటూ ఢాకాలోని భారత డిప్యూటీ హైకమిషనర్ పవన్ బాధేను ప్రశ్నించింది.

మీకు ఎంతమంది భార్యలు?

సిరియా అధ్యక్షుడితో ట్రంప్ జోకులు



ట్రంప్‌తో అహ్మద్ అల్-షరా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరా సోమవారం భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇరువురు నేతల మధ్య ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. అల్ షరాకు ట్రంప్ ఓ పర్ఫ్యూమ్ బాటిల్‌ను అందించారు. ఇది మంచి సువాసన ఇస్తుందని వ్యాఖ్యానించిన ఆయన.. మీకు, మీ సతీమణికి బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా 'మీకు ఎంత మంది భార్యలు?' అని సిరియా అధ్యక్షుడిని ప్రశ్నించారు. ఒక్కరే అని షరా బదులివ్వగా.. 'అది నిజమా? నమ్మలేం..' అంటూ ట్రంప్ సందేహం వ్యక్తం చేయడంతో అక్కడ నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరా.. తొలిసారి అమెరికాలో పర్యటించారు. 1946లో స్వాతంత్ర్యం అనంతరం వాషింగ్టన్‌ను సందర్శించిన మొదటి సిరియా అధ్యక్షుడిగాను ఆయన రికార్డు సృష్టించారు. అంతేకాదు రెండు దశాబ్దాల క్రితం అమెరికా నిర్బంధ కేంద్రంలో ఉన్న ఆయన అధ్యక్షుడి హోదాలో అగ్రరాజ్యంలో పర్యటించడం ఆసక్తిగా మారింది. 2003లో ఇరాక్‌పై అమెరికా దండయాత్రకు ముందు అల్-ఖైదాలో చేరిన షరా.. ఇరాకీ తిరుగుబాటులో పాల్గొన్నారు. దీంతో అమెరికన్ దళాలు ఆయన్ను కొన్నేళ్లు (2006-11) నిర్బంధ కేంద్రంలో ఉంచాయి.

ఆ బాలికల గురించి ట్రంప్‌నకు తెలుసు

- ఓ బాధితురాలితో కొన్ని గంటలున్నారు
- ఈమెయిల్ సాక్ష్యాన్ని బయటపెట్టిన డెమోక్రాట్లు

వాషింగ్టన్: పలువురు మైనర్లతోపాటు మహిళలను అక్రమ లైంగిక సంబంధాలకు వాడుకున్న నేరానికి జైలు పాలై చివరకు అందులోనే మరణించిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవనడానికి సాక్ష్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆ బాలికల గురించి ట్రంప్‌నకు తెలుసని, ఎప్‌స్టీన్ ఇంటివద్ద బాధితురాలైన ఒక బాలికతో ట్రంప్ కొన్ని గంటలు గడిపారని తెలిపే ఈమెయిల్‌ను బుధవారం డెమోక్రాట్లు బయటపెట్టారు. ఈ ఈమెయిల్ హౌస్ కమిటీకి ఎప్‌స్టీన్ సిబ్బంది అందించిన 23వేల పత్రాల్లో భాగంగా ఉంది. 2011 ఏప్రిల్ 2వ తేదీన తన స్నేహితురాలైన గ్లీస్లెయిన్ మ్యాక్స్‌వెల్‌కు ఎప్‌స్టీన్ ఒక ఈమెయిల్ పంపారు. అందులో.. 'మొరగని ఆ కుక్క ట్రంప్ అన్న విషయాన్ని నువ్వు తెలుసుకోవాలని కోరుకుంటున్నా. (పేరు ప్రస్తావించని బాలిక) కొన్ని గంటలపాటు అతడితో మా ఇంట్లో గడిపింది. అయితే అతడి పేరు ఎప్పుడూ ప్రస్తావనకు రాలేదు' అని పేర్కొన్నాడు. 'నేనూ అదే ఆలోచిస్తున్నా' అని మ్యాక్స్‌వెల్ బదులిచ్చింది. ప్రస్తుతం ఆమె జైలులో ఉంది.

విశాఖలో లుపిన్ ఆంకాలజీ యూనిట్



ఈనాడు, హైదరాబాద్: అగ్రశ్రేణి ఔషధ కంపెనీ లుపిన్ లిమిటెడ్‌కు అనుబంధ సంస్థ అయిన లుపిన్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ విశాఖపట్నంలో క్యాన్సర్ మందుల ఉత్పత్తి చేసే యూనిట్‌ను ప్రారంభించింది. ఈ యూనిట్లో కాంట్రాక్టు అభివృద్ధి, ఉత్పత్తి కార్యకలాపాలు (సీడీఎంఓ) చేపట్టనున్నట్లు లుపిన్ వెల్లడించింది. ప్రధానంగా క్యాన్సర్ మందుల విభాగంలోని సంస్థలకు సీడీఎంఓ సేవలు అందించనున్నట్లు లుపిన్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ సీఈఓ అబ్దెలాజిజ్ టౌమి వివరించారు. ఈ యూనిట్లో ప్రాసెస్ డెవలప్‌మెంట్ ల్యాబ్, క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్, అనలెటికల్ డెవలప్‌మెంట్, ప్రాసెస్ ఆప్టిమైజేషన్, వ్యాలిడేషన్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.



సంస్థల బీమాకు 'సైబర్‌ఎడ్జ్'

ఈనాడు, హైదరాబాద్: సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, వాణిజ్య సంస్థలకు బీమా రక్షణ కల్పించేందుకు టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ 'సైబర్ ఎడ్జ్' పేరుతో బీమా పథకాన్ని తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని సంస్థలపై గతేడాది 62 లక్షలకు పైగా మాల్వేర్ దాడులు జరగగా, 17,500 ర్యాన్సమ్‌వేర్ ఘటనలు చోటు చేసుకున్నాయని సంస్థ ఫైనాన్షియల్ లైన్ విభాగం జాతీయ అధిపతి నజ్మ్ బిల్గ్రామి అన్నారు. డేటా నష్టంతో సంస్థలు సగటున రూ.19.5 కోట్లు నష్టపోయాయన్నారు. అందుకే కంపెనీలు సైబర్ రక్షణకు మొగ్గు చూపిస్తున్నాయన్నారు.

నాట్కో ఫార్మా చేతికి దక్షిణాఫ్రికా కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాఫ్రికాలో 130 ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫార్మా కంపెనీ యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్ లిమిటెడ్‌లో 35.75% వాటా కొనుగోలు ప్రక్రియను నాట్కో ఫార్మా పూర్తి చేసింది. ఇందుకోసం నాట్కో ఫార్మా దాదాపు 226 మిలియన్ డాలర్లు (రూ.2,000 కోట్లు) వెచ్చించింది. తదనంతర చర్యల్లో భాగంగా యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్ షేర్లను జోహాన్నెస్‌బర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీ (జేఎస్ఈ) నుంచి ఈనెల 11న 'డీలిస్ట్' చేశారు. అంటే ఇకపై ఈ కంపెనీ షేర్ల క్రయవిక్రయాలు జోహాన్నెస్‌బర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీలో జరగవు.

సిమెంటు పెట్టుబడులు రూ.1.2 లక్షల కోట్లు



- రెండేళ్లలో 160- 170 మి.ట. అదనపు సామర్థ్యం
- వినియోగం పెరుగుతుందనే అంచనాల వల్లే

సిమెంటు పరిశ్రమ భారీ విస్తరణ బాటలో సాగుతోంది. కొన్ని సంస్థలు కొత్త యూనిట్లు స్థాపిస్తుండగా, మరికొన్ని సంస్థలు ఇప్పటికే ఉన్న యూనిట్లలో సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. దీని కోసం కంపెనీలు దాదాపు రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, రెండేళ్లలో 160- 170 మిలియన్ టన్నుల అదనపు సామర్థ్యం లభించనుందని క్రిసిల్ రేటింగ్స్ తాజా నివేదికలో పేర్కొంది. సిమెంటుకు గిరాకీ అధికంగా ఉంటుందనే ఆశాభావంతోనే కంపెనీలు విస్తరణపై దృష్టి సారిస్తున్నాయి.

ఎన్నో సానుకూలతలు

గిరాకీ ఆశించినంతగా లేక గత మూడేళ్లలో సిమెంటు కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోలేదు. కొన్నేళ్ల పాటు వినియోగం పెరుగుతుందనే అంచనాలకు వచ్చాకే, విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపడుతున్నాయి. ఇళ్లు - కార్యాలయాల నిర్మాణమూ అధికంగా ఉంది. ఫలితంగా కొన్నేళ్ల పాటు సిమెంటు వినియోగం పెరగనుంది. దేశంలో సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం 670 మిలియన్ టన్నులు. ఇందులో 85% వాటా గల 17 సిమెంటు కంపెనీలను పరిశీలించి ఈ నివేదికను రూపొందించారు.


తెలుగు రాష్ట్రాల్లోని కంపెనీల స్వాధీనత

దశాబ్దకాలంగా సిమెంటు పరిశ్రమ స్థిరీకరణ దశలో ఉంది. చిన్న, మధ్యస్థాయి కంపెనీలను పెద్ద కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. సిమెంటు పరిశ్రమ ఎంతో విస్తరించిన తెలుగు రాష్ట్రాల్లోని పలు కంపెనీలను, ఈ రంగంలోని అగ్రశ్రేణి సంస్థలు సొంతం చేసుకున్నాయి. పాణ్యం, ఆంధ్రా సిమెంట్స్ కంపెనీలను సాగర్ సిమెంట్స్ కొనుగోలు చేసింది. పెన్నా సిమెంట్స్‌ను అదానీ గ్రూపు సంస్థ అంబుజా సిమెంట్స్ సొంతం చేసుకుంది. ఓరియంట్ సిమెంట్‌నూ అంబుజా సిమెంట్స్ కొనుగోలు చేసింది. రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లో ఉన్న కేశోరాం ఇండస్ట్రీస్ సిమెంటు వ్యాపారాన్ని అల్ట్రాటెక్ సిమెంట్ తీసుకుంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇటువంటి కొనుగోళ్లు- విలీనాలు చోటుచేసుకున్నాయి. అల్ట్రాటెక్, అంబుజా, ఏసీసీ, జేకే సిమెంట్, ఇండియా సిమెంట్స్.. వంటి పెద్ద సంస్థలు చిన్న, మధ్య స్థాయి సిమెంటు కంపెనీలను కొనుగోలు చేస్తూ బహుముఖంగా విస్తరిస్తున్నాయి.

కొత్త యూనిట్లే అధికం

గత మూడేళ్లలో సిమెంటు కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 70 శాతాన్ని వినియోగించుకున్నాయి. అంతకు ముందు ఇది 65% దగ్గరే ఆగింది. కొత్తగా అందుబాటులోకి వచ్చే సిమెంటు ఉత్పత్తి సామర్థ్యంలో దాదాపు 65% కొత్త యూనిట్లే ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుత యూనిట్లను విస్తరించటం వల్ల లభించే అదనపు సామర్థ్యం 35% ఉంటుంది.

జోష్



సానుకూల అంతర్జాతీయ సంకేతాల మద్దతుతో వరుసగా మూడో రోజూ దేశీయ సూచీలు లాభపడ్డాయి. బిహార్ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ కూటమి విజయం సాధించనుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడం సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. ఐటీ, మన్నికైన వినిమయ వస్తువుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 12 పైసలు తగ్గి 88.62 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.84% నష్టంతో 64.61 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.4.75 లక్షల కోట్లు పెరిగి రూ.473.69 లక్షల కోట్లు (5.34 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

రాణించిన గ్రో షేరు

స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృసంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ షేరు అరంగేట్రంలో రాణించింది. ఇష్యూ ధర రూ.100తో పోలిస్తే, బీఎస్ఈలో షేరు ట్రేడింగ్ 14% లాభంతో రూ.114 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.130.94 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 19.52% లాభపడి రూ.119.52 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.73,786.83 కోట్లుగా నమోదైంది.

✦ **లాభాల్లో ప్రారంభమైన టాటా మోటార్స్ సీవీ విభాగం:** టాటా మోటార్స్ విభజన వల్ల ఏర్పడిన టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ (టీఎంసీవీ) షేర్లు శుభారంభం చేశాయి. ఎన్ఎస్ఈలో ఈ షేరు విలువగా పరిగణించిన దాని కంటే 28.48% అధికంగా రూ.335 వద్ద నమోదైంది. ఈ షేరు బీఎస్ఈలో 26.09% లాభంతో రూ.330.25 వద్ద నమోదైంది. ఇంట్రాడేలో రూ.346.75 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరకు రూ.327.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.20 లక్షల కోట్లుగా నమోదైంది.

రికార్డు కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం



ఈ ఏడాది అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠమైన 0.25 శాతంగా నమోదైంది. 2012 వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా 2014 జనవరి నుంచి ప్రస్తుత సిరీస్ రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తుండగా, ఇంత తక్కువగా నమోదు కావడం ఇప్పుడే. ఈ ఏడాది సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 1.44% కాగా, 2024 అక్టోబరులో 6.21 శాతమని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది. ఆహార ద్రవ్యోల్బణం -5.02 శాతంగా నమోదైంది. నూనెలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ధరలు, రవాణా వ్యయాలు తగ్గడం, జీఎస్టీ రేట్ల కోత వల్ల ద్రవ్యోల్బణం దిగివచ్చిందని ఎన్ఎస్ఓ వెల్లడించింది.

కోడి గుడ్లు — 13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వందకు రూపాయలలో)

హైదరాబాద్	595	తూ/ప గోదావరి	605
వరంగల్	597	విశాఖపట్నం	590
విజయవాడ	600	చిత్తూరు	633

జీసీసీల్లో 40 లక్షల ఉద్యోగాలు!



ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ కంపెనీల గ్లోబల్ కేపబులిటీ కేంద్రాల (జీసీసీ)కు కేంద్రంగా మారుతున్న భారత్‌లో 2029-30 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 28-40 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని టీమ్‌లీజ్ సంస్థ తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రతి 5 కొత్త ఉద్యోగాల్లో ఒకటి తాజా ఉత్తీర్ణులకే లభించొచ్చని తెలిపింది. ఏఐ (కృత్రిమమేధ), క్లౌడ్, డేటా ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాలు గలవారికే ఉద్యోగాలు వస్తాయని విశ్లేషించింది. ప్రస్తుతం దేశీయంగా 1,800 జీసీసీలున్నాయని.. అంతర్జాతీయంగా ఉన్న వాటిల్లో ఇవి 55 శాతానికి సమానమని పేర్కొంది. వీటిల్లో 19 లక్షల మంది వృత్తి నిపుణులు పనిచేస్తున్నారని, వీటిద్వారా 64.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.5.69 లక్షల కోట్ల) ఎగుమతి ఆదాయం లభించిందని వివరించింది.

అంతర్జాతీయ సంస్థల నియామకాలు షురూ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీసా ఆంక్షల నేపథ్యంలో, జేపీ మోర్గాన్ ఛేజ్ అండ్ కో, గోల్డ్‌మన్ శాక్స్, కేకేఆర్ అండ్ కో, మిలీనియం మేనేజ్‌మెంట్ ఎల్ఎల్‌సీ, వెల్స్ ఫార్గో వంటి సంస్థలు హైదరాబాద్, బెంగళూరు, ముంబయిల్లోని తమ కేంద్రాల్లో నిపుణుల నియామకాలు పెంచాయని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తెలిపింది. క్రెడిట్ సపోర్ట్ స్పెషలిస్టులు, రుణ వ్యవహారాలను పర్యవేక్షించే అసోసియేట్స్, పోర్టుఫోలియో నిర్వాహకులు, రిస్క్ అనలిస్టులకు ఈ సంస్థలు ఉద్యోగాలిస్తున్నాయి. జేపీ మోర్గాన్ అంతర్జాతీయ ఉద్యోగుల్లో అయిదోవంతు భారత్‌లోనే ఉన్నారు. భారత్‌లో జీసీసీలు కలిగిన 2 అమెరికా బ్యాంకుల అధికారులు కూడా, ఇక్కడ నియామకాల పెంపుకోసం ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగ ఆఫర్లు ఇచ్చిన సంస్థలు కూడా, వారికి జీసీసీల్లో ప్రత్యామ్నాయ అవకాశాలు చూపాలని యోచిస్తున్నాయి.

✦ భారత్‌లో ఒక ఉద్యోగికి ఏడాదికి 4,000-14,000 డాలర్లు (రూ.3.50-12.32 లక్షలు) చెల్లిస్తుండగా, అమెరికాలో అయితే భారతీయులకు 60,000 డాలర్లు (సుమారు రూ.53 లక్షలు), అమెరికన్లకు 1,20,000 డాలర్ల (రూ.1.06 కోట్ల)ను సంస్థలు చెల్లించాల్సి రావడమూ ఇక్కడ నియామకాలు పెంచుకునేందుకు కారణమవుతున్నాయి.

ఎగుమతుల ప్రోత్సాహానికి రూ.45,000 కోట్ల పథకాలు

కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర



దిల్లీ: అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని భారతీయ ఎగుమతిదార్లు తట్టుకునే నిమిత్తం రూ.45,000 కోట్ల విలువైన రెండు పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఎంఎస్ఎంఈలు, తొలిసారి ఎగుమతి చేసేవారు, కార్మికులు అధికంగా ఉండే రంగాల కోసం రూ.25,060 కోట్లతో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్‌కు అనుమతినిచ్చింది. ఇందులో నిర్యత్ ప్రోత్సాహన్(రూ.10,401 కోట్లు), నిర్యత్ దిశ(రూ.14,659 కోట్లు) అనే 2 ఉప పథకాలుంటాయి. రెండో పథకమైన క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ ఎక్స్‌పోర్టర్స్ (సీజీఎస్ఈ) కింద రూ.20,000 కోట్ల వరకు తాకట్టు అవసరం లేని రుణాలు ఇస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. అమెరికా టారిఫ్ ప్రభావం ఎక్కువగా పడుతున్న జౌళి, తోలు, రత్నాభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, సముద్ర ఉత్పత్తుల రంగాలకు ప్రాధాన్య మద్దతు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

కీలక ఖనిజాల ఉత్పత్తి పెంపునకు..

గ్రాఫైట్, సీసియం, రుబిడియం, జిర్కోనియం వంటి కీలక ఖనిజాల ఉత్పత్తిని దేశీయంగా పెంచేందుకు వాటి రాయల్టీ ధరలను హేతుబద్ధీకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ ఖనిజాల గనులను వేలం వేసేందుకు; లిథియం, టంగ్‌స్టన్, అరుదైన భూఅయస్కాంత ఎలిమెంట్స్, నియోబియం వంటి వాటినీ వెలికి తీసేందుకు ఉపకరించనుంది. సీసియం, గ్రాఫైట్, రుబిడియం, జిర్కోనియంపై రాయల్టీ తగ్గించడం వల్ల వీటి ఉత్పత్తి పెరిగే వీలుంది. గ్రాఫైట్‌ను విద్యుత్తు వాహనాల బ్యాటరీల్లో వినియోగిస్తున్నారు. జిర్కోనియంను అణు ఇంధనం, ఏరోస్పేస్, ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగాల్లో వాడతారు. సీసియంను హైటెక్ ఎలక్ట్రానిక్స్, అటామిక్ క్లాక్స్, జీపీఎస్ వ్యవస్థలు, క్యాన్సర్ థెరపీ పరికరాల్లో వినియోగిస్తారు. రుబిడియంను ఫైబర్ ఆప్టిక్స్, టెలికాం, చీకటిలో చూసేందుకు వాడే పరికరాల్లో వినియోగిస్తారు.

పోకర్ణ ఆదాయాల్లో క్షీణత

ఈనాడు, హైదరాబాద్: గ్రానైట్, క్వార్ట్జ్ స్టోన్ ఉత్పత్తుల సంస్థ పోకర్ణ లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.125.85 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.6.33 కోట్ల నికరలాభం నమోదు చేసింది. ఈపీఎస్ రూ.2.04 ఉంది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.253.46 కోట్లు, నికరలాభం రూ.44.95 కోట్లు, ఈపీఎస్ రూ.14.50 ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం సగానికి తగ్గింది. నికరలాభం ఇంకా తక్కువగా నమోదైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశంపై విధించిన సుంకాల వల్ల క్వార్ట్జ్ స్టోన్ ఎగుమతులు తగ్గడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

రెండో దఫా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో ఆర్డీ ఇంజినీరింగ్‌కు రూ.15 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: డిజైన్ ఇంజినీరింగ్ సేవల సంస్థ ఆర్డీ ఇంజినీరింగ్ లిమిటెడ్, రెండో దఫా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో భాగంగా డెల్టా ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎల్ఎల్‌పీ, సెంచరీ ఫ్లోర్ మిల్స్ నుంచి రూ.15 కోట్లు సమీకరించింది. షేరు రూ.425 చొప్పున, 3,53,100 ఈక్విటీ షేర్లను ఆర్డీ ఇంజినీరింగ్ ఈ సంస్థలకు కేటాయించింది. ఈ సంస్థ మొదటి దఫా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్‌లో 5 సంస్థలకు ఇదే ధరకు 4.1 లక్షల షేర్లు కేటాయించి రూ.17.43 కోట్లు సమీకరించింది.

అశోక్ లేలాండ్ లాభం రూ.820 కోట్లు

వాణిజ్య వాహన సంస్థ అశోక్ లేలాండ్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.820 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.767 కోట్లతో పోలిస్తే ఇది 7% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.11,142 కోట్ల నుంచి రూ.12,577 కోట్లకు వృద్ధి చెందింది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
సెంచరీ ప్లైబోర్డ్స్	71	40	1,386	1,184
జ్యోతి ల్యాబ్స్	87.76	104.93	736.06	733.07
హెస్టర్ బయోసైన్సెస్	14.33	8.39	70.97	83.69
పాలిమాక్ పెయింట్స్	(13.93)	(19.37)	133.81	144.74
బజాజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	141	100	1,800	1,752
ఎరిస్ లైఫ్‌సైన్సెస్	134.47	96.41	792.41	741.17
వెల్‌స్పన్ లివింగ్	14.86	202.40	2,440.91	2,873.09
పరాగ్ మిల్క్ ఫుడ్స్	45.65	29.21	1,025.98	887.61
రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	1,911.19	4,082.52	6,309.48	7,345.96
పి ఎన్ గాడ్గిల్ జువెలర్స్	79.31	34.92	2,177.62	2,001.31
శ్రీరామ్ ప్రాపర్టీస్	8.57	(0.79)	229.01	155.10
ఎంఎస్‌టీసీ	47.49	42.34	102.30	93.65
థామస్ కుక్ (ఇండియా)	70.75	71.96	2,073.84	2,003.76
ఇన్‌సెక్టిసైడ్స్	59.10	61.39	640.20	628.14
కీస్టోన్ రియల్టర్స్	9.89	65.55	520.90	556.22
బ్లూ డార్ట్	55.65	51.14	1,584.59	1,497.23

టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు ముగియలేదా?

నోయల్ కుమారుడికి వేరొక బోర్డులో లభించని స్థానం



దిల్లీ: టాటా గ్రూప్‌లో అంతర్గత పదవీ వ్యవహారాలు ఇంకా కొలిక్కి వచ్చినట్లు కనిపించడం లేదు. గతేడాది అక్టోబరులో రతన్ టాటా మృతి అనంతరం, కీలకమైన టాటా ట్రస్ట్స్ పగ్గాలు చేపట్టిన నోయల్ టాటాకు, కొందరు ట్రస్టీల మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నట్లు ఉంది. గ్రూప్‌లోని రెండు శక్తిమంత ట్రస్టుల్లో ఒకదానిలో తన కుమారుడు నెవిల్‌ను ట్రస్టీగా చేయగలిగిన నోయల్, ఇంకో ట్రస్టు బోర్డులో ఆయన్ని చేర్చలేకపోవడమే ఇందుకు నిదర్శనమంటున్నారు.

ఇదీ జరిగింది: టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్‌లో 28% వాటా కలిగిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ (ఎస్‌డీటీటీ)లో నెవిల్, భాస్కర్‌భట్ (గతంలో గ్రూప్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారీయన) ట్రస్టీలుగా నియమితులైనట్లు బుధవారం ఆ ట్రస్టు తెలిపింది. టాటా సన్స్‌లో 23.6% వాటా ఉన్న సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ)లో వీరిద్దరి నియామకం జరగలేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎస్ఆర్‌టీటీ ట్రస్టీ, వైస్ ఛైర్మన్ అయిన వేణు శ్రీనివాసన్ ఇందుకు అభ్యంతరం తెలపడమే ఇందుకు కారణమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నియామక ప్రతిపాదనలు తీసుకువచ్చిన విధానంపై శ్రీనివాసన్ అభ్యంతరం తెలిపారు. ఎస్‌డీటీటీ అజెండాలో ఈ నియామకాల అంశం ఉండగా, ఎస్ఆర్‌టీటీ సమావేశంలో చర్చించాల్సిన అంశాల జాబితాలో లేవు. అజెండాలో ఇతర అంశాల కింద వీటిని తెచ్చిఉండకూడదని ఆయన వ్యాఖ్యానించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వీటిపై సరైన చర్చ జరిగాకే పరిశీలన, ఆమోదం ఉండాలని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అంశంపై ట్రస్టులు కానీ, శ్రీనివాసన్ కానీ ఈ అంశంపై ఇంకా స్పందించలేదు. మరికొన్ని ట్రస్టులకు టాటా సన్స్‌లో 13.8% వాటా ఉంది. మొత్తం అన్ని ట్రస్టులకు కలిపి టాటా సన్స్‌లో 65.4% వాటా ఉంది.

ఏషియన్ పెయింట్స్ డివిడెండ్ 450%

ఏషియన్ పెయింట్స్, జులై- సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1,018.23 కోట్ల ఏకీకృత నికర లాభం ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.693.66 కోట్ల కంటే ఇది 46.8% అధికం. విక్రయాల ద్వారా ఆదాయం రూ.8,003.02 కోట్ల నుంచి 6.38% పెరిగి రూ.8,513.70 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 4% అధికమై రూ.7,376.69 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ డెకరేటివ్ వ్యాపార అమ్మకాల్లో 10.9% పెరుగుదల ఉండగా. . ఆదాయం 6% పెరిగింది. హోమ్ డెకార్ వ్యాపారంలో బాత్ ఫిట్టింగ్ వ్యాపార విక్రయాలు 4.7% తగ్గి రూ.79.3 కోట్లకు, కిచెన్ వ్యాపార ఆదాయం 7.2% తగ్గి రూ.97.70 కోట్లకు పరిమితమయ్యాయి. స్టాండలోన్ (దేశీయ వ్యాపారం) పద్ధతిలో కంపెనీ ఆదాయం 5.75% పెరిగి రూ.7,335.85 కోట్లకు చేరింది. అంతర్జాతీయ విక్రయాలు 9.9% అధికమై రూ.846 కోట్లుగా నమోదయ్యాయి. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.4.50 (450%)ను మధ్యంతర డివిడెండుగా చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

మహారాష్ట్రలో 56.9 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు

ప్రారంభించిన బొండాడా ఇంజినీరింగ్

ఈనాడు, హైదరాబాద్: సౌర విద్యుత్, టెలికాం, రైల్వే విభాగాల్లో మౌలిక వసతులు కల్పించే బొండాడా ఇంజినీరింగ్.. మహారాష్ట్రలోని హింగోలి, ధులే, సంభాజీనగర్, జుల్గావ్ ప్రాంతాల్లోని పారడైమ్ ఐటీ, మహాజెన్కో కోసం 56.9 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపింది. వర్షాకాల ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసినట్లు బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో సంస్థ పేర్కొంది. దీంతో 1 గిగావాట్ మైలురాయిని దాటినట్లు బొండాడా గ్రూపు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బొండాడా రాఘవేంద్ర రావు తెలిపారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అందించేందుకు సాంకేతికంగా, అధునాతన విధానాలతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో మొత్తం రూ.1,216 కోట్ల ఆదాయంపై రూ.92.56 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.5,989 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని తెలిపారు.

చమురుకు భారతే చుక్కాని

- ఇంధన గిరాకీలో వేగవంత వృద్ధి
- 2035 వరకు ఏటా సగటున 3% పెరగొచ్చు
- ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ తాజా నివేదిక



ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగ దేశమైన భారత్.. వచ్చే దశాబ్దంలో చమురు గిరాకీ వృద్ధికి సరికొత్త చోదకంగా మారనుంది. వర్ధమాన దేశాల్లో, భారత్‌లోనే ఇంధనానికి వేగవంత వృద్ధి కనిపించనుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) అంచనా వేసింది. 2035 వరకు ఏటా 3% చొప్పున వృద్ధి నమోదు కావొచ్చని 'గ్లోబల్ ఎనర్జీ అవుట్‌లుక్'లో పేర్కొంది. ఆ నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

భారత్‌లో నమోదవుతున్న వేగవంత ఆర్థిక వృద్ధి, పారిశ్రామికీకరణకు తోడు వాహనాల విక్రయాలు పెరగడం వల్ల 2035 వరకు అంతర్జాతీయ చమురు వినియోగంలో అధిక వాటా కలిగి ఉండొచ్చు. చైనా, ఆగ్నేయాసియా కలిపినా కూడా భారత ఇంధన గిరాకీయే ఎక్కువగా ఉండనుంది.

2050 వరకూ చమురుదే రాజ్యం..

ప్రస్తుత విధానాలను బట్టి చూస్తే ఇంధనాల్లో 2050 వరకు చమురుదే రాజ్యం. గత పదేళ్లలో చమురు గిరాకీలో 75 శాతానికి పైగా వాటా చైనాదే. ఈ పరిస్థితి మారి, చమురు వృద్ధి చోదకంగా భారత్ మారనుంది. 2024లో రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల (ఎంబీపీడీ)గా ఉన్న చమురు వినియోగం 2035 కల్లా 8 ఎంబీపీడీకి పెరగొచ్చు. కార్ల కొనుగోళ్లలో భారీ వృద్ధి; రసాయనాలు, ప్లాస్టిక్స్, విమాన ఇంధనానికి గిరాకీ పెరుగుదల; వంట గ్యాస్ వినియోగం పెరగడం వంటివన్నీ ఇందుకు దోహదం చేయొచ్చు.

✦ భారత్‌లో చమురు గిరాకీ 2035 కల్లా 2 ఎంబీపీడీ మేర పెరగనుంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఈ ధోరణి 2050 వరకు కొనసాగొచ్చు. ఆఫ్రికా (1.2 ఎంబీపీడీ), ఆగ్నేయాసియా (1 ఎంబీపీడీ) తర్వాతి స్థానాల్లో ఉంటాయి. భారత్‌లో చమురు ఉత్పత్తి పరిమితంగా ఉన్నందున, దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత చమురు అవసరాల్లో దిగుమతుల వాటా 2024లో 87% అయితే, 2035లో ఇది 92 శాతానికి చేరొచ్చు.

✦ భారత్‌లో సహజ వాయువు గిరాకీ 2035 కల్లా రెట్టింపై 140 బిలియన్ ఘనపు మీటర్లకు చేరొచ్చు.

✦ సౌర, పవన ఇంధన వనరులు 2050 కల్లా మొత్తం ఇంధన మిశ్రమంలో 20% వాటా పొందే అవకాశం ఉంది.

✦ పునరుత్పాదక ఇంధన స్థాపిత (ఇన్‌స్టాల్డ్) సామర్థ్యం వాటా 2030 కల్లా 60 శాతానికి, 2035 కల్లా 70 శాతానికి చేరొచ్చు.

సెబీ ఛైర్మన్ అయినా.. ఆస్తులు చెప్పాల్సిందే

సంస్కరణలను ప్రతిపాదించిన ప్యానెల్

దిల్లీ: సెబీ ఉన్నతాధికారులకు సంబంధించి, పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో మరింత పారదర్శకత తీసుకురానున్నారు. ఇందు కోసం విస్తృత స్థాయి సంస్కరణలను సెబీ ప్యానెల్ ప్రతిపాదించి, తమ నివేదికను సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండేకు అందజేసింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో భద్రమైన, ప్రజావేగు వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఖరీదైన బహుమతులపై నిషేధం, పదవీ విరమణ తర్వాత ఇతర అసైన్‌మెంట్‌లు స్వీకరించకుండా రెండేళ్ల పాటు ఆంక్షలు, చీఫ్ ఎథిక్స్ అండ్ కాంప్లయెన్స్ ఆఫీసర్(సీఈసీఓ) పదవి సృష్టించడం వంటివీ అందులో ఉన్నాయి. సెబీ ఛైర్మన్, పూర్తికాల సభ్యులు, చీఫ్ జనరల్ మేనేజర్ ర్యాంకు అధికారులు తమ ఆస్తుల వివరాలను బహిరంగ పరచాలి.

ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యం

ఇప్పటికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి

- సీఐఐ భాగస్వామ్య సదస్సులో మరో 120 బిలియన్ డాలర్లకు ఎంఓయూలు
- 7.50 లక్షల ఉద్యోగాల కల్పన
- దిల్లీలో మంత్రి లోకేశ్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: 'రాష్ట్రంలో నమో (నాయుడు, మోదీ) ప్రభుత్వం నడుస్తోంది. అందుకే దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఆహ్వానిస్తున్నాం. చంద్రబాబుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్, ప్రధానమంత్రి మోదీ సహకారంతో రాష్ట్రంలో నడుస్తున్న డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ లాంటి ప్రభుత్వం వల్ల, వారాలు చూసుకోకుండా వేగంగా తీసుకుంటున్న చర్యలను చూసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి కొరుతున్నారు. ఈ మూడింటి వల్లే ఇప్పటివరకూ రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో మరో 120 బిలియన్ డాలర్ల విలువైన 410 ఎంఓయూలు కుదుర్చుకోబోతున్నాం. అవన్నీ రానున్న 12 నెలల్లో క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా కార్యాచరణ కూడా రూపొందించాం. వీటిద్వారా 7.50 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. రాష్ట్రానికి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు. దాన్ని సాకారం చేసేందుకు ప్రపంచంలో ఏ అవకాశం ఉన్నా వదిలిపెట్టకుండా ప్రయత్నిస్తున్నాం' అని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఆ వివరాలు వెల్లడించేందుకు ఆయన బుధవారం ఏపీ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సదస్సుకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్, పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితోపాటు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 58 మంది దౌత్యవేత్తలు, 13 మంది రాయబారులు, హైకమిషనర్లు, మిషన్ డిప్యూటీ హెడ్స్ నలుగురు, కౌన్సిలర్ జనరళ్లు ఐదుగురు హాజరవుతారని చెప్పారు. జీ-20 దేశాల ప్రతినిధులు ఇందులో భాగస్వాములవుతారని తెలిపారు. ఒక ప్లీనరీతోపాటు మొత్తం 45 సెషన్లు ఉంటాయని, అందులో 11 సెషన్లు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉంటాయన్నారు.

> రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించడానికి ప్రధాన కారణం.. రోడ్డుపక్కన బజ్జీలు వేసుకొని జీవనం సాగించే మోహన అనే మహిళ చదువుకున్న తన ఇద్దరు పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని నా పాదయాత్ర సందర్భంగా చేసిన విజ్ఞప్తి. ఇప్పటివరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల ఉద్యోగాలు కల్పించాం'


ఉద్యోగాల కల్పన యువతకు చేసిన ప్రమాణం: 'ఉద్యోగాల కల్పన అనేది కేవలం లక్ష్యం కాదు.. రాష్ట్ర యువతకు చేసిన ప్రమాణం. అందుకే మేం ప్రతి నాన్ని ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రూపొందిస్తున్నాం. గత 16 నెలల్లో మాకు 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. నేరుగా ప్రాజెక్టులను కార్యరూపంలోకి తెచ్చేలా కార్యాచరణను అమలుచేస్తున్నాం. ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ ప్యాక్టరీ, దేశ చరిత్రలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి పెట్టబోతున్న గూగుల్ డేటాసెంటర్ అందుకు ప్రధాన ఉదాహరణలు. వీటితోపాటు దేశంలో టాప్ 10 సౌరవిద్యుత్ పరికరాల తయారీ సంస్థల్లో 5 సంస్థలు రాయలసీమలో ప్లాంట్లను ఏర్పాటు చేయబో తున్నాయి. రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ, రూ.1.5 లక్షల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మేం వీటిని పెట్టుబడులుగా కాకుండా ఉద్యోగ కల్పన కేంద్రాలుగా చూస్తున్నాం' అని లోకేశ్ తెలిపారు.

నేడు విశాఖ ఎకనామిక్ కారిడార్ డీపీఆర్ విడుదల: 'విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ డీపీఆర్‌ను గురువారం విడుదలచేస్తున్నాం. అందులో చాలా విషయాలుంటాయి. దానికోసం ఒక ఎస్‌పీవీని ఏర్పాటుచేసి వనరులను సమీకరిస్తాం. ఒకవైపు పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూనే, వాటికి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడానికి సంస్కరణలనూ తీసుకొస్తున్నాం. థాయ్‌లాండ్‌లో వారం రోజుల్లో భూములు కేటాయిస్తుంటే మేం ఆరు రోజుల్లోనే కేటాయించేలా వేగంగా పనిచేస్తున్నాం. మా దగ్గర అవసరమైనంత ల్యాండ్ బ్యాంక్ ఉంది కాబట్టి భూమి సమస్య ఉత్పన్నం కాదు' అని లోకేశ్ చెప్పారు.

ప్రభుత్వం మారితే ఎలా అన్న ప్రశ్న తలెత్తడం లేదు: 'మేం అధికారం చేపట్టిన తొలి ఆరునెలల వరకు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే ఎలా అని అడిగేవారు. ఆ తర్వాత మా పనితీరు చూసి ఆ ప్రశ్న ఆగిపోయింది. మేం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కాల, రాజకీయ పరీక్షకు తట్టుకొని నిలబడతాయి. ఏ ప్రాజెక్టు అయినా నిరంతరం కొనసాగే విధంగా బలమైన విధానాలు రూపొందించాం. ఇప్పుడు మేం ఏం చేసినా చట్టానికి లోబడే చేస్తున్నాం. అందువల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ఎలాంటి ఢోకా ఉండదు' అని లోకేశ్ స్పష్టం చేశారు.



సీఐఐ భాగస్వామ్య సదస్సుపై దిల్లీలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ బైరెడ్డి శబరి, సీఐఐ ఏపీ ఛైర్మన్ జి.మురళీకృష్ణ



మంత్రి లోకేశ్‌తో సంభాషిస్తున్న అడోబి సిస్టమ్స్ సీఈఓ శంతను నారాయణ్

మీరు ఇక్కడికి వచ్చినారు.. చాలా ధన్యవాదాలు

మంత్రి లోకేశ్‌తో తెలుగులో శంతను నారాయణ్ సంభాషణ

ఈనాడు, దిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత అడోబి సిస్టమ్స్ సంస్థ ఛైర్ అండ్ సీఈఓ శంతను నారాయణ్ మంత్రి నారా లోకేశ్‌ను తెలుగులో ఆప్యాయంగా పలకరించారు. బుధవారం దిల్లీలో జరిగిన 'యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం' కార్యక్రమంలో సంధానకర్తగా పాల్గొన్న ఆయన మంత్రి లోకేశ్‌తో తెలుగులో సంభాషణ మొదలుపెడుతూ 'మీరు ఇక్కడికి వచ్చినారు... చాలా ధన్యవాదాలు. నేను కూడా హైదరాబాద్‌లో పెరిగినందున నా తెలుగునూ కొంత చూపాలనుకుంటున్నా' అని పేర్కొన్నారు. లోకేశ్‌కు, తనకూ మధ్య చాలా సారూప్యతలు ఉన్నట్లు చెప్పారు. తమ ఇద్దరికీ హైదరాబాద్‌తో పాటు, అమెరికాలోని బే ఏరియాలో గడిపిన అనుభవం ఉందన్నారు. 'నేను 40 ఏళ్ల క్రితం అమెరికాకు వెళ్లినప్పుడు హైదరాబాద్, సికింద్రాబాద్‌లు మాత్రమే ఉండేవి. నేను అమెరికాకు వెళ్లిన తొలినాళ్లలో మ్యాప్‌లో హైదరాబాద్ భారత్‌లో ఎక్కడుందన్నది ఎవరికీ పెద్దగా తెలియదు. చంద్రబాబు విజన్ కారణంగా హైదరాబాద్ ప్రపంచ పటంలో చోటు సంపాదించుకొంది. ఇప్పుడు దాన్ని మరిపించేలా మీరు ఆంధ్రప్రదేశ్, అమరావతిలో చేస్తున్నట్లు విన్నాను' అని అంటూ రాష్ట్ర అభివృద్ధి గురించి ఆరాతీశారు. అందుకు లోకేశ్ బదులిస్తూ వ్యాపారంలో జీవితకాలంలో చేయలేని పనిని రాజకీయాల్లో ఐదేళ్లలో చేస్తున్నామని, ఇదే విషయాన్ని తాను తన సతీమణికి చెప్పానన్నారు. ఏఐని ఉపయోగించి పరిశ్రమల ఏర్పాటుకు తాము వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన దరఖాస్తులను కూడా తాము ఏఐ ద్వారా విశ్లేషించి ఉత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంబంధాలను సానుకూలంగా మలుచుకుంటున్నట్లు చెప్పారు. వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి నిరంతరం మానిటరింగ్ చేస్తూ పెట్టుబడులను సాకారం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ తరహాలో ఏపీలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. చంద్రబాబు దార్శనికత కారణంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్‌గా మారుతోందన్నారు. ప్రస్తుతం తాము ప్రపంచస్థాయి పెట్టుబడులతో చరిత్ర సృష్టించబోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత అవకాశాలను ఎవరూ వదిలిపెట్టుకోవద్దని, చరిత్రలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

స్కిల్ అంతరాల భర్తీకే నైపుణ్య గణన

సీఐఐ- విట్ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్

ఈనాడు- అమరావతి; న్యూస్‌టుడే- తుళ్లూరు: 'భారతదేశ ఆర్థిక వ్యవస్థ త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. దీన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ విజన్. ఆ లక్ష్యాన్ని వేగంగా చేరుకోవడానికి ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టాలి. అందుకు నిపుణుల కృషి చేయాలి' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సీఐఐ సదరన్ రీజియన్- విట్ ఏపీ సంయుక్తంగా అమరావతిలో నిర్వహించిన హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్- 2025లో లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఉన్నత విద్యను పునఃరూపకల్పన చేయడం అనే థీమ్‌తో కాంక్లేవ్ ఏర్పాటు చేశారు. త్వరలోనే ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం. 30 ట్రిలియన్ డాలర్ ఎకానమీని ఎలా చేరుకోవాలన్నదే మన ముందున్న ప్రశ్న. మానవ వనరులు, మేధోసంపత్తి లేకుండా ఆర్థికవృద్ధి సాధ్యం కాదు. ఈ మహోన్నత లక్ష్య చేరుకునేందుకు ఉన్నత విద్యారంగం వ్యూహాత్మక మూలస్తంభం' అని స్పష్టం చేశారు. 'ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం వల్ల భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. అమరావతిలో రాబోయే మూడేళ్లలో అద్భుతాలను చూడబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ నెక్ట్స్ జనరేషన్ జాబ్స్, స్టార్టప్‌లకు సిద్ధంగా ఉంది. డేటా సెంటర్లు, క్వాంటమ్, ఇన్నోవేషన్స్‌లో ఏపీ ముందు వరుసలో ఉంది' అని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాల్లోని అంతరాల భర్తీకే సెన్సస్ చేపట్టాం. ప్రతి పౌరుడి నైపుణ్యాన్ని అంచనా వేసి, లోటుపాట్లను గుర్తిస్తాం. యువతకు నైపుణ్య శిక్షణ అందించి పరిశ్రమ అవసరాల మేరకు వారిని తయారు చేస్తాం' అని లోకేశ్ చెప్పారు. కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ అశ్విన్ మహాలింగం, విట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం, ఫస్ట్ జెన్ ఫౌండర్ అండ్ సీఈఓ ఫిలిప్ ఆస్మస్, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె.రత్నషీలామణి, సీఐఐ ఏపీ వైస్ ఛైర్మన్ శరణం నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



సీఐఐ- విట్ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు, విద్యార్థులు

బీపీఎస్ వచ్చేసింది!

- 2025 ఆగస్టు 31లోపు అనధికార నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోవచ్చు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోవడానికి ఎదురు చూస్తున్న వారందరికీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2025 ఆగస్టు 31లోపు నిర్మించిన ఇళ్లు, భవనాలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)లో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. 4 నెలల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బుధవారం జారీ చేసిన మార్గదర్శకాల్లో సూచించింది. క్రమబద్ధీకరణకు కేటగిరీల వారీగా పీనలైజేషన్ ఫీజులు ఖరారు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆయా స్థలాల ధరల ఆధారంగా రుసుములు లెక్కిస్తారు. రాజధాని అమరావతిలో కోర్ క్యాపిటల్ ప్రాంతానికి ఈ పథకం వర్తించబోదని ప్రభుత్వం పేర్కొంది. రాజధానిలోని మిగతా ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాభివృద్ధి సంస్థలు, పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో బీపీఎస్ వర్తించనుంది. పథకం ద్వారా 59,041 అనధికార నిర్మాణాలు క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ప్రజలు కలగనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

దరఖాస్తు చేసుకోవాలిలా....: 2025 నవంబరు 12 (ప్రకటన వెలువడిన తేదీ) నుంచి 120 రోజుల్లోగా www.bps.ap.gov.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లైసెన్స్ కలిగిన టెక్నికల్ పర్సన్ల (ఎల్‌టీపీ) ద్వారా ప్రాసెస్ చేయించాలి.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

విశాఖలో మరో డేటా సెంటర్

- రూ.15 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్
- మంత్రి లోకేశ్ సమక్షంలో దిల్లీలో ఒప్పందం



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపుతున్న టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ కో-ప్రెసిడెంట్ సచిత్ అహూజా, ఏపీ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌లు. చిత్రంలో అడోబ్ సిస్టమ్స్ ఛైర్మన్, సీఈఓ శంతను నారాయణ్, యూఎస్ఐఎస్‌పీఎఫ్ ప్రెసిడెంట్, సీఈఓ ముఖేష్ అఘి

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నంలో రూ.15 వేల కోట్లతో 300 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి బుధవారం దిల్లీలోని అమెరికా-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య వేదికపై రాష్ట్ర మంత్రి లోకేశ్, జేసీ-2 వెంచర్స్ వ్యవస్థాపకులు, సీఈఓ, యూఎస్ ఐఎస్‌పీఎఫ్ ఛైర్మన్ జాన్ ఛాంబర్స్, అడోబి సిస్టమ్స్ సీఈఓ, ఛైర్మన్ శంతను నారాయణ్, గూగుల్ చీఫ్ టెక్నాలజిస్టు ప్రభాకర్ రాఘవన్, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, టిల్‌మన్ గ్లోబల్ హోల్డింగ్స్ సహ అధ్యక్షుడు సచిత్ అహూజాల సమక్షంలో ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి, టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థలు పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

40 ఎకరాల విస్తీర్ణంలో..: 40 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు ద్వారా 2028 నాటికి ప్రత్యక్షంగా 200-300, పరోక్షంగా 800-1,000 ఉద్యోగాలు లభిస్తాయి. టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, ప్రణాళిక, డిజైన్, డేటాసెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన ముఖ్యమైన ఎక్విప్‌మెంట్‌ను తీసుకొస్తుంది. నిబంధనలు అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం.. సంస్థకు భూకేటాయింపులు, ప్రోత్సాహకాలు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తుంది. టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సహ అధ్యక్షుడు సచిత్ అహూజా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు తీర ప్రాంత అనుసంధానం, వేగంగా విస్తరించే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, వేగవంతమైన పరిపాలన అందిస్తోందన్నారు. దీర్ఘకాలం పాటు డిజిటల్ మౌలిక వసతులు సమకూర్చే ప్రపంచస్థాయి డేటాసెంటర్ ఏర్పాటు ద్వారా తాము అత్యంత నాణ్యమైన ఉద్యోగాలు సృష్టించబోతున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టును నిర్దిష్ట గడువులోగా ఆచరణలో పెడతామని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి దోహదం

-మంత్రి లోకేశ్

మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. విశాఖపట్నంను ప్రపంచస్థాయి డేటాసెంటర్‌గా తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకొనేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. దీనివల్ల మన డిజిటల్ వెన్నెముక బలపడటంతో పాటు యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. దీనివల్ల ఇంధనం, నెట్‌వర్క్, క్లౌడ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు వస్తాయని తెలిపారు. టిల్‌మాన్ హోల్డింగ్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ మౌలిక వసతుల కల్పనలో పేరు పొందిందని చెప్పారు. తన అనుబంధ సంస్థలకు మూలధనపరంగా మద్దతు ఇవ్వడానికి 12 బిలియన్ డాలర్ల మేర వనరులు సమీకరించిందని లోకేశ్ వెల్లడించారు.

సీఐఐ సదస్సుకు ముందే.. విశాఖలో పెట్టుబడుల జాతర

నేడు ఆరు కంపెనీలకు భూమిపూజ చేయనున్న లోకేశ్

ఈనాడు, అమరావతి: సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందే విశాఖపట్నంలో పెట్టుబడుల జాతర మొదలుకానుంది. ఐటీ సహా పలు కంపెనీలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం భూమిపూజ చేయనున్నారు. వీటిలో ఐటీ సంస్థలైన సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో పాటు, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్టు, వరల్డ్ ట్రేడ్ సెంటర్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలున్నాయి. వీటి ద్వారా రూ.వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వందల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

డిజిటల్ ఏపీ లక్ష్య సాధన దిశగా.. : డిజిటల్ ఏపీ, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. విశాఖలోని ఐటీ హిల్ నం.3లో అడ్వాన్స్ సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ అండ్ ఏఐ ఎక్సలెన్స్ సెంటర్‌ను నెలకొల్పుతోంది. దీని ద్వారా 300 మందికి పైగా ఐటీ నిపుణులకు ఉపాధి లభిస్తుంది. ఈ సంస్థ దేశంలో క్లౌడ్ డెలివరీ కేంద్రాలు, ఆర్ అండ్‌డీ హబ్‌లను నిర్వహిస్తోంది.

ఏఐ సొల్యూషన్స్‌పై దృష్టి..: ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ విశాఖలో ఐటీ హిల్ నం.2లో ఆర్ అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఏఐ, ఆటోమేషన్-ఎనేబుల్డ్ బీపీవో/కేపీవో సామర్థ్యాలతో హెల్త్‌కేర్ ఐటీఈఎస్ సేవల డెలివరీ, ఏజెంట్ ఏఐ, ఏఐ సొల్యూషన్స్‌పై దృష్టి సారించనుంది. 60 మిలియన్ డాలర్ల వార్షికాదాయం ఉన్న ఈ సంస్థకు మన దేశంలో 1,200, అమెరికాలో 300 మంది సిబ్బంది ఉన్నారు.

రాబోయే ఐదేళ్లలో 2 వేల మందికి ఉద్యోగాలు: టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ద్వారా రాబోయే ఐదేళ్లలో రెండు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. విశాఖ యూనిట్ ద్వారా లో-కోడ్, ఏఐ టెక్నాలజీపై సంస్థ దృష్టిపెట్టనుంది. భారత్ సహా అమెరికా, బ్రిటన్, యూఏఈల్లో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది

ఏఐ పరిశోధనలపై దృష్టి : ఫినోమ్ ప్రీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తొలి విడతలో రూ.20 కోట్లు, రెండో విడతలో రూ.185 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. సుమారు 2,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

ఆతిథ్యరంగం, మాల్స్ సెగ్మెంట్‌లో కీలకపాత్ర: దేశవ్యాప్తంగా కమర్షియల్, ఆఫీస్‌స్పేస్, రెసిడెన్షియల్, హాస్పిటాలిటీ, మాల్స్ సెగ్మెంట్‌లో రహేజా ఐటీ స్పేస్ అండ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు సేవలందిస్తోంది. విశాఖలోని మధురవాడ ఐటీ హిల్-3లో సంస్థ కార్యాలయం ఏర్పాటు చేయనుంది. విశాఖకు పెద్ద ఎత్తున ఐటీ సహా వివిధ కంపెనీలు, డేటా సెంటర్లు వస్తున్న నేపథ్యంలో వాటికి కావాల్సిన ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ లగ్జరీ ప్లాట్లను రహేజా నిర్మిస్తోంది. తొలి విడతగా రూ.2,172 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

అభివృద్ధికి దోహదపడే సంస్థలకు మద్దతు : ప్రాంతీయ, జాతీయ స్థాయి అభివృద్ధికి దోహదపడే సంస్థలకు వరల్డ్ ట్రేడ్ సెంటర్ మద్దతునివ్వనుంది. ఎండాడలో కపిల్ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

తప్పు చేశాను మన్నించండి

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు ఈ ప్రాంత ప్రజలు నాపై అంతులేని ప్రేమ చూపించారు. అలాంటిది గత సంవత్సరం జూన్, జులైల్లో నాపై సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ జరిగింది. అప్పటివరకు హీరోగా ఉన్న నేను విలన్ అయిపోయాను. అది నన్ను తీవ్ర మానసిక వేదనకు గురిచేసి.. గత ఏడాది జులైలో వీఆర్ఎస్ తీసుకున్నాను. నేను ఏం తప్పు చేశాను? అని ఏడాదిగా ఆత్మశోధన చేసుకున్నాను. ఈ ప్రాంత ప్రజల అంచనాలను నేను అందుకోలేకపోయానని, వారి పరీక్షలో విఫలమవడం వల్లే ఇంత అవమానం జరిగిందని గుర్తించాను" అని పేర్కొన్నారు.

నేను చేసిన తప్పేమిటంటే..: "2020లో సాధారణ పరిపాలన శాఖలో ముఖ్యకార్యదర్శిగా ఉండగా.. అదనపు డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు, అభియోగాల నమోదు దస్త్రం డీజీపీ ఆఫీసు నుంచి వచ్చింది. ఏబీ నా కంటే ఐదేళ్ల సీనియర్. అలాంటి అధికారిపై చర్యలకు సంబంధించిన ఫైల్‌పై నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు కొంత నెర్వస్ అయ్యాను. అప్పుడు సివిల్ సర్వీసెస్ నిబంధనల దృష్టి కోణం లోంచి చూసి ఆ ఫైల్‌కి ఆమోదం తెలిపాను. కృష్ణకిశోర్ విషయంలోనూ అదే జరిగింది. అది ముమ్మాటికీ నేను చేసిన తప్పే. నీతి, నైతిక విలువల కోణంలోంచి చూసి ఉంటే.. ఆ తప్పు చేసేవాడిని కాదు" అని స్పష్టం చేశారు.

నిబంధనల కోణంలో మాత్రమే చూశాను: "సర్వీసు నిబంధనలు చాలా ఉంటాయి. కానీ ఆచరణలో ప్రతి ఒక్కటీ తు.చ. తప్పకుండా పాటించలేం. అలా అనుసరించకపోవడం చట్ట ప్రకారం చూస్తే తప్పే. కానీ నైతికంగా తప్పు కాదు. అధికారులు సొంత పనుల కోసం ప్రభుత్వ వాహనం వినియోగించకూడదని, ఒకవేళ వినియోగించాల్సి వస్తే ఆ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి, ఖజానాకు డబ్బు కట్టాలని నిబంధన ఉంటుంది. ప్రస్తుతం అధికారులు ఎక్కడున్నా ప్రభుత్వానికి నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. వ్యక్తిగత, వృత్తి జీవితం మధ్య అంతరం తొలగిపోయింది. కాబట్టి ప్రభుత్వ వాహనాన్ని సొంత అవసరాలకు వాడుకోవడాన్ని తప్పుగా భావించడం లేదు. నేను 30 ఏళ్ల సర్వీసులో నా వ్యక్తిగత అవసరాల కోసం నెలకు సగటున 300 కిలోమీటర్ల చొప్పున... లక్ష కిలోమీటర్లు ప్రభుత్వ వాహనంలో తిరిగి ఉంటాను. దానికి ఇప్పుడు నన్ను జరిమానాతో కలిపి రూ.30-40 లక్షలు కట్టాలని ప్రభుత్వం ఆదేశించవచ్చు. నేను కోర్టుకు వెళ్లినా ప్రభుత్వాన్నే సమర్థిస్తుంది. ఏబీ వెంకటేశ్వరరావు, కృష్ణకిశోర్‌లపై చర్యలు తీసుకోవచ్చునని నేను ఫైల్‌లో రాయడం కూడా అలాంటిదే. నిబంధనల కోణంలోనే చూసి... వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చునని ఫైల్‌లో రాశాను. అది తప్పే" అని పేర్కొన్నారు.

ఏబీ స్థానంలో నేనుంటే.. అని ఆలోచించాల్సింది: 'అప్పట్లో నేను రాష్ట్రంలోని సీనియర్ అధికారుల్లో ర్యాంక్ పరంగా మొదటి 50 స్థానాల్లో ఉన్నాను. ఒక ఫైల్‌ని చట్ట ప్రకారం చూడడానికి కిందిస్థాయి అధికారులు ఉన్నారు. ఒక సీనియర్ అధికారిగా నేను చూడాల్సింది నీతి, నైతికత కోణంలో! ఏబీ వెంకటేశ్వరరావు స్థానంలో నేనుంటే, నాపై మరో ముఖ్యకార్యదర్శి అలాంటి అభియోగాలను నమోదు చేస్తే నేను ఎలా భావించేవాడినని ఆలోచించాల్సింది. ఆయన స్థానంలో నేనుంటే కచ్చితంగా నాకు అన్యాయం జరిగిందనే భావించేవాడిని. అప్పట్లో నేను ఆయన స్థానంలో ఉండి ఆలోచిస్తే... ఆ ఫైల్‌ను తిరస్కరించేవాడిని" అని పేర్కొన్నారు. "ఐఏఎస్ నా జీవితంలో ఒక భాగమే. నా కెరీర్ 2.0లోనైనా ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు నీతి, నైతికత కోణంలో చూడాలన్న గుణపాఠం నేర్చుకున్నాను. నేను కమిషనర్‌గా, కలెక్టర్‌గా వివిధ హోదాల్లో పనిచేసినప్పుడు నా కింది ఉద్యోగులు ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే వారికీ క్షమాపణ చెబుతున్నాను' అని ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు.

దేశంలోనే అతిపెద్ద హరిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించనున్న 'సుజలాన్'

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: దేశంలోనే అతిపెద్ద హరిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని పవన విద్యుత్తు టర్బైన్ తయారీ సంస్థ సుజలాన్ రాష్ట్రంలో నిర్వహించనుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే నాలుగేళ్లలో 12వేల మంది యువతకు బ్లేడ్ టెక్నాలజీ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రో-మెకానికల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనుందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని కూడేరు వద్ద సుజలాన్ ఏర్పాటుచేయనున్న భారీ రోటరీ బ్లేడ్ తయారీ యూనిట్ ద్వారా మేడిన్ ఆంధ్రా ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లభించనుందని ఎక్స్ వేదికగా బుధవారం వెల్లడించారు. "ఇదికాక టాటా పవర్‌తో కలిసి సుజలాన్ రాష్ట్రంలో రూ.6వేల కోట్ల పెట్టుబడితో 700 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టును నిర్మించనుంది. 2019 తర్వాత రాష్ట్రంలో ప్రారంభమవుతున్న తొలి పవన విద్యుత్తు ప్రాజెక్టు ఇది. ఇప్పటికే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న పవన విద్యుత్తులో సుజలాన్ ప్రధాన భాగస్వామిగా ఉంది. ఈ సంస్థ పెట్టుబడులు పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపనున్నాయి' అని నారా లోకేశ్ వివరించారు.

విశాఖలో 'ఏపీ రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్'పై సదస్సు

ఈనాడు, అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్‌పై సదస్సు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ కీలకాంశాలపై చర్చలు చేపట్టి, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రానికి కొత్త రూపం ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొంటారు.


తితిదేకు త్వరలో ఏఐ చాట్‌బాట్

- 13 భాషల్లో సేవలందించేలా అడుగులు
- అమెజాన్ సంస్థ టెండర్‌కు ఆమోదం

తిరుమల, న్యూస్‌టుడే: భక్తులకు మెరుగైన సేవలు అందించడంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్ సేవలు సైతం ప్రవేశపెట్టేందుకు ఇటీవల తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. అందులోభాగంగా అత్యుత్తమ చాట్‌బాట్ సేవలు అందించే సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించగా.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్ క్లౌడ్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. వీటిలో ఏడబ్ల్యూఎస్ సంస్థ ఏడాదికి రూ.50 లక్షలకే సేవలు అందించేందుకు ముందుకు రావడంతో సదరు టెండర్‌ను తితిదే ఆమోదించింది. త్వరలోనే భక్తులకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో శ్రీవారి దర్శనం, సేవలు, వసతిగదులు, విరాళాలు ఇతర ముఖ్యమైన సమాచారాన్ని భక్తులు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఫిర్యాదులు, అభిప్రాయాలనూ పంపవచ్చు. దాదాపు 13 భారతీయ భాషల్లో చాట్‌బాట్ సిద్ధమవుతోంది. స్పీచ్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్ సదుపాయాన్ని అందిస్తారు. ఈ మేరకు టీసీఎస్ సంస్థ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోందని తితిదే డిప్యూటీ ఐటీ జీఎం వెంకటేశ్వరనాయుడు తెలిపారు.

ఆరుగురు శాస్త్రవేత్తలకు ఇన్ఫోసిస్ పురస్కారాలు

ఈనాడు, బెంగళూరు: వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు శాస్త్రవేత్తలకు ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) అవార్డులు ప్రకటించింది. బెంగళూరులోని ఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఫౌండేషన్ వ్యవస్థాపక మండలి అధ్యక్షుడు కె.దినేశ్, సభ్యులు నారాయణమూర్తి, శ్రీనాథ్ బాట్ని తదితరులు బుధవారం ఈ అవార్డు గ్రహీతలు, వారు చేసిన పరిశోధనల వివరాలు వెల్లడించారు. ఆర్థికశాస్త్రం విభాగంలో నిఖిల్ అగర్వాల్, ఇంజినీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో సుశాంత్ సచ్‌దేవ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో ఆంద్రూ ఆలెట్, లైఫ్‌సైన్స్ విభాగంలో అంజన బద్రీనారాయణన్, గణితశాస్త్రంలో సబ్యసాచి ముఖర్జీ, భౌతికశాస్త్రంలో కార్తీష్ మంథిరమ్‌లు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. విజేతకు లక్ష డాలర్లు (రూ.88,57,000), ఒక స్వర్ణ పతకాన్ని బహుమతిగా అందజేస్తారు. పరిశోధనలు చేపట్టే యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడానికి ఈ అవార్డులను ఇస్తున్నట్లు కె.దినేశ్ తెలిపారు.



నాలోని భావాలు, ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వడమంటే భలే ఇష్టం..
రాసేసాను.. వాట్ నెక్ట్స్?
దాన్ని ఎక్కడ పోస్ట్ చేయాలి?
ఏ టాపిక్ మీద రాయాలో అర్థంకావట్లేదే!
ఒక్క ఆలోచన వస్తే బాగుండు!
ఇలా ఆలోచించే వాళ్ల కోసం చాలా యాప్స్ అందుబాటులో ఉన్నాయి.
సరదాగా ఓ లుక్కేయండి!

రాసేద్దాం... రండి!

ప్రిటో

ఈ యాప్‌లో పద్దెనిమిది భాషల్లో నవలలు, కథలు, కవితలు, పద్యాలు రాసుకోవచ్చు. తరవాత వాటిని ఈ-బుక్స్‌గానూ చేసుకోవచ్చు. ఇందులో పోస్ట్ చేసిన రచనలకు సంబంధించి యాప్ పోటీలు కూడా నిర్వహిస్తుంది. గెలిచిన వారికి బహుమతులూ అందిస్తుంది. కొన్ని నిబంధనలు అనుసరిస్తే.. ఈ యాప్‌లో రచనలు పోస్ట్ చేసి డబ్బులు కూడా సంపాదించొచ్చు. ఒకవేళ బుక్స్ లాంటివి పబ్లిష్ చేసుకోవాలంటే మాత్రం కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.

స్టోరీ రైటర్

ఈ యాప్‌ని ఆఫ్‌లైన్‌లోనూ ఉపయోగించొచ్చు. ఇందులో 25 భాషల్లో రచనలు చేయొచ్చు. నచ్చిన వాటికి కమెంట్స్ ఇస్తూ మన అభిప్రాయాల్ని తెలియజేయవచ్చు.

నావలిస్ట్

ఇందులో రచనలను చాప్టర్లుగా డివైడ్ చేసుకోవచ్చు. మనం మొత్తం ఎన్ని పేరాలు, వాక్యాలు, పదాలు, అక్షరాలు రాసామో కూడా చూపిస్తుంది. అలాగే మనం వారం, నెలలో ఎంత వరకు రాసామో కూడా గ్రాఫ్ ద్వారా చూపిస్తుంది. టార్గెట్స్ పెట్టుకుని రాసుకునే వెసులుబాటు కూడా ఉంది. వేరే చోట రాసిన కంటెంట్ ఇందులో కాపీ చేయలేరు, ఇందులో రాసిన దాన్ని వేరే చోట పేస్ట్ చేయలేరు. ఇందులోని అన్ని ఫీచర్లు పూర్తి ఉచితంగా వాడుకోవచ్చు.

ప్రతిలిపి

ఈ యాప్‌లో ఇంగ్లిష్‌తో సహా మన దేశానికి సంబంధించిన 12 భాషల్లో రచనలు చేసుకోవచ్చు. వాటికి సంబంధించినవి చదవొచ్చు. ఉచితంగా మన రచనల్ని పోస్ట్ చేసుకోవచ్చు. ప్రతిలిపి ఎఫ్ఎం ద్వారా ఇందులోని కథలు, కవిత్వాలు వినొచ్చు కూడా!

అటికస్

ఇందులో మనమే రాసుకుని.. దాన్ని పుస్తకంగా ఏ పేజీకి ఆ పేజీని ఎడిట్ చేసుకోవచ్చు. రచన ఫాంట్‌ని మనకు నచ్చినట్లుగా డిజైన్ చేసుకోవచ్చు. అలాగే చిత్రాలను జతచేయొచ్చు. కానీ ఈ యాప్ సేవలు వాడుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి చెల్లిస్తే టైం లిమిట్ ఏం లేకుండా ఎన్నిరోజులైనా ఆ సేవలు ఉపయోగించుకోవచ్చు.

పెన్సిల్

ఇది అన్ని మోడల్స్ మొబైల్స్‌లోనూ పని చేస్తుంది. కథలు రాసుకోవడమే కాకుండా 2డీ, 3డీ బొమ్మలనూ క్రియేట్ చేయొచ్చు. ఈ యాప్ కథలు రాసుకోవడానికి కావాల్సిన ఐడియాలు కూడా ఇస్తుంది. ఈ సేవలన్నీ ఉచితమే.

మై స్టోరీటుడే

ఈ యాప్‌ని ఒక ఫోన్‌లో లాగిన్ అయ్యి.. అందులో రాయడం మొదలుపెట్టిన తరవాత, దాన్ని అక్కడి నుంచే మరో ఫోన్ లేదంటే ట్యాబ్ దేనిలోనైనా కంటిన్యూ చేయొచ్చు. అలాగే మనం కథలు రాసుకున్న తరవాత ఒక పదాన్ని ఎన్నిసార్లు ఉపయోగించామని తెలుసుకోవడానికి సెర్చ్‌లో వెతికితే దాన్ని బోల్డ్ చేసి చూపిస్తుంది.

సుడోరైట్

ఇది రచనలకు సంబంధించిన ఐడియాలు తీసుకోవడానికి, మన దగ్గర ఉన్న కంటెంట్‌ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది.



- ఈనాడు ప్రత్యేక విభాగం

రీడ్సీ స్టూడియో

ఈ యాప్‌లో ప్రత్యేకంగా ప్రూఫ్‌రీడర్‌ని, ఎడిటర్‌ని కూడా అసైన్ చేసుకోవచ్చు. వాళ్లు మనం అప్లోడ్ చేసిన కథనాన్ని చక్కగా చదివి, ఎడిట్ చేసి పెడతారు. మనమూ వేరే వాళ్ల కంటెంట్‌ని ఎడిట్, ప్రూఫ్‌రీడ్ చేయొచ్చు.

ఫోర్‌టెల్లింగ్

ఈ యాప్‌లో కథలోని క్యారెక్టర్లకు, లోకేషన్స్‌కు.. వాటి మధ్య రిలేషన్స్‌కు మ్యాప్ వేసుకునే సదుపాయం కూడా ఉంటుంది. అందులో ఫొటోలు కూడా వాడుకోవచ్చు. ఒక కథ మీద ఇద్దరు ముగ్గురు ఒకేసారి కలిసి పని చేయొచ్చు కూడా! ఇందులో వీక్లీ ఛాలెంజెస్ కూడా ఉంటాయి. ఒకవేళ ఈ యాప్‌లో ఎక్కువ ఫీచర్లు కావాలనుకుంటే ఫోర్‌టెల్లింగ్ ప్రోని డబ్బులు చెల్లించి సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు.

లివింగ్ రైటర్

యాప్ ఓపెన్ చేసిన తరవాత హోం పేజీ మీదున్న ఆప్షన్లు తీసేసి ఫుల్ స్క్రీన్ మొత్తం రాసుకోవడానికి వాడుకోవచ్చు. ఈ యాప్‌లో మనం రాసిన ప్రతి అక్షరం ఆటోమేటిక్‌గా సేవ్ అవుతుంది. బ్యాకప్ ఆప్షన్ కూడా ఉంటుంది.

కెల్‌టెక్స్

ఈ యాప్ సినిమా కథలు, స్క్రీన్‌ప్లేలు, డ్రామా యాక్టులు రాసుకునే వారికి కామిక్ రైటర్స్‌కి చాలా బాగా ఉపయోగపడుతుంది. దీన్ని కూడా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉపయోగించొచ్చు.

ఇవే కాకుండా స్క్రీవెనర్, ఫ్రీడమ్, స్టోరిస్ట్, ఫైనల్ డ్రాఫ్ట్, వైరైటింగ్.. వంటి యాప్‌లలో కూడా మనం నచ్చిన రచనలు చేసుకోవచ్చు.

విధి రాతకే రంగులద్దాడు



తీవ్రమైన మనోవేదనను కళారూపంగా మలిచిన అతడు ఏకంగా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాడు. ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లా కురూద్ పట్టణానికి చెందిన బసంత్ సాహు స్ఫూర్తిగాథ ఇది. 30 ఏళ్ల కిందట జరిగిన ఘోర రోడ్డుప్రమాదం అతడి శరీరంలో 95 శాతం భాగాన్ని పక్షవాతానికి గురిచేసింది. అప్పటిదాకా చురుగ్గా తిరుగాడిన బసంత్ ఇంట్లో మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. ఈ దశలో ఆశలు కోల్పోయినవారు తీవ్ర నిస్పృహకు గురవుతారు. విధికి ఎదురొడ్డి నిలిచినవారు అద్భుతాలు సాధిస్తారు. బసంత్ ఈ రెండో మార్గాన్నే ఎంచుకొన్నారు. పూర్వానుభవం, గురువు శిక్షణ వంటివి ఏవీ లేకున్నా చిత్రకారుడిగా కొత్త ప్రయాణం ప్రారంభించి ఎన్నో చిత్రాలకు జీవం పోశారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సందర్భంగా డిసెంబరు 3న దిల్లీలో బసంత్ జాతీయ అవార్డు అందుకోబోతున్నారు. "మొదట్లో ఏవో పిచ్చిగీతలు గీసినా క్రమంగా పట్టు సాధించాను. నాకు ఆదర్శ నాయకుడైన మహాత్మాగాంధీ చిత్రంతో ఈ కళకు శ్రీకారం చుట్టాను. స్నేహితుల ప్రోత్సాహం మరింత బలాన్ని ఇచ్చింది. ఇప్పుడు నా జీవితంలో నిస్పృహకు చోటు లేదు. నాదో రంగుల లోకం. బసంత్ ఫౌండేషను ఏర్పాటు చేసి పిల్లలకు చిత్రకళ నేర్పుతున్నా" అని బసంత్ తెలిపారు. -ఈటీవీ భారత్



ఆస్ట్రేలియా సీత

ఇది ఐలాండ్ జెమ్ సీతాఫలం.. ఆస్ట్రేలియాలో ఎక్కువగా పండుతుంది. జన్యుపరంగా వృద్ధి చేయడానికి సంగారెడ్డి ఫల పరిశోధన స్థానంలో మూడేళ్ల క్రితం ఈ రకం మొక్కలు 20 నాటారు. ఇప్పుడు ఫలాలనిస్తున్నాయి. ఇవి చూడ్డానికి గుండ్రంగా కనిపించకపోయినా మంచి రుచిగా ఉంటాయి. సాధారణ రకాలతో పోల్చితే తీపి శాతం ఎక్కువ. ఇందులో నాలుగైదు గింజలు మాత్రమే ఉంటాయి. ఆరోగ్యపరంగానూ మేలుచేసే గుణాలు ఎక్కువగా ఉన్నాయని సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సుచిత్ర తెలిపారు. ఈ రకం మొక్కలను రైతుల కోసం అందుబాటులో ఉంచినట్లు వివరించారు.
-ఈనాడు, సంగారెడ్డి; న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

చరిత్రలో ప్రళయ భీకర తుపాను అదే

ఇటీవల మొంథా తుపాను సృష్టించిన నష్టం నుంచి రైతన్నలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. అయితే, ఏకంగా 20 అడుగుల ఎత్తున అలలు ఎగిసిపడితే, గంటకు 225.3 కి.మీ. వేగంతో అతి ప్రచండ గాలులు వీస్తే అమ్మో...!! అవి సృష్టించే విలయం గురించి ఆలోచిస్తేనే భయం వేస్తోంది కదూ. సరిగ్గా 55 సంవత్సరాల క్రితం ఇదే రోజున అంటే... 1970 నవంబరు 13న ప్రస్తుత బంగ్లాదేశ్ (నాటి తూర్పు పాకిస్థాన్)ను అతి భయంకరమైన తుపాను అల్లకల్లోలం చేసింది. ఆ ఏడాది నవంబరు 12 అర్ధరాత్రి నుంచి ప్రళయ భీకరంగా విరుచుకుపడిన ఆ విధ్వంసక తుపాను కారణంగా 3 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అప్పటికి, ఇప్పటికి అదే అతిపెద్ద ఉష్ణమండల సైక్లోన్‌గా నిలిచిపోయింది. వర్తమాన చరిత్రలో ఘోరాతి ఘోరమైన ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచిన ఆ తుపానుకు 'భోలా' అని పేరు పెట్టారు. ఈ తుపాను సహాయక చర్యల్లో నాటి పాకిస్థాన్ ప్రభుత్వం అత్యంత దారుణంగా విఫలమైంది. ప్రత్యేక బంగ్లాదేశ్ ఉద్యమం ఊపందుకోవడానికి అది కూడా ఓ కారణంగా నిలవడం గమనార్హం. -ఈనాడు, హైదరాబాద్

గుంపుగా ఉన్నా.. గుటుక్కుమనలేకపోయానే!



ఆదిలాబాద్ చాందా వాగులో బాతుకు చేపల గుంపు కనిపించింది. ఇవాళ లక్కు బాగుంది.. ఆహారం దొరికిందనుకుంది బాతు. ఆబగా చేపల గుంపు దగ్గరకు ఈదుతుండగా.. అప్రమత్తమైన చేపలన్నీ తుర్రున జారుకున్నాయి. కాసేపు వాటి వెనక పడిన బాతు.. అవి అంతకంతకు ముందుకు పోతుండడంతో లాభంలేదనుకొని వెనుదిరిగింది. గుంపుగా కనిపించినా.. పొంచి వేటాడాల్సిందే అని నిర్ణయించుకుని ముందుకుసాగింది! - ఈనాడు, ఆదిలాబాద్


బిర్యానీ.. మిడ్‌నైట్ బొజ్జలో.. బిగ్‌ఫైట్

అర్ధరాత్రి 12ఏఎం బిర్యానీ.. మార్నింగ్ 4ఏఎం బిర్యానీ.. ఫోన్ ఓపెన్ చేస్తే చాలు రీల్స్‌లో తెగ ఊదరగొట్టేస్తున్న ట్రెండ్ ఇది.. ఒకప్పుడు సమయానికి భోజనం చేయాలనేవారు.. కొత్త అలవాట్ల పుణ్యమా అని తిండికి వేళాపాళా లేకుండా పోతోంది.. ఒకరిని చూసి మరొకరు ఆ ఊబిలో చిక్కుకుపోతున్నారు.. ఆరోగ్య సమస్యల్ని కోరి కొని తెచ్చుకుంటున్నారు.

ఈ రుచి చూడడానికి నేను 100 కి.మీ దూరంలో ఉన్న హైదరాబాద్‌కు వచ్చి మరీ తింటున్నానంటూ.. సామాజిక మాధ్యమాల్లో ఫేమస్ అయ్యేందుకు కొందరు వీడియోల్లో ఏవేవో చెబుతారు. మీరింకా ఇది తినలేదా అంటూ చూసేవారిని ప్రేరేపిస్తుంటారు. అలాంటివి చూసి మీరూ ప్రయత్నిస్తే ఆరోగ్యాన్ని చేతులారా చెడగొట్టుకుంటున్నట్లే అని తెలుసా?


ఆ తిండి ఫ్యాషనా..

అసలు రాత్రి ఉన్నది తినడానికి కాదు.. హాయిగా నిద్రపోవడానికి కదా! అలాంటిది 12 గంటలకు, 2 గంటలకు.. ఉదయం 4 గంటలకు.. ఇలా వేళకాని వేళలో బిర్యానీలు తినడం ఏమిటి? గతంలో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి మెట్రో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతి కొత్తగా పట్టణాలకూ పాకుతోంది. లేట్‌నైట్ పార్టీలు.. పుట్టినరోజు వేడుకలు.. వారాంతపు సెలవులు.. అంటూ అర్ధరాత్రి మాంసాహారం తింటూ చాలామంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.



- ఈనాడు డిజిటల్, నరసరావుపేట

జీర్ణక్రియ దెబ్బతినే ప్రమాదం...



- రాత్రి 12 నుంచి 4 మధ్య తినడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవదు. ఇలా వారంలో కనీసం రెండుసార్లు చేసినా జీర్ణక్రియ చక్రం తప్పుతుంది. అంతేకాకుండా కడుపునిండుగా ఉండడంతో ఉదయం వ్యాయామం చేయలేరు. శరీర ఆకారంలో మార్పు వస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశముంది. రాత్రి మరీ ముఖ్యంగా 10 తర్వాత మాంసాహారం వంటి భారీ ఆహారాన్ని ఆలస్యంగా తిన్నప్పుడు సరిగ్గా జీర్ణం కాదు. దీనివల్ల గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి.
- ఆలస్యంగా తినడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయి ప్రభావితమై గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంది.
- నిద్రపోవడానికి కనీసం 3 గంటల ముందు భోజనం చేయాలి. రాత్రిపూట ఆలస్యంగా తీసుకున్న ఆహారంలోని కేలరీలు పూర్తిగా ఖర్చవకుండా శరీరంలో కొవ్వు రూపంలో పేరుకుపోతాయి. ఇది బరువు పెరగడంతో పాటు ఊబకాయానికి దారితీస్తుంది.
- ఆలస్యంగా భోజనం చేయడం వల్ల ఇన్సులిన్ స్థాయి ప్రభావితమవుతుంది. ఇది మధుమేహం లేదా ప్రీ-డయాబెటిస్ సమస్యలకు దారితీయొచ్చు.

మానసిక రుగ్మతలు..



- అధిక కేలరీలు ఉండే బిర్యానీ, చికెన్, మటన్ రాత్రి తినడం వల్ల జీర్ణక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీని వల్ల నిద్రకు అంతరాయం కలుగుతుంది. మరుసటి రోజు అలసటగా, చురుకుగా ఉండలేనట్లు అనిపిస్తుంది.
- నిద్రలేమితో పాటు ఆందోళన, కుంగుబాటు వంటివి తలెత్తుతాయి. హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. మానసిక సమస్యలూ ఎదుర్కోవాల్సి వస్తుంది.
- తిన్నవెంటనే నిద్రపోవడం వల్ల నిద్రకు కడుపులో ఆమ్లాల ఉత్పత్తి పెరిగి యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట వంటి సమస్యలు వస్తాయి.
- కొన్ని అధ్యయనాల ప్రకారం రాత్రి ఆలస్యంగా ముఖ్యంగా కొవ్వులు అధికంగా ఉండే ఆహారం ఎక్కువగా తినే వారు కొన్నిరకాల క్యాన్సర్ల బారినపడే ముప్పు పొంచి ఉంది.

అధిక క్యాలరీలు, నూనె, వనస్పతి, ఫ్యాటీ మీట్స్ ఉండటం, ఫైబర్, మినరల్స్ తక్కువగా ఉండడం వల్ల బిర్యానీలు అధికంగా తినేవారికి ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ మెటబాలిక్ సిండ్రోమ్, ఫ్యాటీ లివర్, షుగర్, బీపీ వంటి వ్యాధులు వస్తున్నాయి. గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడే యువత సంఖ్య పెరుగుతోంది బిర్యానీతో పాటు తాగే శీతల పానీయాలు ఈ సమస్యలను ఇంకా పెంచుతాయి.

- డా.చైతన్య, జీర్ణకోశ వ్యాధి నిపుణులు, గుంటూరు



ప్రసాదం.. పరబ్రహ్మ స్వరూపం

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంలోని శ్రీదేవి భూదేవి సమేత బాల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో పులిహోర, పండ్లు, మిఠాయిలు, పుష్పాలతో స్వామివారి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ఆ నైవేద్యం పంచిపెట్టారు.
-న్యూస్‌టుడే, గణపవరం



మొక్కుబడి కాదు.. అక్షర గుడి

పంజాబ్‌లోని బఠిండాలో మురికివాడల పిల్లలు బడికి వెళ్లరు.. ట్రాక్టర్ ట్రాలీపై ఏర్పాటుచేసిన 'గుడ్‌విల్' మొబైల్ పాఠశాలే నిత్యం వారి వద్దకు వస్తుంది. పదవీ విరమణ పొందిన రైల్వే ఇంజినీరు కె.కె.గార్గ్ ఈ ఉచిత పాఠశాలలను నిర్వహిస్తున్నారు. మొదట్లో పిల్లలను పంపేందుకు విముఖత చూపిన తల్లిదండ్రులు క్రమంగా ఆయన ప్రయత్నాన్ని అర్థం చేసుకున్నారు. గత 17 ఏళ్లలో ఈ మొబైల్ స్కూలు ద్వారా దాదాపు 700 మంది విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని సర్కారు బడుల్లో చేరారు. "నేను ఉద్యోగంలో ఉన్నపుడు రైళ్లలో తిరుగుతూ చదువు లేకుండా రైల్వేలైన్ల వద్ద ఆడుకొంటున్న చాలామంది పేద పిల్లలను చూశాను. వారి కోసం ఏదైనా చేయాలనే రిటైర్మెంటు తర్వాత ఈ బడిని ప్రారంభించాను. ఓ ఉపాధ్యాయురాలిని నియమించాం. పిల్లలకు నిత్యం పండ్లు, బిస్కెట్ల వంటివి ఇస్తున్నాం" అని కె.కె.గార్గ్ వివరించారు.
-ఈటీవీ భారత్

పొత్తంతో దోస్తానా.. వదల్లేదు పెద్దాయన



తలకు పాగా.. లుంగీ కట్టుకుని.. కర్ర ఆసరాతో నుంచుని గ్రంథాలయం బీరువాలో నుంచి పుస్తకం తీసుకుంటున్న ఈ వ్యక్తి ఎవరై ఉంటారా..? అనుకుంటున్నారా? ఆయన యాభై ఏళ్లుగా జిల్లా గ్రంథాలయ సభ్యత్వాన్ని కలిగిన సీనియర్ పాఠకుడు, మహబూబాబాద్ శివారు ఈదులపూసపల్లికి చెందిన బత్తిని రాములు. ఏడుపదుల వయసుకు దగ్గరలో ఉన్నారు. కర్ర సహాయంతో నడుస్తున్నా.. పుస్తకానికి దూరం కాలేదు. 1970 దశకంలో రూ.10 రుసుంతో సభ్యత్వాన్ని పొందిన ఆయన ప్రతి వారం మూడు కి.మీ. దూరంలోని గ్రంథాలయాన్ని సందర్శిస్తున్నారు. తనకు ఆసక్తి కలిగించే పుస్తకం కోసం కనీసం ఓ గంట వెతికి తీసుకెళ్తారు. వారంలో చదివి వాపస్ ఇచ్చి.. ఇంకో పుస్తకాన్ని పట్టుకెళతారు. గీత వృత్తికారుడైన రాములు.. 300కు పైగా పుస్తకాలు చదివినట్లు గుర్తుందని తెలిపారు. గతేడాది రాములును సీనియర్ పాఠకుడిగా సన్మానించారు అధికారులు. - న్యూస్‌టుడే, మానుకోట

చైనా టాయిలెట్లా.. మజాకా..!



హైదరాబాద్ రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యాధునిక బయో టాయిలెట్లు అందుబాటులోకి వచ్చాయి. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) వీటిని అందజేసింది. చైనా నుంచి తెప్పించిన ఈ కంటైనర్ టాయిలెట్లలో నీరు నిరుపయోగం కాదు. వాటిని ఉపయోగించినప్పుడు వచ్చే మలినాలు, నీళ్లు కంటైనర్ సమీపంలో భూమిలో ఏర్పాటుచేసిన మొదటి సెప్టిక్ ట్యాంక్‌లోకి చేరతాయి. దీని కెపాసిటీ వెయ్యి లీటర్లు.. అది నిండిన వెంటనే సెన్సర్ల ద్వారా రీసైక్లింగ్ జరుగుతుంది. ఇలా రీసైక్లింగ్‌తో శుభ్రపడిన నీళ్లు తిరిగి ఫ్లష్ చేసేందుకు ఉపయోగించే ట్యాంక్‌లోకి చేరతాయి. ఒకసారి పది వేల లీటర్ల నీటితో నింపిన ఫ్లష్‌ట్యాంక్‌లోకి ఇలా పలుమార్లు రీసైకిల్ అయిన నీరు చేరుతుంది. దీంతో ఏడాది వరకు నీళ్లు నింపే అవసరం ఉండదని నిర్వహణ బాధ్యతలు చూస్తున్న సిబ్బంది తెలిపారు. ఘన వ్యర్థాలు రెండో ట్యాంక్‌లోకి చేరతాయి. అక్కడ బయోప్రాసెస్ అయ్యాక.. స్వల్ప పరిమాణంలో మిగిలే వ్యర్థాలు మూడో ట్యాంక్‌లోకి చేరతాయి. ఆరు నెలలకు ఒకసారి ఆ ట్యాంక్‌లోని వ్యర్థాలను బూడిదగా మారుస్తారు. వీటి ఏర్పాటు, నిర్వహణకు రూ.70 లక్షల వరకు అవుతుందని, ఆ మొత్తాన్ని ఆస్కి అందిస్తోందని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. లుంబినీపార్కు, టీ-వర్క్స్ వద్ద ఈ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నామని ఆస్కి ప్రతినిధి తెలిపారు. వీటి ఏర్పాటు దేశంలోనే మొదటిసారని చెప్పారు. -ఈనాడు, హైదరాబాద్



ఈ శత్రువులను జయించండి

మీరు ఇంకెవరినో పోటీగా భావిస్తూ, వారి మీద గెలవాలని కాకుండా, మీలోని అంతర్గత శత్రువులను జయించడంపై దృష్టి పెట్టండి. అవేంటంటే..
- మీ చెడు అలవాట్లు
- ఏకాగ్రత లోపం
- అభద్రతా భావం
- వాయిదా మనస్తత్వం
- క్రమశిక్షణారాహిత్యం
- భయాలు
- అహం.


- టమారా వింటర్, పబ్లిషర్

కళ్లద్దాలే నడిపిస్తాయి



కంటి చూపు లేని వారికి సహాయంగా పని చేసే ఏఐ ఆధారిత స్మార్ట్‌గ్లాసెస్‌ను ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విద్యార్థులు ఎస్.చెన్నకేశవ దుర్గాప్రసాద్, ఎస్.అభినందన రూపొందించారు. ఈ పరికరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతను ఉపయోగించారు. కళ్లద్దాల్లో అమర్చిన కెమెరా ద్వారా మనుషులు, వస్తువులు, ఇతర అడ్డంకులను గుర్తించి వాటిని వాయిస్ అవుట్‌పుట్ ద్వారా వినిపిస్తుంది. 40 మీటర్ల దూరం వరకు ఇది పని చేస్తోంది. టెక్స్ట్ టు స్పీచ్ ఫీచర్ ద్వారా దృష్టిలోపం ఉన్నవారు పుస్తకాలు చదివేందుకు, కరెన్సీ నోట్లను గుర్తించేందుకు కూడా ఇది దోహదపడుతుంది. యూఎస్‌బీ, బ్యాటరీ ఇందులో ఉంటాయి. యుక్తి స్కీంలో చేరిన ఈ ప్రాజెక్టుకు పలు జాతీయస్థాయి ప్రదర్శనల్లో అవార్డులు లభించాయి. జేఎన్‌టీయూకే నేషనల్ లెవెల్ హార్డ్‌వేర్ వర్క్‌షాపులో ప్రథమ బహుమతి లభించింది. ఏఐసీటీఈ ప్రొడక్టైజేషన్ ఫెలోషిప్ మొదటిరౌండ్‌కు ఎంపికైందని, ఈ సాంకేతికతను స్టార్టప్ రూపంలో విస్తరించి దివ్యాంగులకు అందుబాటులోకి తీసుకొస్తామని మెంటార్ షేక్ చాన్‌బాషా తెలిపారు.
-ఈనాడు, ఏలూరు

ఈ అందాలకు మెచ్చి... రాసిచ్చేశారు



అవునండీ..! తమిళనాడు ప్రభుత్వం ఓ రకమైన మొక్కలను సంరక్షించడానికి కొండ ప్రాంతం మొత్తాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఎందుకంటే ఆ మొక్కలు తమ జీవిత కాలంలో ఒక్కసారే పుష్పిస్తాయి. అదీ.. 8 ఏళ్లకోసారి కావడం విశేషం. నీలగిరి జిల్లా ఊటీ దగ్గర్లో ఉండే గూడలూరులో కురింజి రకం (స్ట్రోబిలాంథెస్ సెసిలిస్) మొక్కలు ఉంటాయి. వీటికి పూసే పువ్వులను కురింజి అని అంటారు. చూడటానికి 'గంట' ఆకృతిలో ఉండే ఈ పూలు ఎక్కువగా ఊదా రంగులో, కొన్ని నీలం, తెలుపు, గులాబీ రంగుల్లో కనిపిస్తుంటాయి. కేవలం నీలగిరిలోనే ఈ తరహాలో 33 రకాలు పుష్పాలు ఉన్నాయి. సెప్టెంబరు-అక్టోబరు సీజన్లలో ఇవి పూస్తుంటాయి. అందుకే గూడలూరు సమీప ప్రాంతాన్ని అక్కడి ప్రభుత్వం అక్టోబరులో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేసింది.
- ఈనాడు, చెన్నై

రాజధానిలో పలు సంస్థలకు 120 ఎకరాల కేటాయింపు

- 11 సంస్థలకు కొత్తగా 49.50 ఎకరాలు
- పాత కేటాయింపుల్లో మార్పులు చేర్పులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో వివిధ సంస్థలకు ప్రభుత్వం 120.65 ఎకరాలు కేటాయించింది. ఇందులో 11 కొత్త దరఖాస్తులకు 49.50 ఎకరాలు మంజూరుచేసింది. పలు జాతీయ విద్యాసంస్థలు, బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కొన్ని హోటళ్లకు ఈ భూములిచ్చింది. గతంలో వివిధ సంస్థలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు, చేర్పుల కోసం తాజాగా 71.15 ఎకరాలు ఇచ్చింది. మొత్తంగా 120.65 ఎకరాలు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8న మంత్రుల కమిటీ సమావేశంలో చేసిన సిఫారసులపై సీఆర్‌డీఏ కమిషనర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కేటాయింపుల వివరాలు https://epaper.eenadu.net లో

రూ.99.62 కోట్లతో క్వాంటమ్ సెంటర్

ఈనాడు, అమరావతి: రాజధానిలో రూ.99.62 కోట్లతో అమరావతి క్వాంటమ్ సెంటర్ నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీ చేసింది. దీనికి సంబంధించి బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్లు ఆమోదం తెలపగా, రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ విధానంలో ఈ మేరకు టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులిచ్చింది.

మేఘాకు రూ.796.88 కోట్లతో అమరావతిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు

ఈనాడు, అమరావతి: రాజధాని ప్రాంతంలో మూడు ప్యాకేజీల కింద రూ.796.88 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు చేపట్టేందుకు ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన మేఘా సంస్థకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ రుణంతో అమరావతి అభివృద్ధి పనుల్లో భాగంగా ప్యాకేజీ-36 కింద జోన్-1, 2, 3, 5, 6లలో మురుగునీటి శుద్ధిప్లాంట్ల డిజైన్, ఇంజినీరింగ్, నిర్మాణం, వీటికి అవసరమైన ఎలక్ట్రో మెకానికల్ పరికరాల సరఫరా, వాటిని పరీక్షించి, అమర్చే పనులకు సంబంధించిన బిడ్లలో రూ.274.76 కోట్లతో మేఘా సంస్థ ఎల్-1గా నిలిచింది.

★ ప్యాకేజీ-37లో భాగంగా జోన్ 4, 7, 9, 10లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులకు చెందిన బిడ్లలో రూ.304.60 కోట్లతో మేఘా సంస్థ ఎల్-1గా నిలిచింది.

★ ప్యాకేజీ-38 కింద జోన్ 12, 12ఎలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనుల టెండర్లలో రూ.217.52 కోట్లకు కోట్‌చేసిన మేఘా సంస్థ ఎల్-1గా నిలిచింది.

★ వీటికి సంబంధించి అక్టోబరు 8న జరిగిన సీఆర్‌డీఏ అథారిటీ 53వ సమావేశంలో ఆమోదం తెలపగా, దీనికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

ఏడు గురుకులాల కథ సుఖాంతం

- బీసీ విద్యార్థుల అవస్థలకు చెక్
- పనుల్లో వేగం పెంచిన ప్రభుత్వం
- త్వరలో అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: ఒకరు, ఇద్దరు కాదు.... 500-700 మంది చొప్పున విద్యార్థులుండే బీసీ గురుకులాలవి. సరిపడ తరగతి గదులు, సరైన వసతి లేక పిల్లలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. సువిశాల తరగతి గదులు, సకల సదుపాయాల వసతి గృహం, చూడచక్కని ఆటస్థలం, వర్షం పడినా ఇబ్బంది లేకుండా అంతర్గత రహదారులు... ఇలా అన్ని వసతులతో కూడిన భవన సముదాయాన్ని త్వరలో అందుబాటులోకి తెచ్చే చర్యలు చేపట్టింది. శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ, గుండుమల, అనంతపురం జిల్లా రొద్దం, గొనెబావి, నంద్యాల జిల్లా డోన్, బేతంచెర్ల, వైఎస్సార్ కడప జిల్లా తొండూరులో గురుకులాలకు రూ.60 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లు విడుదల చేసి త్వరితగతిన పనులు చేపట్టాలని నిర్దేశించింది.



శ్రీసత్యసాయి జిల్లా గుండుమలలో నిర్మాణంలో ఉన్న వసతి గృహం

తెదేపా చేపట్టిందనే కక్షతో పనుల నిలిపివేత

గుడిబండ, గుండుమల, గొనెబావి గురుకులాలను 2016-17లో అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు కేటాయించి పనులూ చేపట్టింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా... తెదేపా ప్రభుత్వం చేపట్టిందనే కక్షతో విద్యార్థుల అవస్థలను పట్టించుకోకుండా గురుకులాల పనులను నిలిపేసింది. ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా ఐదేళ్లూ కాలయాపన చేసింది. 2019-20లో మంజూరుచేసిన రొద్దం గురుకులాన్నీ పూర్తి చేయలేదు. డోన్, బేతంచెర్ల, పులివెందుల నియోజకవర్గం తొండూరులో బీసీ గురుకులాల నిర్మాణ పనులు చేపట్టినా అదీ అరకొరే. ఇప్పుడు వీటన్నింటినీ పూర్తిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది.

బిల్లులు చెల్లించకుండా వైకాపా ప్రభుత్వ సతాయింపు

గుడిబండ, గుండుమల, గొనెబావి, రొద్దం గురుకులాల పనుల్ని నిలిపివేయడమే కాకుండా అప్పటివరకు చేసిన వాటికి బిల్లులు చెల్లించకుండా పెండింగ్ పెట్టారు. దీంతో గుత్తేదారులు ఆ పనుల్ని వదిలేసి వెళ్లిపోయారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన డోన్, బేతంచెర్ల, తొండూరు గురుకులాలకూ సకాలంలో బిల్లులు చెల్లించకుండా గుత్తేదారుల్ని సతాయించారు. అరకొరగా పూర్తయిన డోన్, బేతంచెర్ల భవనాల్లోకి ఎన్నికలు సమీపిస్తున్నాయని విద్యార్థులను తరలించి ఇబ్బందులకు గురిచేశారు.

మరింత మందికి ప్రయోజనం

తొండూరు గురుకులాన్ని ప్రస్తుతం ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ 272 మంది విద్యార్థులున్నారు. గొనెబావి గురుకులంలో 280 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ రెండుచోట్లా కొత్తగా మంజూరైన భవన సముదాయాల్లో 480 మంది విద్యార్థులుండేలా వసతులు సమకూరుస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే మరింత మందికి ప్రయోజనం కలగనుంది.

దశాబ్దాల స్వప్నం.. 2 నెలల్లో సాకారం

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో పేదింటి మహిళకు సమకూరిన సొంతిల్లు



కృష్ణవేణి అర్జీని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఆకివీడు, న్యూస్‌టుడే: సొంతిల్లు సమకూర్చుకోవాలన్న ఓ పేదింటి మహిళ దశాబ్దాల స్వప్నం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో సాకారమైంది. ఆమెకు అధికారులు 60 రోజుల్లో ఇల్లు కట్టించి, అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం కుప్పనపూడిలోని తాళ్లకోడు ప్రాంతంలోని లేఅవుట్‌లో ఆకివీడుకు చెందిన కంకణాల కృష్ణవేణికి కొన్నేళ్ల కిందట స్థలం కేటాయించారు. భర్త చనిపోవడంతో ఆమె చెత్త సేకరణతో జీవనోపాధి పొందుతున్నారు. మూడు నెలల కిందట మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి గూడు లేదని, స్థలం ఇచ్చినా కట్టించుకునే స్తోమత లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఆయన ఆదేశాలతో అధికారులు ఇంటి నిర్మాణ పనులు ఆఘమేఘాలపై పూర్తిచేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ నాగరాణి ఆమెతో గృహప్రవేశం చేయించారు. నూతన వస్త్రాలు, పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఎన్నో ఏళ్ల తన కల నెరవేరిందని కృష్ణవేణి ఆనందంతో చెప్పారు.





నిర్మించిన ఇల్లు ★ కృష్ణవేణితో కలిసి గృహప్రవేశం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భద్రతను రెట్టింపు చేయండి

అంతర్జాతీయ విమానాశ్రయాలకు పౌర విమానయాన భద్రతా విభాగం మార్గదర్శకాలు

ఈనాడు, హైదరాబాద్: దిల్లీ పేలుడు దుర్ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర పౌర విమానయాన భద్రతా విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎయిర్ ఇండియా, ఇండిగో ఇతర విమానయాన సంస్థల విమానాల్లో భద్రతను పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఉగ్ర చర్యలకు పాల్పడే వ్యక్తులు హానికరమైన రసాయన పదార్థాలు, విషపూరితమైన వస్తువులు, ఐఈడీ వంటి పేలుడు పదార్థాలను వేర్వేరుగా తరలించే అవకాశాలున్న దృష్ట్యా ప్రతి కార్గో కన్‌సైన్‌మెంట్‌ను సెన్సర్లతో పరీక్షించడమే కాకుండా భౌతికంగా పరిశీలించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులను ప్రయాణికులు గమనిస్తే వారు విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపింది.

మరికొన్ని ఇలా... ★ ప్రవేశద్వారాల వద్ద వంద శాతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ★ ప్రయాణికుల హ్యాండ్ బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను సెన్సర్లు, డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించాలి.



★ ప్రతి వాహనాన్ని తనిఖీచేసి విమానాశ్రయంలోకి పంపించాలి. ★ ప్రయాణికులు విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సమయంలో ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే పక్కకు తీసుకెళ్లి విచారించాలి. వారి సామగ్రి, బ్యాగ్‌లను ఇన్‌లైన్ హోల్డ్ బ్యాగేజ్ పద్ధతి ద్వారా స్క్రీనింగ్ తప్పనిసరి. ★ విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లోని పార్కింగ్ ప్రదేశాలు, రన్‌వేకి సమీపంలో వాహనాలు నిలిపే చోట.. విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సమయానికి పావుగంట ముందు స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు చేయాలి.

సీఎంను కించపరిచేలా పోస్టులు పెట్టినవారి అరెస్టు

పట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబును కించపరిచేలా పోస్టులు పెట్టిన ఇద్దరిని గుంటూరు జిల్లా పట్టిచెరుకూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ రామానాయక్ తెలిపిన వివరాల మేరకు.. పట్టిచెరుకూరు మండలంలోని ఓ వైకాపా కార్యకర్త (17) సీఎంను కించపరిచేలా ఫొటోలు మార్ఫింగ్ చేసి నవంబర్ 4న పోస్టు చేశాడు. దీనిపై తెదేపా కార్యకర్త పల్లపాటి వంశీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తాను అనంతపురం జిల్లా ఐదుకల్లు గ్రామానికి చెందిన బోయ యశ్వంత్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రాం ఖాతా నుంచి మార్ఫింగ్ ఫొటోలను డౌన్‌లోడ్ చేసి పోస్టు చేశానని విచారణలో తెలిపాడు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేశారు.



లావు తగ్గడానికి కడుపు మాడ్చుకోకండి

లావు తగ్గడానికి తక్కువగా తింటూ ఆకలితో కడుపు మాడ్చుకుంటే ఫలితం ఉండదు. తీసుకొనే ఆహారం ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవాలి. చాలా మంది చిరుతిళ్లను ఇష్టంగా తింటూ ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని భుజించరు. ఇది సరికాదు. సరైన ఆహారాన్ని తీసుకుంటే, శరీరంలో కొవ్వును కరిగించడం సులువవుతుంది.

– మకెంజీ స్మిత్, ఫిట్‌నెస్ కోచ్

మొహియుద్దీన్ నివాసంలో ఏటీఎస్ సోదాలు

- రైసిన్ తయారీకి ఉపయోగించిన ముడిపదార్థాలు స్వాధీనం


ఈనాడు, హైదరాబాద్-రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రంగా బయటపడ్డ ఉగ్రకుట్ర కేసులో గుజరాత్ ఏటీఎస్(యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్) సోదాలు నిర్వహించింది. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో రాజేంద్రనగర్‌లోని ఫోర్ట్‌వ్యూకాలనీకి ఐదుగురితో కూడిన ప్రత్యేక బృందం వచ్చింది. ప్రధాన నిందితుడు డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ నివాసంలో గంటన్నరకుపైగా సోదాలు నిర్వహించింది. గుర్తుతెలియని రసాయనం, రైసిన్ విష పదార్థం తయారీకి ఉపయోగించిన ముడిపదార్థాలు, కోల్డ్‌ప్రెస్ మిషన్, కంప్యూటరు, పుస్తకాలు, పేపర్లు స్వాధీనం చేసుకుంది. తనిఖీలకు వస్తున్నట్లు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చినా.. లోపలికి తీసుకెళ్లలేదు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు యూపీకి చెందిన ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహేల్ సలీంఖాన్ ఇళ్లల్లోనూ ఏటీఎస్ పోలీసులు సోదాలు నిర్వహించారు. మొహియుద్దీన్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న రసాయనమేంటో నిర్ధారించలేదు. దీన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నారు.

కాకినాడలో ఏఎంజీ మెటల్స్ సంస్థకు అనుమతి

అనంతపురంలో సుగ్నా స్పాంజ్‌కు కూడా

ఈనాడు, అమరావతి: కాకినాడ జిల్లా ఉప్పాడ వద్ద రూ.44 వేల కోట్ల పెట్టుబడితో ఏఎంజీ మెటల్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసే గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో 3 వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది. మరోవైపు అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో రూ.1,247 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు సుగ్నా స్పాంజ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతించింది. దీనిద్వారా 1,100 మందికి ఉపాధి లభించనుంది. టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారం



కొలకలూరి ఇనాక్

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్ బుధవారం తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందించనున్నారు. గురజాడ వర్ధంతి (నవంబరు 30) సందర్భంగా ఏటా విజయనగరంలో నిర్వహించే సాహితీ చైతన్య ఉత్సవం రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. సమావేశంలో సమాఖ్య సభ్యులు ఎ.గోపాలరావు, చక్రవర్తి, గురజాడ ఇందిర, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 93 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

తోట తరణికి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లో అందించిన విశిష్ట సేవలకుగాను ఫ్రాన్స్ ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం 'చెవాలియర్'కు ప్రముఖ కళాదర్శకుడు తోట తరణి ఎంపికయ్యారు. గురువారం చెన్నైలోని అలయన్స్ ఫ్రాన్స్ ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమంలో భారత దేశంలోని ఫ్రాన్స్ దేశపు దౌత్యాధికారి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తోట తరణి చిత్రలేఖన ప్రదర్శన శుక్రవారం వరకు కొనసాగనుంది. చెవాలియర్ పురస్కారం అందుకోనుండటం చాలా సంతోషంగా ఉందని తోట తరణి హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ 'ఎక్స్' పేజీ ద్వారా అభినందనలు తెలిపారు. గతంలో దిగ్గజ నటుడు దివంగత శివాజీ గణేశన్ (1995), కమల్ హాసన్ (2016) లాంటివారు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తోట తరణికి అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు అగ్ర కథానాయకుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. పవన్ నటించిన హరిహర వీరమల్లు చిత్రానికి తోట తరణి కళా దర్శకత్వం వహించారు. – న్యూస్‌టుడే, చెన్నై

అదిరింది మందాకిని

తన తెలుగు సినిమా పునరాగమనం గొప్పగా ఉందన్న ప్రియాంక చోప్రా... తాను కథానాయికగా నటిస్తున్న కొత్త చిత్రం గ్లోబ్‌ట్రాటర్ అదిరిందంటూ సినీ ప్రియుల్ని ఊరిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుని సొంతం చేసుకున్న ఈమె ప్రస్తుతం మహేశ్‌బాబు - ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో రూపొందుతున్న సినిమాలో కథానాయికగా నటిస్తోంది. గ్లోబ్ ట్రాటర్ అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా వేడుక ఈ నెల 15న రామోజీ ఫిల్మ్‌సిటీలో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న సందడి సినీ ప్రియుల్ని ఆకర్షిస్తోంది. బుధవారం ప్రియాంక చోప్రా ఎక్స్‌లో తన అభిమానులతో మాటామంతీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదిరింది... ఆకలేస్తోంది... అంటూ అచ్చమైన తెలుగు మాటల్ని పంచుకుంది. ఈ సినిమాతో తన ప్రయాణం ఇప్పుడిప్పుడే ఆరంభమైందని... అయితే సినిమా మాత్రం అదిరిపోయిందని చెప్పుకొచ్చింది ప్రియాంక. తెలుగు మాట్లాడటం, గాఢమైన రాజమౌళి సినిమాల షూటింగ్ షెడ్యూల్... ఈ రెండింటిలో ఏది కష్టంగా అనిపించిందన్న ఓ నెటిజన్ ప్రశ్నకు ఆమె బదులిస్తూ... రెండూ కష్టం అనిపించలేదు, కానీ ఈ రెండూ జీవితాన్ని మార్చే విషయాలు అవుతాయని చెప్పుకొచ్చింది ప్రియాంక చోప్రా. ఈ సినిమా చిత్రీకరణ కోసం ఈమధ్య ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడుపుతోంది ప్రియాంక. ఆ విషయం గురించి ఆమె ఓ ప్రశ్నకు బదులిస్తూ... "నా కూతురు హైదరాబాద్‌లో బాగా సెట్ అయ్యింది. మహేశ్, నమ్రత, వాళ్ల కూతురు సితారతో కలిసి బాగా సమయం గడుపుతోంది. రాజమౌళి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న దూడతో కలిసి గడిపిన క్షణాలు తనకి ఇష్టమైన జ్ఞాపకం" అని చెప్పుకొచ్చింది ప్రియాంక.




ప్రియాంక చోప్రా

ఎన్నెన్నో కోణాలు...

ఈ సినిమాలో మందాకిని పాత్రలో సందడి చేయబోతోంది ప్రియాంక చోప్రా. ఆ పాత్ర లుక్‌ని బుధవారం విడుదల చేశారు దర్శకుడు రాజమౌళి. అందులో భారతీయత ఉట్టిపడే చీరకట్టుతో, గన్ ఎక్కుపెట్టి కనిపించింది ప్రియాంక. మందాకిని పాత్రలో లెక్కలేనన్ని ఛాయలు ఉంటాయని ఊరించారు రాజమౌళి. ప్రపంచ వేదికపై భారతీయ సినిమాని పునర్నిర్వచించిన మహిళ, మన దేశీ అమ్మాయి అంటూ ప్రియాంక చోప్రాకి తిరిగి స్వాగతం పలికారు రాజమౌళి.

రష్మి.. నిన్ను చూస్తే గర్వంగా ఉంది

- విజయ్ దేవరకొండ



రాహుల్ రవీంద్రన్, దీక్షిత్‌శెట్టి, రష్మిక, అల్లు అరవింద్, విజయ్ దేవరకొండ, ధీరజ్

"అందరం తప్పులు చేస్తాం. ఎవరూ పరిపూర్ణం కాదు. మగాళ్లు వాళ్ల భాగస్వామికి ఎప్పుడూ రక్షణగా ఉండాలనుకుంటారు. అయితే ఆ రక్షణ వాళ్లపైన నియంత్రణలా ఉండకూడదు. వాళ్ల సంతోషాన్ని, వాళ్ల కలల్ని రక్షిస్తున్నట్టుగా ఉండాలి" అన్నారు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన ముఖ్య అతిథిగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్' విజయోత్సవం జరిగింది. రష్మిక ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పకులు. విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. విజయోత్సవాన్ని ఉద్దేశించి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఈ సినిమా నన్ను ఎంతో భావోద్వేగానికి గురిచేసింది. చాలా చోట్ల కన్నీళ్లు ఆపుకోవల్సి వచ్చింది. చాలా చోట్ల బరువుగా, అసౌకర్యంగా అనిపించింది. చివరికి ఒక సంబరంలా అనిపించింది. ఈమధ్యకాలంలో నేను చూసిన అత్యుత్తమ సినిమా ఇది. రష్మిక భూమాదేవినే. అందరూ సంతోషంగా ఉండాలని తపించే వ్యక్తిత్వం తనది. ఒక మహిళగా ఇప్పుడు తన కథల ఎంపిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. రష్మీ కెరీర్ విషయంలో గర్వపడుతున్నా" అన్నారు. రష్మిక మాట్లాడుతూ "ఈ కథ విన్నప్పుడు ఈ సినిమానే మొదట చేయాలనిపించింది. భూమా జీవితంలో జరిగినట్టుగానే నా జీవితంలోనూ కొన్ని జరిగాయి. కానీ ఇప్పుడు అర్థమవుతోంది అందరి జీవితంలోనూ ఇలాంటివి జరిగాయని. అందరూ ఈ సినిమాకి కనెక్ట్ అవుతున్నారు. అదే నాకు పెద్ద పురస్కారం. విజ్జూ (విజయ్ దేవరకొండ) ఈ సినిమా ప్రారంభం నుంచి భాగం అయ్యారు. విజయోత్సవంలోనూ తను ఉండటం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక విజయ్ దేవరకొండ ఉండాలి. అది ఒక వరం" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ సినిమాకి హీరో దర్శకుడు. మగవాళ్లు ఈ సినిమాని మెచ్చుకునేలా తీశాడు. ఉత్తమ నటిగా అన్ని పురస్కారాలు రష్మికకే రావాలి. అంత బాగా నటించార"న్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ "ఏ దర్శకుడికైనా రష్మిక, దీక్షిత్ లాంటి నటులు దొరికితే మామూలు స్క్రిప్ట్ కూడా సూపర్‌హిట్ అవుతుంది. ప్రేక్షకులు ఈ సినిమాని ఎంతగా ప్రేమిస్తున్నారో, ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరి కుటుంబాలు అంతే గర్వపడుతున్నాయి. అదే మాకు దక్కిన పెద్ద విజయం" అన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్‌శెట్టి, విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని, రోహిణి, గీత రచయిత రాకేందు మౌళి, స్టైలిస్ట్ శ్రావ్య వర్మ, సంగీత దర్శకులు హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రశాంత్ ఆర్.విహారి, సాయిరాజేశ్, బన్నీ వాస్, ఎస్.కె.ఎన్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపై ముద్దు పెట్టి...

'ది గర్ల్‌ఫ్రెండ్' వేడుకకు విజయ్ దేవరకొండ, రష్మిక జోడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వేడుకలో రష్మిక చేతిని ముద్దాడి ఆమెకు అభినందనలు చెప్పారు విజయ్. వేదికపై రష్మి అంటూ రష్మికని సంబోధిస్తూ మాట్లాడారు విజయ్ దేవరకొండ. రష్మిక... విజయ్‌ని విజ్జూ అంటూ పిలిచారు.

మేం జీవితాంతం సినిమాని ప్రేమించేవాళ్లం!

పూర్తిగా ఒక కల్పిత కథతో రూపొందించిన చిత్రమే 'కాంత' అని... మొదట్నుంచీ ఆ విషయంలో మేం ఎంతో స్పష్టతతో ఉన్నామని చెప్పారు కథానాయకులు దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి. చెన్నైలో సినిమా ప్రదర్శనని ఏర్పాటు చేశామని... అది పూర్తయిన వెంటనే ఈ సినిమాపై ముసురుకున్న వివాదాలన్నీ తొలగిపోతాయని చెప్పారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. దుల్కర్, రానా సొంత నిర్మాణ సంస్థలపై రూపొందిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. అయితే ఈ సినిమా తమ తాతయ్య, తొలి తమిళ సూపర్‌స్టార్ ఎం.కె. త్యాగరాజ భాగవతార్ జీవితం ఆధారంగా రూపొందిందని, ఇందులో తాతయ్యని తప్పుగా చూపించారంటూ ఆయన మనవడు త్యాగరాజన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ వివాదం ఒక పక్క కొనసాగుతుండగానే.. మరోవైపు చిత్ర ప్రచార కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి చెప్పిన విషయాలివీ.



రానా, దుల్కర్

కాంతలో ఓ ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంది: దుల్కర్ సల్మాన్

"నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా 'కాంత'. ఏ నటుడికైనా జీవితంలో ఒకే ఒక్కసారి ఇలాంటి సినిమాలు చేసే అవకాశం దక్కుతుంది. మళ్లీ మళ్లీ పునః సృష్టించే పాత్ర కూడా కాదు. నేను, రానా ఈ కథ వినగానే వెంటనే చేయాలనుకున్నాం. ఇందులోని ప్రతి పాత్ర ఓ ప్రత్యేకమైన శక్తి, ఉత్సాహంతో కనిపిస్తుంది. ఇది పూర్తిగా కల్పిత కథ. దర్శకుడు చెప్పిన ఈ కథాలోచన గురించి వినగానే నేను ఇంకేదీ ఆలోచించలేదు. 'మహానటి' సినిమాలో కూడా సినిమా ఉంటుంది. దాంతో పోలిస్తే 'కాంత' వేరు. ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ జరిగింది ఈ సినిమా విషయంలో. అది తెరపై చూసి ఆస్వాదించాలంతే. రానా, సముద్రఖని, భాగ్యశ్రీ ప్రతి ఒక్కరూ అద్భుతమైన పాత్రల్లో కనిపిస్తారు".

- "సినిమాకి సంబంధించిన కథ కావడంతో నాటి సినీ వాతావరణాన్ని పునః సృష్టించి చిత్రీకరణ చేశాం. అప్పట్లో గొప్ప గొప్ప సినిమా సెట్స్‌లో తిరిగిన వస్తువుల్ని సేకరించి తెరపై చూపించాం. 'పాతాళ భైరవి' సినిమాని తీసిన కెమెరా ఇందులో కనిపిస్తుంది. ఇలాంటి కెమెరాతో 'పాతాళ భైరవి' తీశారా అని ఆశ్చర్యపోతారు ప్రేక్షకులు. ఇలా ఆశ్చర్యపోయే విషయాలు సినిమాలో చాలానే ఉన్నాయి. వెండితెర చేసుకునే ఓ వేడుకలాంటి చిత్రమిది. రానా దగ్గుబాటితో కలిసి చేసిన ఈ చిత్రం, ఈ ప్రయాణం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది".

తిరిగి ఇచ్చే అవకాశం దక్కింది: రానా దగ్గుబాటి

"సినిమా స్టూడియోల్లో ఇప్పుడు ఏం జరిగినా వెంటనే అందరికీ తెలిసిపోతోంది. కానీ ఆ రోజుల్లో చాలా తక్కువమందికి ఆ విషయాలు తెలిసేవి. అలాంటి కాలాన్ని స్ఫూర్తిగా తీసుకొని రూపొందించిన సినిమానే ఇది. ఇద్దరు గొప్ప వ్యక్తులు తమ కళ, ప్రతిభకు సంబంధించి పడిన గొడవల నేపథ్యం ఇందులో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఇద్దరు గొప్ప వ్యక్తుల చీకటి కోణాల్ని ఆవిష్కరించేలా ఉంటాయి ఆ సన్నివేశాలు. అంతే కానీ, ఇది ఎవరి తాత, నాన్నల కథ కాదు (నవ్వుతూ). సినిమాని ప్రదర్శించాక అన్నీ సద్దుమణుగుతాయి. ఈ కథని 1950 నేపథ్యంలోనే తీయడానికి కారణం అప్పటి సంస్కృతి, సాహిత్యం, సంగీతమే. ఇప్పుడు ఎలా ఉన్నా సర్దుకుపోతున్నాం కానీ, అప్పట్లో సినిమాలో సంగీతం, సాహిత్యంకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఈ కథని ఆ కాలం నేపథ్యంలో రూపొందిస్తేనే న్యాయం జరుగుతుందని నమ్మాం".

- "సినిమా మాత్రమే కాలాన్ని పునఃసృష్టించి చూపించగలదు. మేం మద్రాస్ నుంచి ఇక్కడకు వచ్చేటప్పుడు హైదరాబాద్‌లో ఎలాంటి స్టూడియోలు ఉండేవి కావు. అప్పట్లో మద్రాస్‌లోని స్టూడియో సంస్కృతి గురించి మాట్లాడుతున్నప్పుడు ఎంతో ఆసక్తిగా అనిపించేది. అలాంటి సమయాన్ని, సంస్కృతిని ఈ సినిమా కోసం పునః సృష్టించి చిత్రీకరణ చేయడం ఎంతో ఆసక్తిగా అనిపించింది. దర్శకుడు ఈ కథని మొదట నాకే చెప్పాడు. దీనికి దుల్కర్ అయితేనే బాగుంటాడని తనని కలిశా. ఆ తర్వాత అన్నీ పక్కాగా కుదిరాయి. కమర్షియల్ మాస్ యాక్షన్ సినిమాలు చేయడం వేరు. ఇలాంటి కాలాన్ని వెనక్కి తీసుకొచ్చే సినిమాలు చేయడం వేరు. ఇలాంటి ఒక కథని మానవీయ భావోద్వేగాలు, డ్రామాతో చెప్పడం పెద్ద సవాల్. నాకూ, దుల్కర్‌కీ ఈ సినిమా చాలా ప్రత్యేకం. మేం సినిమాని జీవితాంతం ప్రేమించేవాళ్లం. మాకు అంతా సినిమానే ఇచ్చింది. మేం కూడా తిరిగి సినిమాకి ఇవ్వాలి. అలాంటి అవకాశం ఈ సినిమాతో వచ్చింది. నేను, దుల్కర్ ఎప్పట్నుంచో స్నేహితులం. కలిసి సినిమా చేయాలనుకున్నాం. అది 'కాంత' కావడం ఎంతో ఆనందంగా ఉంది. మా ఇద్దరి పాత్రలూ గొప్పగా ఉంటాయి. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే సరైన ఎంపిక అని నిరూపించింది. ఆమె నటన ఎంతో క్లాసీగా ఉంటుంది".

'కొదమసింహం' మళ్లీ వస్తోంది!

చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కిన కౌబాయ్ చిత్రం 'కొదమసింహం' సరికొత్త హంగులతో ముస్తాబై ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 1990లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి కె.మురళీమోహనరావు దర్శకుడు. రాధ, సోనం, వాణీ విశ్వనాథ్ కథానాయికలుగా నటించారు. మోహన్‌బాబు ముఖ్యపాత్ర పోషించారు. కైకాల నాగేశ్వరరావు నిర్మాత. ఆయనే ఈ చిత్రాన్ని 4కే విజువల్స్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సిద్ధం చేయించి, రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. "నా కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన ప్రయాణం ఈ చిత్రం. చిరస్మరణీయమైన పాటలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ సినిమా చిత్రీకరణకి సంబంధించి ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయి. దీన్ని మళ్లీ విడుదల చేస్తుండడం సంతోషంగా ఉంద"న్నారు చిరంజీవి. ఈ చిత్రానికి సంగీతం: రాజ్ - కోటి.



చిరంజీవి


నేను రాముణ్ని.. తను నా సీత

"నేను రాముణ్ని.. తను నా సీత'.. 'పోస్లే రావణుడు లేడు".. అంటూ ఓ ఇద్దరు మిత్రులు మాట్లాడుకుంటున్నారు. జానకిరాముడు ఉన్న దగ్గర రావణుడు లేకుండా ఉంటాడా? మరి ఆ కథేంటో తెలుసుకోవాలంటే 'మోగ్లీ 2025' సినిమా చూడాల్సిందే. రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సాక్షి సాగర్ కథానాయిక. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అగ్రహీరో ఎన్టీఆర్ విడుదల చేశారు. డిసెంబరు 12న రానుందీ చిత్రం.



సాక్షి, రోషన్, ఎన్టీఆర్, సందీప్ రాజ్

మావోడి గ్లామరు.. భామలకే ఫీవరు



రామ్

"అన్నకు మేము ఫ్యాన్సు. ఇప్పుడు ఏస్తాం రా డ్యాన్సు. వచ్చింది రా పిలుపు.. అన్నదేరా గెలుపు.." అంటూ తన హీరో సినిమా కోసం థియేటర్ల దగ్గర చిందులేస్తున్నారు రామ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం కోసమే ఇదంతా. పి.మహేశ్‌బాబు తెరకెక్కించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 28న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే 'ఫస్ట్ డే ఫస్ట్ షో..' అనే గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "మావోడి గ్లామరు భామలకే ఫీవరు.. ఆల్ ఆఫ్ యు సింగు.. మా ఆంధ్రాకే కింగు" అంటూ సాగిందీ గీతం. ఇందులో ఆయన ఓ హీరో వీరాభిమానిగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది.

'కాంత' సినిమా వ్యవహారమై నటుడు దుల్కర్‌కు నోటీసులు

తమిళ సినిమా తొలి సూపర్‌స్టార్ ఎం.కె. త్యాగరాజ భాగవతార్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'కాంత' సినిమాపై నిషేధం విధించాలని దాఖలైన పిటిషన్‌పై జవాబివ్వాలని నటుడు దుల్కర్ సల్మాన్‌కు చెన్నై సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎం.కె. త్యాగరాజ భాగవతార్ మనవడు, తమిళనాడు ప్రభుత్వ విశ్రాంత జాయింట్ కార్యదర్శి త్యాగరాజన్(64) దాఖలు చేసిన పిటిషన్‌లో.. దుల్కర్ సల్మాన్ నటించిన, కొచ్చికి చెందిన వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేటు లిమిటెడ్, హైదరాబాద్‌కి చెందిన స్పిరిట్ మీడియా ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా 'కాంత' పేరుతో సినిమా నిర్మించినట్లు తెలిసిందన్నారు. ఈ సినిమా తన తాత ఎం.కె.త్యాగరాజ భాగవతార్ జీవితం ఆధారంగా తెరకెక్కించారని, టీజర్ ఇదివరకే విడుదలైన నేపథ్యంలో నవంబరు 14న సినిమా విడుదల కానుందని పేర్కొన్నారు. ప్రముఖుల జీవితాన్ని సినిమాగా తెరకెక్కించాలంటే వారి చట్టపరమైన వారసుల అనుమతి తీసుకోవాలన్నారు. పాత్రల పేర్లు మార్చినా ప్రజలు గుర్తు చేసుకోగలరన్నారు. భాగవతార్ అనైతికంగా జీవించారని, కంటి చూపు కోల్పోయారని, చివరి రోజుల్లో పేదరికంలో చిక్కుకుని, అప్పుల్లో మరణించినట్లు సినిమాలో చిత్రీకరించారని ఆరోపించారు. సొంతంగా బంగ్లా, ఖరీదైన కార్లు తన తాత వద్ద ఉన్నాయన్నారు. ఎలాంటి చెడు అలవాట్లు ఆయనకు లేవని, కనీస ఆధారాల్లేకుండా అనుచితంగా చిత్రీకరించిన సినిమా విడుదలపై నిషేధం విధించాలని కోరారు. పిటిషన్‌ను విచారించిన సిటీ సివిల్ కోర్టు 18వ తేదీ లోపు జవాబివ్వాలని సినిమా నిర్మాణ సంస్థలు, దుల్కర్ సల్మాన్‌కు నోటీసులు జారీ చేసింది. – న్యూస్‌టుడే, చెన్నై(ప్యారిస్)


సరదా ప్రయాణం



దినేశ్, రోజాభారతి

రోజా భారతి, దినేశ్, సుమంత్, అనుపమ, రాఖీశర్మ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'సీత ప్రయాణం కృష్ణతో'. దేవేందర్ దర్శకత్వం వహిస్తున్నారు. రాజీవ్, రోజా భారతి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. కథానాయిక, నిర్మాత రోజాభారతి మాట్లాడుతూ "ఐదుగురు వ్యక్తుల నేపథ్యంలో సరదా సరదాగా సాగుతుంది. కృష్ణతో కలిసి సీత ప్రయాణం చేయాలనుకోవడానికి కారణం ఏమిటన్నది తెరపైనే చూడాలి" అన్నారు.

ఆసుపత్రి నుంచి ధర్మేంద్ర డిశ్చార్జ్



ప్రముఖ బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర అనారోగ్య సమస్యల కారణంగా కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోన్న సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం ధర్మేంద్ర డిశ్చార్జి అయ్యారని ఆయనకు చికిత్స అందించిన డాక్టర్ ప్రతీత్ సందానీ తెలిపారు. ఆయనకు ఇంటి వద్దే చికిత్స అందించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. "ధర్మేంద్ర ఇంట్లోనే కోలుకుంటున్నారు. ఈ సమయంలో మీడియా, ప్రజలు ఊహాగానాలకు దూరంగా ఉండాలని, కుటుంబ గోప్యతను గౌరవించాలని కోరుతున్నాం. ఆయన కోలుకోవాలని మీ అందరూ చూపించిన ప్రేమ, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని ధర్మేంద్ర కుటుంబం తరఫు వ్యక్తి ఓ ప్రకటనలో తెలిపారు.

నేను బాగున్నాను!

● సీనియర్ నటుడు గోవిందా



ప్రస్తుతం తాను క్షేమంగానే ఉన్నానని చెప్పారు సీనియర్ బాలీవుడ్ నటుడు గోవిందా. మంగళవారం అర్ధరాత్రి స్పృహ కోల్పోవడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు ఆయన స్నేహితుడు, లీగల్ అడ్వైజర్ లలిత్ బిందాల్ మీడియాతో తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయన బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా గోవిందా విలేకర్లతో మాట్లాడుతూ.."నేను బాగున్నాను. అధికంగా వ్యాయామం చేశాను. అందువల్ల అలసిపోయాను. భారీ వ్యాయామం కఠినమైనది. నా వ్యక్తిత్వాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. యోగా, ప్రాణాయామం మంచిదని నేను భావిస్తున్నాను. చికిత్స కొనసాగుతుంది. వైద్యులు నాకు మందులు ఇచ్చారు"అన్నారు. దీనిపై బిందాల్ మాట్లాడుతూ.."మంగళవారం రాత్రి గోవిందా అతని నివాసంలో స్పృహ కోల్పోయారు. దాంతో కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే వైద్యులను సంప్రదించాము. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉంది. విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యులు పర్యవేక్షణలో ఉన్నారు"అని తెలిపారు. గత సంవత్సరం అక్టోబరులో గోవింద లైసెన్స్ రివాల్వర్ పేలి మోకాలికి బుల్లెట్ గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు.

మానవత్వంలో రాణి

సిస్టర్ రాణి మరియా వట్టాలిల్ జీవితం ఆధారంగా రూపొందిన 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్' చిత్రం తెలుగులో ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. 2024 ఆస్కార్ పురస్కారాలకు ఉత్తమ ఒరిజినల్ స్కోర్ విభాగంలో నామినేట్ అయిన చిత్రమిది. విన్సీ అలోషియస్ ప్రధాన పాత్రధారిగా నటించగా షైసన్.పి.ఔసేఫ్ దర్శకత్వం వహించారు. దారుణంగా హత్యకు గురైన రాణి జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, చేసిన త్యాగాలు, ఆమెలోని మానవత్వం, క్షమాగుణం ఆధారంగానే 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్' చిత్రం రూపొందింది. మలయాళంలో ట్రై లైట్ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని దివ్యవాణి సోషల్ కమ్యూనికేషన్స్ పతాకంపై తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.



'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్'

ఛాంపియన్


నితీశ్ కుమార్

నితీశ్‌కు చోటు లేదు

- దక్షిణాఫ్రికాతో టెస్టు జట్టు నుంచి విడుదల
- 'ఎ' జట్టుతో వన్డేలు ఆడనున్న ఆల్‌రౌండర్
- జురెల్‌కు తుది జట్టులో స్థానం ఖాయం

కోల్‌కతా

గత ఏడాది టెస్టుల్లో అరంగేట్రం చేసిన పుట్టి నుంచి నిలకడగా తుది జట్టులో ఆడుతూ వచ్చిన తెలుగు కుర్రాడు, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి.. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. నితీశ్‌కు తుది జట్టులో చోటు ఇవ్వడం కష్టంగా మారడంతో అతణ్ని ఈ సిరీస్ నుంచి విడుదల చేశారు. ఇదే సమయంలో దక్షిణాఫ్రికా-ఎతో వన్డేలు ఆడనున్న భారత్-ఎ జట్టుకు అతను ప్రాతినిధ్యం వహించనున్నాడు. రెండు జట్ల మధ్య గురువారం తొలి వన్డే జరగనుంది. తర్వాత ఈ నెల 16, 19 తేదీల్లో ఇంకో రెండు మ్యాచ్‌లున్నాయి. నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో టెస్టుల్లో అరంగేట్రం చేసిన నితీశ్.. తొలి సిరీస్‌లోనే సెంచరీతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లోనూ పర్వాలేదనిపించాడు. కానీ తర్వాత అతను టెస్టుల్లో నిలకడగా రాణించలేకపోయాడు. ఇంగ్లాండ్ పర్యటన మధ్యలో గాయపడి స్వదేశానికి వచ్చేశాడు. స్వదేశీ టెస్టుల్లో నితీశ్‌తో బౌలింగ్ చేయాల్సిన అవసరం పడట్లేదు. గత నెలలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో అతను కేవలం 4 ఓవర్లే బౌలింగ్ చేశాడు. బ్యాటింగ్‌లో ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. దీంతో తన బదులు స్పెషలిస్టు బ్యాటర్‌నే ఎంచుకోవడం మంచిదనే నిర్ణయానికి జట్టు యాజమాన్యం వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ఆరంభం కాకముందే.. నితీశ్‌ను టెస్టు జట్టు నుంచి విడుదల చేశారు. "నితీశ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం లేదు. అతను గాయాల నుంచి కోలుకుని వచ్చాడు. ఎక్కువ మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. అయిదు రోజుల పాటు ఊరికే కూర్చోబెట్టడం వల్ల లాభం లేదు. దాని బదులు 'ఎ' జట్టు తరపున వన్డేలు ఆడితే.. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఉపయోగపడుతుంది" అని జట్టు వర్గాలు తెలిపాయి.

జురెల్ కోసమే..: దేశవాళీల్లో సూపర్ ఫామ్‌తో సత్తా చాటుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆడబోతున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ పర్యటనలో ప్రధాన వికెట్ కీపర్ రిషభ్ పంత్ గాయపడటంతో అతడి స్థానంలో వరుసగా మ్యాచ్‌లు ఆడాడు జురెల్. అయితే పంత్ గాయం నుంచి కోలుకుని దక్షిణాఫ్రికా సిరీస్‌కు అందుబాటులోకి రావడంతో జురెల్‌కు తుది జట్టులో స్థానం కష్టమే అనిపించింది. కానీ తన చివరి అయిదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 127 నాటౌట్, 132 నాటౌట్, 44, 125, 56, 140 స్కోర్లతో అతను అదరగొట్టాడు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా-ఎతో నాలుగు రోజుల మ్యాచ్‌లో వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకాలు బాదడంతో జురెల్‌ను భారత తుది జట్టులోకి ఎంపిక చేయక తప్పని పరిస్థితి తలెత్తింది. అతడికి చోటు కల్పించే నేపథ్యంలోనే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని జట్టు నుంచి విడుదల చేయాలని జట్టు యాజమాన్యం నిర్ణయించినట్లు తెలుస్తోంది. జురెల్ తుది జట్టులో ఉంటాడని టీమ్‌ఇండియా సహాయ కోచ్ టెన్ డస్కాటే కూడా ధ్రువీకరించాడు. "జట్టు కూర్పు విషయంలో మాకు పూర్తి స్పష్టత వచ్చింది. ఈ టెస్టు నుంచి పంత్, జురెల్‌లలో ఎవరినీ పక్కన పెట్టలేం. సంక్షిప్తంగా నేను ఇవ్వగలిగిన సమాధానమది. ధ్రువ్, పంత్‌లను ఈ మ్యాచ్‌లో చూడకపోతే ఆశ్చర్యపోవాల్సి ఉంటుంది" అని డస్కాటే తెలిపాడు.


జురెల్

స్పిన్ దాడికి సిద్ధం: గత ఏడాది న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఎదురైన ఓటమి నుంచి భారత బ్యాటర్లు పాఠాలు నేర్చుకుని ఉంటారని ఆశిస్తున్నట్లు డస్కాటే చెప్పాడు. దక్షిణాఫ్రికా నుంచి ఎదురయ్యే స్పిన్ దాడిని ఎదుర్కోడానికి తమ బ్యాటర్లు సిద్ధమేనని అతనన్నాడు. "స్పిన్‌ను ఆడడంలో ఒక ప్రణాళికతో ఉన్నాం. కొన్ని వారాల ముందు పాకిస్థాన్‌తో సిరీస్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్లు సత్తా చాటారు. ప్రస్తుత సిరీస్‌లోనూ ఆ జట్టు ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఖాయం. వాళ్లను ఎదుర్కోవడం సవాలే. అదే సమయంలో ఉపఖండపు జట్టుతో ఆడుతున్నామని వాళ్లు గుర్తుంచుకోవాలి" అని డస్కాటే చెప్పాడు.


గంభీర్ పంత్

పంత్.. జోరుగా హుషారుగా

గాయం నుంచి కోలుకుని ఇటీవలే దక్షిణాఫ్రికా-ఎతో రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. టెస్టు సిరీస్ ముంగిట ప్రాక్టీస్‌లో చెమటోడ్చుస్తున్నాడు. ఇంగ్లాండ్ పర్యటన మధ్యలో గాయంతో స్వదేశానికి వచ్చేసిన పంత్.. ఆ తర్వాత టెస్టు మ్యాచ్ ఆడబోయేది ఇప్పుడే. సఫారీలతో తొలి టెస్టు శుక్రవారం ఆరంభం కానుండగా.. బుధవారం ఈడెన్ గార్డెన్స్‌లో పంత్ సుదీర్ఘ సమయం నెట్స్‌లో శ్రమించాడు. బ్యాటింగ్‌లో చాలా సౌకర్యంగా కనిపించిన పంత్.. స్వేచ్ఛగా షాట్లు ఆడాడు. ఎక్కువగా పంత్ స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలను ఎదుర్కొన్నాడు. పదే పదే క్రీజు బయటికి వచ్చి షాట్లు ఆడిన పంత్.. బంతులను గాల్లోకి పంపాడు.

వాళ్లకు సవాలే..!

ముంబయి

భారత్‌లో టెస్టు సిరీస్ అంటే ఏ జట్టుకైనా పెద్ద పరీక్షే. బంతి గిర్రున తిరిగే పిచ్‌లపై ఎన్నో మేటి జట్లు తడబడ్డాయి. దక్షిణాఫ్రికా కూడా అంతే. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మంచి విజయాలు సాధించినా.. భారత్‌లో మాత్రం ఆ జట్టుకు నిరాశ తప్పలేదు. దక్షిణాఫ్రికాపై టీమ్‌ఇండియా స్వదేశంలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. గతంలో ఎనిమిదిసార్లు భారత్‌కు వచ్చిన సఫారీ జట్టు.. ఒకే ఒక్కసారి (2000లో, 2-0)తో సిరీస్ నెగ్గగలిగింది. ఈ దేశంలో దక్షిణాఫ్రికా టెస్టు మ్యాచ్ నెగ్గి 15 ఏళ్లైపోయింది. గత రెండు సిరీస్‌ల్లో ప్రదర్శనైతే ఘోరం. భారత్ స్పిన్ వలలో చిక్కుకుని విలవిల్లాడిన ఆ జట్టు 2015లో 0-3తో, 2019లో 0-3తో వైట్‌వాష్‌కు గురైంది. ఈసారి రెండు టెస్టుల సిరీస్‌లో ఎలాంటి పోటీ ఇవ్వబోతుందన్నది ఆసక్తికరం. దక్షిణాఫ్రికా ఈసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్ హోదాలో భారత్‌లో అడుగుపెట్టింది. ఇటీవల పాకిస్థాన్‌లో తమ స్పిన్నర్లు విశేషంగా రాణించడం, అక్కడ సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకోవడం ఆ జట్టు విశ్వాసాన్ని పెంచేదే. నిరుడు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో 3-0తో గెలవడం దక్షిణాఫ్రికాకు ప్రేరణనిస్తుందనడంలో సందేహం లేదు. పైగా పిచ్‌లు కూడా ఒకప్పటంత విపరీతంగా స్పిన్‌కు అనుకూలించే అవకాశాలు లేని నేపథ్యంలో.. దక్షిణాఫ్రికా ఆత్మవిశ్వాసంతో సిరీస్‌కు సిద్ధమైంది. కానీ టీమ్‌ఇండియాపై పైచేయి సాధించడం ఆ జట్టుకు తేలిక కాదు. బౌలింగ్‌లో రెండు జట్లు సమంగా ఉన్నాయని, బ్యాటర్లకే పరీక్ష ఎదురుకానుందని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు హషీమ్ ఆమ్లా అభిప్రాయపడ్డాడు. "రెండు జట్లలోనూ మంచి సీమర్లు, మంచి స్పిన్నర్లు ఉన్నారు. బౌలింగ్‌లో బలాలు దాదాపు సమానంగా ఉన్నాయి. కానీ బ్యాటర్లు పరుగులు చేసి, బౌలర్లకు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే వీలు కల్పించడం కీలకం. బ్యాటింగ్ రెండు జట్లకూ పరీక్షే" అని చెప్పాడు. దక్షిణాఫ్రికా జట్టులో కొందరికి భారత్‌లో ఆడిన అనుభవం లేదని, అదే వారికి సానుకూలాంశం కావొచ్చని ఆమ్లా అన్నాడు. "కొందరు దక్షిణాఫ్రికా బ్యాటర్లు మొదటిసారి భారత్‌కు వచ్చారు. అది వారికి లాభించే అంశం కూడా కావొచ్చు. ఎందుకంటే గత పర్యటనల ఓటమి భారం వాళ్లపై ఉండదు. తాజాగా ఉంటారు" అని చెప్పాడు.


బవుమా


స్మిత్

ఇలా చేయండి: స్మిత్

స్పిన్నర్ల కంటే ముందు బుమ్రా పదునైన పేస్‌ను సమర్థంగా ఎదుర్కోవడం టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికాకు కీలకమని ఆ జట్టు మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ అన్నాడు. "స్పిన్నర్లను ఎదుర్కోనేందుకు దక్షిణాఫ్రికాపై తప్పక సన్నద్ధమవుతుంది. అయితే త్వరత్వరగా రెండు లేదా మూడు వికెట్లు కోల్పోవడం కంటే ఇబ్బంది ఇంకోటి ఉండదు. ఆ తర్వాత స్పిన్నర్లను ఎదుర్కోవాలి. మ్యాచ్‌లో నిలవడానికి చాలా కష్టపడాల్సివుంటుంది. కాబట్టి ఆరంభంలో బుమ్రాను సమర్థంగా ఎదుర్కోవడం చాలా ముఖ్యం. అలాగే రబాడను మెరుగ్గా ఎదుర్కోవడం భారత్‌కు కీలకం" అని చెప్పాడు.

కాంపౌండ్ మిక్స్‌డ్ ఫైనల్లో భారత్

ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. అభిషేక్ వర్మ, దీప్షికల జంట కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఈ రెండో సీడ్ భారత ద్వయం 156-153తో కజకిస్థాన్ జోడీపై విజయం సాధించింది. అభిషేక్, దీప్షిక ఫైనల్లో బంగ్లాదేశ్ జంటతో తలపడతారు. ఇప్పటివరకు భారత్‌కు అయిదు పతకాలు ఖాయమయ్యాయి. మరో ఏడు పతకాలకు పోటీలో ఉంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో యశ్‌దీప్ భోగ్, అన్షిక కుమారి ద్వయం కాంస్యం కోసం పోటీలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో 5-1తో బంగ్లాదేశ్ జోడీపై గెలిచిన ఈ జంట.. సెమీఫైనల్లో 0-6తో చైనీస్ తైపీ జట్టు చేతిలో పరాజయంపాలైంది. యశ్‌దీప్-అన్షిక్ కాంస్య పతక ప్లేఆఫ్‌లో కొరియా జంటతో తలపడతారు.


అభిషేక్, దీప్షిక



మేం ఆడలేం..

- స్వదేశానికి ఎనిమిది మంది లంక క్రికెటర్లు!
- పాకిస్థాన్‌లో భద్రతపై ఆందోళన
- రద్దు దిశగా వన్డే సిరీస్

కొలంబో: పాకిస్థాన్, శ్రీలంక మధ్య వన్డే సిరీస్ కొనసాగడం సందిగ్ధంగా మారింది. పాక్‌లో పర్యటిస్తోన్న లంక జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు గురువారం స్వదేశానికి బయల్దేరనున్నారు. ఇస్లామాబాద్‌లో బాంబు పేలుడుతో 12 మంది మృతి చెందిన నేపథ్యంలో ఈ ఆటగాళ్లు తమ భద్రతపై ఆందోళన చెందుతున్నారని క్రికెట్ శ్రీలంక (ఎస్‌ఎల్‌సీ) వర్గాలు బుధవారం తెలిపాయి. ఈ పరిస్థితుల్లో గురువారం రావల్పిండిలో రెండో వన్డే జరిగే అవకాశం లేనట్లే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రావల్పిండిలోనే జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ గెలిచింది. మూడో వన్డేకూ రావల్పిండి ఆతిథ్యమివ్వాల్సింది. షెడ్యూలు ప్రకారం వన్డే సిరీస్ తర్వాత శ్రీలంక.. పాకిస్థాన్‌లో ముక్కోణపు సిరీస్ (మూడో జట్టు జింబాబ్వే) ఆడాల్సి ఉంది. ఇస్లామాబాద్‌కు చాలా దగ్గర్లోనే రావల్పిండి ఉండడం భద్రతపై తమ క్రికెటర్లు ఆందోళన చెందడానికి కారణమని ఓ శ్రీలంక బోర్డు అధికారి చెప్పాడు. పాక్-శ్రీలంక సిరీస్ రద్దయ్యే అవకాశాలే ఎక్కువ. 2009లో లాహోర్‌లో గడాఫీ స్టేడియానికి వెళ్తుండగా శ్రీలంక క్రికెటర్ల బస్సుపై తీవ్రవాదులు దాడి చేశారు. అజంత మెండిస్, చమింద వాస్, మహేల జయవర్దనే సహా చాలా మంది ఆటగాళ్లు ఈ దాడిలో గాయపడ్డారు. అనేక మంది భద్రత సిబ్బంది మృతి చెందారు. ఆ దాడి నేపథ్యంలో దాదాపు దశాబ్దం పాటు విదేశీ జట్లు పాకిస్థాన్‌కు వెళ్లలేదు. విశేషమేంటంటే.. 2019 డిసెంబరులో శ్రీలంక పర్యటనతోనే పాకిస్థాన్‌కు తిరిగి విదేశీ జట్ల రాక మొదలైంది.

ఈడెన్‌లో పేస్ పంచ్!



కోల్‌కతా: భారత్‌లో టెస్టు సిరీస్ కోసం వచ్చే ఉపఖండేతర జట్లకు స్పిన్ పిచ్‌లతో స్వాగతం పలకడం మామూలే. అయితే గౌతమ్ గంభీర్ కోచ్ అయ్యాక.. పిచ్‌లు సమతూకంతో ఉండాలనే కోరుకుంటున్నాడు. విదేశీ పేస్ పిచ్‌లకు దగ్గరగా ఉండే వికెట్లపైనే ఆడాలన్నది అతడి అభిమతం. గత ఏడాది బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో ఇదే ప్రయత్నం జరిగింది. పిచ్‌లు పేస్‌కు అనుకూలించాయి. కానీ తర్వాత న్యూజిలాండ్‌తో సిరీస్‌కు సంప్రదాయ స్పిన్ పిచ్‌లనే సిద్ధం చేశారు. ఆశ్చర్యకరంగా ఆ సిరీస్‌లో భారత బ్యాటర్లే స్పిన్ ఉచ్చులో చిక్కుకున్నారు. మన బౌలర్లు ఆ వికెట్లను సరిగా ఉపయోగించుకోలేకపోయారు. గత నెలలో ఆడిన టెస్టు సిరీస్ బలహీన వెస్టిండీస్‌తో కాబట్టి పిచ్‌ల గురించి పెద్దగా చర్చ లేకపోయింది. కానీ ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో తలపడబోతోంది టీమ్‌ఇండియా. శుక్రవారం నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే తొలి టెస్టుకు వికెట్ ఎలా ఉంటుందనే ఆసక్తి అందరిలోనూ ఉంది. ఇక్కడ స్పిన్నర్ల ఆధిపత్యం సాగుతుందన్న సంగతి తెలిసిందే. పేసర్లకూ కొంత అవకాశముంటుంది. ఈ మ్యాచ్‌కు వికెట్ పేస్‌కు కొంచెం ఎక్కువగానే సహకరించే అవకాశముందట. ఇరు జట్లూ ముగ్గురు చొప్పున స్పిన్నర్లతో బరిలోకి దిగుతుండగా.. పిచ్ పూర్తిగా స్పిన్నర్ల స్వర్గధామంలా ఉండదు! బంతి మూడో రోజు నుంచే తిరుగుతుందని.. తొలి రెండు రోజులు పేసర్ల ఆధిపత్యం చూడొచ్చని సమాచారం. పిచ్‌కు తోడు మంచు ప్రభావం వల్ల ఫాస్ట్‌బౌలర్లను ఎదుర్కోవడం కష్టంగా ఉండొచ్చు. అయితే తొలి సెషన్లో ఆచితూచి ఆడితే.. తర్వాత పరుగులు చేయడం తేలికే. మూడో రోజు నుంచి స్పిన్నర్ల జోరు చూడొచ్చని, చివరి రెండు రోజులు బంతి బాగా తిరుగుతుందని తెలుస్తోంది.


రోహిత్, కోహ్లి

దేశవాళీలో ఆడండి

విరాట్, రోహిత్‌లకు బీసీసీఐ ఆదేశం!

దిల్లీ: 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆడాలని టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కోరుకుంటున్నారు. అయితే టెస్టు, టీ20 ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఆ ఇద్దరు మాజీ కెప్టెన్లను జట్టు ఎంపికలో పరిగణించాలంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశించిందట. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలంటే దేశవాళీ క్రికెట్లో ఆడాల్సిందిగా విరాట్, రోహిత్‌లకు బీసీసీఐతో పాటు జట్టు మేనేజ్‌మెంట్ సమాచారం అందించింది. వన్డేలు తగ్గిపోయిన నేపథ్యంలో మ్యాచ్ ఫిట్‌గా ఉండాలంటే వాళ్లు దేశవాళీ క్రికెట్లో ఆడాల్సిందే" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. డిసెంబరు 24న 2025-26 విజయ్ హజారె ట్రోఫీ ప్రారంభంకానుంది. ఈ దేశవాళీ వన్డే టోర్నీలో విరాట్, రోహిత్ ఆడతారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. రోహిత్ శర్మ ఇప్పటికే తన సంసిద్ధతను తెలిపినట్లు మొదట వార్తలొచ్చాయి. అయితే.. అవన్నీ ఊహాగానాలేనని ఎంసీఏ అధికారి తెలిపాడు. రోహిత్ నుంచి ఎంసీఏకు ఎలాంటి విజ్ఞప్తి అందలేదని చెప్పాడు. విజయ్ హజారె కంటే ముందు స్వదేశంలో టీమ్‌ఇండియా.. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టైబ్రేక్‌కు అర్జున్, హరికృష్ణ


అర్జున్

పంజిమ్ (గోవా): చెస్ ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రీడాకారులు అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ, ప్రజ్ఞానంద అయిదో రౌండుకు చేరుతారా లేదా అన్నది టైబ్రేక్‌లో తేలనుంది. నాలుగో రౌండ్లో ఈ ముగ్గురూ తమ ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకున్నారు. అర్జున్, హంగేరి క్రీడాకారుడు పీటర్ లెకో మధ్య గేమ్ 36 ఎత్తుల వద్ద డ్రాగా ముగిసింది. స్వీడన్ గ్రాండ్ మాస్టర్ గ్రెండెలియస్‌తో గేమ్‌లో హరికృష్ణ కొంత తడబడ్డప్పటికీ.. ఉత్కంఠభరిత క్షణాలను అధిగమిస్తూ 38 ఎత్తుల వద్ద డ్రా చేసుకున్నాడు. ప్రజ్ఞానంద-డానియెల్ దుబోవ్ (రష్యా) గేమ్ 30 ఎత్తుల్లోనే డ్రా అయింది. వీరు గురువారం ఈ ప్రత్యర్థులతోనే టైబ్రేక్ ఆడనున్నారు. మరోవైపు మెక్సికో క్రీడాకారుడు జోస్ మార్టినెజ్.. అలెక్సీ సరానా (రష్యా)ను ఓడించి అయిదో రౌండుకు దూసుకెళ్లాడు. అరోనియన్ (అర్మేనియా) సైతం ముందంజ వేశాడు. కార్తీక్, ప్రణవ్ నాలుగో రౌండ్లో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బెంగళూరుకు ఆర్‌సీబీ దూరం!

పుణె: ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సొంత వేదికను మార్చుకునే ప్రయత్నంలో ఉంది. ఈ ఏడాది జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంతో ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకలు విషాదాంతం అయ్యాయి. ఈ నేపథ్యంలో బెంగళూరులో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై అనిశ్చితి నెలకొనడంతో ఆర్‌సీబీ ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించింది. దీనిలో భాగంగా పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియంలో 2026 ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సమాలోచనలు చేస్తోంది. ఈ విషయాన్ని ఎంసీఏ కార్యదర్శి కమలేష్ పిసాల్ కూడా ధ్రువీకరించాడు. "బెంగళూరులో మ్యాచ్‌లు నిర్వహించడానికి ఆర్‌సీబీ సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రత్యామ్నాయ వేదిక కోసం వెతుకుతున్నట్లు తెలిసింది. మాకు సొంత జట్టు లేనందున పుణెలో మ్యాచ్‌లు నిర్వహించుకోవాల్సిందిగా ఆర్‌సీబీని ఆహ్వానించాం. 2018లో చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లకు పుణె వేదికగా నిలిచింది. ఆర్‌సీబీ మ్యాచ్‌ల ఆతిథ్యానికి అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశాం" అని కమలేష్ పేర్కొన్నాడు.

ఓడించాలనే కసితో ఉన్నాం


కేశవ్ మహరాజ్

కోల్‌కతా: దక్షిణాఫ్రికా గత 15 ఏళ్లలో భారత్‌లో టెస్టు మ్యాచ్ గెలవలేదు. కానీ ఈసారి భారత్‌ను భారత్‌లో ఓడించాలనే కసితో ఉన్నామని సఫారీ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అన్నాడు. "భారత్‌ను భారత్‌లో ఓడించాలనే కసి, పట్టుదల మా జట్టులో ఉన్నాయి. మాకిది అత్యంత కఠిన పర్యటనల్లో ఒకటి. ఎన్నో తరాలు ఇక్కడికి వచ్చాయి. భారత్‌తో సిరీస్ మాకు పెద్ద పరీక్ష. ఉపఖండంలో ఇతర ప్రాంతాలను జయించడం మొదలుపెట్టాం. ఈసారి భారత్‌లో గెలవాలనుకుంటున్నాం" అని చెప్పాడు. ప్రస్తుత సిరీస్‌కు క్యురేటర్లు స్పిన్‌కు సహకరించే పిచ్‌లు తయారు చేయకపోవచ్చని కేశవ్ అభిప్రాయపడ్డాడు. "ఈ సిరీస్‌కు మంచి పిచ్‌లు తయారు చేస్తారని అనుకుంటున్నా. మ్యాచ్ సాగుతున్నకొద్దీ పిచ్‌లు క్షీణించవచ్చు" అని అన్నాడు. భారత్‌లో గత రెండు పర్యటనల్లో (2015, 2019) దక్షిణాఫ్రికా ఒక్క టెస్టూ నెగ్గలేకపోయింది.

భారత్ చేతిలో ఆసీస్ చిత్తు

దిల్లీ: మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 238 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 292 పరుగులు సాధించింది. దీపిక (58 బంతుల్లో 91), ఫూలా సరెన్ (22 బంతుల్లో 54 నాటౌట్) సత్తాచాటారు. ఆసీస్ 52 ఎక్స్‌ట్రాలు, 26 పెనాల్టీ పరుగులు భారత్‌కు సమర్పించుకుంది. అనంతరం ఆసీస్ 19.3 ఓవర్లలో 83 పరుగులకే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన దీపికకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరో మ్యాచ్‌లో నేపాల్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందింది.

భారత షూటర్లు విఫలం


కైరో: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ మహిళల 50మీ రైఫిల్ 3 పొజిషన్స్‌లో భారత షూటర్లు విఫలమయ్యారు. అశి చౌక్సీ, ఒలింపియన్ అంజుమ్ మౌద్గిల్ ఫైనల్స్‌కు చేరలేకపోయారు. అశి (588) 15వ స్థానంలో నిలవగా.. అంజుమ్ (587) 17వ స్థానంతో సరిపెట్టుకుంది. ఒలింపియన్ సిఫ్ట్ కౌర్ సమ్రా (580) 48వ స్థానంలో నిలిచింది. నార్వేకు చెందిన జీనెట్ హెగ్ ఫైనల్లో 465.8 స్కోరుతో స్వర్ణం సాధించింది. స్విట్జర్లాండ్ అమ్మాయి ఎమిలీ (465.3) రజతం, బ్రిటన్ షూటర్ సియోనైడ్ మెకింతోష్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ టోర్నీలో భారత్ ఇప్పటివరకు మూడు స్వర్ణాలు, అయిదు రజతాలు, మూడు కాంస్యాలు సొంతం చేసుకుంది. పతకాల పట్టికలో చైనా (15) తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది.


లక్ష్యసేన్

ప్రణయ్, లక్ష్య శుభారంభం

కుమామోటో (జపాన్): జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి షట్లర్లు హెచ్.ఎస్.ప్రణయ్, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21-12, 21-16తో కొకి వతనబె (జపాన్)పై, ప్రణయ్ 16-21, 21-13, 23-21తో లియోంగ్ జున్ (మలేసియా)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆయుష్ శెట్టి 16-21, 11-21తో కొడయ్ నరవొక (జపాన్) చేతిలో, తరుణ్ మన్నెపల్లి 9-21, 19-21తో జియోన్ జిన్ (కొరియా) చేతిలో, కిరణ్ జార్జ్ 20-22, 10-21తో జింగ్ హాంగ్ (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ 12-21, 21-19, 20-22తో ప్రెస్లీ స్మిత్-జెనీ గాయ్ (అమెరికా) జంట చేతిలో పోరాడి ఓడింది.

శిష్యులకు మాటిచ్చి.. పద్మాసనం వేసి..



శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామి ఆలయం ప్రసిద్ధం. ఆ ప్రాంగణలోని యతిరాజ మందిరంలో శ్రీరామానుజుల రూపం దర్శనమిస్తుంది. ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి... విశిష్టాద్వైత ప్రబోధకుడు, ఆదిశేషుని అవతారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీరామానుజాచార్యులు ఒకరోజు శిష్యులను దగ్గరకు పిలిచి... తాను శ్రీమన్నారాయణుని సన్నిధి చేరుకునే సమయం ఆసన్నమైందని తెలియజేశారు. శిష్యులు చింతిస్తూ.. తమను విడిచి వెళ్లొద్దంటూ ఆచార్యుని వేడుకున్నారు. వారిని ఓదార్చి.. తాను మరో మూడు రోజులు ఉండేందుకు అంగీకరించారు రామానుజులవారు. ఆ మూడు రోజులు ఆయన శ్రీరంగపట్టణంలో దివ్య ప్రబంధం పారాయణ చేస్తూ ఆఖరిరోజున తన గురువైన యమునాచార్యుని శ్రీపాదుకలకు నమస్కరించారు. పద్మాసనంలో కూర్చుని ధ్యానంలో మునిగి.. సమాధి స్థితిలోకి వెళ్లారు. ఆయన శిష్యులు నంబి తదితరులు బాధాతప్త హృదయాలతో నమస్కరించారు. గురువు దేహానికి పచ్చకర్పూరాన్ని, ఎర్రసిందూరాన్ని లేపనాలుగా పూశారు. శ్రీరంగం ఆలయంలోని నాలుగో ప్రాకారంలో నైరుతి మూలన ఆయన శరీరాన్ని భద్రపరిచారు. ఆదిశేషుని అవతారంగా భావించే రామానుజులవారు అక్కడే ఉన్నారని విశ్వసిస్తారు భక్తులు. ఆ విశిష్టాద్వైత ప్రబోధకుడు నేటికీ పూజలు అందుకుంటున్నారు.

అరటిపండు ఎందుకు విశిష్టం?!

పూజ, వ్రతం, పెళ్లి, పేరంటం.. ఇలా మన ఆచారాలూ సంప్రదాయాల్లో అరటిపండుకు ప్రత్యేక స్థానం ఉంది కదా! భగవంతుడికి సమర్పించడానికి ఇతర పండ్లు ఎన్నున్నా.. అరటిపండు తప్పనిసరిగా ఉంటుంది. ఇవి అన్ని కాలాల్లోనూ లభిస్తాయి. అంతకుమించి ఈ పండ్లను శుభసూచకంగా భావిస్తారు. ఇంతకూ అరటిపండు ఎందుకు విశిష్టమైందో చూద్దామా..

సపోటా, శీతాఫలం వంటి పండ్లలో గుజ్జు తిని గింజలను పడేస్తాం. అలా పారేసిన విత్తనాలు మళ్లీ మొలకెత్తి వృక్షాలై.. తిరిగి పండ్లను ఇస్తాయి. అంటే ఎంగిలి విత్తనాల నుంచి వచ్చిన చెట్ల ఫలాలను మనం ఆరగిస్తాం. దేవుడికి కూడా నివేదిస్తాం. కానీ అరటిపండు అలా కాదు. పూర్తిగా తినేస్తాం కాబట్టి గింజలు పారేయటం, తిరిగి మొలకెత్తటం ఉండదు. పిలక మొక్కల ద్వారా అరటితోట వృద్ధిచెందుతుంది. ఈ కారణం వల్ల అరటిపండును దేవునికి సమర్పించడం శ్రేష్ఠమని, ఇది పూర్ణఫలమని పెద్దలు చెబుతారు. పండుతోపాటు ఆకులూ పవిత్రమైనవే. అరటిచెట్టు ప్రతిభాగం ఏదో విధంగా పూజకి ఉపయోగపడుతుంది. అతి తక్కువ కాలంలోనే ఫలాలను అందిస్తుంది. అరటిపండ్లను ఆరగించినప్పటికీ పిలకల ద్వారా చెట్లు వస్తూనే ఉంటాయి. పూర్ణఫలంగా భావించే అరటిపండును దేవుడికి నివేదించి.. ప్రసాదంగా స్వీకరించడం, తాంబూలంలో అరటిపండ్లను చేర్చడం పుణ్యప్రదం.



సంకల్ప సిద్ధికి.. విజయాల లబ్ధికి..!


జీవితం వడ్డించిన విస్తరిలానో, విజయకేతనంలానో ఉండాలని కోరుకుంటే.. అందుకోసం సంకల్పించుకోవాలి. కార్యసిద్ధికి నడుం బిగించాలి. ఆశించినది సిద్ధించే వరకూ స్థిమితపడకుండా నిరంతరం కృషిచేస్తుంటే విజయం తథ్యం అంటారు అనుభవజ్ఞులు. మన పురాణేతిహాసాల్లో అటువంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

ఒక పని ఆరంభించినప్పుడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా భయపడి వెనకడుగు వేయక.. పట్టుదలతో ముందుకు సాగాలి. తుదిదాకా శ్రమించాలి. లక్ష్యసాధనలో ముళ్లూరాళ్లూ దాటాలి, త్యాగాలు చేయాలి. అదే కార్యసాధకుల లక్షణం. అలాంటి ఆదర్శమూర్తులెందరో మన పురాణాల్లో కనిపిస్తారు. విజయ పథాన్ని చేరేందుకు వారు అనుసరించిన విధానాలు జయకాముకులందరికీ అనుసరణీయం. వీరంతా బాల్యం నుంచే తమ ప్రతిభను కనబరిచారు. ఆ మహాత్ముల నడవడిక పెద్దలకే కాదు.. బాలలకూ మార్గదర్శనం చేస్తుంది.

సత్య, సత్వగుణ సంపద

ఆంజనేయ స్వామిలో కనిపించే ప్రధాన లక్షణం నమ్మినవారికి సహాయం చేయటం. అసహాయశూరుడిగా, నిరుపమాన భక్తికి ప్రతీకగా ఆ స్వామి గుర్తింపు పొందాడు. సత్యం మాట్లాడాలి, నిరంతరం గురుభక్తితో గడపాలన్న సందేశం రామదూతలో కనిపిస్తాయి.

సూర్యభగవానుడి నుంచి హనుమ విద్యను అభ్యసించిన తీరు నేటి విద్యార్థులకు ఆదర్శం. శిష్యుడిగా గురువును ఎలా గౌరవించాలి, ఎంత దీక్షతో విద్యాభ్యాసం చెయ్యాలి- అనేదానికి పవనసుతుడు చక్కని ఉదాహరణ. స్వశక్తి, స్వామి భక్తి, ప్రతి పనిలో పారదర్శకత, కార్యదక్షత, తపోదీక్షలకు మారుతి పెట్టింది పేరు. అందుకే ఆయన చిరంజీవి అయ్యాడు. ఈ లక్షణాలను యువత అర్థం చేసుకోగలిగితే ఉద్యోగ, వ్యవహార జీవితం విజయవంతమై తీరుతుంది.



సత్సంకల్పంతోనే సుస్థిరత్వం

ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతితో పుట్టినవాడు ధ్రువుడు. ఐదేళ్ల వయసులో అతడు తన తండ్రి తొడపై కూర్చోవాలని ఆశపడితే సవతితల్లి ఘోరంగా పరాభవించింది. అవమానంతో ధ్రువుడి మనసు వేదనకు గురయ్యింది. ఆ దుఃఖం నుంచి బయటపడి ఉన్నత స్థానం పొందాలనే సంకల్పం మనసులో స్థిరపడింది. అది అతణ్ని కఠోర తపస్సుకు ప్రేరేపించింది. పసివయసులోనే నారద మహర్షి ఉపదేశం మనసుకు పట్టింది. ధ్రువుడి తపస్సుకు మెచ్చి శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై, సూర్య చంద్రులు, సప్తరుషులు ప్రదక్షిణ చేసే శాశ్వత స్థానాన్ని వరంగా ప్రసాదించాడు. అదే ఆకాశంలో ధ్రువ నక్షత్ర స్థానం. ఈ నక్షత్రం ఎప్పటికీ స్థిరంగా ఉంటుంది, దిశానిర్దేశం చేస్తుంటుంది.

అవమానభారంతో కుంగిపోకుండా తట్టుకుని నిలబడటం, దైవం మీద అచంచల విశ్వాసం, పట్టుదలతో అనుకున్నది సాధించటం.. ఇవన్నీ విజయ సోపానాలని తెలియజేసి ఆదర్శంగా నిలుస్తుంది ధ్రువుడి కథ.

పట్టుదలకు ప్రతీక

కార్యసాధనకు సంకల్పంతో పాటు కృషి, పట్టుదల ముఖ్యం. దీనికి ఉదాహరణగా మార్కండేయ మహర్షి జీవితం కనిపిస్తుంది. అర్ధాంతరంగా ఆయువు తీరబోతున్న సమయంలో తల్లిదండ్రుల సూచనతో శివపూజకు ఉపక్రమించాడు. పట్టుదలతో ప్రయత్నించాడు. గొప్ప జ్ఞాని, ధర్మజ్ఞుడు, భక్తిపరవశుడిగా బాల్యదశలోనే ఖ్యాతి గడించి, చిరంజీవిగా నిలిచాడు. శివభక్తికి ప్రతీకగా పురాణాల్లో గుర్తింపు పొందాడు. మార్కండేయుడు తన జీవన యాత్రలో మానవాళికి ధర్మం, శాంతి, భక్తి, సత్యనిష్ఠల విలువను రుజువు చేశాడు. నిర్మల, నిశ్చల భక్తి ఉంటే యమధర్మరాజును కూడా జయించవచ్చన్న దానికి ఆయన గడిపిన జీవితం ఉదాహరణ.

బాలలు బ్రహ్మజ్ఞానులు


పౌరాణిక కథను అనుసరించి.. సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు (సనాతనుడని కూడా పిలుస్తారు).. ఈ నలుగురూ అన్నదమ్ములు. వీరు బ్రహ్మమానస పుత్రులు. అంటే సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి మానసం నుంచి పూర్తి సత్వ గుణంతో ఆవిర్భవించారు. బ్రహ్మచర్యం పాటించి, వైరాగ్య జీవితాన్ని గడిపి ప్రతిఫలాన్ని ఆశించక మహారుషులయ్యారు. నిత్యబాల్యాన్ని, కౌమారాన్ని పొందారు. సనకుడు, సనందనుడు విష్ణుమూర్తికి మహా భక్తులు. ఒకసారి ఈ మహర్షులు వైకుంఠంలో విష్ణువు దర్శనం కోసం వెళ్లారు. ద్వారపాలకులుగా ఉన్న జయవిజయులు వారిని లోనికి వెళ్లకుండా అడ్డగించారు. జయవిజయులంటే సామాన్యులు కాదు. చేస్తున్న ఉద్యోగం కూడా ఎంతో కీలకమైనది. అయితే వాళ్లు సనక సనందనుల గొప్పతనానికి విలువనివ్వక... 'వచ్చినవారు బాలలేలే.. ఏమంత ప్రాధాన్యత ఇవ్వనవసరంలేదు'- అనుకున్నారు. అనుచితంగా ప్రవర్తించారు. కర్తవ్య నిర్వహణలో ఏమరపాటు వహించారు. దానికి ప్రతిఫలంగా శాపాన్ని అనుభవించాల్సివచ్చింది. సనక సనందనులు- జీవన్ముక్తులుగా, ఆధ్యాత్మిక ఉపదేశకులుగా, మోక్ష మార్గదర్శకులుగా ప్రసిద్ధులయ్యారు.

సృష్టికార్యంలో పాల్గొనమని, ప్రజావృద్ధి చేయమని సనక సనందనాదులకు హితవు చెప్పాడు తండ్రి బ్రహ్మదేవుడు. కానీ ప్రజల సంఖ్య పెంచడం కన్నా జ్ఞానబోధ చెయ్యటం అవసరమనిపించింది వారికి. జ్ఞానవంతమైన సమాజం విశ్వశాంతికి తొలి సోపానమని నమ్మారు ఈ సోదరులు. అదే వారి సంకల్పం. అందరిలా సాంసారిక సుఖాల వైపు మళ్లక, జీవితాన్ని త్యాగం చేశారు. నిత్యబాల్యాన్ని పొంది జ్ఞాన ప్రబోధమే ధ్యేయంగా మెలిగారు.

దీక్షాదక్షతలతో పాటు త్యాగబుద్ధి ఉన్నప్పుడు బాలలైనా, వృద్ధులైనా లోకమంతటికీ ఆదర్శనీయులుగా నిలుస్తారని హనుమ, ధ్రువ, మార్కండేయ, సనక, సనందనుల కథలు తెలియజేస్తాయి.

– ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు

సహనంతో జీవిద్దాం!



క్రీస్తువాణి

జీవితంలో ఏవో కష్టనష్టాలు ఎదురవడం సహజం. అలాంటి సందర్భాల్లో నిరాశకు లోనవక సహనం కలిగి ఉండాలని బైబిలు బోధిస్తోంది. 'శ్రమ నుంచి ఓర్పు పుడుతుంది. ఓర్పు వల్ల అనుభవం వస్తుంది. అనుభవం నిరీక్షించగల నేర్పును ఇస్తుంది' (రోమా 5:3-4) అని పేర్కొంది కొత్త నిబంధన. నిత్యం శ్రమిస్తూ ఎంతటి సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ దైవాన్ని విశ్వసించి నిబ్బరంగా ముందుకు సాగాలని ఈ వచనం తెలియజెబుతుంది. రకరకాల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయంటే.. అవి మన ఓర్పును పరీక్షించడానికే అని అర్థం చేసుకోవాలి. మనం మరింత బలంగా, స్థిరంగా రూపొంది సమాజంలో స్థిమితంగా జీవించడానికి ఆ అవరోధాలు దోహదం చేస్తాయి. వజ్రాన్ని సానబెడితేనే ప్రకాశిస్తుంది. ఉలి దెబ్బల వల్లనే బండరాయికి రూపురేఖలు వచ్చి చక్కటి శిల్పంగా రూపొందుతుంది. మనమూ అంతే! వచ్చిన బాధలన్నింటికీ సహనంతో సమాధానాలు చెప్పాలి. అప్పుడే మనలోని నిజమైన విజేత బయటికొస్తాడని బైబిలు తెలియజేస్తోంది. 'దైవంపట్ల విశ్వాసంతో ఉండి ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా సహనం వహించినప్పుడు.. మీరు ఏ విషయంలోనూ వెలితి లేనివారుగా, సంపూర్ణులుగా ఉంటారు' అని ఏసు ప్రబోధించాడు. ఆయన సందేశాన్ని పాటిస్తూ తప్పుదోవ పట్టకుండా అప్రమత్తంగా ఉండాలి. ఏది జరిగినా మన మంచికే అని నమ్మి.. ప్రభువును ఆరాధిస్తూ జీవనం సాగించాలి.

ద్రౌపదికి ఏడు ఆలయాలు

దక్షిణ భారతంలో ద్రౌపదికి ఏడు ఆలయాలున్నాయనే సంగతి మీకు తెలుసా? కానీ ఉత్తర భారతదేశంలో మాత్రం ద్రౌపదికి ఒక్క ఆలయం కూడా లేకపోవడం చిత్రమైన సంగతే. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే.. సింగపూర్, మలేషియా, శ్రీలంక, మారిషస్ వంటి ఇతర దేశాల్లోనూ ద్రౌపదికి ఆలయాలు ఉండటం. వివరాల్లోకి వెళ్తే... ఆంధ్రప్రదేశ్ నెల్లూరు మూలాపేటలో ద్రౌపదికి ఆలయం ఉంది. బెంగళూరు నాగరథపేటలో 800 ఏళ్ల పురాతన ధర్మరాయ పేరుతో గుడి ఉంది. ఇక్కడ పాండవులతో కొలువైన ద్రౌపది దర్శనమిస్తుంది. ఇక మిగిలిన అయిదు ఆలయాలు తమిళనాడులోనే ఉండటం విశేషం. చెన్నై వేలాచేరీలో ఈమె గ్రామ దేవతగా పూజలు అందుకుంటోంది. అలందూర్, మహాబలిపురం, కుంభకోణం, సైదాపేట వంటి ప్రాంతాల్లో ద్రౌపదిని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.



పురాణాల ప్రకారం ఈమె అగ్ని సంజాత. పంచభూత రూపులైన పాండవులను నడిపించే అగ్ని శక్తికి ద్రౌపది సంకేతం. వ్యాస భగవానుడికి ఆమె పుట్టుకలో రహస్యం తెలుసు కనుకనే మరో అగ్ని సంజాతుడైన కర్ణుడిని కుంతీదేవి వద్ద పెరగనివ్వలేదు. కార్చిచ్చు సూత్ర న్యాయాన్ని అనుసరించి రెండు పరస్పర అగ్ని శక్తులు ఒకచోట ఉంటే ఆ రెండింటి శక్తి నశించి, అటు కర్ణుడికి, ఇటు ద్రౌపదికి కూడా ఖ్యాతి దక్కేది కాదు. ఆ సంగతి గ్రహించిన మహర్షి- కర్ణుడిని విడిచిపెట్టేలా భారత రచన చేశాడు. కనుకనే కర్ణుడు మహా దాతగా, ద్రౌపది భారతానికి సూత్రధారిగా కీర్తినార్జించారు.

విశేష ఫలితాలనిచ్చే వృశ్చిక సంక్రాంతి

సూర్య భగవానుడు ఒక రాశినుంచి మరొక రాశిలోకి ప్రవేశించే కాలాన్ని సంక్రాంతి అంటారు. ఈ నేపథ్యంలో నవంబర్ 16న సూర్యుడు వృశ్చికరాశిలోకి ప్రవేశిస్తాడు. దీనినే వృశ్చిక సంక్రాంతి అంటారు. ఈ సందర్భంగా పుణ్య నదుల్లో స్నానం ఆచరించి దాన ధర్మాలు, శ్రాద్ధకర్మలు నిర్వహించడం వల్ల విశేష ఫలితం ఉంటుందన్నది శాస్త్రవచనం.



ఈ పవిత్రమైన రోజున పూజలు, వ్రతాలు చేయడం శ్రేయోదాయకం. ఇతర మాసాల్లో సంక్రాంతి మాదిరిగానే వృశ్చికరాశిలో సూర్యుడి సంచారం వేళ శుభ ఫలితాలు చేకూరుతాయి. ఈ రోజున సూర్యోదయం కంటే ముందే నిద్ర లేచి స్నానాదికాలు ముగించాలి. రాగి పాత్రలో నీరు నింపి, అందులో ఎర్రచందనం కలిపి సూర్యుడికి అర్ఘ్యం సమర్పించాలి. 'నమః సూర్యాయ శాంతాయ సర్వరోగ నివారిణే ఆయురారోగ్యం ఐశ్వర్యం దేహి దేవః జగత్పతే' అంటూ పూజించాలి. ఎరుపురంగు పువ్వులు, కుంకుమ, వసుపు వేసిన నీటిని నివేదించే సంప్రదాయం కూడా ఉంది. నెయ్యిలో ఎర్రచందనం కలిపి దీపం వెలిగించాలి. పూజ సమయంలో 'ఓం దినకరాయ నమః' తదితర మంత్రాలతో సూర్యభగవానుణ్ణి స్తుతించాలి. ఇలా చేయడం వల్ల తెలిసీ తెలియక మన పూర్వీకులు చేసిన దోషాలు తొలగి మోక్షం లభిస్తుందని పండితులు చెబుతారు.

వృశ్చిక సంక్రాంతి వేళ పూర్వీకులను స్మరించుకుంటూ ఆహారం, వస్త్రాలు, ఆవులు తదితరాలు దానం చేయడం శుభప్రదం. శ్రాద్ధకర్మలు నిర్వహించాలి, తర్పణాలు వదలాలి. దేవీ పురాణాన్ని అనుసరించి ఈ రోజున నదీస్నానం చేసిన వారికి సకల పాపాల నుంచి విముక్తి లభిస్తుంది.



జీవనంలో మితం.. సంతృప్తి అపరిమితం

ఆడంబరాలూ ఆర్భాటాలూ అగాధాలతో సమానం. వాటికి అలవాటైతే నానాటికీ మరింతగా కూరుకుపోవటమే తప్ప బయటకు రావటం కష్టం. అందుకే విలాసాలు, ప్రాపంచిక సౌఖ్యాల పట్ల నిర్లిప్తతను, మిత వస్తు వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది ఇస్లాం. ప్రవక్త ముహమ్మద్ (స) ఆజన్మాంతం నిరాడంబర జీవనంతో తర్వాతి తరాలకు మార్గదర్శకులయ్యారు. ఆయన వద్ద అతి సాధారణమైన పరుపు, చేతికర్ర, కొన్ని గిన్నెలు వంటి పరిమిత వస్తువులు ఉండేవి. రాజ్యపాలకుడైన తర్వాత కూడా ఆయన ఇల్లు నిరాడంబరంగా ఉండేది. భౌతిక సంపదల కంటే ఆధ్యాత్మిక సంతృప్తికే ప్రాధాన్యమిచ్చారాయన.



ఇస్లాం సందేశం

మనం మూడింట ఒక వంతు కడుపు నిండే వరకే తినాలని, మిగతా రెండు వంతులు నీరు, గాలి కోసం వదిలేయాలని ప్రవక్త (స) బోధించారు. ఆయన తరచుగా ఉపవాసం పాటించేవారు. దైవ చింతనలో గడిపేవారు. ఆహారం తీసుకున్నప్పుడు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపేవారు. విలాస వస్తువులను కూడబెట్టుకోవటం కంటే ఆధ్యాత్మిక సాధన, పేదలకు సాయం వంటివాటికి ప్రాధాన్యత ఇచ్చేవారు. దివ్య ఖురాన్ మితిమీరిన వినియోగాన్ని నిరుత్సాహపరుస్తుంది. రోజువారీ తినటం, తాగటంలో హేతుబద్ధత ఉండాలని సూరా అల్ అరాఫ్, ఆహార వృథాను నివారించాలని సూరా అల్ ఇస్రా పేర్కొంటున్నాయి.

మిత జీవనం అంటే పేదరికం కాదు, సమతుల్యతను పాటించటం. భౌతిక సంపదల కోసం ఆరాటానికి బదులు అల్లాహ్‌తో బంధం, అంతర్గత సంతృప్తిపై దృష్టి సారించటం. ఇలాంటి జీవనశైలితో అంతరంగంలో అస్తవ్యస్తత తొలగుతుంది. భోగ లాలస తగ్గి పర్యావరణ హితం అలవడుతుంది. దాతృత్వ భావన పెంపొందుతుంది. ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక, ఆధ్యాత్మిక శక్తులు ద్విగుణీకృతమవుతాయి.

శబరిమలలో మండల పూజా మహోత్సవం

హరిహర క్షేత్రం శబరిమల ఆలయాన్ని.. ఇతర ఆలయాలకు వలె నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో తెరిచి ఉంచే సంప్రదాయం లేదు. ఈ ఆలయాన్ని ప్రతి నెల మాసపూజ సమయాల్లోనూ, ప్రత్యేక పూజలు, ఉత్సవాల సమయాల్లోనూ తెరుస్తారు. మాసపూజలతో పాటు... విష్ణు పర్వదినం, ఓనం పూజ, మండల పూజ, మకర విళక్కు తదితర ఉత్సవాలు నిర్వహిస్తారు. 'మకర విళక్కు' అంటే సంక్రాంతి రోజున శబరిమలలో వెలిగించే మకరజ్యోతి. నవంబరులో 41 రోజుల పాటు మండల పూజలు సాగుతాయి. చివరి రోజు ప్రత్యేక పూజ నిర్వహిస్తారు. మలయాళ పంచాంగాన్ని అనుసరించి ఈ తేదీలు నిర్ణయిస్తారు. ఈ సంవత్సరం నవంబరు 16వ తేదీన శబరిమలలో మండల పూజా మహోత్సవాలు ప్రారంభమై.. డిసెంబర్ 27న ముగుస్తాయని ఆలయ అధికారులు ప్రకటించారు.



అయ్యప్ప స్వామికి ట్రావెన్‌కోర్ రాజవంశానికి చెందిన చిత్ర తిరునాళ్ బలరామ వర్మ బంగారు ఆభరణాన్ని చేయించారు. మండల పూజ ప్రారంభమయ్యే రోజున స్వామివారికి ఈ ప్రత్యేక ఆభరణాన్ని అలంకరిస్తారు. మండల పూజ వైభవంగా జరుగుతుంది. జనవరి 14న మకర విళక్కు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వారం తర్వాత జరిగే పడిపూజతో ఉత్సవాలు ముగుస్తాయి. మకర జ్యోతికి పెద్దపాదం మార్గం తెరుచుకుంటుంది. దీక్ష తీసుకున్న అయ్యప్ప భక్తులు ఎరుమేలి నుంచి పెద్దపాదం మీదుగా వెళ్తారు. దట్టమైన అడవులు, ఎత్తయిన కొండలను దాటుకుంటూ శబరిగిరికి చేరుకుంటారు. ఆలయ నియమ నిబంధనలను అనుసరించి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మానవజన్మ.. మహోత్తమం!

పరోపకారాయ ఫలంతి వృక్షః పరోపకారాయ వహంతి నద్యః
పరోపకారాయ దుహంతి గావః పరోపకారార్థం ఇదం శరీరం

పరులకు ఉపయోగపడేందుకే చెట్లు ఫలాలను ఇస్తున్నాయి, నదులు ప్రవహిస్తున్నాయి, ఆవులు పాలిస్తున్నాయి. ఈ శరీరం ఉన్నది ఇతరులకు తోడ్పడేందుకే- అన్నది ఈ సుభాషితానికి అర్థం. ఎదుటివారు ఆపదలో ఉంటే సానుభూతి చూపడం, సాయం చేయడమే మానవత్వం. అందుకు మన శరీరం ఒక సాధనమని గ్రహించాలి.

సృష్టిలోని సకల చరాచర జీవుల్లో మరి దేనికీ లేని విచక్షణాజ్ఞానాన్ని మనకు ఇచ్చాడు భగవంతుడు. అలాంటి శరీరాన్ని పొందినందుకు సంతోషించాలి. తోటివారికి సాయపడుతూ తృప్తిపొందాలి. అంతేతప్ప మోసాలూ ద్వేషాలు, కుట్రలూ కుతంత్రాలతో కష్టాలు కొనితెచ్చుకోకూడదన్నది ఆధ్యాత్మికవేత్తల సందేశం. మనం గతంలో చేసిన మంచిచెడులనుబట్టే కష్టసుఖాలు ఉంటాయని పెద్దలు చెబుతారు. కనుక దుఃఖాలు ఎదురైనప్పుడు.. అవి స్వయంకృతాపరాధమేనని గ్రహించి, భవిష్యత్తులో పాపకర్మలకు పాల్పడకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.





వృక్షాలకు మనలా అవయవాల్లేవు. ఎక్కడికీ కదల్లేవు. అయినా పచ్చగా జీవిస్తూ పదిమందికీ సాయపడుతున్నాయి. ఇతర ప్రాణులు మనలా బుద్ధిజీవులు కాకున్నా హాయిగా జీవిస్తున్నాయి. మనం మాత్రం ఎన్ని ఉన్నా, ఎంత పొందుతున్నా.. ఏవో అసంతృప్తులతో ఈర్ష్యాద్వేషాలతో అలమటిస్తున్నాం. దైవానుగ్రహం వల్లే దుర్లభమైన మనిషి జన్మ లభించిందని గ్రహించి, దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనకు వీలైనంతలో పరోపకారం చేస్తూ మోక్షసాధన దిశగా సాగాలి. విచక్షణాజ్ఞానం ఉన్న మానవ జన్మను ప్రసాదించిన భగవంతుని పట్ల కృతజ్ఞత చూపుతూ ఆయన దయకు పాత్రులవ్వాలి. మానవత్వాన్ని చూపిస్తూ, సేవాధర్మాన్ని ఆచరిస్తూ ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. **– నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

సజ్జన సాంగత్యం

అది వర్షరుతువు. బుద్ధుడు తన శిష్యులైన ఆనందుడూ తదితర భిక్షువులతో కురుదేశంలో ఉన్నాడు. వర్షాల వల్ల ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడం కష్టం కాబట్టి ఆ నాలుగు నెలలూ ఒకే చోట ఉండటం సంప్రదాయం. దీన్నే వర్షావాసం అంటారు. ఆ విధంగా వర్షావాసం చేస్తూ వారంతా కురుదేశంలో కాలం గడుపుతున్నారు. వసరులకూ, వసతికీ ఇబ్బందికరమైన ఆ కాలంలో వారంతా దొరికిన భిక్ష స్వీకరిస్తూ, వీలైన చోట తలదాచుకున్నారు.



ఒకరోజు ఆనందుడు భిక్షాటనకు బయల్దేరాడు. అతడు అవంతిక అనే వేశ్య ఇంటి వద్ద భిక్ష అర్థించాడు. ఆమె భిక్ష వేసి- 'వర్షాల వల్ల మీ సన్యాసులందరూ ఇబ్బంది పడుతున్నారని విన్నాను. ఒక్కొక్కరూ ఒక్కో ఇంట ఉంటే బాగుంటుంది కదా! అభ్యంతరం లేకపోతే మీరు నా ఇంట్లో ఉండొచ్చు' అంది. భిక్షువులు ఎక్కడ ఉండాలో తథాగతుడు నిర్ణయిస్తాడనీ, వారిని అడిగి చెబుతానని తన దారిన వెళ్లిపోయాడు ఆనందుడు. అవంతిక ఆహ్వానించిన సంగతి చెప్పాడు. 'తనే ఆహ్వానించినప్పుడు ఆమె ఇంట్లో విడిది చేయడంలో తప్పు లేదు. నువ్వు అక్కడికి మకాం మార్చుకో' అన్నాడు బుద్ధుడు.

అలా ఆనందుడు వేశ్య ఇంటికి వెళ్లాడు. అవంతిక చక్కటి అతిథి మర్యాదలతో ఆనందుడికి స్వాగతం పలికింది. జీర్ణావస్థలో ఉన్న వస్త్రాలు చూసి కొత్తవి కుట్టించింది. దాంతో ఆనందునికి చలి నుంచి రక్షణ కలిగింది. అవంతిక వేళకు వేడిగా భోజనం అందిస్తూ, ఆనందుడు చెప్పే హితోక్తులు శ్రద్ధగా వినేది. ఆ మాటల ప్రభావంతో కొద్దిరోజుల్లోనే అవంతిక అతడి శిష్యురాలైంది. అయితే.. ఒక భిక్షువు వేశ్య ఇంట్లో ఉండటం తోటివారికి నచ్చలేదు. భిక్షువులందరూ ఈ విషయమై నిలదీయగా.. బుద్ధుడు మూడు రోజుల తర్వాత సమాధానం చెబుతానన్నాడు. నాలుగో రోజు ఉదయాన.. ఆనందుడు కాషాయ వస్త్రాలు ధరించిన ఒక యువతితో ఆశ్రమానికి వచ్చాడు. ఆమె మరెవరో కాదు, అవంతిక. వస్తూనే బుద్ధుని పాదాలకు ప్రణమిల్లింది. ఆ దృశ్యం చూసిన భిక్షువుల నోట మాట రాలేదు.

– డాక్టర్ బండి సత్యనారాయణ

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

సాగు సమగ్ర ప్రగతికి సప్తవర్ణాల మార్గం!

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా భారతదేశం అవలంబిస్తున్న నూతన వ్యవసాయ విధానమే ఇంద్రధనుస్సు విప్లవం. ఆహారధాన్యాలు, పాల ఉత్పత్తులు, నూనెగింజలు, చేపలు, కోడిగుడ్లు, మాంసం, పండ్లు తదితర అన్నిరకాల ఉత్పత్తులను పెంచడమే దీని లక్ష్యం. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం, బంగారు విప్లవం మొదలైన సాగు రంగానికి చెందిన అన్నిరకాల విప్లవాలను ఏకం చేసి, సప్తవర్ణాలతో కూడిన ఇంద్రధనుస్సులాంటి ఒకే గొడుగు కిందకు తీసుకొస్తుంది. పర్యావరణ అనుకూల సాగు విధానాలను ప్రోత్సహిస్తూ ఆహార భద్రత సాధించడం, సాంకేతిక సమన్వయంతో అన్నదాతల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ ఉపాధి, రైతుల ఆర్థికాభివృద్ధి లాంటి భిన్న లక్ష్యాలు ఉన్న ఈ విప్లవం గురించి పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన ఉండాలి. దానికి సంబంధించి ఇప్పటి వరకు సాధించిన ప్రగతి, ఎదురవుతున్న సమస్యలు, ఇంకా రావాల్సిన మార్పులనూ తెలుసుకోవాలి.





జాతీయ వ్యవసాయ విధానం-2000లో భాగంగా ఇంద్ర ధనుస్సు విప్లవాన్ని 2000, జులై 29న ప్రభుత్వం ప్రకటించింది.

వ్యవసాయ వైవిధ్యీకరణ: సంప్రదాయ పంటల సాగుతో పాటు పాడి, మత్స్య, కోళ్ల పెంపకం, ఉద్యానవనాల పంటలు చేర్చడం, రైతులకు ఆదాయ వనరులను పెంచడం.

రైతులకు ఆదాయ వృద్ధి: ఉత్పాదక, విలువ ఆధారిత ఉత్పత్తి పెంచడం ద్వారా అన్నదాతలకు అధిక రాబడి కల్పించడం.

స్థిరమైన వ్యవసాయం: నేల ఆరోగ్యాన్ని కాపాడే, నీటిని ఆదా చేసే, పర్యావరణ క్షీణతను తగ్గించే స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం.


పోషక భద్రతను పెంచడం: వివిధ ఆహార రంగాల్లో ఉత్పత్తిని పెంచడం ద్వారా పోషకాహార లోపాన్ని పరిష్కరించడం, ఆహార వైవిధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రామీణ ఉపాధి, అభివృద్ధి: వ్యవసాయ విస్తరణ, ఆధునీకరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.


సాంకేతిక ఏకీకరణ: ఆధునిక వ్యవసాయం కోసం బయోటెక్నాలజీ, యాంత్రీకరణ, నీటిపారుదల పద్ధతులు, ఇతర సాంకేతిక విధానాలు ఉపయోగించడం.

ఇంద్రధనుస్సు విప్లవం - వివిధ భాగాలు

ఈ కార్యక్రమం బహుళ వ్యవసాయ, అనుబంధ రంగ విప్లవాలను అనుసంధానిస్తుంది. అందులో ముఖ్యమైనవి-





హరితవిప్లవం (పంటలు): అధిక దిగుబడినిచ్చే రకాలు, ఎరువులు, నీటిపారుదల లాంటి ఆధునిక పద్ధతుల ద్వారా పంట ఉత్పత్తిని ముఖ్యంగా గోధుమ, వరి, జొన్న పెంచడంపై దృష్టి పెట్టింది.

శ్వేతవిప్లవం (పాడి పరిశ్రమ): పాల ఉత్పత్తిని, పాడి వ్యవసాయాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి ఆపరేషన్ ఫ్లడ్ ప్రధాన కారణం. ఇది భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుల్లో ఒకటిగా నిలిపింది.

పసుపు విప్లవం (నూనెగింజలు): భారతదేశం వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే విధంగా నూనెగింజల ఉత్పత్తి పెంచడంపై దృష్టి పెట్టింది.

నీలివిప్లవం (మత్స్యపరిశ్రమ): తీర ప్రాంత ప్రజలకు ఆదాయ వనరుగా మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆక్వా కల్చర్ ద్వారా చేపల ఉత్పత్తి పెంచుతోంది.

స్వర్ణవిప్లవం (ఉద్యానవనాలు): దేశీయ వ్యవసాయంలో వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు పండ్లు, కూరగాయలు, పువ్వులు, తేనె లాంటి ఉద్యాన పంటల విస్తరణను లక్ష్యంగా పెట్టుకుంది.

ఎరుపు విప్లవం: మాంసం, టమాటా ఉత్పత్తిని అధికం చేయడంపై దృష్టి పెట్టింది. మాంసం ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడం ఇందులో భాగం.

వెండి విప్లవం (గుడ్లు, కోళ్ల పెంపకం): గుడ్ల ఉత్పత్తిని ప్రోత్సహించడం, కోళ్ల పరిశ్రమను బలోపేతం చేయడం ద్వారా ప్రోటీన్ వనరులను అందిస్తుంది.

గుండ్రని విప్లవం (బంగాళాదుంపలు): ఆలుగడ్డల ఉత్పత్తిపై దృష్టి పెడుతుంది.

బూడిద విప్లవం : ఇది ఎరువుల ఉత్పత్తికి సంబంధించింది.

బంగారు విప్లవం: జనపనార ఉత్పత్తికి సంబంధించింది.

ఇవన్నీ ఒకదానికొకటి పూరకంగా ఉంటాయి. ఇంద్రధనుస్సు విప్లవం వీటన్నింటినీ సమన్వయపరచి ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, స్థిరమైన అభివృద్ధికి దోహదపడే విధంగా చేస్తుంది.

ఇంద్రధనుస్సు విప్లవం »

భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముకగా ఉంటూ, దాదాపు సగభాగం జనాభాకు జీవనోపాధి కల్పిస్తోంది. దశాబ్దాలుగా దేశంలో హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం, పసుపు విప్లవంతో అభివృద్ధి జరిగింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో ఈ పరివర్తనలను సమిష్టిగా ఇంద్రధనుస్సు విప్లవంగా పిలుస్తారు. ఇదొక గొడుగు విధానాన్ని, ఇంద్రధనుస్సులో రంగుల వర్ణపటాన్ని సూచిస్తుంది.

ఆవశ్యకత: స్వాతంత్ర్యం తర్వాత దేశం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంది, దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. 1960-70 దశకంలో వచ్చిన హరిత విప్లవం గోధుమ, బియ్యం తదితర ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించింది. అయితే తృణధాన్యాలపైనే అధికంగా దృష్టి సారించి నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పాడి లాంటి ఇతర వ్యవసాయ రంగాలను నిర్లక్ష్యం చేయడంతో పోషకాహార, ఆదాయ పంపిణీ, స్థిరత్వంలో అసమతౌల్యత తలెత్తింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరిగింది. వంటనూనెలు మొదలైన ఆహారపదార్థాల కోసం దిగుమతులపైనే ఆధారపడటం ఎక్కువైంది. వీటిని పరిష్కరించే దిశగా ఇంద్రధనుస్సు విప్లవం వచ్చింది. ఇది వ్యవసాయ వనరుల వైవిధ్యీకరణ, ఏకీకరణపై దృష్టి పెట్టింది.

లక్ష్యాలు: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో స్వయంసమృద్ధిని సాధించడం ఇంద్రధనుస్సు విప్లవం ముఖ్య లక్ష్యం. దేశీయ ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆహార పదార్థాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

విజయాలు

ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుదల: ఆహారధాన్యాల పరంగా (గోధుమ, వరి) దేశంలో స్వయం సమృద్ధిగా మార్గంలో హరితవిప్లవం కీలకపాత్ర పోషించింది. ఉదాహరణకు 1951లో 51 మిలియన్ టన్నులున్న ఆహారధాన్యాల ఉత్పత్తి 2023-24లో 332.3 మిలియన్ టన్నులకు పెరిగింది.

పాడి, కోళ్ల ఉత్పత్తి వృద్ధి: శ్వేత విప్లవం మన దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా మార్చింది. ఉదా: 1951లో పాలఉత్పత్తి 17 మిలియన్ టన్నులు కాగా 2023-24 నాటికి 239.2 మిలియన్ టన్నులకు పెరిగింది. తలసరి పాల లభ్యత 1951లో 124 గ్రాముల నుంచి 2023-24లో 471 గ్రాములకు పెరిగింది. గుడ్లు, మాంసం, కోళ్ల ఉత్పత్తిలోనూ గణనీయమైన పెరుగుదలతో పోషక భద్రత పెరిగింది.

మెరుగైన మత్స్యపరిశ్రమ: ప్రపంచ చేపల ఉత్పత్తిలో దాదాపు 8% వాటాతో భారత్ రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా నిలిచింది. గత రెండు దశాబ్దాలుగా మత్స్యరంగంలో గణనీయమైన వృద్ధి ఉంది. ఉదా: 2013-14లో చేపల ఉత్పత్తి 95.79 లక్షల టన్నుల నుంచి 2023-24లో 184.2 లక్షల టన్నులకు పెరిగింది.

దిగుమతులపై ఆధారపడటం తగ్గుదల: పసుపు విప్లవంతో నూనెగింజల ఉత్పత్తి పెరిగి, వంటనూనెల దిగుమతి తగ్గడంతో ఆహార స్వయంసమృద్ధి సాధ్యమైంది. 2024-25 లో మొత్తం నూనెగింజల ఉత్పత్తి 41.66 మిలియన్ టన్నులు.

రైతుల ఆర్థిక సాధికారత: మెరుగైన ఉత్పాదకత, వైవిధ్యభరిత ఆదాయ మార్గాలు రైతుల ఆర్థిక స్థిరత్వం పెంచేందుకు దోహదపడ్డాయి. ఇంద్రధనుస్సు విప్లవం భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పరివర్తనాత్మక ప్రభావాన్ని చూపింది.

సవాళ్లు

వనరుల కొరత: నీరు, శక్తి, భూవనరుల పరిమిత లభ్యత లాంటివి స్థిర వ్యవసాయ విస్తరణకు ఆటంకంగా ఉన్నాయి. **వాతావరణ మార్పు:** తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, అనూహ్య వర్షపాతం, ఉష్ణోగ్రత వైవిధ్యాలు లాంటివన్నీ పంట దిగుబడి, ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి.

తెగుళ్లు, వ్యాధుల వ్యాప్తి: ఇవి పంటలపై తీవ్ర ప్రభావం చూపి ఉత్పాదకతను దెబ్బతీస్తాయి.

మార్కెట్ అవకాశాలు, మౌలిక సదుపాయాలు: పంట కోత తర్వాత తగినంతగా నిల్వ సౌకర్యాలు లేకపోవడం, పేలవమైన రవాణా, మౌలిక సదుపాయాల లేమి నష్టాలకు దారితీస్తోంది. **రైతుల్లో ఆర్థిక ఒత్తిడి:** అధిక ఇన్‌పుట్ ఖర్చులు, అప్పులు, మార్కెట్ అస్థిరత, ఆర్థిక ఒత్తిడిని పెంచుతాయి. ఈ పరిణామం చిన్న, సన్నకారు రైతులపై అధిక ప్రభావం చూపుతుంది.

తీసుకోవాల్సిన చర్యలు



స్థిరమైన సాగుపద్ధతుల ప్రోత్సాహం: సేంద్రియ వ్యవసాయం, సమగ్ర తెగులు నిర్వహణ, పునరుత్పాదక శక్తివనరుల వినియోగాన్ని ప్రోత్సహించడం.

సాంకేతిక ఆవిష్కరణలు: డిజిటల్ వ్యవసాయం, డ్రోన్ వ్యవస్థలు, ఏఐ సాంకేతికతను అమలుపరచడం.



వీటితోపాటు రైతులకు శిక్షణ, సమ్మిళిత వృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం.



రచయిత: వమరవల్లి రమణయ్య

ప్రాక్టీస్ బిట్లు — చరిత్ర

1. భారతీయ చేనేతకారులు 18వ శతాబ్దంలో ఎదుర్కొన్న ప్రధాన సమస్యలు
   1) ఎగుమతుల మార్కెట్ కుప్పకూలిపోయింది.
   2) మాంచెస్టర్ దిగుమతులతో స్థానిక మార్కెట్ పడిపోయింది.
   3) యంత్రాల మీద తయారవుతున్న వస్త్రాలకు నేత కార్మికులు పోటీ ఇవ్వలేకపోయారు.
   4) పైవన్నీ
2. బ్రిటన్ పత్తి కోసం భారతదేశం వైపునకు మళ్లడానికి కారణం?
   1) అమెరికా నుంచి బ్రిటన్‌కు పత్తి సరఫరా నిలిచిపోవడం.
   2) చైనా నుంచి బ్రిటన్‌కు పత్తి సరఫరా నిలిచిపోవడం.
   3) ఇండియా పత్తి చౌకగా లభించడం.
   4) ఆఫ్రికా నుంచి బ్రిటన్‌కు పత్తి దిగుమతి ఆగిపోవడం.
3. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
   ఎ) 1854 లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు ప్రారంభమైంది.
   బి) 1855 లో బెంగాల్‌లో జనపనార మిల్లు స్థాపించారు.
   సి) 1860 లో కాన్పూర్‌లో ఎల్జిన్ మిల్లు మొదలైంది.
   డి) 1874 నాటికి మద్రాసులో నూలు వడికే నేత మిల్లు ప్రారంభమైంది.
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు
1-4; 2-1; 3-4.

అర్థం చేసుకో.. మంచి మార్కులు తెచ్చుకో! — స్టడీ స్కిల్స్




చాలామంది విద్యార్థులు పరీక్షల ముందు పాఠాలను యాంత్రికంగా మననం చేసుకుంటూ ఉంటారు. కొందరైతే బట్టీ పడతారు. ఈ రెండు పద్ధతుల్లోనూ పాఠాలను కేవలం జ్ఞాపకం పెట్టుకోవడానికే చదువుతారు. అలాచేస్తే కొంతకాలానికి చదివింది మర్చిపోయే అవకాశం ఉంది. కానీ అర్థం చేసుకుంటూ చదివితే, విషయం మీద పూర్తిగా పట్టు కుదురుతుంది. చదివే అంశంపై ప్రశ్నలు తయారుచేసుకుని సమాధానాలను రాబట్టడం, పాఠాన్ని దృశ్యరూపంలో అమర్చుకోవడం లాంటివి చక్కటి ఫలితాలను ఇస్తాయి. చదివిన సబ్జెక్టుపై పట్టు పెంచే ఆ విధానం వల్ల ఉన్న ప్రయోజనాలు, మంచి మార్కులు సాధించుకోవడానికి పాటించాల్సిన పద్ధతులను తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సంప్రదాయ వంటకాల సృజనాత్మక నగరం!

భారత క్రికెట్ మహిళా జట్టు తొలిసారిగా వన్డే ప్రపంచకప్ నెగ్గి ఛాంపియన్‌గా అవతరించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో తజకిస్థాన్ భూభాగంలో భారత్ వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన వైమానిక స్థావరంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దోమలు, పేలు, ఈగలు తదితర జీవుల ద్వారా మానవులకు సంక్రమించే వ్యాధుల నివారణ కోసం అఫ్గాన్‌కు భారత్ పెద్దఎత్తున మందులు, చికిత్స సామగ్రి పంపింది. యునెస్కో సృజనాత్మక నగరాల జాబితాలో దేశం నుంచి మరో సిటీ చేరింది. వార్తల్లో నిలిచిన ఇలాంటి వర్తమాన వ్యవహారాలు, వ్యక్తులు, ప్రాంతాలు, సంఘటనలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకోవాలి. జాతీయ, అంతర్జాతీయ ముఖ్య రాజకీయ, ఆర్థిక, సైనిక పరిణామాలు, ప్రధాన సదస్సులు, అవార్డుల విజేతలు, నాయకత్వ మార్పులతో పాటు తాజా వన్డే మహిళల ప్రపంచకప్ గణాంకాలు, నేవీ కోసం ఇస్రో పంపిన రాకెట్ విశేషాలను గుర్తుంచుకోవాలి.



కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు


1. కింది వాటిలో సరైంది?
   ఎ) 2025 (13వ) మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఇండియా, శ్రీలంకలో జరిగింది.
   బి) మహిళల ప్రపంచకప్ 1973లో మొదటిసారి భారత్‌లో జరిగింది.
   సి) 2025 మహిళల ప్రపంచకప్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసింది షఫాలీ వర్మ (ఇండియా).
   డి) 2025 మహిళల ప్రపంచకప్ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసింది దీప్తి శర్మ (ఇండియా).
   1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి

నోట్: ★ మహిళల ప్రపంచకప్ 1973లో ఇంగ్లండ్‌లో జరిగింది. ★ 2025 (13 వ) మహిళల క్రికెట్ ప్రపంచకప్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసింది - లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా).

2. కింది వాటిలో సరైంది?
   ఎ) 2005, 2017 మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో ఇండియా రన్నర్‌గా నిలిచింది.
   బి) 1978, 1997, 2013, 2025 మహిళా వరల్డ్‌కప్ ఇండియాలో జరిగింది.
   సి) 13 సార్లు మహిళా వరల్డ్‌కప్ జరగగా ఆస్ట్రేలియా ఏడు సార్లు, ఇంగ్లండ్ నాలుగు సార్లు, న్యూజిలాండ్ ఒకసారి, ఇండియా ఒకసారి విజేతగా నిలిచాయి.
   డి) 2025 మహిళల వరల్డ్‌కప్ మొత్తం ప్రైజ్‌మనీ 13.88 మిలియన్ డాలర్లు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి, డి

నోట్: ★ 2025 మహిళల ప్రపంచకప్ విజేత ఇండియా, రన్నర్ దక్షిణాఫ్రికా. ★ 2025 మహిళల ప్రపంచకప్‌లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.

3. కింది వాటిలో సరైంది?



   ఎ) ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన LVM3-M5 వాహక నౌక ద్వారా 2025, నవంబరు 2న 'CMS-03 ఉపగ్రహ ప్రయోగం' విజయవంతమైంది.
   బి) ఇస్రో ఇప్పటివరకు ప్రయోగించిన ఉపగ్రహాల్లో అత్యంత బరువైన ఉపగ్రహంగా CMS3-03 (4,410 కిలోల బరువు) రికార్డు కెక్కింది.
   సి) 2013లో ప్రయోగించిన జీశాట్-7 ఉపగ్రహం కాలపరిమితి పూర్తికావడంతో దాని స్థానంలో ప్రవేశపెట్టిన జీశాట్ 7ఆర్ ఉపగ్రహమే CMS-03.
   డి) భారత భూభాగంతో సహా విస్తృత సముద్ర ప్రాంతంలో అన్నివేళల్లో సేవలందిస్తుంది.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

నోట్: ★ ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో ఇది 103వ ప్రయోగం. ★ సముద్ర వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలవుతుంది. భారత నౌకాదళం కోసం సీఎంఎస్-03ని రూపొందించారు. ★ 15 ఏళ్ల పాటు సేవలు అందిస్తుంది.

4. 'వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్' థీమ్‌తో 8వ ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ సమావేశాన్ని భారత ప్రభుత్వ భాగస్వామ్యంతో 2025, అక్టోబరు 27 నుంచి 30 వరకు ఎక్కడ నిర్వహించారు?
   1) ముంబయి 2) చెన్నై
   3) దిల్లీ 4) కోల్‌కతా
5. ఇండియాలో 94వ రామ్‌సర్ సైట్ గోగాబీల్ సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) కేరళ 2) తమిళనాడు
   3) బిహార్ 4) కర్ణాటక
6. ఏ దేశ విదేశాంగమంత్రి 'అబ్దుల్లాతిఫ్ బిన్ రషీద్ అల్ జయానీ' ఇటీవల భారత్‌ను సందర్శించారు?
   1) బహ్రెయిన్ 2) పాకిస్థాన్
   3) ఖతర్ 4) సౌదీ అరేబియా
7. ఇటీవల మరణించిన హిందీ, భోజ్‌పురి రచయిత రాందరాష్ మిశ్రా (101)కు ఏ సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు వచ్చింది?
   1) 2020 2) 2025 3) 2019 4) 2021

నోట్: ★ ఇతడికి 2011లో వ్యాస్ సమ్మాన్, 2015లో సాహిత్య అకాడమీ అవార్డు, 2021లో సరస్వతీ సమ్మాన్ అవార్డులు వచ్చాయి.

8. యునెస్కో సృజనాత్మక నగరాల జాబితాలో (అసాధారణమైన, విభిన్నమైన వంటకాల సంప్రదాయాలకు – గ్యాస్ట్రోనమీ విభాగంలో) కింది ఏ నగరం గుర్తింపు పొందింది?
   1) విజయవాడ 2) పుణె
   3) అలహాబాదు 4) లఖ్‌నవూ

నోట్: ★ ఉజ్బెకిస్థాన్‌లోని సమర్కండ్‌లో జరిగిన యునెస్కో 43వ జనరల్ కాన్ఫరెన్స్‌లో లఖ్‌నవూ ఈ గుర్తింపు పొందింది. (58 నగరాలు సృజనాత్మక నగరాల జాబితాలో చేరాయి). ★ ప్రపంచ వ్యాప్తంగా 70 గ్యాస్ట్రోనమీ నగరాల్లో లఖ్‌నవూకు స్థానం లభించింది. ★ ఈ విభాగంలో హైదరాబాద్ తర్వాత గుర్తింపు పొందిన రెండో భారతీయ నగరమిది.

ఇండియాలో యునెస్కో సృజనాత్మక నగరాలు - 9

నగరం	విభాగం	చేరిన సంవత్సరం
1) జైపుర్	క్రాఫ్ట్స్ అండ్ ఫోక్ ఆర్ట్స్	2015
2) వారణాసి	మ్యూజిక్	2015
3) చెన్నై	మ్యూజిక్	2017
4) ముంబయి	ఫిల్మ్	2019
5) హైదరాబాద్	గ్యాస్ట్రోనమీ	2019
6) శ్రీనగర్	క్రాఫ్ట్స్ అండ్ ఫోక్ ఆర్ట్స్	2021
7) కోజికోడ్	లిటరేచర్	2023
8) గ్వాలియర్	మ్యూజిక్	2023
9) లఖ్‌నవూ	గ్యాస్ట్రోనమీ	2025

9. క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్ – 2026లో టాప్ 100లో నిలిచిన భారతీయ విద్యాసంస్థలు ఎన్ని?
   1) 8 2) 6 3) 7 4) 3

నోట్: ★ 59వ స్థానంలో ఐఐటీ- దిల్లీ నిలిచింది. (దేశంలో టాప్ ర్యాంకును ఈ సంస్థ సాధించడం వరసగా ఇది ఐదోసారి.) ★ టాప్ 200లో 20, టాప్ 500లో 66 భారతీయ విద్యాసంస్థలు ఉన్నాయి. ★ హాంకాంగ్ విశ్వవిద్యాలయం మొదటి స్థానంలో నిలిచింది.

10. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నూతన డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) రవినందన్ 2) షామిన్ హాసన్
   3) సంజయ్ గార్గ్ 4) నరేష్ కుమార్
11. 'ఖబరోవ్స్క్' అణు జలాంతర్గామి ఏ దేశానికి చెందింది?



   1) అమెరికా
   2) చైనా
   3) ఉత్తర కొరియా 4) రష్యా
12. కింది వాటిలో సరైంది?
   ఎ) దేశ రక్షణ దళాల కోసం మానవ రహిత విమానాలను దేశీయంగా తయారుచేసేందుకు అమెరికా సంస్థ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్ ఇంక్‌తో ఎల్ అండ్ టీ సంస్థ ఒప్పందం చేసుకుంది.
   బి) భారతదేశపు మొదటి డిఫెన్స్ ఎలక్ట్రిక్ వాహనం 'వీర్' బెంగళూరుకు చెందిన ప్రైవేట్ డైనమిక్స్ ద్వారా అభివృద్ధి చేసిన ఒక వ్యూహాత్మక ఎలక్ట్రిక్ టాక్టికల్ ఆల్-టరైన్ వెహికల్.
   సి) తజకిస్థాన్‌లోని ఐనీ వైమానిక స్థావరంలో కార్యకలాపాలను భారత్ ఆపేసింది.
   1) ఎ 2) బి
   3) ఎ, బి 4) ఎ, బి, సి
13. భారత 90వ చెస్‌గ్రాండ్ మాస్టర్ ఇల్లంపర్తి ఏఆర్



ఏ రాష్ట్రానికి చెందినవారు?
   1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
   3) మహారాష్ట్ర 4) తమిళనాడు

నోట్: 91వ చెస్ గ్రాండ్ మాస్టర్ రాహుల్ వీఎస్.

14. 'రాబ్ జెట్టన్' ఏ దేశ ప్రధానిగా ఎంపికయ్యారు?
   1) డెన్మార్క్ 2) నెదర్లాండ్స్
   3) నార్వే 4) స్పెయిన్
15. 'గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ - 2025 లో ఇండియా ర్యాంకు ఎంత?
   1) 3వ 2) 2వ 3) 5వ 4) 4వ

నోట్: అమెరికా, రష్యా, చైనా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

16. 33వ APEC (ఏసియా–పసిఫిక్ ఎకనామిక్ కో – ఆపరేషన్) సదస్సు ఎక్కడ జరిగింది?
   1) జపాన్ 2) ఉత్తర కొరియా
   3) దక్షిణ కొరియా 4) సింగపూర్

నోట్: ★ ఈ సమావేశాన్ని 2005 లో మొదటిసారి, 2025 లో రెండోసారి దక్షిణాఫ్రికా నిర్వహించింది. ★ 2025 సమావేశం థీమ్: 'బిల్డింగ్ ఎ సస్టైనబుల్ టుమారో కనెక్ట్, ఇన్నోవేట్, ప్రాస్పర్'.

17. ఇటీవల ఎవరిని దక్షిణ కొరియా ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వా'తో సత్కరించింది?
   1) నరేంద్ర మోదీ 2) డొనాల్డ్ ట్రంప్
   3) వ్లాదిమిర్ పుతిన్ 4) కీర్ స్టార్మర్
18. ఇటీవల వార్తల్లో ఉన్న కునార్ నది (కామా నది) ఏ రెండు దేశాల మధ్య సరిహద్దుగా ప్రవహిస్తుంది?
   1) పాకిస్థాన్ - అఫ్గానిస్థాన్
   2) ఇండియా - పాకిస్థాన్
   3) చైనా - ఇండియా
   4) ఇండియా - మయన్మార్

నోట్: ★ భారత్ మద్దతుతో అఫ్గానిస్థాన్ ఈ నదిపై ఆనకట్ట నిర్మిస్తోంది. ★ ఇది కాబూల్ నది ఉపనది. ★ పాకిస్థాన్‌లో దీన్ని 'చిత్రాల్ నది' అంటారు.

19. ఆన్‌లైన్ భద్రతను ప్రోత్సహించడానికి ఏ రాష్ట్ర పోలీసులు 'సైబర్ జాగో' కార్యక్రమం ప్రారంభించారు?



   1) పంజాబ్ 2) కేరళ
   3) గోవా 4) ఉత్తరాఖండ్
20. 'మ్యూజియం ఆఫ్ రాయల్ కింగ్‌డమ్ ఆఫ్ ఇండియా'కు మోదీ ఏ రాష్ట్రంలో పునాది రాయి వేశారు?
   1) రాజస్థాన్ 2) గుజరాత్
   3) కేరళ 4) మహారాష్ట్ర

నోట్: గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు.

21. 2025 ఆసియా యువజన క్రీడల్లో భారత ర్యాంకు ఎంత?
   1) 6వ 2) 3వ 3) 4వ 4) 8వ

నోట్: ★ ఇవి 3వ ఆసియా యువజన క్రీడలు. బహ్రెయిన్‌లో 2025, అక్టోబరు 22 నుంచి 31 వరకు జరిగాయి. ★ చైనా, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ★ 13 స్వర్ణాలు, 18 రజతాలు, 17 కాంస్యాలతో మొత్తం 48 పతకాలు ఇండియాకు వచ్చాయి.

22. ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ విజేత ఎవరు?
   1) దబాంగ్ దిల్లీ 2) బెంగళూరు బుల్స్
   3) గుజరాత్ జెయింట్స్ 4) హరియాణా స్టీలర్స్
23. ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
   1) నవంబరు 3 2) నవంబరు 4
   3) నవంబరు 5 4) నవంబరు 9
24. ఇండియా ఇటీవల ఏ దేశానికి ఆరు టన్నుల వెక్టార్–బోర్న్ వ్యాధి నివారణ మందులు, డయాగ్నోస్టిక్ కిట్స్‌ను ఉచితంగా అందించింది?
   1) భూటాన్ 2) అఫ్గానిస్థాన్
   3) మాల్దీవులు 4) శ్రీలంక



రచయిత: జి.ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-2, 2-1, 3-3, 4-3, 5-3, 6-1, 7-2, 8-4, 9-3, 10-3, 11-4, 12-4, 13-4, 14-2, 15-4, 16-3, 17-2, 18-1, 19-1, 20-2, 21-1, 22-1, 23-3, 24-2.

కర్ణాటిక్ యుద్ధాలు/ ఆంగ్లో - ఫ్రెంచ్ యుద్ధాలు (1746-63)

క్రీ.శ.1707-1857 మధ్యకాలంలో భారతదేశంలో మొగల్ వంశపాలకుల అసమర్థత, వారసత్వ యుద్ధాలు, రాష్ట్ర పాలకుల తిరుగుబాట్లు, మరాఠాల్లోని కలహాలు, స్వార్థబుద్ధి మొదలైన అంశాలు ఇంగ్లిష్ - ఈస్ట్ ఇండియా కంపెనీ విస్తరణకు దారితీశాయి. ఇవి స్వదేశీ పాలకుల వ్యవహారాల్లో జోక్యం కల్పించుకునేలా ప్రోత్సహించాయి. ఐరోపాలో ఆంగ్లో - ఫ్రెంచ్ వారి మధ్య ఉన్న శత్రుత్వం భారతదేశంలోనూ రెండు కంపెనీల మధ్య ప్రత్యక్ష పోరుకు తెరతీసింది. ఆంగ్లేయులకు, ఫ్రెంచ్‌వారికి మధ్య మూడుసార్లు జరిగిన భీకర పోరాటాలను కర్ణాటిక్ యుద్ధాలు అంటారు. భారతదేశ చరిత్రలో ఆంగ్లో-ఫ్రెంచ్ కంపెనీలు, స్థానిక పాలకులతో కలిసి చేసిన మూడు కర్ణాటక యుద్ధాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

కంపెనీల ఆధిపత్య పోరుతో.. మూడు భీకర యుద్ధాలు!

మొగలుల పాలన తర్వాత తమిళనాడులో ఆర్కాట్ రాజధానిగా కర్ణాటిక్ అనే ముస్లిం రాజ్యం ఏర్పడింది. ఈ రాజ్యంలోనే మూడు యుద్ధాలు జరగడంతో వాటిని కర్ణాటిక్/ కర్ణాటక యుద్ధాలు అంటారు.

మొదటి కర్ణాటిక్ యుద్ధం (1746-48)



ఐరోపాలో ఇంగ్లండ్, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఆస్ట్రియా వారసత్వ యుద్ధంతో భారత్‌లో మొదటి కర్ణాటిక్ యుద్ధం ప్రారంభమైంది. ఇందులో ఫ్రెంచ్‌వారు విజయం సాధించారు.

- ఫ్రెంచ్ గవర్నర్ **జోసెఫ్ ఫ్రాంకోయిస్ డూప్లే** ఆంగ్లేయులను ఓడించి మద్రాస్‌ను ఆక్రమించాడు.
- ఆంగ్లేయులకు మద్దతుగా వచ్చిన కర్ణాటిక్ నవాబ్ అన్వరుద్దీన్‌ను ఫ్రెంచ్ సేనాని కెప్టెన్ పారడైజ్ శాంథోమ్ ఓడించాడు.
- మొదటి కర్ణాటిక్ పోరుకు కారణమైన ఆస్ట్రియా వారసత్వ యుద్ధం క్రీ.శ.1748లో ఎక్స్-లా-చాపెల్ సంధితో ముగిసింది. మొదటి కర్ణాటిక్ యుద్ధంలో డూప్లే విజయం సాధించినప్పటికీ, ఈ సంధి ప్రకారం ఫ్రెంచ్‌వారు మద్రాస్‌ను ఆంగ్లేయులకు తిరిగి ఇచ్చేశారు. పాండిచ్చేరిని ఫ్రెంచ్‌వారు పొందారు.
- అయితే ఈ యుద్ధం తాత్కాలిక విరమణ మాత్రమే అయ్యింది. భారత్‌లో ఆధిపత్యం కోసం ఆంగ్లో - ఫ్రెంచ్ ఈస్ట్ ఇండియా వర్తక సంఘాల అధికారులు, సేనలు మరోసారి యుద్ధానికి సిద్ధమయ్యాయి.
- మొదటి కర్ణాటిక్ యుద్ధం విదేశీ వర్తక సంఘాల సామ్రాజ్య విస్తరణ కాంక్షను, భారతీయ పాలకుల బలహీనత, అనైక్యతను, స్వదేశీ సేనల బలహీనతలను, డూప్లే - క్లైవ్‌ల నాయకత్వాన్ని బహిరంగం చేసింది.

రెండో కర్ణాటిక్ యుద్ధం (1749-1755)

రెండో కర్ణాటిక్ యుద్ధం మొదటి కర్ణాటిక్ యుద్ధానికి కొనసాగింపుగా జరిగింది. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి.

- మొదటిది భారతదేశంలో స్వదేశీ రాజ్యాలైన ఆర్కాట్, హైదరాబాద్‌లో తలెత్తిన వారసత్వ తగాదాలు. రెండోది ఫ్రెంచ్, ఆంగ్లో కంపెనీ అధికారుల మధ్య ఏర్పడిన శత్రుత్వం.
- హైదరాబాద్, ఆర్కాట్ వారసత్వ తగాదాల్లో రెండు కంపెనీల్లోని వారు వ్యతిరేక కూటముల్లో చేరారు. దీంతో యుద్ధం తిరిగి ప్రారంభమైంది.
- కర్ణాటిక్ రాజ్యంలో నవాబ్ అన్వరుద్దీన్‌కు వ్యతిరేకంగా అతడి సోదరుడు చాంద్‌సాహెబ్ తిరుగుబాటు చేశాడు. ఆంగ్లేయులు అన్వరుద్దీన్‌కు మద్దతివ్వగా, ఫ్రెంచ్‌వారు చాంద్‌సాహెబ్‌కు బాసటగా నిలిచారు.
- అదే సమయంలో నిజాం రాజ్యంలోనూ వారసత్వ ఘర్షణ ప్రారంభమైంది. అధికారంలో ఉన్న నాజర్ జంగ్‌కు వ్యతిరేకంగా అతడి మేనల్లుడు ముజఫర్ జంగ్ తిరుగుబాటు చేశాడు. ఆంగ్లేయులు నాజర్ జంగ్‌కు, ఫ్రెంచ్‌వారు ముజఫర్ జంగ్‌కు మద్దతు పలికారు.
- ఈ రెండు రాజ్యాల్లోని వారసత్వ ఘర్షణల్లో ఆంగ్లేయులు, ఫ్రెంచ్‌వారు తలదూర్చడంతో రెండో కర్ణాటిక్ యుద్ధం అనివార్యమైంది.



ఈ యుద్ధంలోని ప్రధాన ఘట్టాలు: క్రీ.శ. 1749 ఆగస్టులో డూప్లే, ముజఫర్ జంగ్, చాంద్‌సాహెబ్ మిత్రకూటమి సైన్యాలు ఆర్కాట్ నవాబ్ అన్వరుద్దీన్‌పై దండెత్తాయి. ఫ్రెంచ్ సైన్యానికి 'డి-అతుల్' నాయకత్వం వహించాడు. రెండు పక్షాల సైన్యాలకు మధ్య ఆర్కాట్ సమీపంలో ఉన్న అంబూరు వద్ద భయంకర యుద్ధం జరిగింది.

- ఈ యుద్ధంలో అన్వరుద్దీన్ మరణించాడు. అతడి కుమారుడైన మహ్మద్ అలీ ఆర్కాట్ వదిలి తిరుచునాపల్లి పారిపోయాడు.
- డూప్లే, తన సేనలు ఆర్కాట్‌ను స్వాధీనం చేసుకొని అక్కడ ముజఫర్‌జంగ్‌ను దక్కన్ సుబేదారుగా, చాంద్‌సాహెబ్‌ను కర్ణాటిక్ నవాబ్‌గా ప్రకటించారు.
- 1750లో నిజాం రాజ్య పాలకుడు నాజర్ జంగ్ హత్యకు గురవడంతో ఫ్రెంచ్‌వారి మద్దతుతో ముజఫర్ జంగ్ అధికారంలోకి వచ్చాడు. వరుస ఓటములతో కుదేలైన ఆంగ్లేయులు బెంగాల్ నుంచి రాబర్ట్ క్లైవ్‌ను కర్ణాటిక్‌కు రప్పించారు. ఇతడి రాకతో యుద్ధ ఫలితాలు తారుమారయ్యాయి. క్లైవ్ భారీ సైన్యంతో ఆర్కాట్‌ను ఆక్రమించాడు.
- 1751లో ఫ్రెంచ్‌వారి మద్దతుతో అధికారంలోకి వచ్చిన ముజఫర్ జంగ్ కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి వద్ద హత్యకు గురయ్యాడు. దీంతో ఫ్రెంచ్‌వారు సలాబత్ జంగ్‌కు సింహాసనాన్ని అప్పగించి, అతడికి రక్షణగా బుస్సీ అనే ఫ్రెంచ్ సేనానిని నియమించారు.
- 1752లో ఆర్కాట్ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్.. చాంద్‌సాహెబ్‌ను చంపి, అన్వరుద్దీన్ కుమారుడు మహమ్మద్ అలీని కర్ణాటిక్ నవాబ్‌గా నియమించాడు. ఈ విజయాలతో రాబర్ట్ క్లైవ్‌కు ఆర్కాట్ వీరుడు అనే పేరు వచ్చింది. అనంతరం పాండిచ్చేరి సంధి (1754), తిరుచినాపల్లి సంధి (1755)తో రెండో కర్ణాటిక్ యుద్ధం ముగిసింది.

మూడో కర్ణాటిక్ యుద్ధం (1756-63)

ఇంగ్లండ్, ఫ్రాన్స్ మధ్య అమెరికాపై ఆధిపత్యం కోసం జరిగిన సప్తవర్ష సంగ్రామం (Seven Years War)లో భాగంగా భారతదేశంలో మూడో కర్ణాటిక్ యుద్ధం జరిగింది. ఇది క్రీ.శ. 1756 నుంచి 1763 వరకు ఏడేళ్లపాటు కొనసాగింది.

- గాడెహ్యూ అనంతరం ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ పాండిచ్చేరి గవర్నర్‌గా థామస్ ఆర్థర్-కౌంట్- డిలాలీని 1758, ఏప్రిల్‌లో నియమించింది. ఇతడు మంచి యోధుడు, సైనికవేత్త. కానీ అతనికి భారతదేశ రాజకీయాలపై అవగాహన లేదు.
- డిలాలీ హైదరాబాద్‌లో ఉన్న బుస్సీని పాండిచ్చేరి రావాల్సిందిగా ఆదేశించాడు. బుస్సీ హైదరాబాద్ నుంచి పాండిచ్చేరి బయలుదేరగానే ఫోర్డే అక్కడ ఫ్రెంచ్‌వారి ప్రాబల్యాన్ని తగ్గించాడు.
- 1758 నవంబరు 17న ఆంగ్లేయులకు, విజయనగరం రాజుకు సంధి కుదిరింది. దీని ప్రకారం కోస్తా ప్రాంతంలో ఫ్రెంచ్‌వారి స్థావరం రద్దయింది. ఆంగ్లేయులు ఉత్తర సర్కారు జిల్లాలను పొందారు.
- క్రీ.శ. 1760 జనవరి 20న వందవాసి వద్ద జరిగిన యుద్ధంలో సర్ ఐర్ కూట్ అనే ఆంగ్ల సేనాధిపతి డిలాలీ, బుస్సీలను ఓడించాడు. ఈ యుద్ధంతో భారతదేశంపై ఫ్రెంచ్ ఆధిపత్యం అంతమైంది.
- 1763లో ఐరోపాలో సప్తవర్ష సంగ్రామం పారిస్ సంధితో ఆగింది. దీంతో భారతదేశంలో మూడో కర్ణాటిక్ యుద్ధం ముగిసింది. ఈ సంధి ప్రకారం పాండిచ్చేరిని ఫ్రెంచ్‌వారు ఇంగ్లండ్‌కు అప్పగించారు. కానీ బెంగాల్‌లో కేవలం వర్తకం చేసుకోవడానికి ఆంగ్లేయులు వారికి అనుమతించారు.
- మహమ్మద్‌అలీ ఆంగ్లేయుల మద్దతుతో ఆర్కాట్ నవాబ్‌గా స్థిరపడ్డాడు.
- హైదరాబాద్‌లో సలాబత్‌జంగ్ సంరక్షణ భారాన్ని ఆంగ్లేయులు స్వీకరించి, తమ ప్రాబల్యాన్ని స్థాపించారు.
- కర్ణాటక యుద్ధాలు సుమారు 20 ఏళ్లపాటు కొనసాగాయి.
- స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వ దౌత్య ఒత్తిడికి తలొగ్గిన ఫ్రెంచ్‌వారు తమ స్థావరాలను 1954లో భారతదేశానికి స్వాధీనం చేశారు. నెహ్రూ ప్రభుత్వం వీటిని భారతదేశంలో విలీనం చేసి, వాటిలో పాండిచ్చేరిని కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసింది.

బ్రిటిష్ విజయానికి.. ఫ్రెంచ్ ఓటమికి కారణాలు

ఇంగ్లండ్, ఫ్రాన్స్ రెండూ ఆనాటి అగ్ర రాజ్యాలు. అయినప్పటికీ భారతదేశంలో ఆధిపత్యం కోసం ఆ దేశాలకు చెందిన కంపెనీల మధ్య జరిగిన యుద్ధాల్లో ఆంగ్లేయులు విజయం సాధించగా, ఫ్రెంచ్‌వారు ఓడిపోయారు. వీటికి అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

- ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రైవేట్ సంస్థ. దీనిపై కంపెనీ అధికారులకే నిర్ణయాధికారం ఉండటంతో సంపూర్ణ స్వేచ్ఛ ఉండేది. ఫ్రెంచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వ కంపెనీ అవ్వడం వల్ల అందులోని ఉద్యోగులు నియమ నిబంధనలకు ప్రాధాన్యం కల్పించారు.
- ఆంగ్లేయులు లాభసాటి వ్యాపారం కొనసాగించి అత్యున్నత లాభాలు గడించారు. బొంబాయి, మద్రాస్, కలకత్తా లాంటి ప్రధాన స్థావరాలు వారి వ్యాపారాన్ని విపరీతంగా పెంచాయి. ఫ్రెంచ్‌వారికి పాండిచ్చేరి మినహా సరైన వ్యాపార స్థావరాలు లేకపోవడంతో మొదటి నుంచి కంపెనీ నష్టాలకు గురైంది.
- 1757 ప్లాసీ యుద్ధం తర్వాత ఆంగ్లేయులు బెంగాల్‌పై పూర్తి ఆధిపత్యం సంపాదించారు. బెంగాల్‌లోని సంపద, వనరులను ఫ్రెంచ్‌వారిని అంతం చేసేందుకు ఉపయోగించారు.
- ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ విజయంలో బ్రిటిష్ నౌకాశక్తి కీలకపాత్ర పోషించింది. ఆ రోజుల్లో ఇంగ్లండ్‌ను 'క్వీన్ ఆఫ్ ది సీ' అని పిలిచేవారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day

829 *Temerity*

Telugu meaning: వెర్రి ధైర్యం, సాహసం

English meaning: The word 'temerity' (టిమెరిటీ) is a noun that refers to excessive boldness or audacity, often in a reckless or foolish way.

Synonyms: Boldness, Audacity

Antonyms: Caution, Timidity

Usage: **1.** He had the temerity to question his superior's decision during the meeting.

2. Her temerity in challenging traditional norms earned her both admiration and criticism.

Current Affairs



Canadian-Hungarian-British writer David Szalay won the Booker Prize for fiction for his novel 'Flesh' at a ceremony in London on 10 November 2025. Flesh is the story of an ordinary man's life over several decades in which what isn't on the page is just as important as what is.

- The Booker Prize was founded in 1969 and has established a reputation for transforming writers' careers.

Maharashtra has secured the first position in the Best State category of the 6th National Water Awards for 2024. The awards, announced by Jal Shakti Minister C.R. Paatil on 11 November 2025, recognise outstanding efforts in water conservation and management across the country. Gujarat and Haryana have been placed second and third respectively.

Defence Secretary Rajesh Kumar Singh co-chaired the 15th India-Vietnam Defence Policy Dialogue in Hanoi with Vietnam Deputy Minister of National Defence Sr Lt Gen Hoang Xuan Chien on 10 November 2025. They signed a Memorandum of Agreement on Mutual Submarine Search and Rescue Support and Cooperation, and also a Letter of Intent on strengthening Defence Industry collaboration.

A statue of Maharaja Digvijaysinhji Ranjitsinhji was unveiled at Moshav Nevatim in southern Israel on 11 November 2025, to honour his extraordinary humanitarian act of rescuing hundreds of Polish children - including Jewish orphans - during World War II.

NPCI International Payments Limited (NIPL), the international arm of the National Payments Corporation of India (NPCI), and BENEFIT, Bahrain's leading fintech and electronic financial transactions company, have entered into a partnership to enable real-time cross-border remittances between India and Bahrain. This new partnership connects India's Unified Payments Interface (UPI) with Bahrain's Electronic Fund Transfer System (EFTS), specifically through the Fawri+ service, enabling users in both countries to send and receive money instantly and securely.

For more Current Affairs: Scan QR code

భారతదేశంలో వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ

స్టడీ జోన్



దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకులే ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేది కాదు. కొంతమంది ధనికులకు, వ్యాపారులకు మాత్రమే బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేవి. ఆశించిన రీతిలో ఆర్థికాభివృద్ధి జరగలేదు. దీంతో ఇందిరా గాంధీ ప్రభుత్వం 1969లో మొదటిసారి, 1980లో రెండోసారి బ్యాంకులను జాతీయం చేయాలనే నిర్ణయం తీసుకుంది. ఇది బ్యాంకింగ్ వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పులకు కారణమైంది. పోటీపరీక్షల నేపథ్యంలో వీటికి సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

జాతీయీకరణ ఎందుకు?

భారత్‌లో పారిశ్రామిక లైసెన్సింగ్ వ్యవస్థ పనితీరును సమీక్షించేందుకు 1967లో హజారే కమిటీని ఏర్పాటు చేశారు. ఇది తన నివేదికలో పరిశ్రమలు, బ్యాంకులకు మధ్య అనుసంధానం లేకపోతే పరపతి ప్రణాళిక తీసుకురావడం కష్టమని పేర్కొంది. ఫలితంగా ప్రభుత్వం మొదట 'సోషల్ కంట్రోల్'ని ప్రవేశపెట్టింది. దీంతో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో 1969, జులై 19న నాటి ప్రధాని ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

లాభాలు:

ప్రజలకు బ్యాంకులను చేరువ చేయడంలో, పారిశ్రామిక రంగానికి పెట్టుబడి అవసరాలు తీర్చడంలో, రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకుల జాతీయీకరణ ఎంతగానో దోహదం చేసింది.

- గ్రామాలు, పట్టణాలు అనే భేదం లేకుండా ప్రజలంతా బ్యాంకులను ఉపయోగించడం ప్రారంభించారు.
- దేశ ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రుణ విస్తరణ లాంటి వివిధ భాగాల్లో బ్యాంకులు క్రియాశీల పాత్ర పోషించాయి.
- ప్రభుత్వరంగ బ్యాంకులు దేశం నలుమూలలా విస్తరించాయి.

రెండో విడత బ్యాంకుల జాతీయీకరణ ఎప్పుడు జరిగింది? గతంలో అడిగిన ప్రశ్నలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

రైతులు, చేనేత కార్మికుల సమస్యలు - సంక్షేమ పథకాలు



భారతదేశంలో పూర్వం నుంచి వ్యవసాయ, చేనేత రంగాలకు ప్రత్యేకస్థానం ఉంది. ఈ రంగాల్లో లక్షలాది మంది వారసత్వంగా జీవనోపాధి పొందడంతో పాటు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు. దేశ రైతన్నలు అందరి కడుపు నింపుతుంటే, నేతన్నలు తమ కళతో భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెస్తున్నారు. వీరు కొన్ని సందర్భాల్లో ఒడిదొడుకులకు లోనవుతుంటారు. ఈ క్రమంలో వారికి చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చింది.

కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

- కిసాన్ కాల్‌సెంటర్లు
- సాయిల్ హెల్త్‌కార్డు
- రాష్ట్రీయ గోకుల్ మిషన్
- అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ
- పరంపరాగత్ కృషివికాస్ యోజన
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి
- నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్
- కిసాన్ క్రెడిట్ కార్డు

చేనేత రంగం - ప్రాథమిక అంశాలు, చేనేత సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ చేనేత పథకాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Consultant Posts

The National Institute for Empowerment of Persons with Intellectual Disabilities (Divyangjan)- NBER Centre, Secunderabad, is conducting interviews for the Consultant posts on a contract basis. The total no. of posts is 13. The application fee is Rs.200. Eligible candidates can appear for the interview on 17 November 2025.

Relationship Manager jobs

Punjab Sind Bank is inviting applications for the recruitment of MSME Relationship Managers on a contractual basis. The total no. of posts is 30. The application fee is Rs. 850. The last date for receipt of online applications is 26 November 2025.

Ph.D Program

National Institute of Rural Development and Panchayati Raj (NIRD-PR), Rajendranagar, Hyderabad, invites applications for admissions to Ph.D Program in Rural Development. Eligible candidates can apply online before 18 November 2025.

Did You Apply..?

Today (November 13) is the last date for the following Jobs.

- 120 Senior Executive Trainee Posts in BSNL. ***Eligibility:*** B.E./B.Tech.
- 21 Senior Resident posts in ESIC Varanasi. ***Eligibility:*** MS, MD.
- Indian Army - Technical Entry Scheme 55 Course. ***Qualification:*** 10+2 Examination.

For more information and other notifications - scan QR code

Small-Cap Combination Letter Series

Directions (Qs. 1 - 30): *The following questions are framed on letter sequences. In each part of the series, there is a combination of capital and small letters, with certain letters, skipped and/ or repeated. Find the correct answer.*

1. m nN Oo Pp Q ??
A) rR B) qR C) RR
D) rr E) None of the above

2. aB bB cD dD?
A) eF B) fF C) gG
D) Gg E) None of the above

3. aa BBB cccc ??
A) dddjjj B) dddDDD
C) ddddd D) DDDDDD
E) None of the above

4. AGMS ciou ?
A) ABCD ascd B) BHNT bhnt
C) BHNT djpv D) bhnt DJPV
E) None of the above

5. accce ACCCE?
A) GJJJK gjjjk B) giiik GIIIK
C) GIIIK ghhk D) GIIIK GiiiK
E) None of the above

6. ABC abc DEF ?
A) ghi B) GHI C) ABC
D) def E) None of the above

7. ACF acf G ?
A) IL giI B) JL gi I C) IL gjl
D) LL gi i E) None of the above

8. ZXV zxv U
A) st ST B) sqo C) SQO
D) SRTs E) None of the above

9. aZ cX eV ?
A) fU B) gT C) hT
D) Ij E) None of the above

10. AGMS agms ?
A) ABCD abcd B) BHNT bhnt
C) BHNT abcd D) bhnt BHNT
E) None of the above

11. aa cccc ?
A) ddjjj B) dddjj
C) ddddd D) DDDDD
E) None of the above

12. aB bC cD dE e?
A) e B) F C) g
D) G E) None of the above

13. mN nO oP pQ ?
A) rR B) RR C) qR
D) rr E) None of the above

14. DD jjj pp vvv B
A) B B) bB C) bb
D) BB E) None of the above

15. AG ms BH nt CI ?
A) uy B) jk C) ou
D) uo E) None of the above

Bank Exams

Reasoning

16. a CC eee ?
A) f B) gggg C) ff
D) GGGG E) None of the above

17. a FG l m?
A) nn B) op C) R
D) r E) None of the above

18. bbNN cc OO ?
A) aa B) dd C) qq
D) pp E) None of the above

19. A D g J m P
A) sp B) sV C) sP
D) Sv E) None of the above

20. MM qq ..... bbII
A) VV B) ST C) vv
D) pp E) None of the above

21. Qx Di ..... p
A) L B) m C) M
D) l E) None of the above

22. Zs Xu Ux ....
A) Qb C) Bp B) Sx
D) pB E) None of the above

23. DS gv JY .....
A) LA B) MB C) la
D) mb E) None of the above

24. xY Av dS Gp ......
A) Jm B) jM C) Mj
D) mJ E) None of the above

25. Pa re Ti ......
A) sT B) oP
C) mM D) vm
E) None of these

26. SR Jv Uf yY Bb .....
A) Dx B) dx C) xD
D) Xd E) None of the above

27. Y l S V h w s d Z P z D ...... G
A) M d B) m v C) V m
D) v g E) None of the above

28. XaSf aEwj ...... gMEr
A) DjAN B) DjaN C) DiAn
D) Dian E) None of the above

29. EU ma Qg WN cS ....
A) mA B) La C) mB
D) MB E) None of the above

30. sn.. V..H ..fE BbB
A) K g y B) K G y
C) K j y D) K J y
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

కారు కొన్నాక
11 రోజులు అజ్ఞాతంలోనే

• ఫరీదాబాద్‌లో మరో కారు స్వాధీనం

దిల్లీ: దేశ రాజధానిలో పేలుడుకు వాడిన కారును అఖ్నూరు 29న డాక్టర్ ఉమర్ నబీ కొనుగోలు చేశాడని, కలుష్య నియంత్రణ ప్రమాణపత్రాన్ని తీసుకుని 11 రోజులపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని దర్యాప్తు అధికారులు గుర్తించారు. అన్ని రోజులపాటు కారు ఎక్కడ ఉందో కచ్చితంగా తెలియడం లేదు. అల్ ఫలా విశ్వవిద్యాలయం వద్ద ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా.. ఫరీదాబాద్ పోలీసులు మాత్రం అది అక్కడలేదని చెబుతున్నారు. కలుష్య నియంత్రణ ధ్రువీకరణపత్రం (పీయూసీ) తీసుకునే సమయంలో ముగ్గురు వ్యక్తులు కారు నుంచి బయటకు వచ్చారు. వారు ఎవరనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. డాక్టర్ ఉమర్ నబీ పేరుతో నమోదైన ఎర్రరంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా ఖందావలిలో స్వాధీనం చేసుకున్నారు. గూఢచర్యం కోసం వాడారని భావిస్తున్న ఈ కారు కోసం దిల్లీ పోలీసులు అన్ని చెక్‌పోస్టుల్ని ఇప్పటికే అప్రమత్తం చేయడంతో ఇది సాధ్యమైంది.

నకిలీ పత్రాలతో చేతులు మారింది

హ్యుందాయ్ ఐ20 వాహనం పలు చేతులు మారినా.. యాజమాన్య బదిలీకి సంబంధించి ప్రభుత్వ వద్ద ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకపోవడం గమనార్హం. కొనుగోళ్లు, విక్రయాల సమయంలో నకిలీ పత్రాలను ఉపయోగించారని తెలుస్తోంది. ఎర్రకోట కేసులో 9వ అరెస్టు కూడా ఫరీదాబాద్‌లోనే జరిగింది. హరియాణాలోని మేవాత్ ప్రాంతానికి చెందిన మత ప్రబోధకుడు మౌల్వీ ఇష్తియాక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు అల్ ఫలా యూనివర్సిటీ కేంద్రంగా ఉగ్రవాద కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్నారు. ఆ యూనివర్సిటీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఇష్తియాక్ నివసిస్తున్నాడు. ఆ ఇంటి నుంచి దాదాపు 2,500 కేజీల అమోనియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, సల్ఫర్‌లను స్వాధీనం చేసుకోవడంతో విచారణ నిమిత్తం అతడిని శ్రీనగర్‌కు తరలించారు. కీలక నిందితులుగా ఉన్న డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయీద్, డాక్టర్ ఉమర్ నబీ, ఇష్తియాక్‌లకు ఉన్న సంబంధాల గురించి లోతుగా తెలుసుకోవడంపై పోలీసులు దృష్టి సారించారు.

నాలుగు మృతదేహాలు ఎవరివి?

బాంబు పేలుడు జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోయిన తమవారి గురించి దిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో ఎంతోమంది ఆరా తీస్తున్నారు. శవాగారంలో భద్రపరిచిన మృతదేహాలు తమవారివా అని తెలుసుకుంటున్నారు. చనిపోయిన 12 మందిలో 8 మంది ఆచూకీని ఇప్పటికే గుర్తించారు. మిగతా నాలుగు మృతదేహాలు ఎవరివి అనేది తెలుసుకునేందుకు డీఎన్ఏ నమూనాల ద్వారా ప్రయత్నిస్తున్నారు.

అల్-ఫలా ప్రతిష్ఠకు మచ్చ!

• ఉగ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకున్న కొందరు వైద్యులు



ఫరీదాబాద్: దిల్లీ పేలుడు ఘటనపై విచారణ జరుపుతున్న దర్యాప్తు సంస్థల దృష్టి ప్రస్తుతం హరియాణాలోని అల్-ఫలా విశ్వవిద్యాలయంపై పడింది. ఒకప్పుడు ప్రతిష్ఠాత్మక జామియా, అలీగఢ్ విశ్వవిద్యాలయాలకు ప్రత్యామ్నాయంగా కనిపించిన ఈ వర్సిటీ ప్రతిష్ఠ ప్రస్తుత ఘటనలతో మసకబారింది. వైద్యులు, ఆధ్యాపకుల ముసుగులో ఈ విశ్వవిద్యాలయాన్ని కొందరు తమ ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకున్నారు. ఎర్రకోటవద్ద పేలుడుకు కారణమైన కారును నడిపాడని భావిస్తున్న వైద్యుడు ఉమర్ నబీ.. అల్-ఫలా యూనివర్సిటీలో రెసిడెంట్ డాక్టర్‌గా పని చేశాడు. ఇదే యూనివర్సిటీకి చెందిన మరో ఇద్దరు డాక్టర్లు ముజమ్మిల్, షాహీన్‌లను 2,900 కిలోల పేలుడు పదార్థాల కేసులో పోలీసులు అరెస్టు చేశారు. యూనివర్సిటీలోని కొంత మంది వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఈ పరిణామాలతో అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా హరియాణాలోని మేవాత్‌కు చెందిన మౌల్వీ ఇష్తియాక్ అనే మత ప్రచారకుడిని జమ్మూ కశ్మీర్ పోలీసులు శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.

అల్-ఫలా యూనివర్సిటీని ధౌజ్ గ్రామంలో 76 ఎకరాల్లో హరియాణా ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టం కింద ఏర్పాటు చేశారు. 1997లో ఇంజినీరింగ్ కళాశాలగా అది మొదలైంది. 2014లో దీనికి యూనివర్సిటీ హోదా దక్కింది. ఇదే యూనివర్సిటీకి అనుబంధంగా 2019లో అల్-ఫలా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. దిల్లీ జామియా మిలియా యూనివర్సిటీకి కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ యూనివర్సిటీని 1995లో ఏర్పాటైన అల్-ఫలా ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తోంది. అల్-ఫలా క్యాంపస్‌లోనే 650 పడకల ఆసుపత్రి ఉంది. ప్రస్తుతం ఈ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా జావెద్ అహ్మద్ సిద్దిఖీ ఉన్నారు. అల్-ఫలా ఛారిటబుల్ ట్రస్టులో ఆయన మేనేజింగ్ ట్రస్టీ. అల్-ఫలా ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకల కేసులో సిద్దిఖీ ఓసారి అరెస్టయినట్లు తెలుస్తోంది.

స్పందించిన యూనివర్సిటీ

తమ విశ్వవిద్యాలయంపై వస్తున్న ఆరోపణలను అల్-ఫలా యాజమాన్యం ఖండించింది. ఈ దురదృష్టకర పరిణామాలు తమను బాధించాయని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ఓ ప్రకటన విడుదలైంది. ఉగ్ర సంబంధాలున్న వైద్యులకు, తమకు కేవలం వృత్తిపరమైన సంబంధం మాత్రమే ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థలకు విశ్వవిద్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొంది. 'అల్-ఫలా గ్రూప్ 1997 నుంచి వివిధ విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. తర్వాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ దీనిని గుర్తించింది. 2019 నుంచి ఇక్కడ ఎంబీబీఎస్ కోర్సును నిర్వహిస్తున్నాం. మా సంస్థలో విద్యనభ్యసించి పట్టభద్రులైనవారు మన దేశంతోపాటు విదేశాల్లో ప్రముఖ ఆసుపత్రులు, సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దురదృష్టకర పరిణామాలు మమ్మల్ని బాధించాయి. వాటిని మేం ఖండిస్తున్నాం' అని వివరించింది.

ఎర్రకోటను ధ్వంసం చేసే కుట్ర

• మొఘల్ వారసురాలి ఆరోపణ

ఈటీవీ భారత్: దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడుపై మొఘల్ వారసురాలు సుల్తానా బేగం ఆందోళన వ్యక్తం చేశారు. హిందుస్థాన్‌లోని గొప్ప చారిత్రక ప్రాంతమైన ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డాలో నివసిస్తున్న ఆమె పేలుడు ఘటనపై బుధవారం స్పందించారు. చారిత్రక ఎర్రకోటను ధ్వంసం చేసే కుట్ర జరిగిందని వ్యాఖ్యానించారు.

ఐదు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

దిల్లీ: దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. బుధవారం ఇండిగో సంస్థకు దుండగులు ఆ బాంబు బెదిరింపు మెయిల్ పంపారు. అందులో దిల్లీ, ముంబయి, హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు విమానాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఆయా విమానాశ్రయాల అధికారులను అప్రమత్తం చేశారు. ఈ విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబులు గుర్తించలేదని అధికారులు తెలిపారు. బెదిరింపు మెయిల్ పంపిన వారిని గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

నిర్మలా సీతారామన్ సంతకం ఫోర్జరీ

పుణె మహిళకు రూ.99 లక్షలు బురిడీ

ఇంటర్నెట్ డెస్క్: ఓ రిటైర్డ్ ఎల్ఐసీ అధికారిణిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట మోసగించి.. రూ.99 లక్షలు దోచుకున్నారు. ఇందుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేశారు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో వెలుగుచూసింది. పుణెకు చెందిన 62 ఏళ్ల రిటైర్డ్ ఎల్ఐసీ అధికారిణికి డేటా ప్రొటెక్షన్ ఏజెన్సీకి ప్రతినిధులం అంటూ పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. ఆమె ఆధార్-లింక్డ్ మొబైల్ నంబరును మోసపూరిత లావాదేవీల కోసం దుర్వినియోగం చేశారని అతడు పేర్కొన్నాడు. కొద్దిసేపటికే ఓ దుండగుడు తనను తాను జార్జ్ మాథ్యూ అనే సీనియర్ పోలీసు అధికారిగా పరిచయం చేసుకుంటూ.. ఆమెకు వీడియో కాల్ చేశాడు. మోసపూరిత లావాదేవీల నేపథ్యంలో ఆమెపై మనీలాండరింగ్ కేసు నమోదు చేశామని బెదిరించాడు. ఈ కేసుకు గాను కేంద్ర ఆర్థికశాఖ నుంచి అరెస్టు వారెంట్ జారీ అయినట్లు పేర్కొన్నాడు.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నకిలీ సంతకమున్న వారెంట్‌ను పంపాడు. ఈ కేసులో శిక్ష పడకుండా ఉండాలంటే.. ఆందోళన చెందిన బాధితురాలు.. అతడు చెప్పినట్లుగా వివిధ ఖాతాలకు రూ.99 లక్షలను బదిలీ చేసింది.

2026 టాప్‌టెన్ పర్యాటక ప్రదేశాల్లో కొచ్చిన్

ఈటీవీ భారత్: కేరళలోని కొచ్చిన్ నగరం 2026 ఏడాదిగాను ప్రపంచ పర్యాటక సంస్థ విడుదల చేసిన టాప్‌టెన్ ట్రెండింగ్ డెస్టినేషన్లలో ఒకటిగా ప్రతిష్ఠాత్మక ప్రపంచ జాబితాలో చోటు సాధించడంతో రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించింది. ప్రసిద్ధమైన ట్రావెల్ వేదిక బుకింగ్.కామ్ ఈ జాబితాను రూపొందించింది. ఈ గుర్తింపుతో వియత్నాం, స్పెయిన్, కొలంబియా, చైనా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, జర్మనీ, అమెరికా దేశాల ముఖ్య నగరాల సరసన కొచ్చిన్ చేరింది. దీనిపై కేరళ పర్యాటకశాఖ మంత్రి పి.ఎ.మొహమ్మద్ రియాజ్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ.. ప్రపంచ పర్యాటక పటంలో కేరళకు సుస్థిరస్థానం కల్పించే ఓ మైలురాయిగా దీన్ని అభివర్ణించారు. కొచ్చిన్‌తోపాటు నగరానికి సమీపంలోని ప్రశాంత ద్వీపగ్రామం కడ్మకుడికి సైతం అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది.

గతంలో రోగి మరణానికి కారణమై..
ఉద్యోగం పోగొట్టుకున్న ఉమర్

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీలో జరిగిన పేలుడులో కీలక సూత్రధారిగా భావిస్తున్న.. వైద్యుడు ఉమర్ నబీ గురించి మరిన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. ఫరీదాబాద్ మాడ్యూల్‌లో ఉన్న అతడు గతంలో ఓ ఆసుపత్రిలో పని చేసే సమయంలో ఓ రోగి మరణానికి కారణమయ్యాడు. జమ్ము కశ్మీర్‌లోని అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ పని చేసినప్పుడు ఆయనపై ఫిర్యాదులు ఉన్నట్లు డాక్టర్ జిలానీ ఈ వివరాలను వెల్లడించారు. 2023లో ఉమర్ తమ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా పని చేసినట్లు తెలిపారు. మొదటి నుంచీ అతడిపై ఫిర్యాదులు వస్తూనే ఉండేవని వెల్లడించారు. తోటి వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో పాటు రోగులు.. ఉమర్ దురుసు ప్రవర్తన గురించి ఫిర్యాదులు చేశారని తెలిపారు. ఈ క్రమంలో అతడి నిర్లక్ష్యం కారణంగా ఓ రోగి ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. 'సీరియస్ కండిషన్‌లో ఉన్న ఓ రోగిని ఉమర్ పర్యవేక్షణలో ఉంచాం. ఒక రోజు రోగికి వైద్యం చేయకుండా అతడు అదృశ్యమయ్యాడు. ఈ క్రమంలో రోగి పరిస్థితి విషమించింది. అతడిని కాపాడేందుకు మిగిలిన వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా ఉమర్ అందుబాటులో లేకపోవడంతో ఆ రోగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం సూపరింటెండెంట్‌కు ఉమర్‌పై ఫిర్యాదు చేసింది. దీనిపై సీనియర్ వైద్యుల కమిటీ దర్యాప్తు నిర్వహించి ఉమర్‌పై చర్యలు తీసుకుంది. అందులో భాగంగా అతడిని విధుల నుంచి తొలగించింది' అని పేర్కొన్నారు. దీంతో అతడు అల్-ఫలాకు వచ్చి చేరాడు.

భూటాన్ ఆర్థిక ఉద్దీపనకు భారత్ హామీ

• 13వ పంచవర్ష ప్రణాళికకూ సాయమందిస్తామని వెల్లడి
• హిమాలయ దేశంలో ముగిసిన ప్రధాని మోదీ పర్యటన

థింపూ: భూటాన్ ఆర్థిక ఉద్దీపన కార్యక్రమంతో పాటు ఆ దేశ 13వ పంచవర్ష ప్రణాళికకూ సాయం అందిస్తామని భారత ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భూటాన్‌లో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం ఆ దేశ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. భారత్-భూటాన్ మైత్రీబంధానికి సింగ్యే వాంగ్‌చుక్ విశేష కృషి చేశారంటూ ప్రధాని మోదీ ప్రశంసించారు. భేటీలో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇంధనం, వాణిజ్యం, సాంకేతికత, అనుసంధానత అంశాలు చర్చకు వచ్చాయి. 1,020 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన పునత్సంగచ్చు-2 జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాని మోదీ ఈ పర్యటనలో భాగంగా శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలనీ ఇరుదేశాల నేతలు నిర్ణయించారు. ప్రపంచ శాంతి ప్రార్థన ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తోన్న 'కాలచక్ర దీక్ష'లోనూ భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గయాల్ వాంగ్‌చుక్, ఇతర నేతలతో కలిసి మోదీ పాల్గొన్నారు. ఆధ్యాత్మికం, ఆరోగ్యం, ఆర్థికం, విద్య, పర్యాటకం తదితర రంగాలపై ప్రత్యేక దృష్టితో భూటాన్ చేపట్టిన 'గెలెఫు మైండ్‌ఫుల్ సిటీ ప్రాజెక్టు' పురోగతిని మోదీ కొనియాడుతూ సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు.



ప్రధాని మోదీకి వీడ్కోలు పలుకుతున్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గయాల్ వాంగ్‌చుక్

భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక (2024-2029)కు రూ.10వేల కోట్లు సమకూర్చుతామని భారత దేశం ఇప్పటికే హామీ ఇచ్చింది. హిమాలయ దేశం సుస్థిరాభివృద్ధి సాధించేలా పూర్తి సహకారం అందిస్తామని కూడా స్పష్టం చేసినట్లు భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాయితీతో రూ.4వేల కోట్ల రుణాన్ని అందించడంపై భూటాన్ నేతలు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. థింపూ నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణమైన ప్రధాని మోదీకి వీడ్కోలు పలికేందుకు భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గయాల్ వాంగ్‌చుక్ స్వయంగా విమానాశ్రయానికి రావడం విశేషం.

బ్రెజ్జా కారు కోసం గాలింపు!

ఇంటర్నెట్ డెస్క్: ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో అరెస్టయిన మహిళా డాక్టర్లలో ఒకరికి చెందిన బ్రెజ్జా కారుపై ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు. ఆ కారులో పేలుడు పదార్థాలు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇద్దరు మహిళా డాక్టర్ల సోషల్ మీడియా చాట్‌లను అధికారులు సేకరించారు. చాట్‌లలో నిధుల బదిలీలు, లాజిస్టిక్స్, సురక్షిత ప్రదేశాల గురించి వారు చర్చించినట్లు తెలుస్తోంది. 2023-24 మధ్య ఇస్తాంబుల్, దోహా నుంచి డిజిటల్ వాలెట్ల ద్వారా వైద్యుల్లో ఒకరు విదేశీ చెల్లింపులు చేసినట్లు నిఘా వర్గాలు కనుగొన్నాయి. వారి కార్యకలాపాల కోసమే ఈ నిధులు వాడినట్లు అనుమానిస్తున్నారు. ఇద్దరు మహిళా డాక్టర్లు బంగ్లాదేశ్‌లోని ఢాకా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు గుర్తించారు. శ్రీనగర్‌లో ఇంటర్న్‌షిప్ నేపథ్యంలో మత బోధకుడు ఇర్ఫాన్ అహ్మద్‌తో ఏర్పడిన పరిచయం.. ఉగ్రవాద భావజాలంవైపు మళ్లేలా చేసినట్లు తెలుస్తోంది.


భారత్‌లోనే అత్యధిక క్షయ మరణాలు

• ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి

దిల్లీ: ప్రపంచంలో 2024లో అత్యధిక క్షయ కేసులు నమోదైంది భారత్‌లోనే. తదుపరి స్థానాల్లో ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, చైనా, పాకిస్థాన్ ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ క్షయ నివేదిక తెలిపింది. ప్రపంచంలో నమోదైన మొత్తం క్షయ కేసుల్లో 87 శాతం 30 దేశాల్లో సంభవించాయి. వాటిలోనూ ఎనిమిది దేశాల్లోనే 67 శాతం కేసులు కనిపించాయి. అవి- భారత్ (27%), ఇండోనేసియా (10%), ఫిలిప్పీన్స్ (6.8%), చైనా (6.5%), పాకిస్థాన్(6.3%), నైజీరియా (4.8%), కాంగో (3.9%), బంగ్లాదేశ్ (3.6%). క్షయ నివారణ, చికిత్సలకు నిధులు తగ్గిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. భారత్‌లో రిఫాంపిసిన్ తోపాటు అనేక మందులకు లొంగని క్షయ కేసులు అత్యధికంగా కనిపిస్తున్నాయి. 2024లో క్షయ మరణాల్లో 28 శాతం భారత్‌లోనే సంభవించాయి. అంతర్జాతీయంగా ఇదే అత్యధిక రేటు. 2024లో కొత్త క్షయ కేసులు ఎక్కువగా బంగ్లాదేశ్‌లో నమోదయ్యాయి. భారత్‌లోనూ అవి ఎక్కువే.

✦ 2024లో ప్రపంచవ్యాప్తంగా కొత్తగా 83లక్షల మంది ప్రజలకు టీబీ సోకింది. ✦ ఈ ఏడాది టీబీ కారణంగా సంభవించిన మరణాలు 12.3 లక్షలు. 2023లో ఈ మరణాలు 12.5లక్షలుగా ఉన్నాయి. అంటే ఏడాది వ్యవధిలో సుమారు 2 లక్షల మేర మరణాలు తగ్గాయి.

అల్-ఫలాలో వైద్యుడి మిస్సింగ్?



ఇంటర్నెట్ డెస్క్: ఎర్రకోట పేలుడు ఘటన తర్వాత హరియాణా ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్ కనిపించకుండాపోయాడు. గతంలో అతడిపై ఉగ్ర ఆరోపణలున్నాయి. కశ్మీర్‌లోని ఎస్ఎంహెచ్ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసేవాడు. ఉగ్ర ముఠాలతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ఆర్టికల్ 311(2)(ది) కింద అతడిని 2023లో జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ తొలగించారు. ఆ తర్వాత హసన్ ఫరీదాబాద్ వచ్చి చేరాడు. ఎర్రకోట పేలుడు తర్వాత కనిపించకుండా పోయాడని అధికారులు వెల్లడించారు.

ఫరీదాబాద్ ఉగ్ర కుట్ర సూత్రధారి ఇమామ్ ఇర్ఫాన్!

ఇంటర్నెట్ డెస్క్: ఫరీదాబాద్ ఉగ్ర కుట్రల్లో భాగమైనవారు వైద్యులని తేలడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తాజాగా ఈ టెర్రర్ మాడ్యూల్ వెనక ఉన్న ప్రధాన సూత్రధారిని అధికారులు గుర్తించారు. అతడే ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్. జమ్మూ కశ్మీర్ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడి గురించి ఆరా తీయగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్‌ది జమ్మూ కశ్మీర్‌లోని సోపియాన్ ప్రాంతం. వైద్య విద్యార్థులకు ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. గతంలో అతడు శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ సిబ్బందిగా పని చేశాడు. నౌగామ్‌లోని ఓ మసీదులో కలిసిన విద్యార్థులతో సంబంధాలు కొనసాగించాడు. పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ నుంచి ప్రేరణ పొందిన ఇర్ఫాన్.. ఫరీదాబాద్‌లోని వైద్య విద్యార్థులకు ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోసినట్లు తెలుస్తోంది. జైషేకు సంబంధించిన వీడియోలను పదేపదే విద్యార్థులకు చూపించినట్లు సమాచారం. ఇంటర్నెట్ కాల్స్‌తో అఫ్గానిస్థాన్‌లోని కొంత మందితో సంప్రదింపులు జరిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మీ వెబ్‌సైట్లలో తీర్పులను అప్‌లోడ్ చేయండి

• హైకోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశం



దిల్లీ: హైకోర్టులు తమ వెబ్‌సైట్లలో డ్యాష్‌బోర్డులు లేదా విండోలు ఏర్పాటు చేసి వాటిలో జనవరి 31 తర్వాత తీర్పు రిజర్వు చేసిన ఉదంతాలను, వెలువరించిన తీర్పులను, వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తేదీలను తెలియబరచి పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ వివరాలు ప్రజలకు తెలియాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనం బుధవారం పేర్కొంది. తుది వాదనలు పూర్తై తీర్పు రిజర్వు చేసిన ఉదంతాల్లోనూ ఝార్ఖండ్ హైకోర్టు ఏళ్ల తరబడి నిర్ణయాన్ని వెలువరించకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఎన్ని వ్యాజ్యాల్లో తీర్పులు రిజర్వు చేశారు? ఎన్ని కేసుల్లో ఆదేశాలు జారీ చేశారు? కోర్టు తీసుకున్న నిర్ణయంపై సమాచారం హైకోర్టు వెబ్‌సైట్‌లో ఎన్నడు అప్‌లోడ్? చేశారు వంటి వివరాలు ప్రతి ఒక్కరికీ తెలియాలి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ సమాచారం కోసం హైకోర్టు వెబ్‌సైట్‌లో ఒక ప్రత్యేక డ్యాష్‌బోర్డు లేదా ప్రత్యేక విండో ఏర్పాటు చేయడం న్యాయవ్యవస్థ ప్రజల పట్ల జవాబుదారీతనం కలిగివుందని సూచిస్తుందని జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి అన్నారు. కింది కోర్టు మరణ శిక్ష విధించిన పలువురు నిందితులు సమర్పించిన అప్పీలుపై ఝార్ఖండ్ హైకోర్టు ఏళ్లుగా నిర్ణయం తీసుకోకుండా తాత్సారం వహిస్తోందని ప్రసిద్ధ న్యాయవాది ఫౌజియా షకీల్ దాఖలు చేసిన అభ్యర్థనపై విచారణ జరుపుతూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాజ్యంపై స్పందించిన సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల హైకోర్టుల్లో ఇలాంటి వ్యవహారాల్లో తీర్పు రిజర్వు చేసి నెలలు గడిచినా తుది నిర్ణయం వెలువడని ఉదంతాల సమాచారం కోరింది. ఈ అంశంపై విచారణలో సహకారం అందించాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానం న్యాయవాది ఫౌజియా షకీల్‌ను అమికస్ క్యూరిగా నియమించింది. మరణశిక్ష ఎదుర్కొంటున్న నిందితులపై తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన సమాచారాన్ని ఏడు హైకోర్టులు అందించలేదని ఆమె సుప్రీంకోర్టుకు తెలిపారు.

గెలుపు ఊహల్లో రాజకీయ పార్టీలు

• బిహార్‌లో విజయంపై ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ నేతల ధీమా
• మరో రెండు ఎగ్జిట్ పోల్స్‌లోనూ అధికార పక్షానికే పట్టం
• ఎన్నికల ఫలితాలను మార్చేస్తారేమో...
• ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సందేహం

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో భారీ పోలింగ్ నమోదు కావడంతో ప్రజల తీర్పు తమకే అనుకూలమంటూ అధికార ఎన్డీయే, విపక్ష మహాగఠ్‌బంధన్ రెండూ భావిస్తున్నాయి. విజయం సాధించబోతున్నామంటూ తమకు అనుకూలమైన భాష్యాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనను అందించినందువల్లే ప్రజలు. . ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి మద్దతు తెలిపారని అధికార కూటమి నేతలు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో విసిగివేశారిన ఓటర్లు మార్పు కోరుకున్నారు అనటానికి భారీ పోలింగే నిదర్శనమని, రాత్రి 7 గంటల వరకు కూడా లైన్లలో బారులు తీరి ఓపిగ్గా ఓటువేశారని విపక్ష ఆర్జేడీ నేతలు అంటున్నారు. అయితే, ఐదోసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టేలా ప్రజలు నీతీశ్‌కు మద్దతిచ్చారా? విపక్షాలు చెబుతున్నట్లు మార్పు కోరుకున్నారా అన్నది ఈ నెల 14న ఫలితాల వెల్లడితో స్పష్టం కానుంది. కాగా, గెలుపు ధీమాతో ఎన్డీయేలోని కీలక పక్షమైన భాజపా 501 కిలోల లడ్డూలకు ముందుగానే ఆర్డర్ ఇవ్వడం గమనార్హం.

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయి: తేజస్వీ



ఎన్నికల ఫలితాలను మార్చేందుకు అధికార ఎన్డీయే ప్రయత్నించే అవకాశం ఉందని ఆర్జేడీ నేత, విపక్ష మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఆరోపించారు. బుధవారం పట్నాలో విలేకరుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో ఓట్ల చోరీని ప్రజలే ఆపుతారని, మహాగఠ్‌బంధన్ క్లీన్ స్వీప్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ సారి అదనంగా సగటున 29,500 ఓట్లు పోలయ్యాయి. అవి సీఎం నీతీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని మార్చడానికేనని తేజస్వీ యాదవ్ చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులవుతాయన్నారు.

కూటమి/పార్టీ సాధించే సీట్లపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలివి...

	యాక్సిస్ మై ఇండియా	చాణక్య
ఎన్డీయే	121-141	160(+/-12)
మహాగఠ్ బంధన్	98-118	77 (+/-12)
జన్ సురాజ్	0-2	0

మరో రెండు సర్వేలూ ఎన్డీయేకే మొగ్గు

పోలింగ్ ముగిసిన అనంతరం మంగళవారం 8 సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ అన్ని కూడా ఎన్డీయేనే విజయం సాధించబోతోందని అంచనా వేశాయి. బుధవారం మరో రెండు సంస్థల ఎగ్జిట్ పోల్స్ కూడా ఇదే విషయాన్ని తెలిపాయి. ఆర్జేడీ 67 నుంచి 76 వరకూ స్థానాలను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. జేడీయూ:56-62, భాజపా:50-56, కాంగ్రెస్:17-21, వికాస్‌శీల్ ఇన్సాన్:3-5, వామపక్షాలు:10-14 సీట్లలో విజయం సాధించే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎవరుండాలనే విషయంలో... ఆర్జేడీ నేత తేజస్వీకి అనుకూలంగా 34శాతం మంది, నీతీశ్‌కు మద్దతుగా 22 శాతం మంది స్పందించారని వెల్లడించింది.

ఉమ్మడి జలాశయాల్లో విద్యుదుత్పత్తి నిలిపివేయాలి

• తెలంగాణను ఆదేశించండి
• కృష్ణా బోర్డుకు ఈఎన్‌సీ నరసింహమూర్తి లేఖ

ఈనాడు, అమరావతి: 'ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి నిలిపివేసేలా ఆదేశాలివ్వాలి. ఈ జలాశయాలకు ఎగువ నుంచి చెప్పుకోదగ్గ ప్రవాహాలు లేవు. అదే సమయంలో దిగువన అవసరాలు లేవు. అవేవీ పట్టించుకోకుండా విద్యుదుత్పత్తి చేయడం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. భవిష్యత్తులో తాగు, సాగునీటి అవసరాలకు తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుదుత్పత్తి నిలిపివేసేలా చూడాలి' అని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నరసింహమూర్తి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌కు బుధవారం లేఖ రాశారు.

■ ఇంతకుముందు కర్నూలు చీఫ్ ఇంజినీరు శ్రీశైలం ఎడమగట్టుకు సంబంధించిన తెలంగాణ అధికారులకు, కుడిగట్టుకు సంబంధించిన ఏపీ అధికారులకు లేఖ రాశారు. రెండు వైపులా విద్యుదుత్పత్తిని నిలిపివేయాలని కోరారు. చెన్నై నగరానికి, రాయలసీమ కరవు ప్రాంతంలో తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నిల్వలు తగ్గిపోకుండా చూడాలని ఆయన కోరారు.

■ ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ కుడిగట్టు వైపు విద్యుదుత్పత్తిని క్రమేణా తగ్గిస్తుండగా, తెలంగాణ మాత్రం కొనసాగిస్తోందని లేఖలో పేర్కొన్నారు.

కంబోడియా, థాయ్‌లాండ్ సరిహద్దుల్లో ఘర్షణ

• ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

నామ్‌ఫెన్: కంబోడియా, థాయ్‌లాండ్ సరిహద్దుల్లో మరోసారి వివాదం చెలరేగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య జులైలో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఐదు రోజుల పాటు కొనసాగిన ఘర్షణలను ఇరు దేశాలు ముగించాయి. అయితే, థాయ్‌లాండ్ సైనికులు కాల్పులు జరపడంతో తమ దేశ సరిహద్దుల్లోని గ్రామ పౌరుడు ఒకరు చనిపోయారని, మరో ముగ్గురు గాయపడ్డారని బుధవారం కంబోడియా ప్రధాని హున్ మనె తెలిపారు. థాయ్ సైనిక బలగాలు తరచూ కవ్వింపులకు దిగుతున్నాయని ఆరోపించారు.

గుజరాత్ వరద బాధిత రైతులకు
పీయూష్ వితరణ రూ.5.62 కోట్లు



ఈటీవీ భారత్: గుజరాత్‌లో ఎంతోమంది నిరుపేద బాలికలకు సాధికారత కల్పిస్తున్న 'హీరాబానో ఖమ్‌కర్ ప్రాజెక్టు ఇప్పుడు అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఆశాకిరణంగా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సూరత్ పారిశ్రామికవేత్త పీయూష్ దేశాయ్ ఒక్కో కౌలురైతుకు రూ.7,500 చొప్పున మొత్తం 7,500 మందికి రూ.5.62 కోట్ల సహాయం ప్రకటించారు. ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పటివరకు 1,102 మంది బాలికలకు విద్యాసహాయం అందించారు. మొత్తం 21 వేలమంది నిరుపేద బాలికల విద్యకు సహాయం అందిస్తామని ఈ సందర్భంగా పీయూష్ హామీ ఇచ్చారు. సూరత్‌లో వస్త్రాలు, రియల్ ఎస్టేట్, ఆర్థిక రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న పీయూష్ సహాయ ప్యాకేజీ చాలామంది రైతులకు మేలు చేస్తుందని పలువురు ప్రశంసిస్తున్నారు.

ఇంత చిన్న సంచికి రూ.20 వేలా!
ఐఫోన్ పాకెట్‌పై సరదా వ్యాఖ్యలు



ఇంటర్నెట్ డెస్క్: టెక్ దిగ్గజం యాపిల్ ఓ కొత్త ఉత్పత్తిని మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈసారి అది ఏ కొత్త ఐఫోనో.. ట్యాబో కాదు. ఐఫోన్ పెట్టుకునేందుకు ఒక పాకెట్‌ను తీసుకొచ్చింది. దారంతో అల్లిన ఈ పౌచ్ ధర 229 డాలర్లు (రూ.20 వేలు)గా నిర్ణయించింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనరు ఇస్సే మియాకేతో కలిసి ఈ ఉత్పత్తిని తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఈ సంచిని చేత్తో పట్టుకోవచ్చు, మరో బ్యాగుకు కట్టవచ్చు లేదా ఒంటిపైనా ధరించవచ్చని యాపిల్ ఇండస్ట్రియల్ డిజైన్ ఉపాధ్యక్షుడు మోలీ ఆండర్సన్ తెలిపారు. నవంబర్ 14 నుంచి పలు దేశాల్లో ఎంపిక చేసిన యాపిల్ స్టోర్లతోపాటు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఇది రెండు వెర్షన్స్‌లో అందుబాటులోకి రానుంది. దీనిపై నెటిజన్ల నుంచి సరదా వ్యాఖ్యలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'నా ఫోను ధర కూడా ఇంతలేదు కదా మావా!' అంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మస్కట్‌లో సిక్కోలు మహిళ అనుమానాస్పద మృతి



నాగమణి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన శ్రీకాకుళం జిల్లా మహిళ అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. ఆమదాలవలస మండలం వెదుళ్లవలసకు చెందిన సవలాపురపు నాగమణి (28) జీవనోపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం మస్కట్ వెళ్లి, కొంతకాలం కిందట స్వగ్రామానికి వచ్చేశారు. 4 నెలల క్రితం ఓ ఏజెంట్ సాయంతో మళ్లీ మస్కట్ వెళ్లిపోయారు. పని ప్రదేశంలో వేధిస్తున్నారని, ఇంటికి వచ్చేస్తానని ఇటీవలే తల్లికి ఫోన్‌చేసి చెప్పారు. ఇంతలోనే ఆకస్మాత్తుగా నాగమణి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏజెంట్ ఫోన్ చేశారని కుటుంబసభ్యులు వాపోయారు. తన సోదరి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఏజెంట్ హత్య చేశారని సోదరుడు మధు ఆరోపిస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

ఇద్దరు మహిళల మృతి, 9 మందికి గాయాలు

జలుమూరు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 9 మంది గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లావేరు మండలం, గుర్రాలపేట గ్రామానికి చెందిన 14 మంది (డ్రైవర్‌తో సహా) ఆలయాల సందర్శనకు ఆటోలో ఉదయం 9 గంటలకు బయలుదేరారు. టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్తుండగా ఆటోను ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మహిళలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. క్షతగాత్రులను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

బెవరేజెస్ ఏర్పాటుకు 30 ఎకరాలు

ఈనాడు, అమరావతి: రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెంలోని కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్స్, జ్యూస్‌లు, ప్యాకేజ్డ్ తాగునీరు తయారీకి బెవరేజెస్ ఏర్పాటు కోసం 30 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీచేసింది. ఎకరా రూ.40 లక్షల ధరతో కేటాయించడంతోపాటు, ఐదేళ్లలో వివిధ సబ్సిడీల కింద రూ.330.52 కోట్లు ఇచ్చేందుకు అనుమతించింది. ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ పాలసీ (4.0) కింద ప్రత్యేక కేసుగా పరిగణించి వీటిని మంజూరుచేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. రిలయన్స్ సంస్థ అక్కడ రూ.744 కోట్ల పెట్టుబడితో బెవరేజెస్ ఏర్పాటుచేయనుంది. దీని ద్వారా 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది.

30 కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 30 సీసీఐ కేంద్రాల ద్వారా 62 జిన్నింగు మిల్లుల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు ఎం.విజయసునీత తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. పత్తి తేమ, నాణ్యత చూశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతులు తొలుత రైతు సేవా కేంద్రాల్లో కపాస్ కిసాన్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన రోజున సంబంధిత కేంద్రానికి పత్తిని తరలించాలని సూచించారు.

మిగిలింది 5 నెలలే.. ఎన్ని నిధులు కావాలి!

- బడ్జెట్ ప్రణాళికపై ఆర్థికశాఖ కసరత్తు
- 4 కీలక శాఖలతో మంత్రి పయ్యావుల సమీక్ష



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. చిత్రంలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఇతర అధికారులు

ఈనాడు, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రాధాన్య ప్రాజెక్టులు, పనులకు ఇంకా ఎన్ని నిధులు కావాలి? ఎలా సమీకరించాలి.. అనే అంశాలపై రాష్ట్ర ఆర్థిక శాఖ దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 నెలలు పూర్తయ్యాయి. మరో 5 నెలలే మిగిలాయి. ఈ సమయంలోనే లక్ష్యాలు నెరవేర్చుకోవాలి. జగన్ సర్కార్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో చిక్కుకొని నిధుల సమీకరణ కత్తిమీద సాములా మారింది. ఈ క్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం జలవనరుల శాఖ, పంచాయతీరాజ్, రాయలసీమ హార్టికల్చర్, రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో వరుస సమీక్షలు నిర్వహించారు. ప్రాధాన్య అంశాలపై ఖర్చులు, చెల్లింపులు, బకాయిలు, నవంబరుతో సహా రాబోయే 5 నెలల్లో ఆయా శాఖలకు ఇంకా ఎన్ని నిధులు అవసరం, ఎలా సమకూర్చుకోవాలి.. అనే అంశాలపై ఆర్థికశాఖ ప్రణాళికకు అనుగుణంగా సమావేశం దృష్టి సారించింది.

◆ జలవనరుల శాఖలో పోలవరం ప్రాజెక్టుకు తాజాగా ఇచ్చిన రూ.1,000 కోట్ల ఖర్చుతో పాటు వెలిగొండ, హంద్రీ నీవా, గాలేరు నగరి, పోలవరం ఎడమ కాలువ వంటి వాటికి ఎంత నిధులు అవసరమవుతాయో ఆర్థికశాఖ అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు.

◆ కేంద్రం పోలవరం ప్రాజెక్టుకు అడ్వాన్సుగా నిధులు ఇస్తోంది. వాటిలో 75% ఖర్చుచేస్తే మళ్లీ ఇచ్చేందుకు వీలుగా కేంద్ర ఆదేశాలు ఉన్నాయి. కిందటి ఆర్థిక సంవత్సరం ఇచ్చిన నిధుల్లో ఇంకా రూ.2,177.47 కోట్లు ఖర్చు చేయాలి. వాటిలోని రూ.1,000 కోట్లనే పోలవరం సింగిల్ నోడల్ ఖాతాకు ఆర్థికశాఖ బదిలీ చేసింది. ఇందుకు జలవనరుల శాఖ ప్రస్తుతం రూ.1,300 కోట్లకు బిల్లులు సిద్ధం చేసింది. ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తయితే మరో విడత నిధులకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు వీలుంటుంది. ◆ జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని పొడిగించేందుకు కేంద్రం అంగీకరించినా లిఖితపూర్వక ఆదేశాలు రాలేదు. వైకాపా హయాంలో రూ.4,000 కోట్లే ఖర్చు పెట్టారు. ఈ పథకం కింద మరో రూ.23,000 కోట్లు అవసరం. నిధుల సమీకరణకు రూ.10 వేల కోట్లు జాతీయ, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.10 వేల కోట్లు రుణం తీసుకొచ్చే ప్రతిపాదన కొలిక్కి వస్తోందని పంచాయతీరాజ్ అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్థికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు అవసరమని చెప్పారు.

◆ గ్రామీణ రహదారులకు రూ.2,000 కోట్లు అవసరం. ఈ నిధులు ఎలా సమీకరించాలనే చర్చ జరిగింది. సాస్కీ, రాయలసీమ ప్యాకేజీ, పూర్వోదయ తదితర పథకాల కింద ఎలా నిధులు రాబట్టే అవకాశం ఉంది? ఇంతవరకు ఏయే ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. వాటి తాజా పరిస్థితులపైనా చర్చించారు.

◆ రహదారులు, భవనాల శాఖకు మరో రూ.500 కోట్ల వరకు ఇచ్చేందుకు ఆర్థిక శాఖ సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంతవరకు రూ.2,500 కోట్లు ఖర్చు చేశారు. ◆ రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు ఎంత నిధులు అవసరమవుతాయి? కేంద్ర పథకాలు వేటి నుంచి నిధులు సమీకరించే ఆస్కారం ఉందో పక్కా ప్రణాళిక రూపొందించాలని ఉద్యానశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు.

విస్తరిస్తున్న ఉగ్రవాదంపై అంతా అప్రమత్తం కావాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు

ఈనాడు, అమరావతి: 'జాతి భద్రతకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై వ్యవహరించాలని, ప్రతి కార్యాలయం, సంస్థా అప్రమత్తంగా ఉండి ఈ బాధ్యతను నెరవేర్చాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం రాత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ అంతర్గతభద్రతకు ఎదురవుతున్న సవాళ్లను ప్రస్తావిస్తూ ప్రతి ఒక్కరం అప్రమత్తంగా ఉంటేనే ఎదుర్కోగలమని పేర్కొన్నారు. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తారని, దేశ అంతర్గత భద్రతను కాపాడుకోవాల్సింది మనమే అని అభిప్రాయపడ్డారు. భారతదేశాన్ని కాపాడటం, బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని వ్యాఖ్యానించారు. 'గూఢచార, భద్రతా దళాల్లో పనిచేసేవారే అసలైన హీరోలు. వారు ఎలాంటి గుర్తింపూ కోరుకోకుండా రాత్రింబవళ్లు దేశానికి సేవ చేస్తున్నారు. ఊహించలేని విపత్తులను సైతం వారు నిలువరిస్తున్నారు. కొన్నిరోజుల కిందట వారు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు, అసాల్ట్ రైఫిళ్లను పట్టుకున్నారు. ఉగ్రవాదుల దుష్ట ప్రణాళికలను వారు విఫలం చేశారు. ఆ విధ్వంసం మన వీధులను తాకకముందే వారు నిలువరించారు. ఉగ్రవాద లింకులు, మూలాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. విజయనగరం అరెస్టులతో భయానక ఉగ్ర ప్లాట్‌ను ఎన్‌ఐఏ, ఇతర ఏజెన్సీలు విజయవంతంగా ఛేదించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లక్ష్యంగా ప్రణాళిక రచించిన ఉగ్రదాడులనూ నిరోధించాయి. ప్రస్తుతం ఊహించని పట్టణాల నుంచి ఉగ్ర దాడులు ఉద్భవిస్తున్నాయి. ఈ సమయంలో జాతీయ భద్రత కేంద్రప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి రాష్ట్ర శాఖ, ప్రతి స్థానిక సంస్థకు సంబంధించినది. దురదృష్టవశాత్తూ ఉగ్రవాదం విస్తృతిని మనం కళ్లు మూసుకుని చూస్తూ ఉన్నాం. ఈ పరిస్థితిని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి' అని పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు.

విశాఖ సదస్సుతో రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, దేశ విదేశాల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు విశ్వాసంతో వచ్చేలా చేస్తుందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో విలేకర్లతో ఆయన బుధవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో విశాఖలో పెట్టుబడుల సదస్సుకు ముందే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించినట్లు తెలిపారు. విశాఖ సదస్సుకు మూడు రోజుల ముందు కనిగిరి లాంటి వెనుకబడిన ప్రాంతం నుంచి 17 జిల్లాల్లో 49 ఎంఎస్‌ఎంఈ పార్కులను వర్చువల్‌గా చంద్రబాబు ప్రారంభించారని గుర్తుచేశారు. పెద్ద పరిశ్రమలపై చర్చ జరగాల్సిన సమయంలో చిన్న పరిశ్రమలకూ అంతే ప్రాధాన్యం ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. 2019-24 మధ్య పెట్టుబడుల ఆకర్షణలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

జల్ జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు జిల్లాకో బృందం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: జల్ జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో జేజేఎం పనుల ప్రగతిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ల నేతృత్వంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, అటవీశాఖల సమన్వయంతో పనిచేసేలా పర్యవేక్షక బృందం ఏర్పాటుచేయాలని సూచించారు. పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. 5 జిల్లాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణ, నిర్దేశిత గడువులో పనుల పూర్తికి చేపట్టాల్సిన ప్రణాళికలపై పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.27వేల కోట్లు ఇస్తే గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకుండా పనులు అటకెక్కించిందని పవన్‌కల్యాణ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోందని.. 5 జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ప్రకాశం, పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాల్లో పనులు సమీక్షించారు. ప్రకాశం జిల్లాలో అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

భాగస్వామ్య సదస్సులో ఏ రోజు ఏ కార్యక్రమాలంటే..

ఈనాడు, విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ భాగస్వామ్య సదస్సుకు విశాఖ సన్నద్ధమైంది. ఈ సదస్సు కోసం బుధవారం రాత్రే ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి శనివారం వరకు జరిగే కార్యక్రమ వివరాలు..

13వతేదీ(గురువారం): హోటల్ నోవోటెల్‌లో 'పార్టనర్స్ ఇన్ ప్రోగ్రెస్-ఇండియా-యూరప్ కోపరేషన్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్' అనే అంశంపై జరిగే ఇండియా-యూరప్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. గ్రీన్ షిఫ్ట్, సస్టెయినబుల్ ఇన్నోవేషన్, యూరోపియన్ పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. మధ్యాహ్నం నుంచి తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్స్ ప్రతినిధులతో ముఖ్య భేటీలు ఉంటాయి. ఎస్పీపీ పంప్స్ లిమిటెడ్, రెన్యూపవన్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, మురుగప్ప గ్రూపు, జ్యూయల్ గ్రూప్, హీరో ఫ్యూచర్ ప్రతినిధులతో సీఎం సమావేశమై చర్చలు జరుపుతారు. సాయంత్రం నుంచి వైజాగ్ ఎకనమిక్ రీజియన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం స్పెషల్ మీటింగ్ ఆఫ్ సీఐఐ నేషనల్ కౌన్సిల్‌కు హాజరవుతారు.

14వతేదీ(శుక్రవారం): సీఐఐ భాగస్వామ్య సదస్సు సదస్సు ప్రారంభ కార్యక్రమం తర్వాత, 'టెక్నాలజీ.. ట్రస్ట్ అండ్ ట్రేడ్' సెషన్ జరగనుంది. మధ్యాహ్నం 'ఏఐ ఫర్ వికసిత్ భారత్' సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారు. ఏపీ ఆర్థికాభివృద్ధికి ఏఐ ఏవిధంగా దోహదపడుతుందో తెలియజేయనున్నారు. సింగపూర్ నుంచి విజయవాడకు నేరుగా విమాన సర్వీసులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. సాయంత్రం రాష్ట్ర ఆర్థికశాఖ నిర్వహించే 'రీ ఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్‌లో సీఎం పాల్గొంటారు. సంజీవ్ గోయెంకా గ్రూప్ వైస్ ఛైర్మన్‌తో సీఎం భేటీ అవుతారు. అనంతరం విశాఖలో లులూ నిర్మించే నూతన మాల్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు.

15వతేదీ(శనివారం): బ్లూమ్‌బర్గ్ మీడియా ఇంటరాక్షన్‌లో సీఎం పాల్గొంటారు. రేమండ్, శ్రీసిటీ, ఇండోసోల్ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. బహ్రెయిన్, న్యూజిలాండ్, కెనడా, జపాన్ ప్రతినిధులతో భేటీ అవుతారు. మధ్యాహ్నం నుంచి వరల్డ్ ఎకనమిక్ ఫోరానికి చెందిన 'సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్'ను ప్రారంభిస్తారు. అనంతరం గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం నుంచి ఎంఓయూల కార్యక్రమం నిర్వహిస్తారు. సదస్సు చివరిలో సీఎం మీడియా సమావేశం ఉంటుంది. భాగస్వామ్య సదస్సులో సాధించిన ఫలితాలు వివరిస్తారు.

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం: సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు ఇప్పటికే సింగపూర్, యూఏఈ, యూకే దేశాల పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి రోడ్‌షోలు, పర్యటనలు నిర్వహించారు. అటు ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ సహా పలువురు మంత్రులు పెట్టుబడుల కోసం పలు సంస్థలతో దేశ, విదేశాల్లో సంప్రదింపులు జరిపారు. భాగస్వామ్య సదస్సు ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

రూ.5,300 కోట్ల ఐటీ ఆధారిత ప్రాజెక్టులకు భూకేటాయింపులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఆధారిత ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన కంపెనీలు/సంస్థలకు అవసరమైన భూములను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.5,331 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా 15,981 ఉద్యోగాలను కల్పించగలమని ఆయా సంస్థలు ప్రతిపాదించాయి. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టులకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇలా మంత్రిమండలి ఆమోదించిన ప్రాజెక్టులకు భూకేటాయింపులు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ◆ 1,500 మందికి ఉద్యోగాలు కల్పించేలా, రూ.1,079 కోట్ల పెట్టుబడితో శ్రీ సిటీలో ఐటీ ఎన్‌క్లోజర్స్-పీసీబీ బేర్ బోర్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం క్రియోన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదనకు ఆమోదం తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ(4.0) 2025-30 కింద అర్హమైన ప్రోత్సాహకాలు అందించేందుకు అనుమతించింది.

కంపెనీ/సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగాల సంఖ్య	ఇచ్చిన భూమి (ఎకరాల్లో)
ఎన్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్	2,081	600	కుప్పంలో 130
కె.రహేజా కార్ప్ రియల్‌ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్	2,172	9,681	ఐటీ హిల్-3, మధురవాడలో 27.10
ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్	700	1,000	నాయుడుపేట ఎంపీసెజ్‌లో 19.06
ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్	119.18	2,000	హిల్-2, రుషికొండ, మధురవాడలో 2
ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్	150	2,000	కాపులుప్పాడలో 3.3
సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్	109.73	700	కాపులుప్పాడలో ఫేజ్61 ఐటీ పార్కులో 3.55
మొత్తం	**5331.91**	**15,981**	

మొంథా తుపానుతో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.13 కోట్లు నష్టం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మొంథా తుపాను ప్రభావంతో 40 ప్రభుత్వ ఆసుపత్రుల భవనాలు, పైకప్పులు, ప్రహరీలు దెబ్బతిన్నాయని, వీటి తక్షణ మరమ్మతులకు రూ.13.13 కోట్లు అవసరమని వైద్యారోగ్య శాఖ తాత్కాలిక ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 ఆసుపత్రి భవనాల మరమ్మతులకు రూ.9.54 కోట్లు, విశాఖలో 13 భవనాలకు రూ.1.64 కోట్లు, చిత్తూరు జిల్లాలో ఆరు భవనాలకు రూ.88.25 లక్షలు, విజయనగరం జిల్లాలో మూడు భవనాలకు రూ.77 లక్షలు అవసరమని అధికారులు పేర్కొన్నారు.

రైతులూ తమ భూములు లీజుకు ఇచ్చుకోవచ్చు

- ఎసైన్డ్ చట్టానికి చేసిన సవరణలకు మంత్రివర్గం ఆమోదం
- పునరుత్పాదక ఇంధన వనరుల కంపెనీలకు 26.43 లక్షల ఎకరాలు ఇవ్వాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ రైతులూ ఇకనుంచి తమ భూములను పునరుత్పాదక ఇంధన వనరుల కంపెనీలకు లీజుకు ఇచ్చుకోవచ్చు. ఇందుకు వారికి ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు కౌలు లభిస్తుంది. ఈ మేరకు ఎసైన్డ్ భూముల చట్టానికి చేసిన సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పునరుత్పాదక ఇంధన వనరుల కంపెనీలకు ఇక నుంచి ఎసైన్డ్ భూములు కేటాయించనున్నారు. ఆయా కంపెనీలు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేవలం సౌర, పవన, సీఎన్‌జీ, పంప్డ్ స్టోరేజ్ కేంద్రాలు పెట్టడానికే వీటిని కేటాయించనున్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటుచేయవచ్చో ఇప్పటికే గుర్తించారు. వీటికి లీజుకు ఇచ్చేందుకు 26,43,500 ఎకరాలను గుర్తించారు. నెడ్‌క్యాప్ లేదా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటుచేసే రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే పరిశ్రమ నెలకొల్పిన వారు.. విస్తరణ అవసరాలకు భూముల్ని తీసుకోవచ్చు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లోనూ కంపెనీలు ఏర్పాటు చేయవచ్చు. ఆయా కంపెనీలు ప్రైవేటు భూముల్ని లీజుకు తీసుకుంటే.. రైతులు, భూ యజమానులకు ప్రయోజనం కలిగేలా విధివిధానాలు రూపొందించారు.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: ప్రైవేటు భూములను లీజుకు తీసుకుంటే ఆ రైతుకు సంబంధిత కంపెనీ ఏడాదికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు కౌలు చెల్లించాలి. రెండేళ్లకోసారి 5% కౌలు పెరుగుతుంది. కౌలుకు ఇచ్చిన యజమాని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఎసైన్డ్ రైతులకు సైతం ఇవే నిబంధనలు వర్తిస్తాయి. తద్వారా రైతులకు నికర ఆదాయం లభిస్తుంది.

పేదలకు మేలు చేసేందుకే

అనగాని సత్యప్రసాద్, రెవెన్యూశాఖ మంత్రి

'రాష్ట్రంలో పేదలకు మేలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎసైన్డ్ భూములను లీజుకు ఇచ్చేందుకు అనుమతి ఇస్తాం. తద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల కేంద్రంగా మార్చడంలో పేద రైతులూ భాగస్వాములవుతారు. వారి కుటుంబాల్లోని పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయి' అని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

రాజధానిలో సంస్థలకు భూ కేటాయింపులు ఇలా...

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో పలు సంస్థలకు ప్రభుత్వం భూములను కేటాయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలివీ...

కొత్తగా భూ కేటాయింపులు పొందిన సంస్థలు

సంస్థ పేరు	ప్రతిపాదిత విస్తీర్ణం (ఎకరాల్లో)	కేటాయింపు విధానం	ధర
బాసిల్ వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్	4	ఫ్రీహోల్డ్	రూ.50 లక్షలు
సెయింట్ మేరీస్ ఇంటర్నేషనల్ స్కూల్	7.97	ఫ్రీహోల్డ్	రూ.50 లక్షలు
సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్	15	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చదరపు మీటరుకు ఏడాదికి రూపాయి చొప్పున అద్దె
కాగ్ (రెసిడెన్షియల్)	5	ఫ్రీహోల్డ్	రూ.4.1 కోట్ల ఫ్రీహోల్డ్
ఎన్‌టీపీసీ	1.5	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చదరపు మీటరుకు ఏడాదికి రూపాయి చొప్పున అద్దె
జ్యుడీషియల్ అకాడమీ	4.83	60 ఏళ్ల లీజు	చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున.. 60 ఏళ్లకు
కాస్మోక్స్ 2-(ప్లానటేరియం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్)	5	60 ఏళ్ల లీజు	చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు	0.40	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున అద్దె
పంజాబ్ నేషనల్ బ్యాంకు	0.40	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున అద్దె
ఐడీబీఐ	0.40	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున అద్దె
నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్	5	60 ఏళ్ల లీజు	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున అద్దె

గతంలో కేటాయించిన భూములకు సంబంధించి తాజా సవరణలు

సంస్థ పేరు	తాజా ప్రతిపాదిత విస్తీర్ణం (ఎకరాల్లో)	ధర
హైదరాబాద్ ఎడ్యుకేషన్ అకాడమీ	8	ఎకరా రూ.50 లక్షల చొప్పున (ఫ్రీహోల్డ్)
బీపీసీఎల్ ఆఫీస్	1.34	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
ఐఆర్‌సీటీసీ	2	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
ఏపీ హెచ్‌ఆర్‌డీఐ	10	చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్ల లీజు
ఎక్స్ఎల్‌ఆర్ఐ	11.79	ఎకరా రూ.50 లక్షల చొప్పున (ఫ్రీహోల్డ్)
హడ్కో	9.17	ఎకరా రూ.4 కోట్లు చొప్పున (ఫ్రీహోల్డ్)

బ్యాంకులు, ప్రభుత్వ సంస్థల నివాసాలకు ప్రతిపాదిత కేటాయింపులు

సంస్థ పేరు	తాజా ప్రతిపాదిత విస్తీర్ణం(ఎకరాల్లో)	ధర
ఆప్కాబ్	2.20	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
ఎస్‌బీఐ	2.05	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
ఆర్బీఐ	4.04	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
బ్యాంక్ ఆఫ్ బరోడా	1.15	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం.చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
కెనరా బ్యాంకు	0.80	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
బ్యాంకు ఆఫ్ ఇండియా	0.82	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
బీపీసీఎల్	1.10	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె
ఎన్ఐఏసీఎల్	0.50	ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున లీజు ప్రీమియం. చ.మీ.కి ఏడాదికి రూపాయి చొప్పున 60 ఏళ్లకు అద్దె

గత కేటాయింపులు కొనసాగిస్తూ... వాటిలో చేసిన మార్పులు, చేర్పులు

సంస్థ	గతంలో కేటాయింపు	ప్రస్తుతం చేసిన మార్పు
అమరావతి ఎడ్యుకేషనల్, కల్చరల్ అకాడమీ	అబ్బరాజుపాలెంలో 3 ఎకరాలు	నెక్కల్లులో 3 ఎకరాలు
ఎఫ్‌సీఐ	అనంతవరంలో ఆఫీసుకి 0.5 ఎరాలు, వెలగపూడిలో నివాసాలకు 0.6 ఎకరాలు	నేలపాడులో ఆఫీసుకు 0.5 ఎకరాలు, ఐనవోలులో నివాసాలకు 0.6 ఎకరాలు
కాంధారి హోటల్స్ ప్రైవేట్స్ లిమిటెడ్	తుళ్లూరులో ఎకరా (ధర రూ.కోటి)	తుళ్లూరులో ఎకరా (రూ.1.50 కోట్లు)
కినర గ్రూప్ ఆఫ్ హోటల్స్	మందడంలో ఎకరా (రూ.కోటి)	మందడంలో ఎకరా(రూ.1.50 కోట్లు)
ఏపీ గ్రంథాలయాల శాఖ	ఒక ఎకరా (చదరపు మీటరుకు ఏడాదికి రూ.1 నామినల్ లీజ్,)	6.19 ఎకరాలు (చదరపు మీటర్‌కి ఏడాదికి రూ.1 నామినల్ లీజ్, 60 ఏళ్ల వరకు)
జీఐఐఎస్ కే.12 ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్	శాఖమూరులో 4 ఎకరాలు	శాఖమూరులోనే 4 ఎకరాల భూమి ఫ్రీ హోల్డ్

ఉండవల్లి వరద పంపింగ్ స్టేషన్-2కు రూ.595 కోట్లు

ఈనాడు, అమరావతి: ఉండవల్లి వరద పంపింగ్ స్టేషన్-2 (8,400 క్యూసెక్కుల సామర్థ్యం) నిర్మాణానికి రూ.595.01 కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం బుధవారం పరిపాలన అనుమతులిచ్చింది. ప్యాకేజీ 50 కింద సర్వే, విచారణ, రూపకల్పన, నిర్మాణం, పరీక్షకుగాను ఈ మొత్తాన్ని వినియోగించనుంది. 15 ఏళ్లపాటు నిర్వహణ, ఇతర కార్యకలాపాలు చేపట్టేలా టెండర్లు ఆహ్వానించేందుకు అనుమతించింది. ఈ నిధులు ప్రపంచబ్యాంకు, ఏడీబీ సహకారంతో సీఆర్‌డీఏకు సమకూరుతాయని ప్రభుత్వం తెలిపింది.

సీఆర్‌డీఏకు రూ.7,500 కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అవసరాల కోసం జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.7,500 కోట్ల రుణం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన రుణ ఒప్పందం, హైపోథికేషన్ డీడ్, తీసుకోవలసిన ఇతర చర్యలపై సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ◆ రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.1,500 కోట్ల రుణం తీసుకునేందుకు సీఆర్‌డీఏకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది.

మౌలిక వసతుల కల్పనకు రూ.1,863 కోట్లు

ఈనాడు, అమరావతి: రాజధాని గ్రామాల్లోని భూసమీకరణ లేఅవుట్లలో మౌలిక వసతులను కల్పించేందుకు రూ.1,863 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లోని లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు వెచ్చించనున్నారు. పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీని ఆదేశించింది.

రుణ చెల్లింపునకు మారిటైం బోర్డు సహకారం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధికి రాష్ట్ర విమానాశ్రయ అభివృద్ధి సంస్థ హడ్కో నుంచి తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించేందుకు ఏపీ మారిటైం బోర్డు సహకారం అందించనుంది. దీనికి ప్రభుత్వం హామీనిస్తూ కంఫర్ట్ లెటర్ జారీచేయనుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ పేరు స్వర్ణాంధ్ర పీ4గా మార్పు

ఈనాడు, అమరావతి: ప్రణాళిక శాఖ పరిధిలోని స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ పేరును స్వర్ణాంధ్ర పీ4గా ప్రభుత్వం మార్చింది. ఏపీ 2018 బిజినెస్ రూల్స్ (రెండో షెడ్యూల్)లో సవరణ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

జర్నలిస్టుల అక్రెడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి జారీ చేసే నూతన అక్రెడిటేషన్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమాచార, పౌరసంబంధాలశాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి, జిరాక్స్ కాపీలను విజయవాడలోని తమ కార్యాలయంలో అందించాలన్నారు. నవంబరు 14 నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://mediarelations.ap.gov.in లో సూచించిన విధంగా పూర్తి వివరాలను నమోదుచేయాలని వివరించారు.

ఖాళీలు చూపకుండా ఇస్తున్న పదోన్నతులతో.. ఉద్యోగులకు అన్యాయం: ఎన్ఎంయూఏ

ఈనాడు, అమరావతి: జోనల్ కేడర్‌లో పదోన్నతులు ఇచ్చిన తర్వాత కిందికేడర్లలో ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకోకుండా పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం వల్ల ఉద్యోగులకు నష్టం జరుగుతోందని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) తెలిపింది. ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో చూపించకపోవడంతో.. చాలామంది పదోన్నతులు తిరస్కరిస్తున్నారని, దీనివల్ల ఏడాదంతా ఉండాల్సిన ప్యానెల్.. ఉనికిలో లేకుండా పోయే పరిస్థితి నెలకొంటుందని తెలిపింది. విజయవాడ జోన్లో మూడు జిల్లాల్లో ఏడీసీ నుంచి డీసీ పదోన్నతికి ఎక్కువ మంది సమ్మతి తెలపలేదని పేర్కొంది. పారదర్శకంగా, సీనియారిటీకి అనుగుణంగా, ఖాళీలను చూపించి పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరుతూ ఆర్టీసీ ఈడీకి (పరిపాలన) లేఖరాసినట్లు ఎన్ఎంయూఏ అధ్యక్షులు పీవీ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మంగళగిరి మయూరి టెక్ పార్క్‌లోకి గనులశాఖ కార్యాలయం

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆంజనేయ టవర్స్‌లో ఉన్న గనుల శాఖ సంచాలకుని కార్యాలయాన్ని గుంటూరు జిల్లాలోని మంగళగిరి వద్ద చెన్నై-కోల్‌కతా హైవే పక్కనే ఉన్న మయూరి టెక్ పార్క్ భవనంలోకి మార్చనున్నారు. దీనికి అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీ చేసింది. ఆ భవనంలో చదరపు అడుగుకి రూ.29.50 ధరతో.. 23,936 చదరపు అడుగులు అద్దెకు తీసుకునేందుకు అనుమతించింది. ఈ మేరకు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే ప్రజలు నిరసనకు దిగారు

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల కేంద్రాల్లో వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనల్లో ప్రజలు పాల్గొని వారి సంకల్పాన్ని వ్యక్తపరిచారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య, ఆరోగ్యరంగ సంరక్షణ కోసం ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు భావసారూప్య పార్టీలు, సంస్థలు స్వచ్ఛందంగా కలిసిరావడం గర్వంగా ఉందని 'ఎక్స్'లో చేసిన పోస్టులో జగన్ పేర్కొన్నారు. నిరసన ర్యాలీలను అడ్డుకునేందుకు పోలీసులు అన్నివిధాలుగా ప్రయత్నించినా ప్రజలు వెనక్కు తగ్గలేదని, న్యాయమైన డిమాండ్ కోసం ఐక్యంగా కదిలారని పేర్కొన్నారు. బలమైన ఈ ప్రజాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గౌరవించి, వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జోగి రమేష్ పిటిషన్‌పై కౌంటర్ వేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో అన్నమయ్య జిల్లా ములకలచెరువు, విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసుల దర్యాప్తును సీబీఐకి బదిలీచేయాలని కోరుతూ వైకాపా నేత జోగి రమేష్ దాఖలుచేసిన వ్యాజ్యంలో కౌంటర్ వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీలను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఈ ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు విచారణలో జోగి రమేష్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత పిటిషన్ దాఖలు చేశాక పిటిషనర్ అరెస్ట్, రిమాండ్ విధింపు, తదితర అంశాలను పేర్కొంటూ అదనపు అఫిడవిట్ దాఖలు చేశామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేస్తామని, సమయం కావాలని కోరారు. విచారణార్హతతోపాటు ప్రధాన పిటిషన్‌పైనా కౌంటర్ వేయాలని న్యాయమూర్తి ప్రభుత్వానికి సూచించారు.

బీసీ జనగణన పిల్‌పై కౌంటర్ వేయండి

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ఈనాడు, అమరావతి: బీసీ జనగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని పిల్‌లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. బీసీ గణన, వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించబోతున్నారని, ముందుకెళ్లకుండా ప్రభుత్వాన్ని నిలువరించాలని కోరుతూ ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ. సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ జనాభా లెక్కింపు చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం అమలు చేయట్లేదన్నారు. బీసీల జనాభా లెక్కింపు జరగకపోవడంతో వారి సంఖ్యకు అనుగుణంగా స్థానిక ఎన్నికల్లో సీట్లు దక్కడం లేదని చెప్పారు.

'పరకామణి' కేసులో ఆ ఐదుగురినీ విచారించండి

- ఇది రాజకీయ కేసు కాదు.. భక్తుల మనోవేదన
- సీఐడీ డీజీకి విన్నవించిన తెదేపా బృందం



సీఐడీ డీజీకి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నేతలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'శ్రీవారి కానుకలు కాజేసిన నిందితులు ఎంత పెద్దవారైనా శిక్షించండి. కేసులో పాత్రధారులనే కాకుండా వెనకుండి నడిపించిన అప్పటి తితిదే ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డితోపాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రోజూ ఆదేశాలు జారీ చేసిన సీఎంవో చీఫ్ ధనంజయరెడ్డిని పిలిచి విచారించండి. వారివి, వారి కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలు పరిశీలిస్తే దోపిడీ వెలుగులోకి వస్తుంది. ఇది రాజకీయ వేధింపుల కేసు కాదు.. భక్తుల మనోభావాలకు సంబంధించిన కేసుగా పరిగణించి క్షుణ్నంగా దర్యాప్తు జరపాలి. భక్తుల సొమ్ము మెక్కేసిన వారి నుంచి తిరిగి స్వామివారికి చేరేలా చర్యలు చేపట్టాలి' అని తెదేపా బృందం విన్నవించింది. బుధవారం పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు కలిశారు. 27 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

వైకాపా హయాంలో పునరావాస కేంద్రంగా

వైకాపా ప్రభుత్వంలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారని, పరకామణి ఉద్యోగి రూ.కోట్లు కాజేయడం వెనుక ఓ ముఠానే ఉందని తెదేపా నేతలు ఆరోపించారు. 'తితిదేకి గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించేందుకు స్టాంప్ డ్యూటీ సొమ్ము ఎవరి ఖాతా నుంచి వచ్చింది? అప్పటి పాలకమండలి సభ్యుడు చెల్లించాడన్న ఆరోపణలను నిగ్గు తేల్చండి. పక్క రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఎందుకు చేయాల్సి వచ్చింది? కోట్ల రూపాయల స్వామి సొమ్ము కాజేసిన పరకామణి కేసు రాజీకి ఎవరి నుంచి ఒత్తిడి వచ్చింది? అప్పటి తితిదే బోర్డు, ఛైర్మన్ నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? ఇంత జరుగుతుంటే అప్పటి ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఏం చేస్తున్నారు? ఆయన భాగస్వామ్యం ఉందా? పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్ ఆస్తులను తితిదే పెద్దలు నేరుగా కాకుండా బినామీ జయచంద్రారెడ్డి ద్వారా కాజేశారనే ఆరోపణల్లో నిజమెంత? చోరీ ఘటన తర్వాత నిందితుడి ఇంటి నుంచి రూ.9 కోట్ల నగదు, మూడు కిలోల బంగారం, వెండిని ఎవరు కాజేశారు?' ఇవన్నీ తేల్చాలని కోరారు.

వందేళ్ల వివాదానికి తెరదించిన సుప్రీంకోర్టు

- సంగలప్పస్వామి విగ్రహం అప్పగింత విషయంలో గంగులకుంట గ్రామస్థుల అప్పీల్ కొట్టివేత



ఈనాడు, దిల్లీ: దేవుడి విగ్రహం అప్పగింతకు సంబంధించి అనంతపురం జిల్లాకు చెందిన కురుబ సామాజికవర్గంలో రెండువర్గాల మధ్య నెలకొన్న వందేళ్ల నాటి వివాదానికి సుప్రీంకోర్టు తెరదించింది. సంగలప్పస్వామి విగ్రహం అప్పగింత, పూజలకు సంబంధించిన రాజీ డిక్రీని ఎర్రాయపల్లి గ్రామానికి చెందిన కమటం వంశీకులు ఉల్లంఘించినందున వారి నుంచి విగ్రహాలను ఇప్పించాలని గంగులకుంట గ్రామానికి చెందిన కాపడం వంశస్థులు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. జస్టిస్ ప్రసన్నకుమార్ మిశ్ర, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రెండువర్గాల మధ్య 1933 నవంబరు 1న కుదిరిన రాజీ డిక్రీ అమలుకు దాఖలుచేసిన ఎగ్జిక్యూషన్ పిటిషన్‌ను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు 2012లో ఇచ్చిన తీర్పును సమర్థించింది. రాజీ డిక్రీ ఉల్లంఘన జరిగినట్లు ఆధారాలు లేనందున దాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు జారీచేయడం కుదరదని స్పష్టంచేసింది. దేవుడి విగ్రహారాధనకు సంబంధించిన ఈ వివాదం రెండు గ్రామాల మధ్య 1927 నుంచి కొనసాగుతూ వస్తోంది.

సంగలప్పస్వామి విగ్రహంతో పాటు, స్వామివారి పూజా వస్తువులను తమకంటే తమకు అప్పగించాలని కమటం, కాపడం వంశస్థులు 1927 నుంచి న్యాయపోరాటం చేస్తున్నారు. 1933లో రాజీకి రావడంతో అనంతపురం సబార్డినేట్ జడ్జి రాజీ డిక్రీ జారీచేశారు. విగ్రహాలు, పూజా సామగ్రిని ఒక్కో ఊరిలో 6 నెలలు ఉంచడం, 3 నెలలకోసారి ఓ గ్రూప్ పూజలు చేసుకోవడానికి వీలు కల్పించారు. ఈ క్రమంలో 1999లో విగ్రహం, పూజా వస్తువులు తీసుకెళ్లిన ఎర్రాయపల్లి గ్రామస్థులు వాటిని తిరిగి ఇవ్వలేదని, అందువల్ల డిక్రీ ప్రకారం 6 నెలలపాటు స్వామివారి విగ్రహం, వస్తువులను తమకు అప్పగించేలా ఉత్తర్వులు జారీచేయాలని 2000లో గంగులకుంట గ్రామస్థులు అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో స్వామివారి విగ్రహం, వస్తువులను గంగులకుంట గ్రామస్థులకు నెలలోపు ఇవ్వాలని, లేదంటే జప్తు చేయాలని వారంట్ ఇస్తామని ఎర్రాయపల్లి గ్రామస్థులను హెచ్చరించింది. ఈ ఉత్తర్వులపై ఎర్రాయపల్లి గ్రామస్థులు హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు విచారించి.. డిక్రీ ఉల్లంఘించినట్లు ఆధారాలు చూపలేకపోయినందున గంగులకుంట గ్రామస్థులు దాఖలుచేసిన ఎగ్జిక్యూషన్ పిటిషన్‌కు విచారణార్హత లేదని ఉత్తర్వులు జారీచేసింది. ఆ తీర్పుపై గంగులకుంట వాసులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇక్కడా హైకోర్టు తీర్పునే సమర్థిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. రాజీ కుదిరాక 1999 వరకూ ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు కాబట్టి ఇరువర్గాలు రాజీ డిక్రీ ప్రకారం నడుచుకొని ఉండొచ్చని కిందికోర్టు భావించి ఎగ్జిక్యూషన్ పిటిషన్ అమలుచేయాలని తీర్పు ఇచ్చింది తప్పితే అందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది.

పోలీసులను నెట్టేసి.. బారికేడ్లు పడేసి

- వైకాపా నిరసనలో ఉద్రిక్తత



గరివిడి ఆర్వోబీ వద్ద బారికేడ్లు తోసుకొని ముందుకెళ్లేందుకు యత్నిస్తున్న వైకాపా శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

గరివిడి, చీపురుపల్లి, విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైకాపా బుధవారం విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినా నేతలు పట్టించుకోలేదు. వైకాపా గరివిడి నుంచి ప్రధాన రహదారి గుండా చీపురుపల్లి వరకు ర్యాలీ తలపెట్టింది. కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీగా ముందు వెళ్లగా.. శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వారి వెనుక కారులో బయలుదేరారు. గరివిడి ఆర్వోబీ వద్దకు చేరుకోగానే వీరిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. వైకాపా కార్యకర్తలు పట్టించుకోకుండా పోలీసులను, బారికేడ్లను తోసుకొని ముందుకెళ్లే యత్నం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గర్భిణిని తీసుకెళ్తున్న 108 అంబులెన్సు వాహనం ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని అంబులెన్సు వెళ్లేలా చేశారు. బొత్స కూడా ట్రాఫిక్‌లో చిక్కుకొని కారులోనే ఉండిపోవాల్సి వచ్చింది. చివరికి ఒక్కో వాహనాన్ని పంపి.. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పోలీసులే రాస్తారోకో చేసినట్టుంది: బొత్స

వైకాపా చేపట్టిన 'ప్రజా ఉద్యమ ర్యాలీ' సందర్భంగా పోలీసులే రాస్తారోకో, ధర్నా చేసినట్టు ఉందని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. విజయనగరంలో విలేకర్లతో మాట్లాడారు. "గరివిడి నుంచి చీపురుపల్లి వరకు బైక్ ర్యాలీ తీస్తే పోలీసులు గంటన్నరపాటు ఇబ్బందులు పెట్టారు. పేద విద్యార్థులకు న్యాయం జరగాలంటే ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలు ఉండాలి. రాష్ట్రంలో 3 లక్షల ఇళ్లు ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద కట్టామని ఇప్పుడు ప్రకటనలు ఇచ్చారు.. అసలు వాటికి భూసేకరణ, శంకుస్థాపనలు ఎప్పుడు చేశారో చెప్పాలి. కల్తీ నెయ్యి కొనుగోలుకు సంబంధించి తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాక.. ఆ విషయంపై మాట్లాడతా" అని అన్నారు. విశాఖ సమిట్‌పై అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. 'మా హయాంలో జరిగిన సమిట్‌కు అత్యధిక పెట్టుబడులు వచ్చాయి' అని బొత్స వ్యాఖ్యానించారు.

సునామీ హెచ్చరికల వ్యవస్థ పటిష్ఠత ముఖ్యం

- ఇన్‌కాయిస్ సదస్సులో శాస్త్రవేత్తలు



సదస్సును ప్రారంభిస్తున్న శైలేష్‌నాయక్. చిత్రంలో ప్రొఫెసర్ యుచిరో(జపాన్), ప్రొఫెసర్ వియాచెస్లావ్(రష్యా), టీఎం.బాలకృష్ణన్ నాయర్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: సునామీ హెచ్చరికల వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడంతోపాటు సునామీకి కారణమవుతున్న వేర్వేరు కారణాలను మరింత సమర్థంగా విశ్లేషించాల్సిన అవసరముందని ప్రముఖ శాస్త్రవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ (ఎన్ఐఏఎస్) డైరెక్టర్ శైలేష్‌నాయక్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం(ఇన్‌కాయిస్)లో మూడు రోజులపాటు నిర్వహించనున్న 32వ అంతర్జాతీయ సునామీ సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలేష్‌నాయక్ మాట్లాడుతూ... "కచ్చితమైన సమాచారాన్ని తీరప్రాంతాల బాధితవర్గాలకు ఎంత త్వరగా అందజేశామనేది కీలకాంశం. అత్యాధునిక సాంకేతికతతో సునామీలను వేగంగా గుర్తించడం, తీవ్రతను విశ్లేషించడం, ప్రభావాన్ని అంచనా వేయడం అత్యంత ముఖ్యం. విపత్తుల హెచ్చరికల సమాచారాన్ని సమర్థంగా వినియోగించుకునేలా సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు భాగస్వామ్యం కావాల్సిన అవసరముంది" అని సూచించారు. ఇన్‌కాయిస్ డైరెక్టర్ టీఎం.బాలకృష్ణన్ నాయర్, సునామీలపై నిపుణుడు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ యుచిరో టానియోకా(జపాన్), ప్రముఖ జియోఫిజిక్స్ ప్రొఫెసర్ వియాచెస్లావ్ కె.గుసియాకోవ్(రష్యా) తదితరులు మాట్లాడారు. సముద్రంలో భూకంపాలతోపాటు అగ్నిపర్వత విస్ఫోటాలు, కొండచరియలు విరిగిపడటం, ఉల్కాపాతాలు వంటి కారణాలతోనూ సునామీలు ఏర్పడుతున్న నేపథ్యంలో పరిశోధనలు మరింత విస్తృతం కావాలని అభిప్రాయపడ్డారు.

కేఏ పాల్ పిల్‌పై విచారణకు హైకోర్టు నిరాకరణ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో పది వైద్య కళాశాలలు నిర్మించి నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిల్‌పై విచారణకు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఓ పిల్ దాఖలైందని, అలాంటప్పుడు మరో పిల్ ఎందుకని పాల్‌ను ప్రశ్నించింది. ఇప్పటికే దాఖలైన పిల్‌లో ప్రతివాదిగా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేసుకొని వాదనలు వినిపించేందుకు వెసులుబాటు ఇచ్చింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులు జారీచేసింది.

ధాన్యం సేకరణకు 5 వేల కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరించి, చెల్లింపులు చేసేందుకు పౌరసరఫరాల శాఖ వాణిజ్య బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుంచి రూ.5 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బీపీఎస్ కోసం 120 రోజుల్లోగా దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: 2025 ఆగస్టు 31లోపు నిర్మించిన ఇళ్లు, భవనాలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)లో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. 4 నెలల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బుధవారం జారీ చేసిన మార్గదర్శకాల్లో సూచించింది.

దరఖాస్తు చేసుకోవాలిలా: 2025 నవంబరు 12 (ప్రకటన వెలువడిన తేదీ) నుంచి 120 రోజుల్లోగా www.bps.ap.gov.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లైసెన్స్ కలిగిన టెక్నికల్ పర్సన్ల (ఎల్‌టీపీ) ద్వారా ప్రాసెస్ చేయించాలి. దరఖాస్తులకు జతచేయాల్సిన పత్రాల వివరాలివీ...

◆ స్వీయ ధ్రువీకరణతో యాజమాన్య హక్కు పత్రం (రిజిస్టర్ దస్తావేజులు). ◆ సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన ఎన్‌కంబరెన్స్, మార్కెట్ విలువ సర్టిఫికెట్లు. ◆ బిల్డింగ్ ప్లాన్. ◆ తేదీ ముద్రతో భవనం మొత్తం కనిపించేలా 2 తాజా ఫొటోలు. ◆ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణ ప్రాంతం, అనుమతించిన ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాల డ్రాయింగ్‌లు. ◆ అనుమతుల్లేకుండా మొత్తం భవన నిర్మిస్తే.. బిల్టప్ ఏరియా, సైట్ ప్లాన్. ◆ ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణకు సమ్మతి పత్రం. ◆ లైసెన్స్ కలిగిన స్ట్రక్చరల్ ఇంజినీర్‌తో నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ పత్రం (స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్).

క్రమబద్ధీకరణ రుసుములిలా: ◆ విస్తీర్ణం ఆధారంగా చదరపు అడుగుకు రూ.40 నుంచి రూ.400 వరకు పీనలైజేషన్ ఫీజులు విధించనున్నారు. ◆ నిర్మాణంలో ఉల్లంఘనలపై రూ.20 వేల నుంచి రూ.80 వేల వరకు అపరాధ రుసుములు ప్రాథమికంగా విధించనున్నారు. అనధికార అంతస్తులకు చదరపు అడుగుకు రూ.120 నుంచి రూ.200 వరకు విధిస్తారు. ◆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్కెట్ విలువ ఆధారంగా అపరాధ రుసుములు విధించనున్నారు.

రాయితీలు...

◆ 60 గజాల్లోపు ఇంటి నిర్మాణాలకు (జీ+1) బీపీఎస్ అవసరం లేదు. ◆ 1997 డిసెంబరు 31కి ముందు చేపట్టిన నిర్మాణాలపై మొత్తం పీనలైజేషన్ రుసుముల్లో 25% రాయితీ. ◆ నోటిఫైడ్ మురికివాడల్లో నివాస భవనాలపై 50% రాయితీ.

బీపీఎస్ అమలు ఎక్కడెక్కడ అంటే...

◆ నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు. ◆ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని గ్రామ పంచాయతీలు. ◆ విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ. ◆ విశాఖ-కాకినాడ పెట్రోలియం, కెమికల్, పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్. ◆ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా).

వీటికి బీపీఎస్ వర్తించదు

◆ ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు ◆ వివాదాస్పద, యాజమాన్య హక్కు లేని భూముల్లోని నిర్మాణాలు ◆ అర్బన్ ల్యాండ్ సీలింగ్, చెరువులు, వాగులు, కాలువలు ఆక్రమించి కట్టినవి. ◆ తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినవి. ◆ అనుమతి పొందిన లేఔట్లలోని పార్కింగ్, ఓపెన్ స్పేస్, వినోద ప్రదేశాల్లో చేపట్టిన నిర్మాణాలు. ◆ 2025 ఆగస్టు 13 తర్వాత నిర్మించిన భవనాలకు బీపీఎస్ వర్తించదు.

దరఖాస్తులకు 6 నెలల్లో పరిష్కారం

◆ బీపీఎల్ దరఖాస్తులను అధికారులు 6 నెలల్లో పరిష్కరించి ప్రొసీడింగ్ జారీ చేయాలి. ◆ దరఖాస్తులు తిరస్కరిస్తే అప్పీల్ చేసుకోవచ్చు. ◆ అప్పీళ్లను 30 రోజుల్లోగా పరిష్కరించాలి.

పీపీపీ వైద్య కళాశాలలపై వైకాపాది అసత్య ప్రచారం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ పేరుతో సగం సీట్లకు రూ.లక్షల్లో వెలకట్టిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. వైకాపా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల మద్దతు లేదన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో ఎన్ని దొంగ సంతకాలు చేశారో చెప్పాలని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కల్తీ మద్యం, తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఆరోపణలతో నిండా మునిగిన జగన్.. రాజకీయ ఉనికి కోసం వైద్య కళాశాలలపై దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ప్రతి నిర్ణయం ప్రజాశ్రేయస్సు కోసమేనని.. పీపీపీ పద్ధతిలో వైద్యకళాశాలల నిర్మాణమూ ఈ కోవలోకే వస్తుందని స్పష్టం చేశారు.

హైకమాండ్ ఎవరో బయటపడనుంది

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

ఈనాడు, అమరావతి: శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో హైకమాండ్ ఎవరో త్వరలో బయటపడనుందని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. హైకమాండ్ ఒత్తిడితోనే కల్తీ నెయ్యి కొనుగోలు చేసినట్టు సిట్ విచారణలో తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో జగన్, కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి కనుసన్నల్లో తిరుమలను ధర్మారెడ్డి శాసించారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తితిదేలో అక్రమాలు చేసి జగన్ రూ.కోట్లు దండుకున్నారు. కోట్లమంది హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. తన హయాంలోనే నెయ్యిలో పామాయిల్ కలిసినట్టు నివేదికలు స్పష్టం చేసినా.. కమీషన్లు తీసుకొని సుబ్బారెడ్డి వాటిని అనుమతించారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాల స్థలం ఆక్రమించిన వైకాపా నేతలు

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: కడప జిల్లా కమలాపురం మండలం మల్లారెడ్డిపల్లెలో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన భూమిని వైకాపా నేతలు ఆక్రమించారని సురేశ్‌కుమార్ అనే వ్యక్తి మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ప్రభుత్వ సలహాదారు (మైనారిటీ వ్యవహారాలు) షరీఫ్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్ శివప్రసాద్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన జమృత్‌బీ, మొహమ్మద్ కోరారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా సివిల్స్ శిక్షణ

ఈనాడు, అమరావతి: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మొత్తం 340 మందికి శిక్షణ ఇస్తామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని, మరిన్ని వివరాలకు http: apstudycircle.apcfss.in వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

నిరీక్షణలో ఉన్న ఐపీఎస్‌లకు పోస్టింగులు

ఈనాడు, అమరావతి: నిరీక్షణలో ఉన్న ఇద్దరు ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పోస్టింగులిచ్చింది. జి.కృష్ణకాంత్‌ను శాంతిభద్రతల విభాగం ఏఐజీగా, ఏ.సురేష్‌బాబును ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీచేశారు.

ఇమామ్, మౌజమ్‌ల వేతనాలకు రూ.90 కోట్లు

ఈనాడు, అమరావతి: ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం రూ.90 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. నెలకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. గతేడాది ఏప్రిల్, మే, జూన్ సహా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఉన్న బకాయిల చెల్లింపునకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. గౌరవ వేతనాల విడుదల పట్ల వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా పెండింగ్ బిల్లులను విడుదల చేయనున్నట్లు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే.

విద్యుత్తు సంస్థల రుణాలకు ప్రభుత్వం హామీ

ఈనాడు, అమరావతి: ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్) ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి రూ.1,000 కోట్ల రుణాన్ని తీసుకునేందుకు ప్రభుత్వం హామీ ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు రాష్ట్ర డిస్కంలు పలు బ్యాంకుల నుంచి తీసుకునే రూ.1,150 కోట్ల రుణానికి కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది.

'కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా 2026 ఏప్రిల్ వరకు ప్రక్రియ పూర్తిచేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు.

'స్ట్రే' విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు

విజయవాడ (ఎన్టీఆర్ ఆరోగ్యవిశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఎంబీబీఎస్/బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల కోసం నిర్వహించనున్న 'స్ట్రే' (మిగులు) విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. ఈ ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థులు ఇంతకు ముందు కౌన్సెలింగులకు దరఖాస్తు చేసి ఉండకూడదు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం (13వ తేదీ) సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఫీజు రుసుమును చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సందేహాలుంటే 89787 80501 నంబరుకు, సాంకేతిక సమస్యలుంటే 90007 80707లో సంప్రదించొచ్చన్నారు.

డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణకు ఏసీబీ కోర్టును ఆదేశించండి

హైకోర్టులో సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో డిఫాల్ట్ బెయిల్ మంజూరుచేయాలని తాను వేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తిప్పిపంపడాన్ని సవాలు చేస్తూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌కు నంబరు కేటాయించి విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరారు. బెయిల్ పిటిషన్లపై విచారణ జరపొద్దంటూ హైకోర్టు ఎలాంటి ఆంక్షలు విధించలేదన్నారు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను విచారించాలని, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై కాదని సుప్రీంకోర్టు గత నెల 16న ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో తన పిటిషన్‌పై విచారణ జరపలేమంటూ రిటర్న్ చేస్తూ ఏసీబీ కోర్టు డాకెట్ ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు.

తర్లువాడ పారిశ్రామిక పార్కు భూపరిహారం చెల్లింపుల్లో సవరణ

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా తర్లువాడ గ్రామంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు కేటాయించిన భూమి పరిహారం చెల్లింపులో ప్రభుత్వం సవరణ చేసింది. గతంలో ఎకరాకు రూ.17 లక్షల పరిహారాన్ని చెల్లించాలని నిర్దేశించగా.. దాన్ని తాజాగా రూ.20 లక్షలకు పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రికార్డు లేని ఆక్రమణదారులకు ఎకరాకు రూ.8.5 లక్షలకు బదులుగా రూ.10 లక్షలు చెల్లించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ఏపీఐఐసీ విడుదల చేసిన నిధులను సవరించిన మార్కెట్ విలువ ఆధారంగా ఎసైనీలకు 80 శాతం పరిహారం చెల్లించేందుకు వినియోగించాలంది. ఎసైనీల నుంచి తీసుకున్న భూమికి అనుగుణంగా సమీప ప్రాంతంలో లేదా అనుకుని ఉన్న ప్రాంతంలో మొత్తం భూభాగంలో 20 శాతం భూమిని తిరిగి కేటాయించాలని వెల్లడించింది.